# మానసమయూరి

నవల

- కస్తూరి మురళీకృష్ణ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 182

కౌముది మాసపత్రికలో

జనవరి 2015 సంచిక నుంచి డిసెంబర్ 2017 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

(ప్రారంభం)

**ఇల్లంతా గోలగోలగా ఉంది.**

పెళ్ళికి వచ్చిన బంధువులు, పెళ్ళి అటెండ్ అయి, చుట్టపు చూపుగా వచ్చారు. దాంతో ఎప్పుడూ నిశ్శబ్ధంగా ఉండే ఇల్లు నవ్వులు, కేరింతలు, పిల్లల పరుగులు, పెద్దల అదిలింపులతో హడావిడిగా ఉంది.

**'ఆప్ కె లియే కబ్ హై యే మేలే**

**హమ్ హై హర్ ఎక్ మేలేమే అకేలే'**

అందరూ సంతోషంగా నవ్వుతూ, తుళ్ళుతూ, ఆనందంగా ఉండటం చూస్తుంటే శరత్ మనస్సులో ఈ ఆలోచన మెదిలింది.

ఎందుకో ఈ ఆటలు, పాటలు, మాటలు అన్నీ వ్యర్థం అనిపిస్తాయి. ఇదంతా నటన అనిపిస్తుంది. అందరిలో కలవలేకపోతాడు. ఒకవేళ శరత్ కలవాలని ప్రయత్నించినా, అంతవరకూ నవ్వుతూ, తుళ్ళుతున్న వారు కూడా ఇతడిని చూడగానే బిగదీసుకు పోతారు. దాంతో వారి ఆనందం పాడుచేయటం ఇష్టం లేక తనే పక్కకు వెళ్ళిపోతాడు.

'అందుకే ఈ సంబరాలు, జాతరలు తన కోసం కాదు. ఎందుకంటే ఎంత మంది ఉన్నా తాను ఒంటరివాడే' అనుకున్నాడు శరత్.

అతడి కళ్ళు వాళ్ళందరి మధ్య తన భార్య ప్రశాంతి కోసం వెతికాయి.

ప్రశాంతి ఆడవాళ్ళ మధ్య కూర్చుని కబుర్లాడుతోంది. అంతా ఏదో నవ్వుకుంటూ మాట్లాడుతున్నారు. వారి మధ్య ఉన్న ప్రశాంతి ఉండి ఉండి తన వైపు చూడటం గమనించాడు శరత్.

ఇది శరత్‌కు బాధ కలిగిస్తుంది.

ప్రశాంతి అందరితో కలిసిపోతుంది. ఆమెకు ఎలాంటి భేషజాలు, అహంకారాలులేవు. ఎలాంటి వారితోనయినా క్షణాలలో స్నేహం చేస్తుంది. రెండో క్షణానికల్లా వరుస కలిపేస్తుంది. మూడో క్షణానికి ఆప్తబంధువులైపోతారు. అలా పదిమంది నడుమ ఉండటం ఆమెకు ఎంతో ఇష్టం.

కానీ ఎవ్వరితో కలవలేని శరత్ స్వభావం ఆమె పై ప్రభావం చూపించింది. శరత్ ఎక్కడికీ రాకపోవటం, ఎవరితో కలవలేక పోవటం, ఎక్కడికయినా వచ్చినా ఇబ్బందిగా ముళ్ళమీద ఉన్నట్టుండటం వల్ల ఆమె ఎక్కడికి వెళ్ళినా స్థిమితంగా ఉండలేక పోతుంది. తనతో బలవంతాన రావటం వల్ల శరత్ ఇబ్బంది పడుతున్నాడేమోనని అశాంతిగా ఉంటుంది. మాటిమాటికీ అతడు ఎలా ఉన్నాడో గమనిస్తూంటుంది. దాంతో ఆమె కూడా ఎక్కడా స్థిమితంగా, శాంతంగా ఉండలేకపోతుంది.

ఇదీ శరత్‌కు బాధ కలిగిస్తుంది. వేరే చోటుకు వెళ్ళినప్పుడే కాదు, తమ ఇంటికి ఎవరు వచ్చినా ఇదే పరిస్థితి.

'ఇంతకీ ఇక్కడ ప్లాటు రేట్లు ఎలా ఉన్నాయి? ఏమైనా పెరిగాయా?' అడిగాడు ప్రశాంతి బంధువు.

శరత్‌కి తెలియదు. పక్కింటి వారే తెలియదు. ప్లాట్ల ధరలు ఏం తెలుస్తాయి? కానీ తెలియదంటే ఎవ్వరూ నమ్మరు. మాట్లాడటం ఇష్టం లేదనుకుంటారు. అందుకని, ఎప్పుడో విన్న ఎవరి మాటల్లోనో విన్న ధర చెప్పాడు.

'పదివేలుంటుందండి'

'ఛ.ఛ. నాలుగు సంవత్సరాల క్రితమే పదివేలుంది. ఇప్పుడు పెరిగి ఉంటుంది' అన్నాడాయన.

ఓ వెర్రి నవ్వు నవ్వాడు శరత్.

'డబ్బులేమైనా దాస్తున్నావా?'

ఇది మరో ఇబ్బందికరమైన ప్రశ్న. ఎందుకంటే, పెళ్ళయిన కొత్తల్లోనే డబ్బుల వ్యవహారాలన్నీ ప్రశాంతి చూసుకోవాలన్న ఒప్పందం జరిగింది. దాంతో తన ఖర్చుకు కూడా ప్రశాంతిని అడిగి తీసుకుంటాడు శరత్. డబ్బు వ్యవహారాలేవీ అతనికి తెలియదు.

'నాకు తెలియదండి.. అంతా ప్రశాంతి చూసుకుంటుంది' అన్నాడు.

'అదేమిటి? ప్రశాంతికేం తెలుస్తుంది? డబ్బు వ్యవహారాలు మగవాళ్ళే చూసుకోవాలి' అన్నాడాయన.

అతని మనసులో ఆలోచన శరత్‌కి తెలుస్తోంది.

తనకి నిజం చెప్పటం ఇష్టం లేదనీ, బోలెడంత డబ్బు సంపాదిస్తూ, కూడా కూడబెడుతున్నాడని చెప్పటం ఇష్టంలేక దాటేస్తున్నాడని అనుకుంటున్నాడని గ్రహించాడు. ఇదో పెద్ద బాధ. *ఎదుటివాడి మనసులోని ఆలోచనలు గ్రహించగలగటం కన్నా దౌర్భాగ్యం ఇంకొకటి లేదు.*

మనుషులకు దేవుడు ఇచ్చిన అనేక వరాలలో ముఖం, మాట ప్రధానమైనవి. మనిషి ముఖంలో భావం తెలుస్తుంటుంది. మాట ఆ భావాన్ని కప్పిపుచ్చుతూ విరుద్ధంగా ఉంటుంది.

మనం మాట వింటాం. ముఖం చూస్తాం.

మాటలో లేనిది, మాటల వెనక దాగి ఉన్న హృదయాన్ని చూడగలుగుతాం.

కానీ ఆ నిజం గ్రహించినా పైకి అనలేము.. చెప్పలేము.

నటన.. ప్రపంచమంతా నటన..

ఎదుటివాడి మనసులోని భావాన్ని గ్రహించినా పైకి, అతని మాటల్లో కనిపిస్తున్న అర్థాన్ని మాత్రమే గ్రహించినట్టు ప్రవర్తించాలి. 'పైకి నువ్విలా మాట్లాడుతున్నా, నీ మనస్సులో మాట ఇది' అనటానికి వీలులేనిది. అందుకే అతని మాటలకు నవ్వి ఊరుకున్నాడు శరత్.

'ఇంత పెద్ద ఇల్లు కట్టావు. పైన పోర్షన్ రెంటుకి ఇవ్వచ్చుకదా? నాలుగు డబ్బులయినా వస్తాయి.'

శరత్ ఇంటి మొదటి అంతస్తు కట్టినప్పటి నుంచీ ఈ ప్రశ్న అడగనివారు లేరు. అంత పెద్ద ఇల్లు కట్టి అద్దెకు ఇవ్వకుండా ఉండటం మూర్ఖత్వమని ప్రతి ఒక్కరూ సలహా ఇస్తూంటారు.

కానీ పుస్తకాలు చదువుకోవటానికి, సంగీతం వినటానికి, ఈ మహా కాంక్రీటు అరణ్యంలో, ఓ ఒయాసిస్సులాంటి గది ఉండటంలోని ఆనందం ఎన్ని లక్షల రెంట్ల కయినా సరిపోదన్న నిజం ఎవరికీ అర్థం కాదు. అర్థం అయ్యేట్టు చెప్పలేడు.

అయితే సమాధానం ఇవ్వటం నుంచి పిల్లల పెద్ద పెద్ద అరుపులు, నవ్వులూ తప్పించాయి.

అందరి దృష్టి అటు మళ్ళింది.

శరత్ కొడుకు సుమంత్, కూతురు స్రవంతిలు వాళ్ళ వయసు పిల్లలతో కలిసి స్నేక్స్ అండ్ లాడెర్స్ ఆడుతున్నారు. చివరి అడుగు ముందు స్రవంతి పాము నోట్లోపడి ఆరంభస్థానానికి వచ్చింది. దానికి మిగతావారంతా సంతోషంతో కేరింతలు కొడుతున్నారు. స్రవంతి ఏడ్చినట్టు నటిస్తోంది.

శరత్‌తో మాట్లాడుతున్నవారు, మిగతావారంతా అక్కడికి పరుగెత్తారు. ఉన్న చోటునుండి కదలకుండా ఆ వైపే చూస్తూండిపోయాడు శరత్.

ఈ పాములు - నిచ్చెనలు ఆట నిజంగా మనిషి జీవితాన్ని, మనస్తత్వాన్ని ప్రవచిస్తుంది. పావుల్లో మనల్ని ఆరోపించుకుంటాము. పావులు పైకి ఎక్కుతూంటే మనమే ఏదో సాధిస్తున్నట్టు భావించుకుంటాము. నిచ్చెన అందితే ఏదో సాధించినట్టు సంబర పడతాము.

పాము నోట్లో పడితే క్రుంగిపోతాము. కానీ మన కదలికలు, నిచ్చెనలు దొరకటాలు, పాము నోట్లో పడటాలు, దేన్లో మన ప్రమేయం ఉండదు. మనం వేసే 'డైస్' ఎంత పడుతుందో మన చేతిలో ఉండదు. కానీ కావాల్సింది పడితే మన గొప్ప అనుకుంటాం. లేకపోతే బాధపడతాం. ఇంతకీ ఆ పావు మనం కాదు.. జీవితమూ ఇంతే.

ఏదీ మనది కాదు. కానీ అంతా మనదే అనుకుంటాం.

ఏదీ మన చేతిలో ఉండదు. కానీ అంతా మన గొప్పనో, చేతకాని తనమో అనుకుంటాం.

కానీ తరచి చూస్తే ఆట మనది కాదు. ఆట ఆడేదీ మనం కాదు. గమ్యం ఏమీలేదు. ఆటలో చివరి గడి చేరిన తరువాత ఏముంది? మళ్ళీ మొదటి గడికి వచ్చి మనదికాని ఆటను మనం కాని మనం ఆరంభించటమే!

**'అవాజ్ కే బిన్ తెరా... అంజామ్ తై హో చుకా'**

మన ప్రమేయం లేకుండానే ఫలితం నిర్ణయం అయిపోయింది. అందుకే కలి **'అంధే జహాన్‌కే అంధె రాస్తే... జాయెతో జాయె కహా'** అంటాడు. 'గుడ్డి ప్రపంచంలో గుడ్డి దారులు.. వెళ్ళాలనుకున్నా ఎటుపోతాం?'

ఇప్పుడు అందరూ కలసి ఆట ఆడుతున్నారు. సలహాలిస్తున్నారు. నవ్వుతున్నారు. అరుస్తున్నారు ఆనందంతో.

అలా ఆనందిస్తూ సర్వం మరచిన వారిని చూస్తూ ఆలోచిస్తూ కూచున్నాడు శరత్ ఒంటరిగా.

'ఏమిటి ఒంటరిగా కూర్చున్నారు? అందరితో కలిసి కూచోవచ్చుగా?' ఉలిక్కిపడ్డాడు శరత్.

అతడి పక్కకు వచ్చి గుసగుసగా అంది ప్రశాంతి. ఆమె గుసగుసగా అన్నా మాటలో విసుగు కోపం తెలుస్తోంది.

ఏదో అనబోయాడు శరత్. అతడిని రక్షిస్తూ ఫోను మోగింది. నెంబరు చూశాడు.

అతడి ఆఫీసు కొలీగు అంజన్ కుమార్ ఫోన్ చేస్తున్నాడు.

'హలో!' అన్నాడు ఫోనెత్తి

అతడివైపు కోపంగా చూసి వెళ్ళింది ప్రశాంతి.

'శరత్.. ఓసారి అర్జంటుగా రావాలి..' ఏడుస్తున్నట్టు ధ్వనించింది అంజన్ స్వరం.

'ఏమైంది?' అడిగాడు శరత్.

'ప్లీజ్.. తర్వగా రా'

'ఎక్కడున్నావు?'

అతడు చెప్పింది విన్న శరత్ భృకుటి ముడిపడింది. 'వస్తున్నా' అన్నాడు. గబగబా బట్టలు వేసుకుంటున్న శరత్ దగ్గరకు వచ్చింది ప్రశాంతి.

'అందరూ ఉన్నారు. వదిలేసి ఎక్కడకు వెళ్తున్నారు? మరిలా వెళ్తే అందరూ ఏమనుకుంటారు? ముందే మనం ఎవ్వరితో కలవం. మన ఇంటికి ఎవ్వరూ రారు. ఇలా వాళ్ళంతట వాళ్ళు మనం పిలవకున్నా వస్తే మీరు అందరినీ వదిలి వెళ్ళిపోతారా? ఏమనుకుంటారు?'

'అంజన్ కుమార్ ఫోను చేశాడు. అర్జంటుగా రమ్మన్నాడు' తయారవుతూనే చెప్పాడు శరత్.

'మీరెళ్ళి ఏం సహాయం చేస్తారు? పూచికపుల్ల అటుది ఇటు పెట్టటం చేతకాదు. ఇంట్లో. బయట వాళ్ళకేం చేస్తారు?'

'ఏమో తెలియదు. వాళ్ళబ్బాయిని పోలీసులు పట్టుకున్నారట.. రమ్మన్నాడు.'

'పోలీసు వ్యవహారాల్లో ఇరుక్కోకండి. ముందే అమాయకులు. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడతారు. వాళ్ళబ్బాయిని వదిలి మిమ్మల్ని జైల్లో పారేస్తారు. అనవసరంగా ముందు వెనుక ఆలోచించకుండా వాగ్దానాలు చేసేయకండి. అయినా మీరెళ్ళి ఏం చేస్తారు వాళ్ళబ్బాయిని పోలీసులు పట్టుకుంటే? పక్కింటి వాళ్ళే తెలియదు మీకు. పోలీసుల్లో ఎవరు తెలుస్తారు?'

'ఏమో.. రమ్మన్నాడు.. వెళ్తున్నాను..' చెప్పాడు శరత్.

'ఇదే మామూలు సమయంలో అయితే ఎవరెంత అర్జంటు పని అన్నా కదలరు. ఇప్పుడు ఇంట్లో అందరూ ఉన్నారని, తప్పించుకుంటున్నారు.. నాకు తెలుసు మీ స్వభావం'

ఏమనాలో తోచలేదు శరత్‌కు.

ప్రశాంతి దృక్కోణంలో ఆమె ఆవేదన సబబే.

'లేదు.. ఎందుకో రమ్మన్నాడు. సహాయం చేయగలిగితే చేస్తాను. లేకపోతే సానుభూతి చూపించి వస్తాను.'

'సానుభూతా! మొన్న మా పిన్నివాళ్ళ తోటికోడలు వాళ్ళమ్మ పోతే ఒక్కసారి రమ్మంటే వచ్చారా? వాళ్ళెవరో కూడా తెలియదు. మనం వెళ్ళి వాళ్ళని బాధపెట్టటం ఎందుకన్నారు? ఇప్పుడు సానుభూతి పొంగుకొస్తోందెందుకు?'

శరత్ మాట్లాడలేదు. ముందు గదిలోకి వచ్చాడు. 'నేను అర్జంటుగా వెళ్ళాలి' అని వాళ్ళ స్పందన కోసం ఎదురు చూడకుండా బయటకు వచ్చేశాడు.

'వాళ్ళ ఫ్రెండుకెవరికో సీరియస్‌గా ఉందట..' ప్రశాంతి ఏదో వివరణ ఇవ్వటం వినిపించింది.

ఆమె మీద ప్రేమ పెరిగింది జాలి పొంగింది. కానీ ఇక ఆలోచించకుండా బయటకు వచ్చి కారు స్టార్ట్ చేశాడు. ముందుకు దూకించాడు.

'కోర్టులోనూ, పోలీసు స్టేషన్‌లోనూ కనీసం ఒక్కసారైనా అడుగు పెట్టకుండా, ఎవ్వరి జీవితం పూర్తికాదంటారు' అనుకున్నాడు శరత్ పోలీసు స్టేషన్‌లోకి అడుగు పెడుతూ. ఎందుకో చిన్నప్పటి నుంచీ పోలీసులంటే భయం. అకారణ భయం అది. పోలీసు స్టేషన్‌లో అడుగు పెట్టటం అంటే ఏదో చిన్నతనం.

బయట పోలీసు స్టేషన్ ఆవరణలో నిలబడి మాట్లాడుతున్న వారిని చూస్తుంటే ఎలాగో అనిపించింది. వాళ్ళల్లో ఆడ, మగ ఉన్నారు. చదువు రాని వాళ్ళలా కనిపించే వాళ్ళున్నారు. రాజకీయ నాయకుల్లా పూర్తిగా తెల్లటి ఖద్దరు దుస్తుల్లో ఉన్నవారూ ఉన్నారు.

ఓ చెట్టుక్రింద, పల్లెటూరి వాళ్ళల్లా ఉన్నారు, ఒకామె కూర్చుని ఏడుస్తోంది. ఆమె చుట్టూ ఉన్నవారు సముదాయిస్తున్నారు ఆమెని.

ఇది శరత్‌కు పూర్తిగా పరిచయం లేని ప్రపంచం. వారిని వింతగా, కుతూహలంగా చూస్తూ, ఆలోచిస్తూ అంజన్ కుమార్ కోసం వెతికాడు.

అంజన్ కుమార్, ఆఫీసులో శరత్‌కి అసిస్టెంటు. అతడూ ఎవ్వరితో ఎక్కువ మాట్లాడడు. తన పని మౌనంగా చూసుకుంటాడు. బయటపడతాడు. అతడు తనకి ఫోను చేయటమే ఓ వింత.

అక్కడ అంజన్‌కుమార్‌ని ఎక్కడ వెతకాలా అని ఆలోచిస్తూ అయోమయంగా నిలుచున్నాడు శరత్.

'ఓ...సార్. వచ్చేశారా?' అంటూ శరత్‌ని చూసి పరుగెత్తుకు వచ్చాడు అంజన్.

'ఏమిటి? ఏమైంది?'

'అదే తెలియటం లేదు. మావాడిని అరెస్టు చేసి జైలులో పెట్టారని ఫోను వచ్చింది. పరుగెత్తుకు వచ్చాను. ఎందుకో ఎవరూ చెప్పటం లేదు. పెద్దసార్ రావాలంటున్నారు. నాకు భయం వేసింది. మీరయితే ఇంగ్లీషులో మాట్లాడతారని పిలిచాను' గబగబా చెప్పాడు అంజన్.

తనమీద అతడికి ఉన్న విశ్వాసం చూస్తే శరత్‌కి విశ్వాసం పెరిగింది. లోపల భయపడుతూన్నా పైకి 'పద.. విషయం కనుక్కుందాం' అన్నాడు. అంజన్ కుమార్ వెనుక నడిచాడు.

లోపల ఓ టేబుల్ దగ్గర పోలీసు కూర్చుని ఉన్నాడు. అతడి చుట్టూ మనుషులు మూగి ఉన్నారు.

అంజన్ వారిలో దూరాడు. ‘మా అబ్బాయి అనూప్ కేసు‘ అని అడిగాడు.

‘లోపల సార్ ఉన్నారు పొండి‘ అన్నాడు పోలీసు.

‘ఇటురండి‘ అంటూ అంజన్ కుమార్ తీసుకువెళ్ళాడు.

తలుపు తోసుకుని లోపలకు అడుగుపెట్టారు.

టేబుల్ దగ్గర కూచుని ఏదో సీరియస్‌గా రాస్తున్న పోలీసు ఇన్‌స్పెక్టర్, వీళ్ళ అలికిడి విని తలెత్తాడు.

‘ఏం కావాలి?‘ అడిగాడు.

తనని తాను పరిచయం చేసుకున్నాడు శరత్. ‘ఈయన అంజన్ కుమార్ నా కొలీగ్. వీళ్ళబ్బాయి అనూప్‌ని అరెస్టు చేశారని ఫోను వచ్చింది విషయం తెలుసుకుందామని వచ్చాను‘ చెప్పాడు.

‘కూచోండి‘ అన్నాడు పోలీసు.

పోలీసుల గురించి, వారు వ్యవహరించే తీరు గురించి కథల్లో చదివాడు. సినిమాల్లో చూశాడు. దాన్ని బట్టి ఏదో ఊహించుకున్నాడు. ఇక్కడ పోలీసు మర్యాదగా ‘కూర్చోండి‘ అంటే ఆశ్చర్యపోయాడు. కూచున్నాడు.

ఆయన బెల్ కొట్టాడు. ప్యూన్ రాగానే ‘రవీందర్‌ని పిలు‘ అన్నాడు.

కాస్సేపటికి రవీందర్ వచ్చాడు.

‘డ్రగ్స్‌కేసు. వివరాలు చెప్పు‘ అడిగాడు పోలీసు.

‘సార్. నిన్న రాత్రి ప్యారడైజ్ దగ్గర డ్రగ్స్ కొంటూ యువకులు పట్టుబడ్డారు. వారిలో ఒక అబ్బాయి పారిపోయాడు. పట్టుబడ్డ వాళ్ళని అడిగితే వాళ్ళు ఈ అబ్బాయి పేరు చెప్పారు. అరెస్టు చేసి తెచ్చాను.‘

‘మా వాడు డ్రగ్స్ తీసుకోడు‘ ఏదో చెప్పబోతున్న అంజన్ కుమార్ వైపు పోలీసు కోపంగా చూశాడు.

అంజన్‌కుమార్ నోరు మూసేశాడు.

‘ఎందుకు కంటారు పిల్లల్ని వాళ్ళని అదుపులో పెట్టలేనప్పుడు? వాళ్ళకి మంచిచెడూ నేర్పకుండా సమాజం మీదకు ఎందుకు వదులుతారు?. ఏమీ తెలియదు. పట్టించుకోరు. గాలికి వదిలేస్తారు. వాడు అడ్డగాడిదలా ఎదుగుతాడు. నేరం చేసి పట్టుబడితే మావాడు అమాయకుడు అంటారు. అమాయకుడు మీ వాడు కాదు. మీరు. అమాయకులే కాదు మూర్ఖులు కూడా.‘ అరిచాడు పోలీసు.

అంజన్ కుమార్ తల వంచుకున్నాడు.

‘నిన్న రాత్రి ఎన్నిగంటలకు ఇంటికి వచ్చాడు మీవాడు?‘

‘రాత్రి..పదకొండు గంటలు దాటింది.‘ చెప్పాడు అంజన్.

‘అప్పటి దాకా బయట ఏం చేస్తున్నాడో అడిగారా?‘

అంజన్ మాట్లాడలేదు.

‘కాలేజీ ఎన్నిగంటలకు అయిపోతుంది?‘

‘నాలుగు గంటలకు‘

‘మరి పదకొండు దాకా ఏం చేస్తున్నాడో అడిగారా?‘

అంజన్ మాట్లాడలేదు.

'కాలేజీ అయిన తరువాత కాదు కాలేజీ ఎగ్గొట్టి ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్ళాడు. సినిమా అయిన తరువాత బార్‌కి వెళ్ళారు. తొమ్మిది గంటలకు బార్ నుంచీ బయటకు వచ్చారు. పదిగంటలకు పారడైజ్ సర్కిల్ చేరుకున్నారు. పదిన్నరకు డ్రగ్స్ వ్యాపారం జరుగుతున్నదన్న సమాచారం వచ్చింది. పదకొండుకు అక్కడకు వెళ్ళాం. మమ్మల్ని చూసి డ్రగ్స్ అమ్మేవాళ్ళు పారిపోయారు. వీళ్ళని పారిపోబోతుంటే పట్టుకున్నాం. ఇదంతా అయ్యేసరికి పదకొండు దాటింది. వీళ్ళబ్బాయి పారిపోయాడు. పొద్దున్న పదిన్నరకి పట్టుకున్నాం.'

'ఇప్పుడేం చెప్తావు?' అన్నట్టు చూశాడు పోలీసు అంజన్ కుమార్ వైపు.

అంజన్ కుమార్ గుటకలు మింగాడు. 'రాత్రి పన్నెండు దాటింది మావాడు వచ్చేసరికి. రోజూ పన్నెండు తరువాత వస్తాడు' మెల్లిగా చెప్తాడు అంజన్.

'మరి రోజూ పన్నెండు దాటి వస్తే, ఎక్కడికి వెళ్తున్నాడా? ఏం చేస్తున్నాడు? ఎటు తిరుగుతున్నాడు? అడిగే కనీసం బాధ్యత లేదా? పరుగెత్తుకు వచ్చారు వాడు మా అమాయకుడని ఇప్పుడు.. ఈ ఆరాటం, ఆతృత రోజూ ఏమయ్యాయి?'

అంజన్ తల దించుకున్నాడు.

ఓ పోలీసు అనూప్‌ని పట్టుకు వచ్చాడు.

వీళ్ళ ముందే ఆ పోలీసు అనూప్‌ని చెంపమీద కొట్టాడు. అంజన్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బొటబొటా కంటి నుండి నీళ్ళు కారాయి. శరత్ హృదయం మెలిపెట్టినయింది.

అనూప్ పోలీసు వైపు నీరసంగా చూశాడు. వాడి ముఖంలో పశ్చాత్తాపం లేదు. కోపం ఉంది నిరసన ఉంది.

'చెప్పరా.. నువ్వు డ్రగ్స్ కొనటానికి నీ ఫ్రెండ్స్‌తో వెళ్ళావా? లేదా?' అరిచాడు పోలీసు.

'నా దగ్గర డబ్బుల్లేవు. వాళ్ళు కొంటుంటే తోడుగా వెళ్ళాను' అరిచినట్టు చెప్పాడు అనూప్.

అనూప్ వైపు విచిత్రంగా చూశాడు శరత్.

అనూప్ ఎపుడు కలిసినా 'ఎలా ఉన్నారంకుల్?' అని మర్యాదగా అడుగుతాడు. వాడు.. ఇప్పుడు.. ఇలా.. ఈ రకంగా. శరత్ జీర్ణించుకోలేక పోతున్నాడు. తనకే ఇలా ఉంటే. వాడిని కని ప్రేమగా పెంచిన అంజన్‌కి ఎలా ఉంటుంది? అంజన్ వైపు చూడాలంటే భయంగా ఉంది శరత్‌కు.

'క్షమించండి. మావాడు పొరపాటు చేశాడు. నేరం చేసినా, నేరం చేయకున్నా నేరస్తుల పక్కన ఉండటం కూడా నేరమే. నేరాన్ని దాచిపెట్టి నట్టవుతుంది. మీరు దయ ఉంచి, మావాడిని ఈ ఒక్కసారికి వదిలేయండి. ఇకపై మేము వాడిని జాగ్రత్తగా చూసుకుంటాం. ప్లీజ్' బ్రతిమిలాడుతూ అడిగాడు శరత్.

అనూప్ నుంచి శరత్ వైపుతిరిగాడు పోలీసు. అతడి కళ్ళు శరత్ గుండెను చీల్చి లోపలకు చూస్తున్నట్టున్నాయి.

'ఏడ్చావ్. నువ్వు ఎలాంటి నియంత్రణ చూపలేవు. నీకసలు ఎలాంటి సంబంధం లేదు. ఏదో మాట్లాడుతున్నావు' అన్నట్టున్నాయి పోలీసు చూపులు. శరత్ తలదించుకున్నాడు.

పోలీసు నవ్వాడు. 'మీ వాడికి బెయిల్ దొరుకుతుంది. కానీ ఇన్వెస్టిగేషన్ పూర్తయ్యేవరకూ రోజూ విడిచి రోజూ రావాలి. బెయిల్ బాండ్ బయట కానిస్టేబుల్ రాస్తాడు. పొండి - చూస్తే మర్యాదస్తుల్లా ఉన్నారు. కొడుకుకి కాస్త మంచి మర్యాద నేర్పండి' అన్నాడు పోలీసు.

అతడి ప్రతిమాట ములుకుల్లా గుచ్చుకున్నాయి శరత్‌కి. 'దేవుడా! ఇలాంటి పరిస్థితి ఎవ్వరికీ రానీయకు' అనుకున్నాడు మనసులో.

వీళ్ళు బయటకు వస్తూంటే ఓ కానిస్టేబుల్ వచ్చి అంజన్ కుమార్ చెవిలో ఏదో చెప్పాడు. వాళ్ళిద్దరూ ఓ పక్కకి వెళ్ళారు.

వాళ్ళకోసం ఎదురు చూస్తూ కూచుని చుట్టూ చూశాడు శరత్. ఆ పోలీసు స్టేషన్‌లో ఓ వైపు ఇనుప తలుపులున్న రెండు గదులున్నాయి. వాటిల్లో ఇద్దరు ముగ్గురు కూచుని ఉన్నారు. బయట జరిగే వాటిని చూస్తూ. అది చూసి శరత్ గుండె ఝుల్లుమంది.

'జైలు అంటే ఇదా?' ఇలా ఓ గదిలో బంధించి పెడితే.. ఇక జీవితం ఏముంది? బయట ప్రపంచంతో సంబంధం లేదు. పుస్తకాలు లేవు. సంగీతం లేదు. ఉద్యోగం లేదు. భార్య లేదు. పిల్లల్లేరు. జీవితం మీద శరత్ ఒళ్ళు జలదరించింది. మనసు అదోలా అయిపోయింది.

ఇంతలో అంజన్ కుమార్ వచ్చాడు. 'పదండి పోదాం' అన్నాడు.

'ఏమైంది?' అడిగాడు శరత్.

'అంతా సెటిల్ అయింది. సాయంత్రం వస్తాడు మావాడు ఇంటికి. పోలీసులు కేసు పెట్టరు. కేసు పెడితే మావాడి రికార్డు పాడవుతుంది. వాడి భవిష్యత్తు పాడవుతుంది.'

'ఇది ఎలా సాధ్యమయింది?' అడిగాడు శరత్.

'వద్దుసార్. వదిలేయండి. మీకు చెప్పవద్దన్నారు. వాళ్ళు మిమ్మల్ని చూసి పెద్దమనిషి అనుకున్నారు. మిమ్మల్ని అందుకే రమ్మన్నాను. మిమ్మల్ని చూసిన వాళ్ళకి మీరు అమాయకులు అని తెలుస్తుంది సానుభూతి చూపుతారు. '

శరత్ మాట్లాడలేదు. అలాగే మనసులో ఇంకా జైలుగది. దాన్లో కూచుని ఉన్న మనుషులు మెదులుతున్నారు.

'థాంక్స్ సార్ పిలవగానే వచ్చారు.' అన్నాడు అంజన్ కుమార్.

'మీ వాడిని జాగ్రత్తగా చూసుకో' కారు స్టార్ట్ చేస్తూ చెప్పాడు శరత్.

'సరేసార్. వాడిని ఊరు పంపించేస్తాను' అన్నాడు అంజన్ కుమార్.

'గుడ్.లక్' అన్నాడు శరత్. కారును ముందుకు నడిపించాడు.

అతడి మనసుని పలురకాల ఆలోచనలు చుట్టుముట్టాయి. అంజన్ కుమార్ స్థానంలో తనని ఊహించుకున్నాడు. తన సంతానాన్ని ఊహించుకున్నాడు. కారు స్టీరింగ్ మీద అతడి చేతులు ఎగిరాయి.

'దేవుడా.. నా జీవితాన్ని ఇలా ప్రశాంతంగా నడవనీ. నా పిల్లలు ఎలాంటి కష్టం లేకుండా సంతోషంగా బ్రతకనీ' అనుకున్నాడు. కానీ ఓ ఆలోచన వచ్చింది. తన పిల్లల గురించి తనకేం తెలుసు?

**'తన పిల్లల గురించి తనకేం తెలుసు?'**

ఈ ఆలోచన రావటంతోటే శరత్ చేతులు స్టీరింగ్‌పై బిగుసుకున్నాయి.

'మీరు ఎప్పుడయినా పిల్లలేం చదువుతున్నారు, వాళ్ళ ఇష్టాఇష్టాలేమిటి? వాళ్ళు మీ నుంచి ఏం వాంఛిస్తున్నారో ఆలోచించారా? నాకు మీరు అలవాటయిపోయారు. నా బ్రతుకు ఇంతేనని సర్దుకుపోతాను. మరి వాళ్ళ సంగతి ఏమిటి? నాన్నకి మేం ఇష్టం లేదనుకుంటారా?'

ఉలిక్కిపడ్డాడు శరత్. తన పక్కసీటు ఖాళీగా ఉంది. కానీ ప్రశాంతి తనపక్కన కూర్చుని అన్నట్టే అనిపించింది.

అతని ప్రమేయం లేకుండా ఏక్సిలేటర్ పై కాలి ఒత్తిడి పెరిగింది.

అతడికి ఇంటికి త్వరగా వెళ్ళి పిల్లల్ని దగ్గరకి తీసుకోవాలని ఉంది.

'మీ మనసులో మాట నాకు చెప్పండి. మీకేం కావాలన్నా నిర్భయంగా, నిర్మొహమాటంగా చెప్పండి. మీకు ఇష్టం లేనివి చెప్పండి. అంతేకానీ, అందరి ముందు తలదించుకునే పరిస్థితి కల్పించకండి మీకోసం ఒకరిని బ్రతిమిలాడి, కన్నీరు కార్చే దుస్థితి కల్పించకండి' అని బ్రతిమలాడాలని ఉంది.

అతడి కళ్ళముందు అంజన్ కుమార్ కొడుకుని పోలీసు చెంపదెబ్బ కొడుతున్న దృశ్యం కదలాడుతోంది.

ఇల్లు చేరుకున్నాడు. కారు ఆపి గబగబా ఇంట్లోకి పరుగెత్తాడు. తలుపుకి తాళం కప్ప వెక్కిరిస్తూ కనిపించింది.

గబగబా జేబులోంచి సెల్ తీశాడు. పోలీసు దగ్గరకు వెళ్ళేటప్పుడు సెల్‌ని 'మ్యూట్'లో పెట్టాడు. ప్రశాంతి నాలుగు మార్లు ఫోను చేసింది. శబ్దం రాకపోవటంతో తనకు ఫోను వచ్చినట్టు తెలియదు.

వెంటనే ప్రశాంతికి ఫోను చేశాడు. మరో చేయితో జేబులో తాళం చెవి కోసం వెతికాడు. ఓ స్పేర్ తాళం చెవి శరత్ దగ్గర ఉంటుంది.

ఫోను రెండు మార్లు మోగగానే 'కట్' చేసింది ప్రశాంతి.

శరత్‌కి తెలుసు, ప్రశాంతికి కోపం వచ్చి ఉంటుందని. నిట్టూర్చి ఇంట్లోకి నడిచాడు.

ఇల్లు ప్రశాంతంగా ఉంది.

శరత్ మనసు అల్లకల్లోలంగా ఉంది.

ఎప్పుడూ ఒంటరితనాన్ని వాంఛించే శరత్ ఇప్పుడు తన సంతానం దగ్గర ఉండాలని వాంఛిస్తున్నాడు.

అతడు ఒంటరిగా ఉండాలనుకుంటున్నప్పుడు ఎప్పుడూ ఎవరో ఒకరు అతడి ఏకాంతాన్ని భంగం చేస్తుంటారు. ఇప్పుడు మొట్టమొదటిసారి ఒకరితో ఉండాలని కోరుకుంటున్నాడు. కానీ ఒంటరితనం అతడిని చుట్టుముట్టింది.

టేబుల్ దగ్గర కూర్చుని టేప్ 'ఆన్' చేశాడు.

**జబ్ భి యెహ్ దిల్ ఉదాస్ హోతా హై**

**జానె కౌన్ ఆస్ పాస్ హోతా హై**

మహమ్మద్ రఫీ స్వరం ప్రపంచంలోని ఒంటరితనాన్ని, వేదనను నింపుకుని మనసుని కదిపే రీతిలో ధ్వనిస్తోంది. పదాలకు అదనపు లోతును, ఆర్తిని ఆపాదిస్తోంది.

కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు శరత్.

'అందరం కలిసి సినిమాకి వెళ్ళాం. ఎలాగో మీరు రారు, వచ్చినా మీరు సినిమాని ఎంజాయ్ చెయ్యలేరు. మీ వల్ల మా ఆనందం పాడవుతుందని మేము వెళ్ళాం. మీకు ఫోను చేస్తే ఫోను ఎత్తలేదు. వచ్చిన తరువాత చెప్పవచ్చని వెళ్ళాం.'

ఇంట్లోకి వస్తూ చెప్పింది ప్రశాంతి.

'పిల్లలేరి?'

'వాళ్ళు బాబాయిగారి ఇంట్లో పడుకుంటామన్నారు. పిల్లలందరూ ఉన్నారు కదా అదృష్టవశాత్తు వాళ్ళకి మీ గుణాలు రాలేదు లెండి' కోటూ విడిచింది ప్రశాంతి.

శరత్‌కి నవ్వొచ్చింది.

భార్య భర్తల సంబంధం జీవితాంతం ఉండాల్సిన అనుబంధం. కష్టాల్లో సుఖాల్లో ఇద్దరూ ఒకరికి ఒకరు తోడు. కలిసి సంసార సాగరాన్ని ఈదాలి. జీవితంలో భర్తకు భార్య, భార్యకు భర్త తప్ప మరో సన్నిహితుడుండడు. అలాంటి బాంధవ్యంలో ఈ ఎత్తిపొడుపులు,

ఒకరిని మరొకరు సాధించటం, తక్కువ చేసి చూపించాలని ప్రయత్నించటం, ఆధిక్యం నిరూపించుకోవాలన్న ఆరాటం, హక్కులు, అహాలు... ఇదేనా జీవితాంతం కలిసి ఉండాల్సిన అనుబంధ స్వరూపం? అనుకున్నాడు. అతడి నవ్వు చూసి ప్రశాంతికి కోపం వచ్చింది.

'మీకేం చిద్విలాసంగా నవ్వుతారు. నాన్నకి సినిమాలు ఎందుకు నచ్చవు అని స్రవంతి అడిగింది. దానికి మీ పుత్రరత్నం ఏం సమాధానం చెప్పాడో తెలుసా?'

'ఏం చెప్పాడు?'

'నాన్న అంతేనే... ఆయనకి ఎవ్వరితో పడదు. అందరికన్నా తాను గొప్ప అనుకుంటారు అన్నాడు. బాగుందా మీమీద మీ కొడుకు అభిప్రాయం?' వ్యంగ్యంగా అడిగింది ప్రశాంతి.

శరత్ మాట్లాడలేదు.

తన కొడుకు 'తనగురించి అలా అనుకుంటున్నాడా? బయట వాళ్ళు అనుకుంటున్నారంటే వాళ్ళకి తన గురించి ఏమీ తెలియదనుకోవచ్చు. కానీ, ఒకే ఇంట్లో తనతో కలిసి ఉంటున్న వాడు అలా అనుకుంటున్నాడంటే లోపం వాడిలో ఉందా? తనలో ఉందా?'

'ఇంతకీ ఏం జరిగింది? మీ కొలీగెందుకు అంత అర్జంటుగా రమ్మన్నాడు?'

శరత్ ముఖంలో అతడి బాధను గమనించి అర్థం చేసుకుని టాపిక్ మార్చింది ప్రశాంతి.

జరిగింది చెప్పాడు. 'అది చూసిన తరువాత నాకు మన పిల్లల గురించి ఏం తెలుసు అన్న ఆలోచన వచ్చింది. పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని అనిపిస్తోంది' చివరలో తన మనసులో మాట చెప్పాడు.

అది విని విరగబడి నవ్వింది ప్రశాంతి. 'ఇన్నాళ్ళకి మేమూ మనుషులమే అన్న ఆలోచన వచ్చింది. కనీసం నేను కాకపోయినా పిల్లలు మనుషులని గుర్తించారు సంతోషం' అంది. చివరి మాటలంటున్నప్పుడు లీలగా ఆమె గొంతులో కదలిన జీరను గమనించాడు శరత్.

ఆమెని దగ్గరకి తీసుకున్నాడు శరత్. అతడిని హత్తుకుపోయింది ప్రశాంతి.

శరత్ మనస్సు విచిత్రంగా స్పందించింది.

ఒక్క క్షణం క్రితం తామిద్దరూ ప్రత్యర్థుల్లా తోచారు. ఆమె మాటలతో తనని గాయపరచాలని ప్రయత్నించింది. ఇప్పుడు ఎంతో ఆత్మీయంగా, ఆప్యాయంగా అనిపిస్తోంది.

'నేను మిమ్మల్ని కష్టపెడుతున్నానా?' గొంతుకేదో అడ్డపడుతున్నట్టనిపించింది శరత్‌కు ఆ మాట అంటుంటే. ప్రశాంతి పట్ల ప్రేమ భావన పొంగిపొర్లుతోంది. ప్రశాంతి నవ్వింది. చూపుడు వేలితో అతని బుగ్గమీద రాస్తూ అంది 'ఎవరూ ఎవరినీ కష్టపెట్టరండి. మనమే కష్టపడతాం. మీరేం చేస్తారు, మీరంతే. నేనేం చేస్తాను? నేనింతే.'

శరత్ మాట్లాడలేదు. ఆమెని మరింత దగ్గరగా హత్తుకున్నాడు.

కానీ మనసులో ఎక్కడో ఓ రకమైన భావన కలిగింది.

*ఇదేనా జీవితం? మనసులో మెదిలే ఊహలు వేరు. కోరికలు వేరు. జీవితం అందించే నిజం వేరు. ఒకటి స్వప్నం మరొకటి సత్యం. సత్యంతో రాజీపడుతూ అందని స్వప్నం గురించి ఆలోచిస్తూ ఉన్నదానినే సర్వం అనుకుంటూ జీవించటమేనా జీవితం?*

ఉదయం లేచేసరికి అంతా రొటీన్‌గా హడావిడిగా జరిగిపోయింది.

పిల్లలు గబగబా తయారయి వెళ్ళిపోయారు. వాళ్ళ కాలేజీ బస్సులు ఆలస్యం అయితే ఎదురు చూడవు మరి.

శరత్ లేచేసరికి పిల్లలు వచ్చి తయారయి వెళ్ళిపోయారు. ప్రశాంతి గబగబా వంట చేసి టిఫిన్లు సర్దేసింది.

కాసేపట్లో ఇద్దరూ కారులో బయటపడ్డారు. దారిలో ఏవో పొడి పొడి మాటలు నడిచాయి.

ఉదయం పూట ఆఫీసుకు వెళ్ళేవాళ్ళతో రోడ్లు రద్దీగా ఉన్నాయి. దీనికి తోడు, మెట్రోరైలు కోసం రోడ్ల నడుమ తవ్వటంతో, రోడ్లు మరింత చిన్నవయాయి. మెట్రో పిల్లర్లను తప్పించుకుని పోయే వాహనాలతో రోడ్లు జామ్ అయిపోతున్నాయి.

మరోవైపు ఏదో ఓ వంతెన చక్కని రోడ్లన్నిటినీ తవ్వేస్తున్నారు. ఓసారి వాటర్ పైపులంటారు. ఇంకోసారి ఇంకేదో అంటారు. చక్కని రోడ్లను తవ్వి కుప్పలు పెట్టి వదిలేస్తారు.

'నగరంలో వాహనం నడపటం నరక సదృశం అయిపోయింది.' అన్నాడు శరత్ ప్రశాంతితో. ఆమె మాట్లాడలేదు. వాచీవైపు చూసుకుంది. 'ఎంత త్వరగా బయలుదేరినా ఆలస్యం అయిపోతోంది' చిరాకుపడింది.

ఆమెని ఆమె ఆఫీసు దగ్గర దింపి తన ఆఫీసు వైపు కారు దూకించాడు శరత్.

---

'మా వాడిని మా ఊరు పంపించేశాను. మళ్ళీ పరీక్షలప్పుడు వస్తాడు. థాంక్స్ సార్' లంచ్ టైములో శరత్‌తో అన్నాడు అంజనకుమార్.

'నిన్నటి నుంచీ మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను అడగవచ్చా?' జంకుతూ అన్నాడు శరత్

'భలేవారే సార్. పిలవగానే సహాయానికి వచ్చారు. మీరు అలా జంకితే ఎలా? అడగండి.'

కాస్సేపు మౌనంగా ఉన్నాడు శరత్. చివరికి జాగ్రత్తగా, ప్రతిపదాన్ని తూచిచూస్తున్నట్టు అడిగాడు. 'మీవాడిని మీరు ప్రేమిస్తారు. వాడు అడిగినవన్నీ ఇస్తున్నారు. మరి అయినా మీవాడు ఎందుకని తప్పుదారి పట్టాడు? ఎక్కడ ఉంది లోపం?'.

అంజన్ కుమార్ తలవంచుకున్నాడు.

'సారీ...' అన్నాడు శరత్.

తలెత్తాడు అంజన్. అతడి కళ్ళల్లో నీళ్ళున్నాయి. 'నేనూ అదే ఆలోచిస్తున్నాను సార్. నాకు ఒకటే అనిపిస్తోంది. ప్రపంచం మారిపోతోంది. ఎంత వేగంగా మారుతోందంటే, జరుగుతున్నది మనకి అర్థమయ్యేసరికి మళ్ళీ పరిస్థితి మారిపోతోంది.'

అర్థంకానట్టు చూశాడు అతడివైపు శరత్.

'మా నాన్న, అమ్మకి చదువు లేదు. తినటానికి తిండి ఉండేదికాదు. నేను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. కనీసం పురుగులు, రాళ్ళతో నిండి, ఉడికీ ఉడకనిదయినా అన్నం దొరికేది. నాకీ ఉద్యోగం వచ్చింది. నేను పడ్డ బాధలు నా కొడుకు పడకూడదని వాడిని ఇంగ్లీష్ మీడియం, కాన్వెంట్‌లో చదివించాను. నేను పడ్డ డబ్బులేమి వాడికి ఉండకూడదని అడిగినది అడిగినట్టు అందించాను. వాడికేం కావాలో ముందే గ్రహించి వాడు అడగకుండానే అందించాను. అయితే... కోరికలు అపరిమితం. నాశక్తి పరిమితం. అదీగాక, నేను నా స్థాయిలో, నా అనుభవాల ప్రకారం వాడి అవసరాల గురించి ఊహించి అందించాను. కానీ వాడు పెరుగుతున్న వాతావరణం గ్రహించలేదు. నాకు అది అర్థం కాలేదు. అక్కడ వచ్చింది తేడా!

అంజన్ చెపుతున్నది అర్థమయీ అవనట్టుంది శరత్‌కు.

'వాడికేం కావాలో, ఏమేం అవసరమో నేను గ్రహించి, ఊహించినదంతా ఇచ్చును కానీ నిజంగా వాడికేం కావాలో నాకు అర్థం కాలేదు. నేను అందించిన దానితో వాడు సంతృప్తి పడినంత కాలం అంతా సవ్యంగా గడిచింది. ఎప్పుడయితే వాడి కోరికలు నేను తీర్చలేకపోయానో, అవి నా శక్తి పరిధిని దాటిపోయాయో, అప్పుడు వాడి దారి వాడే ఎంచుకున్నాడు. వాడి దృష్టిలో నేను పనికిరానివాడినయ్యాను' అంజన్ గొంతు గద్గదికమయింది.

'మానవ సంబంధాలన్నీ ఇంతేనేమో! మనం ఎదుటివారి ఇష్టమైనవి వారి ఇష్టప్రకారం నడిచినంత కాలం అంతా సవ్యంగా ఉంటుంది. ఆనందకరమైన అనుబంధంలా అనిపిస్తుంది' అన్నాడు శరత్.

తల అడ్డంగా ఊపాడు అంజన్ 'నాకు ఒక్కచోట మనం పొరపడ్డామనిపిస్తుంది' అన్నాడు.

'ఎక్కడ?' అడిగాడు శరత్.

'నేను కష్టపడి పైకి వచ్చాను. నిజంగా చాలా కష్టాలు పడ్డాను. ఢక్కా మొక్కీలు తిన్నాను. మనుషుల్లో మంచి చూశాను. చెడు చూశాను. నైచ్యం చుశాను. అన్నిటినీ తట్టుకుని నిలబడ్డాను. నేను పడ్డ కష్టాలు నా కొడుకు పడకూడదనుకున్నాను. వాడికి కష్టం తెలియకుండా పెంచాను. పువ్వుల్లో పెట్టి పెంచాను. అదే నేను చేసిన పొరపాటు.'

'ఎందుకని?'

'సింపుల్. వాడికి కష్టం తెలియదు. అనుకోగానే అన్నీ అందటం అలవాటయి పోయింది. దేనికోసమైనా తపించటం, కష్టపడటం, అది అందక పోతే నిరాశను అధిగమించి, నిస్పృహను దాటుకుని దాన్ని సాధించాలని పోరాడటం తెలియదు. చివరికి అందకపోతే రాజీపడి బ్రతకటం తెలియదు. అతి సున్నితంగా పెంచాను. అది నేను చేసిన తప్పు. అడగ్గానే అన్నీ అందుతూంటే విలువ ఏం తెలుస్తుంది? దాంతో దేనిపైనా విలువలేకుండా పెరిగాడు. దేనిపైనా అంటే ఏదో ఒకటి కాదు, అన్నిటిపైనా విలువలేకుండా ఎదిగాడు. తల్లితండ్రులపైనా, అనుబంధం, ఆత్మీయతల పైనా, విలువలపైనే కాదు తన జీవితం పట్ల కూడా ఏ మాత్రం విలువలేకుండా చులకన భావంతో పెరిగాడు. తప్పు వాడిది కాదు నాదే.'

శరత్ మాట్లాడలేదు. అతడి హృదయం బరువెక్కింది. అంజన్ మాటల్లోని నిజం కాదనలేనిది. కానీ దాన్ని సంపూర్ణంగా నిజమని ఒప్పుకోవటానికి శరత్ సిద్ధంగాలేడు. అతడి అహం అతడి ఆలోచనను ప్రభావితం చేస్తోంది.

'వస్తాను. ఏదో వాగేశాను. థాంక్స్' అంటూ లేచాడు అంజన్.

అతడు వెళ్ళిన చాలాసేపటి వరకూ ఆవైపే చూస్తూ కూచున్నాడు శరత్. అతడికి తాను ఎక్కడో ఒదిలిన విషయం గుర్తుకు వచ్చింది.

'పిల్లలను ఇలా పెంచాలి, ఇది అనాలి, ఇది అనకూడదు అని ఎన్నో సూత్రాలు చెప్తారు. సిద్ధాంతాలు చెప్తారు. కానీ పిల్లల్ని ఇలా పెంచాలని ఖచ్చితంగా ఎవరూ నిర్ణయించరు. ఎందుకంటే ఏ పిల్లవాడికి ఆ పిల్లవాడు ఒక ప్రత్యేక ప్రపంచం. ఒక చోట వర్తించింది మరొక చోట వర్తించదు. ఏ ఒక్కడూ మరొకరిలా ప్రవర్తించరు. ఆలోచించరు.

కాబట్టి పిల్లల్ని ఎలా పెంచాలన్నది ఎవరికి వారు వారి మనస్సును అనుసరించి తీసుకోవాల్సిన నిర్ణయం. ఫలితంపై ఎవరికీ నియంత్రణ లేదు. పిల్లల్ని పెంచటం, వారి భవిష్యత్తును నిర్దేశించటం అన్నది గాలిలో దీపం పెట్టి వెలగాలని ప్రార్థించటం లాంటిది.'

ఆలోచిస్తున్న శరత్ గదిలోకి ప్యూన్ అడుగుపెట్టటంతో తలెత్తి చూశాడు.

'పెద్దసార్ పిలుస్తున్నారు'

లేచి వెళ్ళాడు శరత్.

బాస్ గదిలోకి అడుగు పెట్టేసరికి మిగతా ఆఫీసర్లందరూ ఉన్నారు. 'ఏదో పెద్ద మీటింగ్ లానే ఉంది' అనుకున్నాడు శరత్.

'టైమ్' చూసుకున్నాడు. ఆలస్యమయేట్టుంటే ప్రశాంతిని వెళ్ళిపోమని చెప్పాలి. కాసేపటికే మీటింగ్ దేనిగురించో అర్థమైపోయింది.

ప్రభుత్వాఫీసుల్లో ఉద్యోగులకు ప్రధాన సమస్య ట్రాన్సఫర్లు. ఎవ్వరూ తమకు అలవాటయిన పని వదిలి కొత్త స్థలానికి వెళ్ళేందుకు ఇష్టపడరు. పనిచేయని వాడిని వదుల్చుకోవాలనే ప్రతివారూ ప్రయత్నిస్తారు. సమస్యను పక్కవాడిపై నెట్టేసి చేతులు దులుపుకోవాలన్న ఆరాటం ప్రదర్శిస్తారు. అంతే తప్ప సమస్యను పరిష్కరించాలని ఎవరూ ప్రయత్నించరు. ఎవరిని ఏ సెక్షన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయాలి, ఎవరికి ఎవరు కావాలి అని వాదోపవాదాలు జరుగుతుంటే నిర్లిప్తంగా వింటూ కూచున్నాడు శరత్.

నిర్ణయాలు జరిగిపోయాయి. అందరూ నవ్వుతూ సెలవు తీసుకుంటున్నారు. శరత్ కూడా వెళ్ళబోతూంటే బాస్ పిలిచాడు.

'నీకు చెప్పటం మరచిపోయాను. నీ సెక్షన్‌కి బెంగుళూరు నుంచి మాధవి వస్తోంది. ఆమె ఇంతకు ముందు ఇక్కడ పనిచేసి వెళ్ళిందట. మళ్ళీ ఇక్కడికి వస్తోందట. హెడ్‌క్వార్టర్స్ నుంచి ఫోను వచ్చింది. చాలా ఇన్‌ఫ్లూయెన్స్ ఉన్నదిట. జాగ్రత్త.'

బాస్ మాటలకు తల ఊపి బయటకు వచ్చేశాడు శరత్. 'ఎవరు వస్తే తనకి ఏమిటి? తన పని తనది' అనుకున్నాడు కారును స్టార్ట్ చేస్తూ.

'మీ సెక్షన్‌కి మాధవి వస్తోందట కదా?'

పక్కన కూర్చుంటూ పలకరించాడు పరమేశ్వర్.

ఆశ్చర్యపోయాడు శరత్. తనకే తెలియలేదు. కానీ అప్పుడే ఆఫీసంతా తెలిసిపోయింది.

ఇది ఆశ్చర్యంగా ఉంటుంది శరత్‌కు. అందుకే 'నీకెలా తెలుసు?' అనడిగాడు ఆశ్చర్యంగా.

'మాకు ఎలా తెలుస్తుందో అనవసరంకానీ.. జాగ్రత్తగా ఉండాలి నువ్వు. అసలే అమాయకుడివి' అన్నాడు పరమేశ్వర్.

'ఎందుకని?'

'చాలా జాగ్రత్తగా ఉండాలి. అది అందరు ఆఫీసర్లతో చాలా సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకుంటుంది. ప్రతి విషయం చేరవేస్తుంది. అందుకే ఎవ్వరూ ఆమెని తీసుకోవటానికి ఇష్టపడలేదు. నీకు అంటగట్టారు.'

శరత్ మాట్లాడలేదు. కానీ ఎందుకో అతడి నోరు చేదైపోయింది.

పైకి చూస్తే అందరూ విద్యావంతులే. అందరూ సంస్కారవంతులే. నీతులు చెప్పేవారే. కానీ అవకాశం దొరికితే ప్రతి ఒక్కరి గురించీ చులకనగా మాట్లాడతారు. ముఖ్యంగా మహిళల గురించి.

అంతలో అతడికి ఓ ఆలోచన వచ్చింది.

అతడి భార్య ప్రశాంతి కూడా ఉద్యోగం చేస్తోంది. ఆమె గురించి కొలీగులు ఏం మాట్లాడుకుంటారో? ఏమని వ్యాఖ్యానిస్తారో.

మనసునెవరో మెలిపెట్టినట్టయింది.

ప్రేమ అంటే తాను ఇష్టపడిన వ్యక్తిని స్వేచ్ఛగా వదిలేయటం అంటారు ఆధునికులు. కానీ..'తనది' అనుకోగానే తెలియకుండానే ఒక ఆత్మీయత వస్తుంది. పొసెసివ్‌నెస్ వస్తుంది. అదిలేని బంధానికి అర్థం ఏముంది? 'బంధం' అన్న పదంలోనే 'బంధం' ఉంది.

పరమేశ్వర్ ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు కానీ శరత్ వినిపించుకోవటంలేదు. అన్యమనస్కంగా ఉన్నాడు.

శరత్ ఏదో ఆలోచనల్లోకి జారటం చూసి, తన మాటలు అతడికి రుచించటంలేదని పరమేశ్వర్ గ్రహించాడు. 'పనుంది వస్తా'నని జారుకున్నాడు మెల్లగా.

పరమేశ్వర్ మాటలు శరత్ మనస్సులోంచి పోవటంలేదు.

ఆఫీసు నుంచి ఇంటికి వస్తున్న అతని మదిలో అవే మాటలు మెదలుతున్నాయి. దారిలో కనబడిన ప్రతి మహిళను చూస్తూంటే ఏదో జాలిగా, దిగులుగా అనిపించసాగింది.

ఒక మహిళ ఇల్లుదాటి బయటకు అడుగుపెట్టిన క్షణం నుంచీ ప్రతి ఒక్కరూ వారిని గమనిస్తారు. వారి ప్రతికదలికను పరికిస్తారు. ఏవేవో ఊహిస్తారు. నోటికి వచ్చినట్టు మాట్లాడతారు.

ఎలా ఉంటుంది ఆడవాళ్ళకి?

అతడు ఇంటికి వచ్చేసరికి సుమంత్ బయటకు వెళ్ళిపోయాడు ఫ్రెండ్స్‌తో. స్రవంతి, ఆమె స్నేహితురాళ్ళు బాల్కనీలో మాట్లాడుతున్నారు. దూరం నుంచే కనిపించారు. అందరూ రంగురంగుల దుస్తుల్లో అందంగా సీతాకోక చిలకల్లా ఉన్నారు.

వాళ్ళని చూస్తుంటే సంతోషంగా అనిపించింది.

ఇంకా జీవితమంటే ఏమీ తెలియదు. జీవితంలోని తొలిదశలో అడుగుపెడుతూ ఉత్సాహంతో పరవళ్ళు తొక్కుతున్నారు. అనంతమైన ఆనందాలు, అద్భుతమైన అనుభవాలు తమకోసం ఎదురు చూస్తున్నాయన్న ఉత్సాహం కనిపించింది వారిలో.

ఇంట్లోకి వెళ్ళేసరికి వంట చేస్తూ కనిపించింది ప్రశాంతి.

కాస్సేపు ఇతర విషయాలు మాట్లాడిన తరువాత హఠాత్తుగా అడిగాడు శరత్.

'ప్రశాంతీ.. నీకు ఎవరైనా మగవాళ్ళు నీ దిక్కు చూస్తే ఏమనిపిస్తుంది?'

చురుగ్గా చూసింది అతనివైపు 'ఎందుకని?' అడిగింది.

'తెలుసుకుందామని'.

'తెలుసుకుని?'

'అర్థం చేసుకుందామని.'

'అర్థం చేసుకుని?'

ఏమనాలో తోచలేదు శరత్‌కు. మౌనంగా గదిలోంచి వెళ్ళిపోయాడు.

కాస్సేపటికి కాఫీ పట్టుకొచ్చి అతడికి అందిస్తూ అంది ప్రశాంతి.

'మీ మగవాళ్ళకి కళ్ళు తప్పించి మెదడుండదు. శరీరం తప్పించి మనసు కనబడదు. మీకు అమ్మాయి ఎపుడూ అందుకోసమే ఎదురు చూస్తున్నట్టు కనిపిస్తుంది. ఎవరితోనయినా నవ్వుతూ మాట్లాడితే ఏవేవో ఊహించి కథలల్లేస్తారు. అందుకే ఎవడయినా చూస్తే, వీడి బుర్రలో ఏ కుళ్ళు ఆలోచన సుళ్ళు తిరుగుతోందా అని అనిపిస్తుంది'

శరత్ నవ్వాడు. ఏమీ మాట్లాడలేదు.

'అయినా, ఇపుడా అనుమానం ఎందుకొచ్చింది? మీ సెక్షన్‌కి ఎవరో కొత్త అమ్మాయి వస్తోందన్నారు, వచ్చిందా? అందంగా ఉందా?' అడిగింది.

పెద్దగా నవ్వాడు శరత్. 'ఇందాక మగబుద్ధిని  తిట్టావు. ఇప్పుడు నువ్వూ అలాగే అడుగుతున్నావు' అన్నాడు.

'నేను అడుగుతున్నది మీ బుద్ధి గురించి.' అంది కోపంగా లేస్తూ.

'ఇంకా రాలేదు. వస్తుంది త్వరలో'

'ఏమో ఆమె గురించి చెడుగా చెప్తున్నారు. మా కొలీగు పవిత్రలేదూ.. దానికి తెలుసట మాధవి. మీ ఆయన జాగ్రత్త అంది నాతో.'

'నాకు పెళ్ళయింది. ఇద్దరు ఎదిగిన పిల్లలున్నారు. ఇంకేం జాగ్రత్తలు చెప్పింది మీ ఫ్రెండు?' అడిగాడు నవ్వుతూ.

'పెళ్ళయ్యేది పిల్లలుండేది ఆడవాళ్ళకి. మగవాళ్ళు ఎంత వయసొచ్చినా ఎదగరు. అందుకే అరవై ఏళ్ళవాళ్ళు కూడా ఆరేళ్ళ పిల్లల్ని రేప్ చేసిన వార్తలు వింటున్నాం' అని విసవిసా వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచిస్తూ కూచున్నాడు శరత్.

ఎందుకో జరిగిన సంభాషణ అతడికి రుచించలేదు. తాను అడిగింది ఒకటి, సంభాషణ జరిగినదింకో విషయం గురించి. పుస్తకం తీశాడు. క్షణంలో అన్నీ మరిచి పుస్తకంలో లీనమైపోయాడు.

'నాన్నా'

పుస్తకంలోంచి తలెత్తి చూశాడు శరత్.

ఎదురుగా ఉన్నాడు సుమంత్.

'ఏమిటి?' అడిగాడు శరత్.

'మా కాలేజ్‌నుంచి పిక్నిక్‌కు వెళ్తున్నారు. నేను వెళ్తాను. అమ్మ మిమ్మల్ని అడగమంది.'

'డబ్బులు అమ్మ దగ్గరే ఉన్నాయి కదా. అమ్మనే అడుగు. నాకేమీ అభ్యంతరం లేదు. జాగ్రత్తగా వెళ్ళు.' అన్నాడు.

కాస్సేపు మౌనంగా నిలబడి వెళ్ళిపోయాడు సుమంత్.

పుస్తకం పక్కన పెట్టి ఆఫీసుకి తయారవుతూంటే సుడిగాలిలా లోపలకి వచ్చింది ప్రశాంతి.

'మీరు అసలు పెళ్ళెందుకు చేసుకున్నారు?' అరిచింది.

బిత్తరపోయాడు శరత్.

'మీకు సన్యాసం పుచ్చుకోవాలని ఉంటే, సన్యాసం పుచ్చుకోండి. అంతేకానీ ఇంట్లో ఉండి ఏవీ పట్టనట్టుంటే ఎట్లా?'

'ఏమైంది?'

'వాడు పిక్నిక్‌కి వెళ్తున్నాడు. ఎక్కడికో అడిగారా?'

'ఎక్కడికయినా, కాలేజీవాళ్ళు అందరినీ తీసుకెళ్తారుగా?'

'ఎటో అడిగారా?' అరిచింది.

'అడగలేదు.'

'ఎందుకు అడగలేదు?'

'అందువల్ల నష్టం ఏమిటి?'

'నష్టం ఉంది. మీకు పిల్లల పట్ల ఆసక్తి లేకపోతే ఎందుకని కన్నారు? వాడు డల్హౌసీ వెళ్తాడట. అక్కడేదో కొండలు ఎక్కుతారట. ఇంతకూడా ఆసక్తి లేకపోతే ఎట్లా? కనీసం మీరు వద్దంటారనుకున్నాను. అమ్మ ఇష్టం అని నామీదకి నెట్టేశారు. అందరు మొగవాళ్ళు ఇలా ఉంటారా?'

'మంచిదేకదా. డల్హౌసీ వెళ్తే హిమాలయాల ఒడిలోకి వెళ్ళినట్టుంటుంది. దూరంగా పీర్ పంజాల్ రేంజ్ కనిపిస్తుంది. 1942 ఎ లవ్ స్టోరీ మొత్తం డల్హౌసీలోనే షూట్ చేశారు. చాల అందమైన ప్రదేశం' ఇంకా చెప్పబోతూ ప్రశాంతి మొహం చూసి ఆగిపోయాడు శరత్.

'పిల్లలకి కాస్త తండ్రి భయం ఉండాలి. వాడు అడిగాడు. ఏంటో అడగకుండా మీరు ఓ.కే అన్నారు. వాడికి ఏం భయం ఉంటుంది? మీరు వద్దనాలి. వాడు బ్రతిమలాడాలి అంతేకానీ ఏమడిగినా యస్ అంటే విలువ ఏముంటుంది?'

'అదేమిటి.. వాడు మన సంతానం. మనల్ని చూసి వాడు భయపడటం ఎందుకు? అదీకాక వాడు చిన్నపిల్లవాడు కాదు. ఇంజనీరింగ్ చదువుతున్నాడు. వాడికి ఏం కావాలో వాడికి తెలుసు. ఈ వయసులో వాడికి ఆత్మాభిమానాన్ని మనం దెబ్బతీస్తే ఎలా? వాడు బ్రతిమలాడితేనే మన ఈగో నిలుస్తుందంటే, అలాంటి ఈగో నాకు అనవసరం' కోపంగా అన్నాడు శరత్.

శరత్ వైపు విచిత్రంగా చూసింది ప్రశాంతి.

'మహానుభావా! పుస్తకాలు వేరు. నిజజీవితం వేరు. ***పుస్తకాలలో ఎవడికి వాడు వాడి అనుభవాలే జగద్రక్షకాలని రాస్తారు. వాటిని నమ్మి అనుసరిస్తే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టే. మీరే అంటుంటారుగా, తమ బలహీనతలకి సిద్ధాంతాల ముసుగులు వేసి ప్రచారం చేసి వాటికి ప్రామాణికత సాధించుకుంటారు రచయితలని.*** వాళ్ళు చెప్పినవి చదివి మీరు పిల్లల్ని పాడుచేస్తున్నారు.'

శరత్‌కి గుర్తువచ్చింది. ఆ మధ్య ప్రశాంతి ఓ రచయిత్రి శక్తివంతమైన రచన చదివి, దాని ప్రభావంలో పడి శరత్‌తో పోట్లాడటం మొదలు పెట్టింది. ప్రతి విషయానికి మగవాళ్ళ అణగ్రదొక్కడం అంటూ సాగదీసేది. అప్పుడు శరత్, ఈ మాటలని ఆ రచయిత్రి వ్యక్తిగత జీవితాన్ని ప్రశాంతికి వివరించాడు. ఆమె, ఎలా నిర్దాక్షిణ్యంగా కన్నబిడ్డలను వారి మానాన వారిని నడివీధిలో వదిలేసి, వేరేవాడితో వెళ్ళిపోయిందో, ఆ వదిలివేయటాన్ని సమర్థిస్తూ 'శృంఖలాలు తెంచుకున్న స్త్రీ' అంటూ ఎలా సాహిత్యాన్ని సృష్టించి, గౌరవాన్ని పొందుతోందో వివరించాడు. 'ఇప్పుడు దాన్ని గుర్తు చేస్తోంది ప్రశాంతి.

'సరే.. ఈసారి అడుగుతాలే' అని ఆమెని దగ్గరకి తీసుకుని మృదువుగా చెప్పాడు.

'మన చిన్నప్పుడు మన పెద్దల దగ్గర డబ్బులుండేవి కావు. పిల్లలకు ఇన్ని అవకాశాలు ఉండేవి కావు. ఇపుడూ మనకి డబ్బులున్నాయి. ఇద్దరం సంపాదిస్తున్నాం. అంతా వాళ్ళ కోసమే కదా.. వాళ్ళ కోరికలు తీర్చటానికే కదా వెళ్ళనీ ఎంజాయ్ చేయనీ!

అతడి కౌగిలిలో ఒదిగిపోతూ అంది 'కానీ అడిగినవన్నీ ఇస్తూంటే వాడికి విలువ తెలియవద్దా? ఇప్పుడు అడిగిన వన్నీ ఇస్తారు. రేపు, వాడు విలువ తెలియకుండా ఏదో ఒకటి చేస్తే, అప్పుడు పెంపకంలో లోపం ఉందని ఏడుస్తారు. మీ అంజన్ కుమార్ పిల్లవాడిని గుర్తుకు తెచ్చుకోండి' అంది.

కొరడాతో ఛెళ్ళున కొట్టినట్టయింది. ఆమె చుట్టూ బిగుసుకున్న చేతులు సడలిపోయాయి.

'పదండి త్వరగా టైమవుతోంది. మళ్ళీ ఆలస్యమయితే మా బాసాసురుడి చాంబర్‌లోకి వెళ్ళి సంతకం పెట్టాలి. ఆడాళ్ళు ఉద్యోగాలు చేయటం గురించి అరగంట లెక్చర్ వినాలి' అంది.

ఆమెని వదిలేశాడు.

ఆమెని వదిలేశాడు కానీ ఆమె అన్నమాటలను వదలలేకపోయాడు.

శరత్‌కు ఎవరిమీదా ఒత్తిడి పెట్టడం ఇష్టం ఉండదు. తన ఆధిక్యం నిరూపించి ఎదుటివారు తాను చెప్పినట్టు వినేట్టు చేసుకోవాలని ఉండదు. ప్రతివ్యక్తికీ అతడికే ప్రత్యేకమైన అభిప్రాయాలుంటాయి. అనుభవాలుంటాయి. తనకి ఏది మంచి, ఏది చెడో నిర్ణయించుకునే శక్తి ఉంటుంది. అందుకే ఎవరిమీదా తన అభిప్రాయాలు రుద్దాలని ప్రయత్నించడు. తన సంతానం విషయంలోనూ అంతే. చిన్నప్పటి నుంచీ వారి స్వంత అభిప్రాయాలను గౌరవించాడు. మంచి, చెడు వివరించి నిర్ణయం వాళ్ళకే వదిలేసేవాడు. అది పొరపాటా?

ఆఫీస్‌కి వెళ్ళిన తరువాత పనిలో పడి సర్వం మరిచిపోయాడు. వ్యక్తిగతంగా ఆఫీసు పని శరత్ దృష్టిలో ఓ పనికాదు. 'పని' అన్నది వ్యక్తిలోని సృజనాత్మకతకు ఊపు నిచ్చేదిలా ఉండాలి. అతనిలోని అన్వేషణాసక్తిని రగిలించి, వ్యక్తిని మనిషిగా నిలపాలి. మరయంత్రంలా మార్చకూడదు.

కానీ ఉద్యోగాలన్నీ రొటీన్ ఉద్యోగాలే. బుర్ర అవసరంలేని ఉద్యోగాలు. ముఖ్యంగా, ప్రభుత్వోద్యోగాలలో మనిషి అవసరం లేదు. మర యంత్రం ఉంటే సరిపోతుంది. దీనికి తోడు బ్రిటీష్ వాడు ఏర్పరచిన అధికార వ్యవస్థ అదే పద్ధతిలో కొనసాగటంతో, నిర్ణయాలన్నీ పైవాడు తీసుకుంటాడు.

ఆలోచనలున్నా అవగాహన ఉన్నా క్రిందివాడు తలవంచుకుని నిర్ణయాలను అమలు పరచాల్సిందే. 'ఈ నిర్ణయం పొరపాటు' అని చెప్పకూడదు. చెపితే అధికారం, అహంకారం దెబ్బతింటాయి.

బ్రిటీష్ వాడికి అహంకారం. వాడు పాలకుడు కాబట్టి తనకు బానిసలయిన తన క్రిందివారు ఏరకంగానూ తనను ప్రశ్నించటానికి వీలులేదు. కానీ స్వాతంత్ర్యం వచ్చినా అదే కొనసాగుతోంది. బ్రిటీష్ వాడు పోయినా ఆ అధికారం, ఆ బానిసల వ్యవహారం మాత్రం పోలేదు.

కానీ తనకు కేటాయించిన పని చేయటం తన ధర్మం అనుకుంటాడు శరత్.

ఇక్కడ మరో విషయం శరత్‌కు నచ్చదు.

'వర్క్ ఈజ్ వర్షిప్' అంటారు.

'వీధులూడ్వడం నీకు బాధ్యత అయితే అందరికన్నా బాగా వీధులూడ్వాలి' అంటాడు అరబిందో.

కానీ తాను జన్మించింది నాలుగు పచ్చకాగితాల సంపాదన కోసం తను జీవితాన్ని ఇలా తాకట్టు పెట్టటం కోసం కాదనిపిస్తోంది శరత్‌కు. ఇది తమ ధర్మం కాదనిపిస్తుంది.

కానీ ఒక చట్రంలో ఇరుక్కుపోయారు. అందులో తానూ ఒకడు. దానికి ఎదురీదలేడు. ఎదురు నిలవలేడు. కానీ మనస్సులో బాధపడకుండా ఉండలేడు.

ఎంత అర్థవిహీనం, నిరర్థకం అనిపించినా కేటాయించిన పని చేయక తప్పదు. దాన్ని తిట్టుకుంటూ చేసేకన్నా ఆనందిస్తూ చేయటం మేలు. అందుకే పనిని ఎంజాయ్ చేయాలని ప్రయత్నిస్తాడు శరత్.

కనీసం ప్రభుత్వోద్యోగంలో ఓ భద్రత ఉంటుంది. ఉద్యోగ పరంగానూ, ఆదాయం పరంగానూ ఉద్విగ్నతలుండవు. అదే ప్రైవేట్ ఉద్యోగంలో ఎదుగుదల ఉన్నట్టనిపించినా అక్కడ మనిషి మనిషిలా మనగలగటం కష్టం అనిపిస్తుంది.

శరత్ ఫ్రెండ్స్ చాలామంది ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉన్నారు. వారు ఆఫీసుకి వెళ్ళే సమయం తప్ప ఇంటికి వచ్చే సమయంపై నియంత్రణ ఉండదు. ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. జీవితమంతా డబ్బు వేటలో గడిచిపోతుంది.

ఆలోచిస్తూ పని చేస్తున్న శరత్, చక్కటి పరిమళం గాలిలో తేలుతూ రావటంతో పని ఆపాడు. గుండెల నిండుగా ఆ పరిమళాన్ని పీల్చుకున్నాడు.

ఫైళ్ళు, దుమ్ముల నడుమ ఎక్కడిదీ పరిమళం అనుకున్నాడు. తల ఎత్తి ఆవైపు చూశాడు.

ఒక్క క్షణం తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు.

ఎదురుగా ఉన్న ఓ అందమైన యువతి. యువతి అనేకన్నా నడివయసు మహిళ అనవచ్చు. ముప్పయి అయిదేళ్ళుంటాయి. చక్కగ్గా అలంకరించుకుంది. లిప్‌స్టిక్ పెట్టుకుంది. ఆమె శరీరం రంగుని ఉద్దీపితం చేస్తూ, ఆమె అందాన్ని ఇనుమడింపచేసేటటువంటి దుస్తులు వేసుకుంది. చాలా ఆకర్షణీయంగా ఉంది.

'హలో... అయామ్ మాధవి' అని చేయిసాచింది.

**ఆప్ కే హసీన్ రుఖ్ పె ఆజ్ నయా నూర్ హై,**

మేర దిల్ మచల్ గయాతొ మేర క్యా ఖుసూర్ హై.

నీ అందమైన వదనం నేడు సరికొత్త వెలుతురుతో మెరిసిపోతోంది. అది చూసి నా హృదయం చలిస్తే దోషం నాది కాదు.

'పియానో, వయొలిన్ వాయిద్యాలు సృజించిన స్వరతరంగాలు ఆనందం కలిగిస్తూ, మత్తు కలిగించే మహమ్మద్ రఫీ స్వరమాధుర్యం చిలికే రొమాన్స్‌ను అనుభవించేందుకు సిద్ధపరుస్తూంటే, గేయంలో పొదిగిన పదాల భావం సృజించిన ఓ అస్పష్టమైన అందమైన ఆకారాన్ని ఊహిస్తూ తన్మయత్వం చెందుతున్నాడు శరత్.

సాధారణంగా సినిమా పాటలు టైమ్‌పాస్ కోసం వింటారు. హోటళ్ళలో, పెళ్ళిళ్ళలో, పాటలు మోగిస్తూ ఎవరిగొడవల్లో వారుంటారు. ఇళ్ళల్లో కూడా పాటలు వింటూ ముచ్చట్లాడుకుంటూంటారు. కానీ అది సినిమా పాట అయినా, శాస్త్రీయ సంగీతమైనా ఏదో క్యాజువల్‌గా వినటం శరత్‌కి ఇష్టం అనిపించదు. అది కళను, ఆ కళను సృజించిన కళాకారులను అవమానించినట్టే అనిపిస్తుంది. అందుకని అతడు ఏది విన్నా సంపూర్ణంగా తన దృష్టిని ఆ అంశంపైనే పెట్టి వింటాడు. అలా వింటున్నప్పుడు మామూలుగా వింటూంటే తెలియని, దృష్టికి రాని అనేక విషయాలు గ్రహింపుకు వస్తాయి.

ఒకో లయను, ఒకో శబ్దాన్ని సృహించి మాధుర్యాన్ని పెంపొందించి ప్రజలను రంజింప చేయటానికి కళాకారులు ఎంత శ్రమపడ్డారో, ఎంత నిజాయితీగా, చిత్తశుద్ధితో తమ కళను సృజించారో అర్థమయి అద్భుతం అనిపిస్తుంది. అది మామూలు సినిమా పాట అయినా, శాస్త్రీయ సంగీత గీతమైనా అంత తేలికగా కొట్టిపారేయటం అన్యాయమే కాదు వ్యక్తి తనకి తాను చేసుకుంటున్న మోసం అనిపిస్తుంది.

ఖలీలటోంకి ఛాలోమె ఖిలాఖిలా యెరూప్‌హై

ఘటాసె జైసె ఛన్ రహీ సుబహ సబహకి ధూప్ హై

పాటలోని పదాలు, వాటి అర్థాలు శరత్ హృదయంలో ఒక చిత్రాన్ని గీశాయి.

సూర్యోదయ సమయంలో మేఘాలను చీల్చుకుని సూర్యకిరణాలు ఆకాశంలో విస్తరిస్తూ తమ వెలుగులు ప్రసరిస్తున్నట్టు, విడివడిన కురులమాటు నుంచి తొంగి చూస్తున్న ఆమె రూపం ఉంది.

ఎంత అద్భుతమైన వర్ణన!

కవులంటే నినాదాలు రాసేవారు, రెండులైన్ల అంత్యప్రాసల భావవాక్యాలు రాసేవారు కారు. హృదయంలో కలం ముంచి, భావావేశ అంబరంపై అక్షరాల చిత్రాలను గీసేవారు.

గదినిండా పియానో రమ్యమైన శబ్దాలు నిండిపోయాయి. పియానోకు వంతపాడుతున్న వయొలిన్లు, వేణువులతో ఒక పాట ఒక 'సింఫనీ'లా పరమాద్భుతమైన భావాల అలల కడలిలా మారిపోయింది.

పాట అయిపోయింది.

శరత్ కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి. హృదయంలో ఏదో తెలియని బాధ కలుగుతోంది. అత్యంత ఆనందంలో అంతులేని వేదన కలగటం ఎంతో చిత్రమైన అనుభూతి □

అబ్ క్యా మిసాల్ దూ మై తుమ్హారే షబాబ్ కీ

ఇన్సాన్ బన్ గయా హై కిరణ్ మహతాబ్ కీ

ఒక పాట అయి మరో పాట ఆరంభమయింది.

ఆకాశమంత ఎత్తు ఎగసి పడిన అల, కలిగించిన సంచలనం నుంచి, ఉక్కిరిబిక్కిరి నుంచి తేరుకుని ఊపిరి పీల్చుకునేలోగా మరో అల ఉవ్వెత్తున ఎగసినట్టు, ఒకపాట కలిగించిన భావాల సంచలనం నుంచి తేరుకోకముందే వందో రమణీయమైన వర్ణనతో కూడుకున్న పాట ఆరంభమయింది.

ఈ పాటలో వాయిద్య ఆడంబరంలేదు. కేవలం బాణీ రమ్యత, గాయకుడి స్వరంలోని శృంగార రసప్రవాహం, కవితలోని పదాలు సృష్టించే అత్యద్భుతమైన భావాలతో మరో ఆనందకరమైన తుఫానును సృష్టించారు కళాకారులు.

తన ప్రేయసి యవ్వనాన్ని ఏమని వర్ణించాలో తెలియక సతమతమవుతూ స్త్రీ ఆకృతి దాల్చిన వెన్నెల కిరణం అని అంటున్నాడు. ఒక వెన్నెల కిరణం మానవ ఆకారం దాల్చి వస్తే ఎలా ఉంటుంది?

అసలు ఆ ఊహనే అద్భుతంగా ఉంది.

ఎంతటి అద్భుతమైన ఊహ! ఎంతటి సంస్కారవంతమైన ఊహ! ఎంతటి ఉన్నతమైన ఆలోచన.

ఇంతలో అతడి తపస్సులాంటి ఏకాగ్రతను భంగం చేస్తూ, 'మై పరేషాన్, పరేషాన్, పరేషాన్, పరేషాన్... రంజి షే హై ధువాధువా' అని ఓ యువతి గొంతు 'హై పిచ్'లో వినిపించింది.

శరత్ వింటున్న పాటను ముంచేసింది.

వెంటనే పాటను ఆపేశాడు. ముందు గదిలోకి తొంగి చూశాడు. శరత్ కూతురు స్రవంతి, ఆమె స్నేహితురాళ్ళు ఇద్దరూ, టీవీలో వస్తున్న పాటతో వంతపాడుతున్నారు పెద్ద గొంతుతో.

ప్రతి తరానికీ తనదైన ప్రత్యేక వినోద సాధనాలు, విలువలు ఉంటాయి. పాత తరం వారికి కొత్త తరం చెడిపోతున్నట్టు, కొత్త తరానికి సరైన అభిరుచి లేనట్టు అనిపిస్తుంది. కొత్త తరం వారికి పాత తరం వారివి విసుగు కలిగిస్తాయి. పాత అంటే చులకన ఉంటుంది. తరాల అంతరం ఇది. 'వారి ఆనందం ఇది. తన ఆనందం అది. ఎవరి ఆనందం వారిది' అనుకున్నాడు శరత్.

నెమ్మదిగా ఇంటిపైకి బాల్కనీలోకి బయలుదేరాడు అతడు. పై మెట్లెక్కుతూంటే అక్కడ నిలబడి పక్కింటామెతో మాట్లాడుతున్న ప్రశాంతి నవ్వింది.

'మీ అమ్మాయికి పాటల విషయంలో మీ పోలిక వచ్చింది. పాటలంటే ఒళ్ళూ పై మరిచిపోతుంది. మీరేమో నిశ్శబ్దంగా ఆనందిస్తారు. అది గెంతుతూ ఆనందిస్తుంది' అంది.

మౌనంగా పైకి వెళ్ళాడు శరత్.

ఆకాశంలో తారలు మినుకు మినుకు మటున్నాయి. వెన్నెలను వెదజల్లుతున్నాడు చంద్రుడు.

ఇక వెన్నెల కిరణం అందమైన మనిషిలా ఆకారం దిద్దుకుంటే ఎలా ఉంటుంది? ఆ ఆలోచన అతడిని వదలటంలేదు.

విడవడిన కురుల నీడలోని ఆమె వదనం, మేఘాలను చీల్చుకుని విస్తరిస్తున్న సూర్య కిరణాల్లా ఉండటం, వెన్నెల కిరణం మానవ ఆకృతి దాల్చటం..ఆ ఊహల విస్తృతని, అనంతత్వాన్ని, ఫలితంగా ప్రతిఫలించే అందాన్ని ఊహించాలని, అందుకోవాలని అతని హృదయం ఆతృత పడుతోంది. 'మనిషి వయసు పరంగా ఎంత ఎదిగినా, మానసికంగా, ముఖ్యంగా రొమాంటిక్ ఊహల పరంగా ఎప్పుడూ ఎదగడేమో!' అనిపించింది శరత్‌కు. సున్నితమైన శృంగార భావనలకు, కళను అర్థం చేసుకుని ఆస్వాదించటానికి నడుమ అవినాభావ సంబంధం ఉందనిపిస్తుంది. కళ సృజన వ్యక్తిలోని శృంగారభావనలను ప్రతిపాదిస్తుందంటుంది మానసిక శాస్త్రం.

'అందుకేనేమో, కళాకారులందరిలో ఓ రకమైన 'పిచ్చితనం' ఉంటుంది' అనుకున్నాడు శరత్. అంతలో అతడికి ఆ రోజు ఆఫీసులో జరిగిన సంఘటనలు గుర్తుకువచ్చాయి. మాధవి వచ్చి తనని తాను పరిచయం చేసుకున్నప్పుడు, ఆమెని చూసి నిశ్చేష్టుడయ్యాడు శరత్..

అతడిని నిశ్చేష్టుడిని చేసింది అనూహ్యమైన ఆమె అందం.

అందరూ చెప్తూంటే ఏదేదో ఊహించుకున్నాడు. కానీ ఇంకా ముప్పయి దాటవు ఆమెకు. ఆమె తనని తాను అలంకరించుకున్న తీరు, ఆమె హుందాగా నిలబడిన తీరు అతడిని ఆకర్షించింది.

ఆమె కళ్ళు అతడిని కట్టిపడేశాయి.

'పల్కోంకి  గలియోమె చెహరే, బహారోంకి హస్తే హుయే ' అన్న పాదం గుర్తుకువచ్చింది. 'కనురెప్పల దారులలో అందాన్ని, ఆనందాన్ని సూచించే వసంతంలాంటి వదనం...'

ఏమిటీ ఉన్నతమైన ఊహలు. ఎలా వస్తాయి కవులకు ఇలాంటి ఆలోచనలు? అందరికీ ఆలోచనలు వచ్చినా వాటిని పొందికగా, క్రమపద్ధతిలో, మరింత వన్నె తెచ్చేలా ప్రదర్శించగలగటం కొందరికే ఎందుకు సాధ్యమవుతుంది?

మాధవిని చూసి ఆమె, పలకరింపుకు సమాధానం ఇచ్చేలోగా, వేరే ఫ్లోర్‌లోని అతడు వచ్చాడు.

'హాయ్ మధూ' అన్నాడు ఆమె చేయి పట్టి కుదిపేస్తూ.

ఇంతలో ఇంకొకరెవరో వచ్చారు.

కాస్సేపటికి ఆమె చుట్టు ఓ గుంపు తయారయింది. అందరూ గలగలా మాట్లాడేస్తున్నారు. వారందరికీ కేంద్ర బిందువులా ఉంది మాధవి.

కాస్సేపు వాళ్ళవైపు చూశాడు శరత్.

వాళ్ళు అలా మాట్లాడుతూ నవ్వుతూ తుళ్ళుతూ బయటకు వెళ్ళిపోయారు. హాల్లో ఉన్న వాళ్ళందరూ పనులు ఆపేసి మరీ వాళ్ళవైపు చూస్తూండిపోయారు.

'ఇంక మన ఆఫీసు ఆఫీసులా ఉండదు' శరత్ పక్కన వచ్చి కూర్చుంటూ అన్నాడు పరమేశ్వర్.

శరత్ మాట్లాడలేదు.

ఆఫీసులో నవయువకులెవరూ లేరు. అందరూ నడివయసులోవారే. అందరూ జీవితానుభవాలలో పండిన వారే. కానీ.. ఆ గుంపు వైపు చూస్తున్నపుడు ఎవరి కళ్ళల్లోనూ పరిణితి లేదు.

ఒకరకమైన నిరాశ, కసి అసూయలు కనిపించాయి.

ఇది శరత్ నిత్యజీవితంలోనూ గమనించాడు.

ఒక అమ్మాయి ఎక్కడ కనిపించినా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు ఆమె వైపు చూస్తారు. ఆ చూపులలో ఆమె అందాన్ని మెచ్చుకోవటంతో పాటు మరో రకమైన భావాలుంటాయి. మగవాళ్ళే కాదు మహిళల చూపుల్లోనూ ఆ భావం కనిపిస్తుంది.

ఇక అబ్బాయి, అమ్మాయి కలిసి కనిపిస్తే వారివైపు కుతూహలంగా చూడనివారుండరు. వెకిలిగా నవ్వని వారుండరు. దీనికి వయసుతో, సామాజిక స్థాయితో సంబంధం లేదు.

ఇప్పుడు అనంతమైన ఆకాశం క్రింద నుంచుని ఆలోచిస్తుంటే అంతా పనికిరానిదిగా, సిల్లీగా అనిపిస్తోంది.

'మనిషి తన జీవితాన్ని ఎంత వ్యర్థంగా, పనికిరాని ఆలోచనలతో, పనిలేని ఆవేశాలు, నిరాశలు, ఆవేదనలతో గడిపేస్తాడు కదా!' అనుకున్నాడు శరత్.

ప్రతి వ్యక్తికీ ఆనందం కావాలి. కానీ ఆ ఆనందం కోసం అన్వేషణలో అంతా నిరాశలు, విషాదాలే.

'ఘర్ సే చలే థే హమ్‌తొ ఖుషీకీ తలాష్ మే

గమ్ రాహమే పడి హై వొహీ సాహ్ హోలియే...

ఓ పాటలోని చరణం గుర్తుకు వచ్చింది. ఆనందాన్ని, సౌఖ్యాన్ని వెతుకుతూ ఇల్లు వదిలితే... దారిలో విషాదం, బాధలు కలిసి, వెంట వచ్చాయట. నవ్వొచ్చింది శరత్‌కు.

'అన్నం తింటారా? లేక ఆలోచనలు తింటూ గడిపేస్తారా?' పైకి వచ్చింది ప్రశాంతి.

ఆలోచనలతో పడి శరత్ గమనించలేదు. చాలా రాత్రయింది. రోడ్లపై వాహనాలు తిరగటం తగ్గిపోయింది. ఉండి ఉండి ఒకటి రెండు వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. జన సంచారం తగ్గిపోయింది.

'పద'

వెన్నెల పడి ప్రశాంతి వదనం వెండి రంగులో మెరిసిపోతోంది. ఆమెని దగ్గర తీసుకున్నాడు.

'మంచి రొమాంటిక్ మూడ్‌లో ఉన్నట్టున్నారు' అంది ప్రశాంతి నవ్వుతూ, అతడి నుంచి దూరం జరుగుతూ.

నవ్వాడు శరత్.. 'ఆప్ కే హసీన్ రుఖ్ పె ఆజ్ నయా నూర్ హై, మేర దిల్ మచల్ గయా తొ మేర క్యా ఖుసూర్ హై' హమ్ చేశాడు.

'బాగుంది. ఇక్కడేమో మీరు శృంగార పాటలు పాడుతున్నారు. క్రింద మీ కూతురు ఆమె స్నేహితులు ప్రేమ పాటలు పాడుతూ కలలుకంటున్నారు. చూస్తుంటే ప్రపంచమంతా ప్రేమ ప్రేమ అంటూ కొట్టుకుపోతున్నట్టుంది. ఆ ఏడుపు లేనిది నా ఒక్కర్తికే లాగుంది. కడుపులో ఎలకలు భరతనాట్యం చేస్తున్నాయి. రండి తిందాం త్వరగా పడుకుంటే ప్రొద్దున్నే త్వరగా లేవవచ్చు' గబగబా అంది ప్రశాంతి.

'పద' అన్నాడు శరత్ ఆమెని అనుసరిస్తూ.

ప్రశాంతి అన్న మాటలతో సత్యం అతడిని కొరడాలతో ఛెళ్ళు ఛెళ్ళున కొడుతోంది. ప్రతివ్యక్తి మగ అయినా, ఆడ అయినా పెళ్ళయ్యే వరకూ 'ప్రేమ భావన'లో మునిగితేలుతారు, కలలు కంటారు.

నిజం ఎప్పుడూ కలకాదు.

దాంతో ప్రేమరాహిత్య భావన పెరుగుతుంది. ***ఉన్నదానితో రాజీపడలేక, లేనిదాన్ని పొందలేక, ఇతరులెవరో దాన్ని పొందుతున్నారన్న అసూయతో జీవితాంతం అసంతృప్తి, ప్రేమ రాహిత్య భావనలతో సతమతమవుతారు. ఇతరుల ఆనందాన్ని పాడుచేస్తారు.*** శరత్ క్రిందకు వచ్చేసరికి స్రవంతి, ఆమె స్నేహితులు గలగల మాట్లాడుతూ నవుతూ తుళ్ళుతూ మెట్లెక్కడం ఆరంభించారు.

పక్కకు తొలిగి వారికి దారి ఇచ్చాడు శరత్.

'హాయ్ అంకుల్' అంటూ శరత్‌ని పలకరించి పైకి వెళ్ళారు.

శరత్‌కి నవ్వు వచ్చిది.

సీతాకోక చిలుకల్లా నవ్వుతూ తుళ్ళుతూ వెళ్తున్న వారిలో తన కూతురు కూడా ఒకరవటం గమ్మత్తుగా అనిపించింది. ఖలీల్ జిబ్రాన్ కవిత మనసులో మెదిలింది.

*Your children are not your children.*

*They are the sons and daughters of Life's longing for itself.*

*They come through you but not from you,*

*And though they are with you yet they belong not to you.*

నిజం.. పిల్లలకు జన్మనివ్వటం మటుకే తల్లిదండ్రుల వంతు. నిజానికి ఆ జన్మ నివ్వటంలో కూడా తల్లితండ్రులు తోలు బొమ్మల్లాంటివారే తప్ప వారి ప్రమేయం ఏమీలేదు. తల్లిదండ్రుల ద్వారా జన్మించిన పిల్లలు ఎవరికి వారే ప్రత్యేకం. వారి ఆలోచనలు, ఇష్టాఇష్టాలు, భవిష్యత్తు, అదృష్టం దేనిమీదా ఎవరికీ నియంత్రణ లేదు.

***నియంత్రణ లేని దాన్ని నియంత్రించాలని తపన పడి జీవితాన్ని నరకప్రాయం చేసుకోవటమే మనిషి జీవితమా?***

నవ్వుతూ గలగలా వెళ్తున్న స్రవంతిని చూస్తుంటే పలురకాల ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. అప్పుడే ఆమె తనదైన ఇష్టాఇష్టాలతో స్వతంత్రంగా, ప్రత్యేక ప్రపంచంలా తోస్తోంది.

"మళ్ళీ ఆగిపోయారేమిటి? ఇప్పుడేం ఆలోచనలు వస్తున్నాయి? నాకు తెలియదు. అసలు అంతగా ఏమాలోచిస్తారు? ఒక్కపైసా ఆదాయంలేని ఆ ఆలోచనలవల్ల ఏం లాభం? ఏవైనా డబ్బులు వచ్చే ఆలోచనలు చేయండి ప్లీజ్' హాస్యంగా అంది ప్రశాంతి.

నవ్వాడు శరత్.

'సమంత్ రాలేదా?' అడిగాడు శరత్ కంచం ముందు కూర్చుంటూ.

'అబ్బో.. ఎంత ఆశ్చర్యం. మీకో కొడుకు ఉన్నాడనీ, వాడు రాత్రి పది అయినా ఇంటికి రాలేదని ఇప్పుడు గుర్తొచ్చిందే! గుర్తొచ్చినందుకు సంతోషం' వ్యంగ్యంగా అంది ప్రశాంతి.

'మన అమ్మాయి స్నేహితులు రాత్రి పది అయినా మన ఇంట్లో ఉన్నారు. అలా వాడు ఎవరి ఇంట్లోనయినా ఉన్నాడేమో!' ఆమె వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా.

'ఏమో.. ప్రొద్దున్న వెళ్ళేటప్పుడే లేటవుతుందని చెప్పాడు. ఇంత లేటు అవుతుందనుకోలేదు. వాడికో సెల్‌ఫోను ఇచ్చేస్తే ఎక్కడున్నాడో తెలుస్తుందికదా!'

'పిల్లలకి సెల్‌ఫోన్లు ఇప్పుడే ఎందుకు?'

'వాళ్ళు పిల్లలు కారు. రాత్రి పదయినా బయట తిరిగేవాడు చిన్నపిల్లాడా?'

'వాళ్ళకి పరిణితి లేదు. సెల్‌ఫోన్ ఇస్తే దాన్ని సరిగ్గా వాడే బదులు వీడియో తీయటానికి, వాట్సప్పుల్లో షేర్ చేసుకోవటానికి దుర్వినియోగం చేస్తారు. '

ఆశ్చర్యంగా చూసింది శరత్‌వైపు ప్రశాంతి.

'మీకు సెల్‌ఫోన్లలో వీడియోలు తీస్తారని, వాట్సప్పులో షేర్ చేసుకుంటారని ఎలా తెలిసింది?' ఆశ్చర్యం నటిస్తూ అడిగింది.

నవ్వాడు శరత్. 'సరే.. వాడికీ సెల్‌ఫోన్ కొనిద్దాం'

'అమ్మాయి ఎప్పటినుంచో అడుగుతోంది.'

శరత్ రోడ్డుమీద యువతీ యువకులు అరుదుగా కనిపిస్తున్నారు. ఎప్పుడూ చెవిదగ్గర సెల్‌ఫోను పెట్టుకుని ముచ్చట్లాడే వారూ, వేలితో సెల్‌ఫోను, స్క్రీను మీద కెలికేవారు కనిపిస్తున్నారు తప్ప మామూలుగా ఎవ్వరు కనబడటం లేదు. నడుస్తూ, డ్రైవ్ చేస్తూ, పదిమంది మధ్య ఉంటూ తమ ఒంటరి ప్రపంచంలో విహరించే వాళ్ళలో తన సంతానము ఒకరయిపోవటం శరత్‌కు ఇష్టంలేదు. కానీ.. జీవిత ప్రవాహంలో కొట్టుకుపోతూ తన ప్రత్యేకతను నిలుపుకోవటం ఎలా?

అదీగాక, ప్రత్యేక ప్రపంచమయిన తన సంతానం పై తన అభిప్రాయాలు రుద్దటం సమంజసమా?

'తినేటప్పుడు ఏమాలోచనలు? ఎదురుగా ఓ మనిషి ఉందని పట్టించుకోకపోతే ఎలా' అడిగింది ప్రశాంతి.

'There can be no disparity in marriage like insuitability of mind and purpose' డేవిడ్ కాపర్ ఫీల్డ్ నవలలోని వాక్యం గుర్తుకు వచ్చింది శరత్‌కు.

ఇది తనకేకాదు, ప్రశాంతికీ వర్తిస్తుంది.

ప్రశాంతి మీద ప్రేమ, జాలి వెల్లువలా పొంగాయి.

జీవితం విచిత్రమైనది. ఎక్కడెక్కడి వారినో కలుపుతుంది. పూర్తిగా విభిన్నమైన వ్యక్తులను ఒక చోట చేరుస్తుంది. కలిసి బ్రతకమంటుంది. వ్యక్తిత్వానికి పరీక్ష పెడుతుంది.

తన ఆకాంక్షలు, ఊహలు, ఆలోచనలతో రాజీపడుతూ, కలను కలగా పక్కన పెట్టి, సత్యంతో రాజీపడి బ్రతకటం నేర్పిస్తుంది.

'మాధవి వచ్చి జాయిన్ అయిందట కదా?' అడిగింది ప్రశాంతి.

ఆమె వైపు తలెత్తి చూశాడు.

'మా ఆఫీసులో నీ గూఢచారులు ఎవరున్నారు?' నవ్వుతూ అడిగాడు.

'ఏం చేస్తామండీ... మా ఖర్మ.. వెయ్యికళ్ళతో కాపాడుకోవాల్సి వస్తుంది. కాలం బాగాలేదు. పిల్లలు ప్రేమో రామచంద్ర అని కొట్టుకుపోతూ పార్కులు, సినిమాహాళ్ళు పావనం చేస్తున్నారు. పెళ్ళయి పిల్లలున్న పెద్దలూ 'ప్రేమో దేవుడా' అని కొట్టుకుపోతున్నారు. మా ఆఫీసులో రామచంద్రం లేడూ.. మీకు గుర్తుండదులెండి. చక్కని భార్య, మంచి పిల్లలున్నారు. కానీ ఆఫీసులో ఓ అమ్మాయి మోజులో పడి భార్యా పిల్లల్ని వదిలేశాడు. ఆ అమ్మాయి అవసరం ఉన్నంతకాలం వాడుకుంది. అవసరం తీరగానే పొమ్మంది. వేరే పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది. పాపం, భార్యాపిల్లలు అన్యాయమైపోయారు. కాలం బాగాలేదు. ఏం చేస్తాం?'

'నేను అట్లా ఎవరివెంటయినా వెళ్ళిపోతానని భయమా?'

'నాకు అంత అదృష్టం కూడానా. మీ ఆలోచనల్లో పడి ఎటుపోతున్నారో మీకే తెలియదు. ఎవరి వెంటనో ఏం పోతారు? కానీ నా జాగ్రత్తల్లో నేనుండాలి. ముందు జాగ్రత్త పడితే తరువాత పడే బాధల నుంచి తప్పించుకోవచ్చు' అంది ప్రశాంతి.

నవ్వాడు శరత్. 'రాత్రి పదకొండు దాటింది. సుమంత్ ఇంకా రాలేదేమిటి?'

'అదే అంటున్నాను. కనీసం ఆలస్యం అయింది, కంగారుపడకండి అని చెప్పాలన్న జ్ఞానంలేదు'

ఆమె మాటలు పూర్తవుతూంటేనే బయట కీచుమని కారు ఆగిన శబ్దం వినిపించింది. శరత్, మాధవి బయటకు వెళ్ళి చూశారు.

ఇంటి సందు చివర్లో ఓ కారు దాదాపుగా గోడను కొట్టినంత పనిచేసి ఆగింది. దాన్నిండా యువకులున్నారు. 'బై..రా' అంటూ దిగుతున్నాడు సుమంత్. చూడగానే తాగి ఉన్నట్టు తెలుస్తోంది, సుమంత్ మాత్రమే కాదు, కారులోని అందరూ.

**శరత్‌కు ఇదంతా కల అనిపిస్తోంది.** తాను ఈ కలను దర్శిస్తున్నవాడిలా అనిపిస్తున్నాడు.

ప్రొద్దున్నే లేవటం, ఆఫీసుకి తయారవటం, ఆఫీసుకి రావటం, ఎందుకూ పనికిరాని పనులు చేయటం, సాయంత్రమవగానే ఇంటికి వెళ్ళటం, తినటం, పడుకోవటం, మళ్ళీ ప్రొద్దున్నే లేచి ఆఫీసుకి రావటం.. ఇదంతా ఎందుకూ అంటే బ్రతకటం కోసం.

బ్రతకటం కోసం సంపాదించే డబ్బులకోసం బ్రతుకునే అమ్మేసుకున్నట్టు అనిపిస్తోంది.

'ఏమోయ్ అలా ఉన్నావు? ఒంట్లో బాగాలేదా?' ఓ కొలీగు అడిగాడు.

నవ్వానని పించాడు శరత్ సమాధానంగా.

'ఏం శరత్.. ఆర్ యూ నాట్ వెల్?' బాస్ అడిగాడు.

ఎందుకో ఏదో కోల్పోయిన భావన కలుగుతోంది. అంతా శూన్యంగా, నిరాశగా అనిపిస్తోంది.

మెదడంతా స్తబ్దుగా ఉంది.

'ఏం సార్.. అలా ఉన్నారు?' చనువుగా వచ్చి పక్కన కూర్చుని అడిగింది మాధవి ఆమె వైపు చూశాడు శరత్.

ఆరోజు ప్రత్యేకంగా అలంకరించుకుంది. ఏదో పెళ్ళికి వెళ్ళాల్సి ఉందని అత్యంత ఆకర్షణీయంగా అలంకరించుకుంది. రోజూ కన్నా అందంగా ఉంది. శరత్‌కు నవ్వు వచ్చింది.

పెళ్ళిరోజు అందంగా అలంకరించుకుంటారందరూ. పెళ్ళి కొడుకు కూతురు ఎలాగో ప్రత్యేకంగా అలంకరించుకుకుంటారు. పెళ్ళికి వచ్చిన వారు కూడా ఒకరిని మించి ఒకరు పోటీ పడుతూ అలంకరించుకుంటారు.

పరపరలాడే చీరలు, ధగధగలాడే ఆభరణాలు, మేకప్పులతో ఉంటారు. ఎందుకు? ఎందుకోసం ఈ అలంకరణ?

ముఖానికి ఎంత మేకప్పు వేసుకున్నా, ఎన్ని ఖరీదైన దుస్తులు వేసుకున్నా, ఎన్నెన్ని అలంకారాలు చేసుకున్నా అవి తాత్కాలికమే.

ఫంక్షన్ అయిపోయి, ఎవరింటికి వారు వెళ్ళిపోయిన తరువాత అలంకరణలన్నీ తీసేయాల్సి ఉంటుంది. ఆభరణాలన్నీ తీసేయాల్సి ఉంటుంది. అప్పుడు అసలు రూపంతో దర్శనమివ్వాల్సి ఉంటుంది.

అంటే వ్యక్తులు తమవారి ముందు తమ అసలు రూపాలు ప్రదర్శిస్తారు. కానీ బయటవారి ముందు తమ అసలు రూపు కాక మరో అందమైన రూపాన్ని ప్రదర్శించాలని తపన పడతారా?

తమ అలంకరణలు, ఆభరణాలు, హోదాల ప్రదర్శనలు అన్నీ బయట వారిని ఊరించి, తమ ఆధిక్యతను నిలుపుకోవటం కోసమేనా?

తమ మేకప్పు రూపం చూసి అందరూ అసూయ చెందాలని, తమని గొప్పగా భావించాలన్న తపననా?

బయటకు కనిపించే మాయనే అందరూ నిజమని భ్రమపడతారు. కానీ పైకి కనిపించే మేకప్పుల క్రింద దాగున్న అసలు మనిషిని చూడలేరు. చూపించరు.

'ఏం సార్.. ఆఫీసులో ఉన్నారా? ఇంకెక్కడయినా విహరిస్తున్నారా?' అడిగింది మాధవి.

ఉలిక్కిపడ్డాడు శరత్.

'ఇవాళ్ళ మనకొలీగ్ కూతురు పెళ్ళి మధ్యాహ్నం వెళ్ళిపోతాం' చెప్పింది.

తల ఊపాడు శరత్.

'మీరు రారా పెళ్ళికి?' అడిగింది.

తల అడ్డంగా ఊపాడు శరత్.

'ఎందుకని?' అడిగింది.

సమాధానం ఇవ్వలేదు. నవ్వాడు.

ఆమె శరత్ వైపు ఓసారి పరిశీలనగా చూసింది. లేచి నిలబడింది. 'వెళ్తున్నాం' అని హైహీల్స్ టకటకలాడించుకుంటూ వెళ్ళిపోయింది.

ఆమె అటు వెళ్ళగానే సెక్షన్‌లోని అమ్మాయి హేమలత వచ్చింది.

'సార్.. మీరు మాధవికి అలా ఇష్టం వచ్చినట్టు పర్మిషన్లు ఇవ్వకండి .అది బయట అందరితో తిరుగుతుంది' అంది.

ఆమె వైపు ఓసారి చూసి ముఖం తిప్పుకున్నాడు శరత్.

ఈమె ఎప్పుడూ ఎవరో ఒకరిమీద ఏదో ఒకటి చెప్తూనే ఉంటుంది.

'ఐడెంటిటీ క్రైసెస్ అన్న పదానికి చక్కని నిదర్శనం ఈమె' అనుకున్నాడు శరత్ మనసులో.

ఆఫీసులో అందరూ ఎదిగినవారే. కుటుంబాల బాధ్యతలు మోస్తున్నవారే. పిల్లలను పెంచుతున్నవారే.

కానీ అందరూ ఇంకా ఎదిగీ ఎదగని మనస్సులతో కనిపిస్తారు. అందరూ ఇంకా బాల్యం వీడని పెద్దల్లా అనిపిస్తారు.

శరత్ ఏమీ మాట్లాడకపోవడంతో ఆమె వెళ్ళిపోయింది.

శరత్ మనస్సులో ఎందుకో తెలియదు ఆవేదన సుళ్ళు తిరుగుతోంది.

అది సుమంత్ తాగి ఇంటికి వచ్చినందుకా?

లేక, వాడు తాగటానికి తన భార్య తనను దోషిగా నిలిపినందుకా? లేక ప్రొద్దున్నే లేచి, నా గురుంచి నువ్వేం పట్టించుకున్నావింతవరకూ? ఇప్పుడూ పట్టించుకోకు. నేను తాగితే ఏమిటి నష్టం?' అని తన కొడుకు తననే నిలదీసి అడిగినందుకా?

రాత్రి జరిగిన విషయాలు ఒకటొకటే జ్ఞాపకం రాసాగాయి.

తూలుతూ వచ్చిన కొడుకుని ఆవేశంగా ఏదో అనబోయిన భార్యను వారించాడు శరత్. 'వాడిని ఇప్పుడేమీ అనవద్దు. వాడి నేరభావన పెరుగుతుంది. దాన్నికప్పిపుచ్చుకునేందుకు నేరం మనపై మోపుతాడు. తిరుగుబాటు ధోరణిలో మాట్లాడతాడు. వాడిని మనమే తాగుడు వైపు తరిమినట్టవుతుంది' అన్నాడు శరత్.

ప్రశాంతి ఎందుకో ఏమీ అనకుండా అతడి మాటలు విన్నది. ఆమెకూడా కొడుకు తాగి ఇంటికి రావటాన్ని జీర్ణించుకోలేకపోతోంది. అందుకే శరత్ మాటలకు మౌనంగా ఉండిపోయింది.

వాళ్ళ ఫ్రెండు పట్టుకుని వచ్చాడు సుమంత్‌ని. వాడూ తూలుతున్నాడు.

వాళ్ళని చూస్తుంటే శరత్ మనస్సు చిత్రంగా స్పందించింది.

తన కొడుకు తనకే అపరిచితుడిలా అనిపిస్తున్నాడు.

ముఖం ఉబ్బి, కళ్ళల్లో మత్తునిండి, బాలెన్స్‌లేక తూలుతూ, వస్తున్నవాడు తనవల్ల జనించిన వాడనిపించటంలేదు.

వాడిని చిన్నప్పటినుంచీ ఎత్తుకుని ముద్దు చేసిన భావన అబద్ధం అనిపిస్తోంది. తడబడే అడుగులు వేస్తూ సంతోషపడే సుందరవదనం, ఏదైనా అడిగింది కొనిచ్చినప్పుడు కళ్ళల్లో కనబడే మెరుపు, ఆ మెరుపుకోసం సర్వంత్యాగం చేయాలనిపించిన భావన తాను అనుభవించిన భావనలు కావనిపిస్తోంది. రాత్రుళ్ళు ఏడ్చినప్పుడు ఎత్తుకుని బయట అటూ ఇటూ తిరుగుతూ, తారలను, చందమామను, చెట్లను చూపిస్తూ, పాటలు పాడి నిద్రపుచ్చినవాడు, వీడూ వేర్వేరనిపిస్తోంది.

రాత్రిళ్ళు గుండెల మీద పడుకోబెట్టుకుని, 'సోజా రాజకుమారా' అని పాడింది, 'ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు' అని మురిసింది వీడిని చూసి కాదనిపిస్తోంది.

వాడు జ్వరంతో పడుకుంటే డాక్టర్లు చుట్టూ తిరిగి, రాత్రింబవళ్ళు మేల్కొని కంగారు పడిందంతా నిజంకాదు, అబద్ధం అనిపిస్తోంది.

అబద్ధం.. వాడు ఇక్కడ జులాయి వాళ్ళతో తిరిగి చెడిపోతాడని పడిన కంగారు, స్కూలులో వాడు నేర్చుకునే చెడ్డమాటలు, చేతలనుంచి తప్పించాలని పడ్డ తపనలు, అడుగడుగునా వాడిని కంటికి రెప్పలా కాపాడుతూ, బంగారు భవిష్యత్తు సాధించాలని పడిన తపనలు, అన్నీ బూటకం అనిపిస్తున్నాయి.

వాడు క్లాసులో మంచి మార్కులు తెచ్చుకున్నపుడు కలిగిన గర్వం, అంచెలంచెలుగా ఎదుగుతూ తనకేంకావాలో నిర్ణయించుకోగల వ్యక్తిత్వం సాధించాడని కలిగిన ఆనందం అన్నీ ఆవిరయిపోతున్నాయి.

ఎవడు వీడు? తూలుతూ, అపరిచితుడిలా కనిపిస్తూ తనముందు నుంచున్నవాడు?

'ఏమనుకోకండి అంకుల్. రాహుల్ బర్త్‌డే పార్టీ ఇవాళ' అది సంజాయిషీ ఇస్తున్నట్టులేదు. వార్త వినిపిస్తున్నట్టుంది.

'మేం చేసింది చేశాం. నువ్వు భరించక తప్పదు. ఏం చేస్తావో చేసుకో' అన్న సవాల్ విసిరినట్టుంది ఆ పిల్లవాడి మాట.

శరత్ సమాధానం ఇవ్వలేదు. ఆ పిల్లవాడి నుంచి సుమంత్ చేతులను తన భుజం మీద వేసుకున్నాడు.

'మా నాన్న తాగడురా.. తాగటం తప్పంటాడు. ఉట్టి డర్ పోక్. ఈడియట్' ఏదో గొణుగుతున్నాడు సుమంత్.

వాడికి తనని ఎవరు పట్టుకున్నారో తెలియటంలేదు.

తాగేవారంటే ఎందుకో చిన్నచూపు, అసహ్యం శరత్‌కు.

తాగుడు అనేది ఒక బలహీనత.

తనలో తాను ఆనందాన్ని ప్రాకృతికంగా పొందలేనివాడు మాత్రమే కృత్రిమ ఆనంద సాధనాలపై ఆధారపడతాడన్నది శరత్ ప్రగాఢ విశ్వాసం.

అందుకే అందరూ గొప్పగా పొగిడే 'దేవదాసు' శరత్‌కు నచ్చడు. కోరిన అమ్మాయి లభించకపోతే తాగి జీవితాన్ని వ్యర్థం చేసుకునే పనికిమాలినవాడు దేవదాసు అన్నది శరత్ అభిప్రాయం.

సినిమాలు దేవదాసుని హీరో చేసి సమాజానికి ఆదర్శం చేశాయి కానీ అతి బలహీనుడు, నీచుడు, చేతకాని వాడు దేవదాసన్నది శరత్ అభిప్రాయం. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని, నిరాశలను, కన్నీళ్ళను అదుముకుని జీవితంలో తల ఎత్తుకుని పోరాడగలిగేవాడే అసలైన హీరో అన్నది శరత్ నమ్మకం. అందుకే ఎవరైనా దేవదాసు పేరెత్తితే శరత్ 'మదర్ ఇండియా' ప్రసక్తి తెచ్చేవాడు. శాంతారాం సినిమా 'ఆద్మీ'ప్రసక్తి తెచ్చేవాడు. కాస్త దెబ్బతగిలితే చాలు తాగుడు వైపు మళ్ళే కథలు, సినిమాలను అసహ్యించుకునేవాడు.

వ్యక్తి ఆనందంకానీ, విశ్వాసం కానీ తన అంతరాంతరాలలోంచే రావాలి.

బయటనుంచి కృత్రిమంగా ఎన్ని ఊతకర్రలు తెచ్చుకున్నా అవి తాత్కాలికమే కానీ శాశ్వతం కావు.

'ఉద్ధవేత్ ఆత్మనాత్మానాం' అంటుంది భగవద్గీత. వ్యక్తి తనని తాను ఉద్ధరించుకోవాలన్నది శరత్ విశ్వాసం.

కొడుకు స్పర్శ అసహ్యంగా ఉంది.

వీడిని ఎత్తుకుని ముద్దాడి, గుండెలకు అదుముకుని, ఆ ఆత్మీయస్పర్శానందాన్ని అనుభవించానన్న భావన అతడి మనస్సును తొలిచి వేస్తోంది.

ముఖం ఉబ్బి, చెమటలు కారుతూ, తూలుతున్న కొడుకు తనవాడు కాదనిపిస్తోంది.

బెడ్‌రూములోకి తీసుకువెళ్ళాడు.

'ష్.. నాన్నకు చెప్పొద్దు' అన్నాడు సుమంత్, శరత్‌తో.

వెళ్ళి మంచం మీద వాలిపోయాడు. క్షణాలలో నిద్రలోకి జారుకున్నాడు.

ప్రశాంతి గదిలోకి వచ్చింది. ఆమె కంటనీరు కారుతోంది.

శరత్ భుజం మీద తలపెట్టి, నిద్రిస్తున్న సుమంత్ వైపు చూస్తూ అడిగింది బేలగా' వీడిలా అయ్యాడేమిటండీ? ఈ తాగుడు ఎలా వచ్చింది వీడికి?' ఆమెని పొదివి పట్టుకున్నాడు శరత్.

మామూలు సంబంధాలు ఇతర సమయాల్లో ఎలా ఉన్నా కష్ట సమయంలో విరిగిపోతాయి. కానీ ఆత్మీయ అనుబంధాలు మాత్రం కష్టకాలంలో మరింత సన్నిహితమౌతాయి. ఒకరినుంచి మరొకరు శక్తిని పొందుతారు.

ఆమెని పొదవిపట్టుకుని నడిచాడు శరత్. గదితలుపు నిశ్శబ్దంగా వేశాడు.

తలుపు వేసేముందు స్పృహలోలేని కొడుకువైపు చూశాడు.

'మరణానికి నిద్రకూ తేడా ఊపిరి' అనిపించింది.

ముందు గదిలోకి రాగానే, పైనుంచీ స్రవంతి క్రిందకు వచ్చింది.

ఆమె స్నేహితులను పంపించేసినట్టుంది.

'అమ్మా, అన్న తాగివచ్చాడా?' అడిగింది. ఆమె ముఖంలో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి తోడు, తన అన్నయ్య తాగిరావటం తన స్నేహితురాళ్ళంతా చూశారన్న అవమాన భావన ఆమె బాధను మరింత పెంచుతోంది.

'తాగి వచ్చాడు. వస్తే ఏమైంది? అందరూ తాగరా? మీ ఫ్రెండ్ రూబీతో వాళ్ళమ్మా, నాన్నా కూడా కూచుని తాగుతారని నువ్వేకదా చెప్పావు? మీ రిషిత క్రికెట్ ఆడటానికి వెళ్ళినప్పుడు తాగుతుందని చెప్తావు. గుర్తుందా? ఆడపిల్లలు తాగితే లేనిది మగపిల్లవాడు తాగితే తప్పేముంది?' కొట్టినట్టే అంది ప్రశాంతి.

ఆశ్చర్యంగా చూశాడు శరత్ ఆమె వైపు.

ఒక్క క్షణం క్రితం వరకూ కొడుకు తాగి వచ్చాడని బాధపడుతూ, బేలగా ఆసరాకోసం తన భుజం మీద తలవాల్చిన ఈమె, తన కొడుకును ఎవరూ మాట అనడం సహించలేక బెబ్బులిగా మారింది. ఏ చర్యకు తాను బాధపడుతుందో, ఆ చర్యను సమర్ధిస్తూ వాదిస్తోంది.

స్రవంతి ముఖం ముడుచుకుంది. గబగబా తనగదిలోకి వెళ్ళిపోయింది. స్రవంతి అటువెళ్ళగానే ప్రశాంతి కోపంగా శరత్ వైపు తిరిగింది.

'అంతా మీవల్లనే. చిన్నప్పటి నుంచీ చెపుతున్నాను. తండ్రి భయం ఉండాలండీ పిల్లలకు అంటే, ఉండాల్సింది భయం కాదు ప్రేమ అన్నారు. పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి. వాళ్ళకు నచ్చినట్టూ ఎదగనివ్వాలి. తీగకు ఆధారం కలిపిస్తే చాలు, అదే ఎదుగుతుందన్నారు. ఇపుడు చూడండి, మీ తీగ ఏవైపు ఎదుగుతోందో! స్పేర్ ది రాడ్ స్పాయిల్ ది చైల్డ్ అన్నారంటే వినలేదు. అనుభవించండి. ఇదంతా మీ మూలంగానే, ఎంత ధైర్యం లేకపోతే తాగి ఇంటికి వస్తాడా? మిగతా పిల్లలు వాళ్ళ అమ్మానాన్న అంటే భయపడి ఛస్తారు. మన పక్కవాళ్ళు చూడండి బెల్టుతో కొట్టేవాడాయన. ఇప్పటికీ పిల్లలు తండ్రి అంటే గజగజ వణికిపోతారు.' కోపంగా అంది.

శరత్ ఏమీ మాట్లాడలేదు.

'మీరేం మాట్లాడరు. నాకు తెలుసు. మీకు బాధలు, ఆనందాలు ఉంటేకదా? ఏమీ పట్టని సంసారంలో సన్యాసి మీరు. ఆ పాటలు, పుస్తకాలు ఉంటే చాలు మీకు, ఎవరెటు పోయినా ఫరవాలేదు' కసిగా అంది.

'రాత్రయింది పడుకో స్రవంతిని ఓదార్చు. జరిగింది జరిగింది. జరగబోయేది జరుగుతుంది. నువ్వూ నేనూ అరుచుకుని ఏంలాభం?' మృదువుగా అన్నాడు శరత్.

కోపంగా చూసి ఏదో అనబోయి ఆగిపోయింది ప్రశాంతి. విసవిసా నడుస్తూ స్రవంతి గదిలోకి వెళ్ళింది.

ఆమె వెళ్ళిన తరువాత ఒంటరిగా, నిశ్శబ్దంలో చాలాసేపు కూర్చున్నాడు శరత్.

చివరికి లైట్లు ఆపి తన గదిలోకి వెళ్ళాడు. ఇలాంటి సమయాల్లో పుస్తకపఠనం ముఖ్యంగా కవిత్వపఠనం అన్నిటికీ మందు. మనసులోని ఆందోళనను అణచి ప్రశాంతతను నింపే ఏకైక మార్గం. పుస్తకాల షెల్ఫులో వెతికాడు. రవీంద్రుడి గీతాంజలి తీశాడు.

ఎపుడు బాధ కలిగినా గీతాంజలి చదివితే శాంతిగా ఉంటుంది. ఏదో ఒక పేజీ తెరిచాడు. చదివాడు.

This is my prayer to thee, my lord---
strike, strike at the root of penury in my heart.
Give me the strength lightly to bear my joys and sorrows.

Give me the strength to make my love fruitful in service.
Give me the strength never to disown the poor
or bend my knees before insolent might.
Give me the strength to raise my mind high above daily trifles.
And give me the strength to surrender my strength to thy will with love.

చదువుతూంటే ఎప్పుడో నిద్రపట్టింది.

**ప్రొద్దున్నే లేచిన శరత్‌కు** రాత్రి జరిగిందంతా కల, నిజంకాదు అనిపించింది. కొడుకు నిద్రపోతున్న గదిలోకి వెళ్ళాడు.

వాడు అస్తవ్యస్తంగా పడుకుని ఉన్నాడు. గదిలో నిండిన వాసన రాత్రి జరిగింది 'కలకాదు' అని స్పష్టం చేస్తోంది.

ప్రశాంతి నిద్రలేచి ముభావంగా పనులు చేస్తోంది. స్రవంతి కూడా మూతి ముడుచుకుని ఉంది.

నిజానికి ఇంట్లో ఏమీ జరగలేదు కానీ వాతావరణంలో ఏదో తెలియని విషాదం, ఉద్విగ్నతలు నిండినట్టుంది. ఎవరికి వారు మౌనంగా తమ పనులు చేసుకుంటున్నారు. ఒకరు మరొకరితో మాట్లాడటంలేదు.

ఒకే ఇంట్లో ఎన్నో ఏళ్ళుగా కలసి ఉంటున్నా, ఎవరెవరి మనస్సుల్లో ఎలాంటి ఆలోచనలు మెదులుతున్నాయో ఎవరికి తెలుసు?

ఎవరెవరి ఆశలు, నిరాశలు, ఆనంద విషాదాలు ఎవరు పసికట్టగలరు? పై పై విషయాలు తెలుస్తాయి.

కానీ అంతరంగలోతుల్లో సుళ్ళు తిరుగుతున్న సుడిగుండాలనెవరు పసికట్టగలరు?

భౌతికంగా ఒక వ్యక్తితో, వ్యక్తుల సమూహంతో సంవత్సరాల తరబడి సన్నిహితంగా జీవించవచ్చు. కానీ మానసికంగా ఎంత సాన్నిహిత్యం సాధించగలరన్నది వేరే విషయం. ఇంట్లో వాతావరణాన్ని ఎలా తేలిక చేయాలో అర్థం కావటంలేదు శరత్‌కు. ఇంతలో సుమంత్ నిద్రలేచాడు.

ముఖం చిట్లించుకుని బయటకు వచ్చాడు కానీ ఆ చిట్లింపు వెనుక నేరభావన స్పష్టంగా తెలుస్తోంది.

***మనిషి మనసుకి తాను చేస్తున్న పనుల్లో తప్పు ఒప్పులు ఎవరూ చెప్పకుండానే తెలుస్తాయి. కానీ తప్పు ఒప్పుకోవటానికి మెదడు సిద్ధంగా ఉండదు. మనసు మెదడు పై విజయం సాధిస్తే వ్యక్తి తప్పు గ్రహించి, క్షమార్పణలు చెప్పుకుని తప్పు సరిదిద్దుకోవటానికి సిద్ధంగా ఉంటాడు.***

***మెదడు మనసుపై విజయం సాధిస్తే, తప్పును కప్పిపుచ్చుకుని దాన్ని సమర్థించుకోవాలని ప్రయత్నిస్తాడు. నేరం ఇతరుల పైకి నెట్టాలని ప్రయత్నిస్తాడు మెదడు, మనస్సు రెంటి మధ్య సమన్వయం ఉన్న మనిషి నేరం అనిపించేపని చేయడు.***

తన కొడుకు ఏ వర్గీకరణలోకి వస్తాడా అని ఆసక్తిగా చూశాడు శరత్.

సుమంత్ మౌనంగా తన పనులు చేసుకుంటూ పోయాడు.

అమ్మని పలకరించాడు.

ఆమె మాట్లాడలేదు. ముభావంగా వెళ్ళిపోయింది.

చెల్లిని పలకరించాడు.

తనని కానట్టు వెళ్ళిపోయింది.

శరత్ ఎదురుగా వచ్చి కూచున్నాడు 'ఎలా ఉంది? తలనొప్పి తగ్గిందా?' అడిగాడు శరత్ మృదువుగా.

కోపంగా చూశాడు సుమంత్ తండ్రివైపు.

‘నాకేమైంది? నాకు ఎందుకు తలనొప్పి? ఏమైంది ఇంట్లో అంతా ఎందుకిలా ఉన్నారు? నేనేం తప్పు చేశాను? నేను రేప్ చేశానా? మర్డర్ చేశానా? ఎవరినైనా లూటీ చేశానా? ఎందుకని అంతా నన్ను నేరస్తుడ్ని చూసినట్టు చూస్తున్నారు?‘ గట్టిగా అరిచాడు సుమంత్.

అంత వరకు నిశ్శబ్దంగా ఉన్న ఇంట్లో అతడి గొంతు వికృతంగా ప్రతిధ్వనించింది. అతడు అరచి ఆగిన తరువాత ఇంట్లో నెలకొన్న నిశ్శబ్దం మరింత భయంకరంగా ఉంది.

ఇంతలో ప్రశాంతి వంటింట్లోంచి గబగబా బయటకు వచ్చింది.

‘ఏమిటా అరుపులు? కేకలు? ఇంటికి తాగి వచ్చింది నువ్వు. పిచ్చికుక్కలా అరుస్తావా? తల్లిదండ్రులంటే కనీస గౌరవం కూడాలేదా?‘ అరిచింది. తాను చేసిన నేరానికి కుములుతూ, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు అందరిమీదా అరచే సంతృప్తి పడే మానసిక స్థితిలో ఉన్నాడు సుమంత్.

ఈ సమయంలో అతడిని తిట్టటం, అరవటం, నేరాన్ని ఎత్తి చూపటం చేయకూడనిపని.

కానీ ప్రశాంతి అదే పనిచేసింది.

తాను చేసిన పనికి సిగ్గుపడే బదులు, దాన్ని సమర్ధించుకునే ‘తిరుగుబాటు‘ భావన తలెత్తింది.

సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణలో పెట్టటం అంటే బెదిరించటం, కొట్టటం, లంచం ఆశ చూపించటం, బతిమిలాడటంలలో ఏదో ఒకటి అనుకుంటారు.

***పిల్లలు చెప్పినట్టు వినేట్టు చేసుకోవటమే క్రమశిక్షణ అనుకుంటారు. కానీ క్రమశిక్షణ అన్నది పిల్లల మనస్సుల్లోంచి రావాలి. బలవంతానో, బెదిరించో బయటనుంచి వచ్చిన క్రమశిక్షణ చిరుగాలికే ఎగిరిపోయే ధూళిలాంటిది. అలా పెరిగిన పిల్లలు ఎదుగుతున్న కొద్దీ తమ స్వీయానుభవాల ద్వారా తమపైనే ప్రత్యేకమైన అభిప్రాయాలు ఏర్పాటు చేసుకుంటారు.***

తల్లిదండ్రులకు తమ పిల్లలు ఎంత ఎదిగినా చిన్న పిల్లల్లానే అనిపిస్తారు. చిన్నప్పుడు పిల్లలతో ఎలా వ్యవహరించాలో, ఎదిగిన తరువాత కూడా అలానే వ్యవహరిస్తారు.

ఇక్కడ నుంచీ ఘర్షణ మొదలవుతుంది.

ఎదిగిన పిల్లవాడు తల్లిదండ్రులు తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని గుర్తించి గౌరవించాలని అనుకుంటాడు.

తల్లిదండ్రులు పిల్లవాడిని పిల్లవాడిగానే చూస్తారు. వాడి ఎదుగుదలలో తమ ప్రాధాన్యాన్ని గుర్తించి తమని గౌరవించాలని కోరుకుంటారు.

రెండు సమాంతరంగా ప్రవహించే నదుల్లాంటివి భావాలు, అభిప్రాయాలు..

చిన్నప్పుడు ఎలాగయితే బెదిరింపులు, తిట్టటం ద్వారా పిల్లవాడికి బుద్ధి చెప్పాలని ప్రయత్నించిందో అదే రీతిలో ఎదిగిన పిల్లవాడి తప్పును ఎత్తి చూపించి నేర భావన కలిగించాలని ప్రయత్నించింది ప్రశాంతి.

కానీ సుమంత్ ఇపుడు చిన్నపిల్లవాడు కాదు, తల్లి తిట్టగానే తలవంచుకుని లొంగిపోవటానికి.

ఈ వయసులో తిరుగుబాటు భావన రెపరెపలాడుతూంటుంది. ఎదుగుతున్న పిల్లవాడిని పిల్లవాడిలా కాదు, ఎదిగిపోయిన పిల్లవాడిలా చూడాలి. కానీ ఆ పరిణతి తల్లిదండ్రులు వచ్చేసరికి కాలం మించిపోతుంది.

పిల్లవాడో అమ్మాయిని ఇష్టపడ్డానని చెప్పగానే తల్లితండ్రులు ఆవేశపడిపోతారు ఆ పిల్లలో వంకలు వెతకాలని ప్రయత్నిస్తారు.

ఇంకా భవిష్యత్తును నిర్ణయించే పెద్ద నిర్ణయాలు తీసుకునే వయసురాలేదని విమర్శిస్తారు.

అప్పుడే ప్రేమేంటని ఈసడిస్తారు.

ఇవన్నీ పిల్లవాడి పట్టుదలను పెంచుతాయి. మామూలు ఇష్టం కాస్తా గాఢం అవుతుంది.

అంటే తల్లిదండ్రులు పిల్లవాడిని పిల్లవాడిలానే చూడటం వల్ల తమకు తెలుసో, తెలియకనో పిల్లవాడిని పెద్దలకు ఇష్టంలేని పనులవైపు తరుముతున్నారన్నమాట.

ఇప్పుడు తన కళ్ళముందు అదే జరుగుతుంటే మౌన ప్రేక్షకుడిలా దాన్ని చూస్తూ నిస్సహాయంగా కూర్చుని ఉండటం శరత్‌కి బాధ కలిగిస్తోంది. ఇందులో ఎవరికీ ఏమీ చెప్పలేదు.

ఒకరిది ఆవేశం.. మరొకరిది నిరసన..

ఆవేశం హద్దులు దాటితే, నిరసన తిరుగుబాటు అవుతుంది.

సుమంత్ తిరుగుబాటు బావుటా ఎగరవేశాడు.

'నేనేమన్నాను? నేను అన్నదానిలో మిమ్మల్ని అవమానించటం ఏముంది? అవును రాత్రి తాగివచ్చాను. దాన్లో తప్పు ఏముంది? ఇప్పుడు అందరూ తాగుతారు. తాగటం తప్పుకాదు. అయినా నేనేమీ తాగుబోతునా? ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ అయింది. అందరూ తాగేరు. తాగిన వాళ్ళు చెడ్డవాళ్ళు అనే పాత పనికిరాని భావనను మీ మెదళ్ళలోంచి తొలగించండి. ఫారిన్‌లో అందరూ తాగుతారు. అందరూ చెడ్డవాళ్ళేనా? అయితే అక్కడ అన్నన్ని సత్యావిష్కరణలు ఎలా జరుగుతున్నాయి? అంత అభివృద్ధి ఎలా సాధ్యమయింది? తాగటం తప్పుకాదు. తాగితే చెడ్డవాడుకాదు. తాగటం చెడిపోవటం కాదు. మీ అపోహలు నాపైన రుద్దకండి' అరిచాడు సుమంత్.

అతడి ఆవేశానికి బిత్తరపడి నిలుచుండిపోయింది ప్రశాంతి. ఆమె నోటమాట రాలేదు. సుమంత్ తండ్రివైపు తిరిగాడు.

'నాన్న తాగడు. అంతమాత్రాన నాన్న మంచివాడా? గొప్పవాడా? ఎప్పుడూ పుస్తకాలు చదువుతూండటం, ఎవరినీ కలవక పోవటం మంచితనమా? గొప్పతనమా? ఏరీ నాన్నకి ఒక్క ఫ్రెండున్నాడా? బయట ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలుసా? నాన్న కొలీగులే ఎంతమంది ఎంతెంతగా డబ్బులు సంపాదిస్తున్నారో తెలుసా? అందరూ తాగుతారు. స్నేహం చేస్తారు. వ్యాపారాలు చేస్తారు. ఎదుగుతారు. నాన్నలా ఓ మూల ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోరు. నన్నూ అలా ఏకాకిలా అవమంటావా? నేను అలాకాను. నాకు ఫ్రెండ్స్ కావాలి. ఎదుగుదల కావాలి' శరత్‌కు నవ్వు వచ్చింది. మనసులో నవ్వుకున్నాడు.

ఓడిపోయిన దానిలా ప్రశాంతి శరత్ వైపు తిరిగింది.

'వాడలా మాట్లాడుతుంటే, బెల్లం కొట్టిన రాయిలా మౌనంగా వింటుండిపోతారేంటి? నోరిప్పరేమిటి? మంచి చెడు చెప్పరేమిటి? తాగుడు అలవాటయితే ఎలా చెడిపోతారో చెప్పండి' అరిచింది ప్రశాంతి.

శరత్ కొడుకు వైపు చూశాడు.

జాలిగా అనిపించింది.

వాడి తరానికి తగ్గట్టు వాడు ప్రవర్తిస్తున్నాడు.

తమ తరం పరిధిలో తాము ఆలోచిస్తున్నారు.

అవును. తమ తల్లిదండ్రులు తమకు రాముడు దేవుడు, ఆదర్శం అని నేర్పించి, ఈ తరానికి సమాజం రావణుడు దైవం, శూర్పణఖ ఆదర్శం అని నేర్పుతోంది. ఏ తరానికి ఆ తరానికి తగ్గ విలువలు ఉంటాయి. వ్యాకరణం ఉంటుంది. లేచాడు శరత్.

'వాడు చిన్నపిల్లవాడు కాదు. మంచి చెడు తెలుసుకోలేని విచక్షణ లేని వాడు కాదు. వాడికి నువ్వూ నేనూ చెప్పాల్సిన పనిలేదు. వాడి మనస్సుకు మంచి చెడు తెలుస్తుంది. ' మృదువుగా అన్నాడు. 'వాడంతట వాడు తెలుసుకోలేకపోతే ఎంత చెప్పినా తెలుసుకోలేడు' అన్నాడు.

సుమంత్ నిరసనగా చూశాడు శరత్‌వైపు.

ప్రశాంతి ఆశ్చర్యంగా చూసింది శరత్‌వైపు.

మౌనంగా తన గదిలోకి నడిచాడు శరత్. రేడియో 'ఆన్' చేశాడు. పాట వస్తోంది.

తార మన్ దర్పణ్ కహెలాయే

భలే, బురే, సారే కర్మోంకో దేఖే ఔర్ దిఖాయే..

నీ మనస్సు అద్దంలాంటిది. మంచి చెడు కర్మలన్నిటినీ చూస్తుంది. చూపిస్తుంది.

మన్ హి దేవతా, మన్ హీ ఈశ్వర్

మనసే బడా నాకోయీ,

మన్ ఉడియారు, జబ్ జబ్ ఫైలే

జగ్ ఉడియారా హోయే

ఇస్ ఉజ్‌లే దర్పణ్ పర్ ప్రాణీ, ధూల్ న జమ్‌నేపాయే

మనస్సే దేవత. మనస్సే ఈశ్వరుడు. మనస్సును మించినదేదీలేదు. మనస్సు జ్ఞానమనే వెలుగుతో నిండితే, ఆ వెలుగువల్ల జగత్తు వెలుతురుమయమవుతుంది. ఇలాంటి వెలిగే దర్పణంపైన ధూళి నిండనివ్వద్దు.

'ఏంటి సార్ పార్టీకి వెళ్ళలేదా?'

తిరిగి చూశాడు శరత్.

పక్కన కూర్చుని చనువుగా అడిగింది మాధవి.

'అదేమిటి, పెళ్ళికి వెళ్తానన్నారు? మధ్యాహ్నం రానన్నారు, అప్పుడే వచ్చేశారు?' అడిగాడు శరత్.

మాధవి కళ్ళల్లో సన్నని నీటిపొర తళుక్కుమని మెరిసింది.

'సార్.. నాకు మాట్లాడాలని ఉంది. మనం కాఫీ తాగుదామా?' అడిగింది. ఒక్క క్షణం ఆలోచించాడు శరత్. 'సరే' అన్నాడు.

'ఒక్క రిక్వెస్ట్ సార్' అంది.

ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూశాడు శరత్.

'ఇక్కడకాదు సార్.. బయటకు వెళ్దాం. ఇక్కడ మనం కాఫీతాగుతూ మాట్లడటం ఎవరయినా చూస్తే గొడవలయిపోతారు. ఎవరేమన్నా నాకు బాధలేదు. కానీ .. అనవసరంగా మీరు బాధపడతారు. '

'మరి?'

'తాజ్‌కు రండి' అని చరచరాలేచి వెళ్ళిపోయింది.

శరత్‌కు గమ్మత్తుగా అనిపించింది.

తన జీవితంలో ఓ అమ్మాయి తనని 'కాఫీ'కి పిలవటం ఇది మొదటిసారి.

ఆ పిలవటం బహుశా తన భుజం ఆసరాగా కన్నీరు కార్చటానికి.

'వెళ్ళాలా? వద్దా?' ఆలోచించాడు.

ఓ నిర్ణయానికి వచ్చాడు. లేచాడు.

శరత్ వచ్చేసరికి, అందరికీ దూరంగా, ఇద్దరే ఎదురు బదురుగా కూర్చోగల టేబుల్ వద్ద కూర్చుని కనిపించింది మాధవి.

ఆ హోటల్ గది మొత్తం ఆమె వల్ల పూలతోటలా మారినట్టు అనిపించింది శరత్‌కు. వెయిటర్లే కాదు, కొద్ది సంఖ్యలో ఉన్న కష్టమర్లు కూడా ఉండి ఉండి ఆమె వైపు దొంగ చూపులు చూస్తూండటం గమనించాడు శరత్.

ఇంత అందమైన అమ్మాయి ఎదురు చూస్తున్న ఆ అదృష్టవంతుడు ఎవరోనని అందరూ ఆత్రంగా, అసూయతో ఎదురు చూస్తున్నట్టు అనిపించింది శరత్‌కు.

అందరూ తనని అసూయగా చూస్తారనిపించింది.

గర్వంగా అనిపించింది. అంతలో నవ్వొచ్చింది.

గర్వం ఎందుకు?

అంతలో అతనికి ఓ ఆలోచన వచ్చింది.

తన తరం పుట్టినప్పటి నుంచీ తమకు ప్రేమ భావనలు నవలలు, సినిమాల నుంచి అందుతూ వచ్చింది. కానీ తన తరం తిరుగుబాటు తరంకాదు. అలాగని, మరీ దేవదాసులాంటి బుద్ధిగా చెప్పినట్టు విని బాధలను బాటిళ్ళలో దింపి నాశనమయ్యే తరమూ కాదు.

దాంతో తమ తరంలో కొందరు ప్రేమ వివాహాలు ధైర్యంగా చేసుకున్నారు.

వారిని నిరసిస్తూ, రహస్యంగా వారివైపు ఆరాధనగా, అసూయతో చూస్తూ తల్లితండ్రులు చూసిన అమ్మాయిని పెళ్ళిచేసుకుని సుఖంగా జీవిస్తున్నవారే అధికంగా కల తరం తమది.

కానీ తమలో ప్రేమరాహిత్య భావన, సినిమాల్లోలా ఓ ప్రేయసి లేకపోవటం, పార్కుల్లో, హోటళ్ళలో కలవటం లాంటి ప్రేమరాహిత్య భావన అంతర్గతంగా, అంతరంతరాల్లో ఉంది.

ఆ నిరాశను అణచిపెట్టి జీవితం సాగిస్తున్న తరం తమది. ధైర్యవంతుల వైపు అసూయగా చూస్తూ, అమ్మాయిలతో స్వేచ్ఛగా మాట్లాడి, తిరగగలిగే వారిని ఆరాధిస్తూ, వారి గురించి చెడుగా ఊహించి మాట్లాడి సంతృప్తి పడే తరం తమది.

అటు పాతను వదలలేక, కొత్తను పూర్తిగా ఆహ్వానించలేక పాత, కొత్తల నడుమ ఊగిసలాడే తరం తమది.

అందుకే మాధవి తనకోసం ఎదురుచూస్తున్న భావన ఆనందం కలిగిస్తోంది. రొమాంటిక్ భావనలకు ఊపిరి పోస్తోంది.

కానీ ఆమె తన మీద ప్రేమతో తనకోసం ఎదురు చూడటం లేదని తెలుసు. ఆమె తన గోడు వెళ్ళబోసుకోవటానికి, వినే చెవుల కోసమే తప్ప అర్థం చేసుకుని స్పందించే హృదయం కోసం ఎదురు చూడటం లేదనీ తెలుసు.

అంతేకాదు, తనకు వివాహమయిందని భార్య, ఎదిగిన పిల్లలున్నారనీ తెలుసు. తన భార్య ఇలా మరో వ్యక్తికి గోడు వెళ్ళబోసుకుంటే హర్షించలేడనీ అతడికి తెలుసు. 'కానీ.. ఏదో భావన ఈ ఆలోచనలన్నిటినీ కప్పిపుచ్చింది.'

మాధవి పిలవగానే పరుగెత్తుకు వచ్చేట్టు చేసింది.

శరత్ ఎదురుగా వచ్చి కూర్చోగానే అడిగింది మాధవి.

'అందరూ నా గురించి ఏమనుకుంటున్నారో నాకు తెలుసు. మీరేమనుకుంటున్నారు నా గురించి?'

**'నా గురించి మీరేమనుకుంటున్నారు?',** శరత్ తన ప్రశ్నకు ఎంత సేపటికీ సమాధానం ఇవ్వకపోవటంతో మళ్ళీ అడిగింది మాధవి.

నోరు విప్పాడు శరత్ 'నేను మీ గురించి ఏమనుకుంటున్నానో అప్రస్తుతం. మీరేదో నాతో చెప్పాలన్నారు. వచ్చాను. చెప్పండి' అన్నాడు శరత్.

ఆమె చుట్టూ చూసింది.

అక్కడక్కడా తప్ప పెద్ద జనాలు లేరు.

'నేనెందుకు రమ్మన్నాననుకుంటున్నారు?' అడిగింది.

ఆమె వైపు సూటిగా చూశాడు శరత్. 'మీరు ఎందుకు పిలిచారో నాకు తెలియదు. మీరేదో బాధలో ఉన్నారనిపించింది. బాధ పంచుకుంటే తరుగుతుందంటారు. మీ బాధను నాకు చెప్పటం వల్ల తగ్గించుకోవాలనుకుంటున్నారనుకుని వచ్చాను. సారీ' అన్నాడు శరత్ లేచి నిలుచుంటూ.

మాధవి నవ్వింది.

'కోపం వద్దు. మీతో నాకు పరిచయం లేదు అంతగా. మీతో ఎందుకని పంచుకుంటాననుకున్నారు? అంటే, మీ మనసులో ఏదో ఓ మూల నన్ను ఒంటరిగా కలవాలన్న కోరిక ఉన్నట్టే కదా?' అంది నవ్వుతూ.

ఆమె వైపు ఆలోచనగా చూశాడు శరత్. కూచున్నాడు.

'ఇది సహజం. పైకి ఎవరెంత నీతులు చెప్పినా, ఎంత మంచిగా ప్రవర్తించినా, స్త్రీ, పురుషుల నడుమ ఆకర్షణ ఉండటం సహజం. కుతూహలం ఉండటమూ సహజం. దానికి మీరు ఎక్సెప్షన్ కాదు. నేనూ కాను' అన్నాడు.

'నాకో సమస్య వచ్చింది. దానికి మీరు పరిష్కారం సూచిస్తారనిపించింది. నా అంచనా సరైనదేనని మీ మాటలు నిరూపించాయి.' అంది నవ్వుతూ.

'అంటే, మీరు నాకు పరీక్ష పెట్టారా?'

'నేను మనుషులను చాలా దగ్గరగా చూశాను. మనుషులు ఎంత దగ్గరగా వస్తే వారు అంతగా అపరిచితులుగా, అనిపిస్తారని అనుభవపూర్వకంగా గ్రహించాను. ఒకరకంగా చెప్పాలంటే, పైకి కనబడే మనిషికీ లోపలి మనిషికీ అస్సలు పోలికనే ఉండదు. కానీ..' అని ఆగింది సందేహిస్తూ.

'కానీ..?' అడిగాడు శరత్.

'మీరేమయినా అనుకుంటారేమోనని సందేహిస్తున్నాను.'

'మనం నిర్మోహమాటంగా మాట్లాడుతున్నాం. ఏమైనా అనుకునేదేముంది?'

'కానీ.. తరచి చూస్తే మనుషులంతా ఒక్కటే అనిపిస్తుంది. పైకి ఎంతగా విభిన్నంగా అనిపించినా, మనుషులు, ముఖ్యంగా మగవాళ్ళంతా ఒక్కటే.' అంది.

శరత్ మాట్లాడలేదు.

***సాధారణంగా మనుషులు తమ అభిప్రాయాలను వ్యక్తపరచటానికే ఇష్టపడతారు. ఎదుటివాడి అభిప్రాయాలను వినాలనుకోరు. ఎదుటివాడు కూడా తమ అభిప్రాయాలనే బలపరచాలనుకుంటారు. అలా బలపరచే వారి స్నేహమే వాంఛిస్తారు. వ్యతిరేకించేవారు, కాదనే వారిని మెచ్చరు.*** అందుకని ఆమె మాటల మధ్యలో తాను మాట్లాడాలని ప్రయత్నించలేదు.

'నేను స్వానుభవం మీద చెపుతున్నాను. రకరకాల మాటలు చెప్తారు. నమ్మిస్తారు. మాయ మాటలు చెప్తారు. కానీ వాళ్ళ ఉద్దేశ్యం ఒక్కటే. కొందరు బయట పడతారు. కొందరు బయట పడరు. పైగా ఎదుట సానుభూతి కురిపిస్తారు. నీతులు వల్లిస్తారు. మనిషి కనుమరుగు కాగానే నీచంగా మాట్లాడతారు. అందరూ అంతే.'

శరత్ మౌనంగా ఉన్నాడు. అతడి పెదవులపై చిరునవ్వుంది.

'మీకు తెలుసు నాకు పెళ్ళయిందని. ఇద్దరు పిల్లలున్నారు. అయినా సరే నేను ఎవరితోనయినా నవ్వుతూ మాట్లాడితే సంబంధం అంటగట్టేస్తారు. తమ మనసులోని కుళ్ళును వెదజల్లుతారు. తీరని తమ కోరికల నిస్పృహలు, నిరాశలను, ఎదుట వారేదో సుఖపడిపోతున్నారన్న కసితో ప్రదర్శిస్తారు.' అంది.

శరత్ ఏమీ మాట్లాడక పోవటం చూసి అడిగింది. 'ఏమిటి, మీరేం మాట్లాడరు?' అని –

శరత్ నవ్వి ఊరుకున్నాడు.

'నేను ఇంతకుముందు ఇక్కడ పని చేసి వెళ్ళాను. అప్పుడు నాకు సన్నిహితులున్నారు. ఇప్పుడు మళ్ళీ వచ్చాను. నేను వాళ్ళతో కలసి పెళ్ళికి వెళ్తే తప్పేమిటి?'

'ఏమీలేదు' అన్నాడు శరత్. అతడికి విషయం కొద్ది కొద్దిగా అర్ధమవుతోంది.

'కదా.. మరి .. పెళ్ళిలో అందరిముందు భయంకరంగా గోల జరిగింది. నాకు అక్కడ ఉండాలనిపించలేదు. అసహ్యంగా అనిపించింది. ఈ భార్యలకు తమ భర్తలంటే నమ్మకం లేదో, తమ మీద తమకే నమ్మకం లేదో కానీ అనుమానాల కుళ్ళుతో ఛస్తున్నారు.' కసిగా అంది మాధవి.

'ఏం జరిగింది?' జరిగింది అర్ధమయినా అడిగాడు శరత్.

'నేను అశోక్ మంచి స్నేహితులం. ఇద్దరం ఒకేసారి ఉద్యోగంలో చేరాం. అప్పటి నుంచీ మంచి ఫ్రెండ్సయ్యాము. నేను పెళ్ళికి వెళ్ళాలంటే, నేనూ వస్తున్నాను పద అన్నాడు. అతడితో బండిమీద పెళ్ళికి వెళ్ళాను. మేము పెళ్ళిలో దిగినప్పటి నుంచీ ప్రతి ఒక్కరు మావైపు అదోరకంగా చూస్తూనే ఉన్నారు. అది ఇబ్బందిగా అనిపించింది అయితే, ఆ పెళ్ళికి అశోక్ భార్య వారి ఆఫీసు వాళ్ళతో వచ్చింది. ఆమె కూడా మేమిద్దరం కలిసి బండి దిగటం చూసింది' ఏదో అప్రియమైన దాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్న భావన కనిపించింది ఆమె ముఖంలో.

మౌనంగా, ఆమె కొనసాగించటం కోసం, ఎదురు చూస్తూ కూచున్నాడు. వెయిటర్ వచ్చి రెండు కాఫీలు పెట్టి వెళ్ళాడు.

'అసలు ఈ మనుషులు ఒకరి మీద ఒకరికి నమ్మకాలు లేకుండా ఇన్నేళ్ళూ సంసారాలు ఎలా చేస్తారో? కలసి ఎలా ఉంటారో? పైగా, పదిమంది ముందు అల్లరి పడద్దన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా, అండర్‌స్టాండింగ్ లేకుండా ఎలా ఉంటారో?' అంది.

కాఫీ సిప్ చేస్తూ ఆమె మాటలు వింటున్నాడు శరత్.

'అందరి ముందు అతడి భార్య గోల చేసింది. నన్ను నానామాటలంది. ఆమె ఇన్ని మాటలంటూంటే అశోక్ ఆమె నోరు మూయించే ప్రయత్నమే చేయలేదు. చివరికి నేను ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చి అరవటం మొదలు పెట్టిది.... ఛీ...ఛీ.. నేను అక్కడినుంచి వచ్చేశాను. ఏమయింది చెప్పండి, అశోక్ నేను కొలీగులం. ఎప్పటినుంచో తెలుసు. బండి ఎక్కినంత మాత్రాన అదో పెద్ద ఇష్యూనా? దానికి ఏడ్పులు, పెడబొబ్బలు, గోలలూనా? ఛీ మెదడు ఎదగని మనుషులు.. పశువులు..'

కాఫీ చల్లగా అయిపోయిందని వెయిటర్‌ని పిలిచి ఇంకోటి తెమ్మంది.

ఆమె మాటలు వింటూంటే, శరత్‌కు గమ్మత్తుగా అనిపించింది.

ఈ మధ్య కాలంలో టీవీ ఛానళ్ళు, ముఖ్యంగా వార్తల ఛానళ్ళు పెరిగిపోయినప్పటినుంచీ 'వార్త' అర్ధం మారిపోయింది. అలాంటి అర్ధం లేని వార్తల ఛానళ్ళలో రోజుకు ఒకటో రెండో అక్రమ సంబంధాల వార్తలు వస్తూంటాయి. అవేవో అంతర్జాతీయ సమస్యలకన్నా ప్రాధాన్యం అన్నట్టు పదే పదే, గంటల తరబడి వాటిని చూపిస్తూంటారు. ఎవడో, ఓ అమ్మాయితో ఉంటే, వాడి భార్య బంధువులు వచ్చి ఆ అమ్మాయిని లాగి కొడుతూంటారు. టీవీ కెమేరాలు ఆప్యాయంగా, ఆత్రంగా దాన్నంతా చిత్రీకరించి, ప్రజలకు చూపించి వారిని విజ్ఞానవంతులను చేస్తూంటాయి.

లేకపోతే, ఎవరితో భర్తకు సంబంధం ఉందో, ఆ అమ్మాయి తరపువారు వచ్చి భర్తను తన్నటం, చీపుర్లతో కొట్టటం వంటి వాటిని, ఎవడితోనో సంబంధం ఉన్న అమ్మాయిని, ఊళ్ళో వాళ్ళో, అతడి భార్య తరపు వాళ్ళో బహిరంగంగా అవమానించటం, కొట్టటం వంటి దృశ్యాలను చూపిస్తూనే ఉంటారు గొప్ప గొప్ప వార్తలన్నట్టు.

అలాంటివి చూస్తున్నప్పుడు, అసలివి చూపించాల్సిన అవసరం ఉందా? అనిపిస్తుంది శరత్‌కి. అమలాపురంలో ఆ మారుమూలన ఉన్న పల్లెటూరిలో ఎవరికో ఎవరితోనో సంబంధం ఉంటే, అదొక అంతర్జాతీయ వార్తనా? అలాంటి వాటిని కవర్ చేయటం, వాళ్ళు టీవీ కెమేరాలతో సహా వెళ్ళి కొట్టటం, దాన్ని అందరికీ ప్రదర్శించటం... ఎంత సమయం వ్యర్థం? పైగా, అలాంటివి ఇతరులకు ప్రోత్సాహాన్నిస్తాయి, అలా చేయటానికి 'మీ సమస్యలు చెప్పండి, వాటిని చూపటానికి మేము సిద్ధం' అని ప్రతి ఛానల్ ప్రకటిస్తూనే ఉంటాయి.

ఆర్థర్ సి క్లార్క్ అనే రచయిత, అరవయ్యవ దశకంలోనే రాసిన ఓ సైన్స్ ఫిక్షన్ రచన '2001 - స్పేస్ ఒడిస్సీ'లో, ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతమైతే, ప్రతి పనికిరాని విషయం ప్రధాన వార్త అవుతుందని ఊహించి రాశాడు. ఆ నవలలో చంద్రమండల ప్రయాణంలో నాయకుడు ఈ ఆలోచన చేస్తాడు. కానీ ఇప్పుడు భూమిమీదే మనం దాన్ని అనుభవిస్తున్నాం.

'పెళ్ళిలో వాళ్ళెవరూ మీ గోలను చిత్రీకరించలేదా?' వొద్దనుకుంటున్నా ఆపుకునేలోగా, మాట బయటకు వచ్చేసింది. ఎంతగా నాలిక కరచుకున్నా లాభం లేదు.

కోపంగా చూసింది మాధవి అతడివైపు.

అంతలోనే ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. 'మీరు కూడా అందరిలాంటివారే' అంది కన్నీళ్ళ నడుమ.

కుర్చీలో వెనక్కు వాలేడు శరత్. ఆమె వైపు చూస్తూ అన్నాడు.

'మీరీ సమాజంలోనే పుట్టి ఎదిగారు. ఈ సమాజంలోనే ఉంటున్నారు. మీరు చదువుకున్నవారు తెలివైన వారు. మీకే సమాజ మనస్తత్వం తెలియక పోవటం ఆశ్చర్యంగా ఉంది.

'ఏమిటీ సమాజ మనస్తత్వం? కుళ్ళు మనస్తత్వం? ఎప్పటికీ అసూయలు, అనుమానాలు తప్ప మనిషికీ మనిషికీ నడుమ ఉండే సంబంధం, అనుబంధాల సౌందర్యం తెలుసా ఈ సమాజానికి?' అంది కసిగా.

'మీరు ఒక్క విషయం ఆలోచించండి. మీరు ఓ ఫంక్షన్‌కి వెళ్తారు. అక్కడ మీ భర్త మరో స్త్రీతో ఫంక్షన్‌కి వస్తారు. మీరు అప్పుడు ఏం చేస్తారు? మీ మనసులో ఎలాంటి భావనలు కలుగుతాయి? బహుశా, అశోక్ భార్యలా మీరు అందరి ముందూ గోల చేయకపోవచ్చు. నోరు విప్పి ఏమీ అనకపోవచ్చు. కానీ మనసులో ఏమీ అనుకోకుండా ఉండగలరా?'

మాధవి ఏమీ మాట్లాడలేదు. కాఫీ సిప్ చేస్తూ చుట్టూ చూస్తూ మౌనంగా ఉంది.

'మానవ స్వభావంలోనే నేను, నాది అన్న భావం ఉంది. అలా అనుకోకపోతే మనిషి ఏమీ చేయలేడు. ఒక పురుషుడు ఒక స్త్రీని తనది అనుకుంటాడు.. ఒక స్త్రీ, ఒక పురుషుడిని తనది అనుకుంటుంది. తనది అనుకున్నది తనది కాదన్న భావనను భరించటం కష్టం. ఏదీ 'తనది కాదు' అన్న నిర్మోహత్వం సాధించటం అత్యంత ఉన్నతమైన స్థితి. అది అందరికీ సాధ్యం కాదు. కాబట్టి, తనది అనుకున్నది తనది కాకుండా పోతుందేమో నన్న భయం ఉండటం సహజం. ఎలాంటి భయాలు లేని స్థితి పరమోత్తమం. కానీ ఆ పరమోత్తమ స్థితి పురుషోత్తముడికే సాధ్యం కాలేదు. సామాన్యులకు సాధ్యం అవుతుందా?'

కోపంగా చూసింది మాధవి, శరత్ వైపు.

'అంటే పాత రాతి యుగంలోలా, ఇక ఆడవాళ్ళు మగవాళ్ళతో మాట్లాడకూడదా? వంటింటి కుందేళ్ళుగానే ఉండాలా? ఉద్యోగాలకు ముసుగులేసుకుని వచ్చి, పరదాల మాటున కూర్చోవాలా? మా చిన్నపుడు రిక్షాల్లో పరదాల వెనుక కూర్చునేవారు. సినిమా

హాళ్ళలో కూడా ఆడవాళ్ళకు వేరే సీట్లు, మగవాళ్ళకి వేరే సీట్లు ఉండేవి. పరపురుషుడు చూసినా, తాకినా అపవిత్రమై పోయినట్టు చేసేవారు. అలాంటి సంకుచితాలను వదిలించుకుని ఎంతో ప్రగతి సాధించాం. మళ్ళీ వెనక్కు పోదామంటారా?'

నవ్వాడు శరత్ 'మీ మాటలు వింటూంటే నాకు నవ్వాలో, ఏడవాలో తెలియటం లేదు. ఒక పద్ధతి ప్రకారం బ్రెయిన్ వాష్ జరిగిన తరువాత, తనకి అంతా తెలుసు, తనకి తెలిసిందే నిజమనుకునే స్వంత ఆలోచనలు లేని వ్యక్తులు చిలక పలుకుల్లా వల్లెవేసే ఆలోచనలే మీరూ వల్లెవేస్తున్నారు. ఎవరికివారు తాము స్వతంత్రం, తమ ఆలోచనలు స్వతంత్రం అనుకుంటున్నారు. కానీ మీరూ ఆ బ్రెయిన్ వాష్డ్ చిలకపలుకులే వల్లెవేస్తున్నారు' అన్నాడు.

కోపంగా లేచింది మాధవి 'మీరు తెలివైన వారు అనుకున్నాను. కానీ అందరూ అన్నట్టు యూ ఆర్ ఎ స్నోబ్. అన్నీ మీకే తెలుసనుకుంటారు. ఎదుటివాడికి ఏమీ తెలియదన్నట్టు మాట్లాడతారు. అందుకే ఎవ్వరూ మీతో కలవలేరు. యూ ఆర్ ఎ లోనర్. వసంత నాకు కరెక్టు చెప్పింది. మీరు ప్రతి ఒక్కరినీ విమర్శిస్తారని, ఎవ్వరినీ లెక్కచేయరని, మీరే గొప్ప అనుకుంటారని. కానీ అందరూ అలా అంటున్నారంటే మీరు ప్రత్యేకం అనుకున్నాను. సారీ, అయామ్ రియల్లీ సారీ దట్ ఐ థాట్ యు ఆర్ డిఫరెంట్.' విసవిసా వెళ్ళిపోయింది.

నవ్వుకున్నాడు శరత్.

***మనుషులు సాధారణంగా ఎదుటివాడి అభిప్రాయం అడగటం, తమ అభిప్రాయాన్ని బలపరచుకోవటం కోసమే, తమ అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయాన్ని వినటం కోసం కాదు.***

పాపం, పెళ్ళిలో అవమానం భరించలేకపోయింది. ఆఫీసులో తాను కనిపించాడు. తన నుంచి సానుభూతి ఆశించింది. ఆమె కోరినట్టు సానుభూతి చూపించి, ఆమె ఈగోను సంతృప్తి పరచే బదులు తాను నిజాలు చెప్పబోయాడు.

అంతలో మరో ఆలోచన వచ్చింది, 'బహుశా ఇందుకే తాను ఎవ్వరికీ సన్నిహితంగా వెళ్ళలేకపోతున్నాడేమో' అనుకున్నాడు.

ఎవరేది వినాలనుకుంటున్నారో అది ఎప్పుడూ అనడు తాను. తానేది అనాలనుకుంటున్నాడో అదే అంటాడు. అది ఎవరికి అవసరం?

అతడికి వసంతకూ తనకూ నడుమ జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. వసంత, శరత్ కొలీగు. రచయిత్రి. ప్రతికలలో తరచూ ఆమె కథలు ప్రచురితమవుతూంటాయి. వాటిని అందరికీ చూపించి అభిప్రాయం అడుగుతూంటుంది. అందరూ ఆమెని పొగుడుతూంటారు. దాన్లో సగం మంది చదవకుండానే ఆకాశానికి ఎత్తేస్తూంటారు. దాంతో ఆమెకి తన రచనలమీద గొప్ప అభిప్రాయం ఏర్పడింది. తానేమి రాస్తే అది గొప్ప అన్న భావం స్థిరపడింది.

ఎవరో ఆమెకి శరత్ పుస్తకాలు బాగా చదువుతాడని చెప్పటంతో ఓ రోజు శరత్ దగ్గరకు వచ్చి పలకరించింది.

అంత వరకూ వారికి ముఖ పరిచయం తప్ప మరో పరిచయం లేదు.

తనని తాను పరిచయం చేసుకుని తన రచనలు ఇచ్చింది. చదివి అభిప్రాయం చెప్పమంది. ముఖ్యంగా, ఆ వారం పత్రికలో ప్రచురించిన కథను చదివి చెప్పమంది.

'పత్రిక వెలువడి రెండు మూడు రోజులే అయింది. కానీ ఫోన్లతో చచ్చిపోతున్నాను. ఎంత నచ్చేసిందో అందరికీ. పొగిడేస్తున్నారు. ఫోను చూస్తేనే భయమేస్తోంది. విసుగొస్తోంది. ఇంకోసారి నా ఫోను నెంబరు ఇవ్వద్దని పత్రిక వాళ్ళకి చెప్పాలి' అంది.

ఆమె ఇచ్చిన పత్రికలోది కథ చదివాడు శరత్. మిగతా పుస్తకాలన్నీ 'నేను చదివాను' అని చెప్పి ఇచ్చేశాడు.

అతడు కథ చదివే వరకూ ఫోనులో మాట్లాడుతూ పక్కనే కూర్చుంది వసంత.

కథ చదవగానే ఫోను కట్టేసి 'మరో అభిమాని' అని 'కథ ఎలా ఉంది?' అని అడిగింది.

'బాగుంది' ముక్తసరిగా అన్నాడు శరత్.

'అలా అంటే సరిపోదు. మీరు బాగా విశ్లేషిస్తారని అంటారు. అందుకే మీ దగ్గరకు వచ్చాను. మీరు నిర్మొహమాటంగా విశ్లేషించాలి' అంది.

నిట్టూర్చాడు శరత్.

'మీ కథలన్నిటిలో అక్రమ సంబంధాల పులకరింతలు ప్రేమరాహిత్యపు పలవరింతలు తప్ప మరోకొత్తదనం లేదు. మీ రచనలు అన్నీ చదివితే మీకు వైవాహిక వ్యవస్థలో ప్రేమలేదు, వైవాహికేతర సంబంధాలలోనే ప్రేమ ఉందని నిరూపించాలని కంకణం కట్టుకున్నట్టుంది మీ కథలన్నిటిలో మగవాళ్ళు క్రూరులు, భార్యలను తిట్టేవారు, కొట్టేవారు, సెక్స్‌ని స్లీపింగ్ పిల్‌లా వాడేవారు, మాత్రమే. కానీ భర్త కాని మగవాళ్ళంతా సున్నిత మనస్కులు, చక్కని ప్రేమికులు. మీ ఇప్పటి కథలో చూడండి. అతడికి పెళ్ళయింది. ఆమెకి పెళ్ళయింది కానీ ఇద్దరూ కలుస్తారు సాయంత్రాలు. చెరువు గట్టున కూర్చుని స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటారు. కానీ అతడు బాధ్యత తీసుకోటానికి ఇష్టపడడు. ఆమెని కలవటం మానేస్తాడు. అతడింత మోసగాడు, మగవాళ్ళింతే అనుకుంటుంది ఆమె. ఇదీ కథ. దీన్లో ఏముంది?' అడిగాడు.

వసంత ముఖం మాడిపోయింది.

'అందరూ ఎంతగా పొగుడుతున్నారో తెలుసా?' అంది డిఫెన్సివ్‌గా.

'ఆమెకి పెళ్ళయింది. వాడికి పెళ్ళయింది. అంటే ఆమె తన భర్తకి, వాడు తన భార్యకి ద్రోహం చేస్తున్నట్టే కదా? ఇద్దరూ మోసం చేస్తున్నారు. చివరలో భయం వల్లనో, మరే కారణం వల్లనో వాడు వెనుకంజ వేశాడు. దాన్లో ఆమెకి వచ్చిన కష్టం, నష్టం ఏముంది? పైగా, వాడు ఈమెని భర్త నుంచి దూరం చేసి, వదిలేసి, మరో అసంతృప్త  హృదయంపై ప్రేమ జల్లులు చిలుకరించే మహిళోద్ధరణ కార్యక్రమం పెట్టినందుకు, ఆమె జీవితాన్ని పాడు చేయనందుకు ఆమె సంతోషించాలి.'

'చాలా అసహ్యంగా మాట్లాడుతున్నారు' కోపాన్ని పళ్ళ బిగువున అణచిపెట్టి అంది.

శరత్ అది గమనించలేదు.

'ఇంకో కథ చూడండి. ఆమెకి పెళ్ళయింది. ఆమె భర్త ఆమెని పట్టించుకోడు. ఆమె ఎక్కడికో వెళితే ఒకడు పరిచయం అవుతాడు. వాడు, ఈమె సంగీతం గురించి చర్చించుకుంటారు. ఇద్దరి మనస్సులు కలుస్తాయి.. కానీ ఈమె భర్త దగ్గరకు వెళ్ళిపోతుంది. భర్తతో ఉంటుంది కానీ వాడిని తలచుకుంటుంది. ఆమె చాలా గొప్ప త్యాగం చేసినటు రాశారు. ఈ రెండు కథలనీ పోల్చండి. మొదటి కథలో మగవాడు వెనుకంజ వేశాడు. వాడు దుష్టుడు. అమ్మాయికి అన్యాయం అయిపోయింది. మగవాళ్ళంతా మోసగాళ్ళన్నది కంక్లూజన్. రెండో కథలో అమ్మాయి వెనుకంజ వేసింది. మగవాళ్ళే మోసగాళ్ళు మళ్ళీ. ఆ పిచ్చి భర్త విలన్. కానీ వాడినే తలుస్తూ భర్తతో ఉండే ఈమె చాలా గొప్ప మహిళ.'

'ఛీ.. అసహ్యంగా మాట్లాడుతున్నారు. మీ ఆలోచనా విధానం సక్రమంగా లేదు.' అందమె.

శరత్ అది పట్టించుకోలేదు.

'ఇంకో కథ చూడండి. అతడికి మొదటి భార్య చచ్చిపోయింది. ఆమె భర్త చచ్చిపోయాడు. ఇద్దరూ పెళ్ళిచేసుకున్నారు. అతడు మొదటి భార్య సంవత్సరీకం గొప్పగా చేశాడు. ఈమె తన భర్త సంవత్సరీకం చేయాలనుకుంటే అతడు అభ్యంతరం పెట్టాడు. మగవాళ్ళ దౌష్ట్యాన్ని తిట్టింది ఆమె. నీ భార్యని తలచుకునే హక్కు నీకుంటే, నా భర్తని తలచుకునే హక్కు నాకూ ఉందని పోరాడుతుంది. తన హక్కు నిలుపుకోవటం కోసం భర్తను వదిలేస్తుంది. ఇదీ కథ. ఏమిటది?'

వసంత ముఖం ఎర్రబడింది. ఏదో అనబోయింది. అంతలో శరత్ మాట్లాడటం కొనసాగించాడు.

'ఈ కథ చూడండి. దీన్లో భర్త భార్యను పట్టించుకోడు. తాగుతాడు. కొడతాడు. ఆమెను ఎప్పటిలాగే బయట వాడెవడో ప్రేమిస్తాడు. వాడికి పెళ్ళయి ఉంటుంది. వాడితో ప్రేమమయ జీవితం గడపటానికి ఈమె తన భర్త వెధవని వదిలేస్తుంది. వాడు తన భార్య వెధవిని వదిలేస్తాడు. ఇద్దరూ ప్రేమ పంచుకుని తింటూ దివ్యమైన జీవితం గడుపుతారు. ఇందులో ఎవరికి లాభం కలిగింది? ఎవరిది గొప్ప? ఎవరిది తప్పు? మీ ప్రతి కథలో భర్త అయిన ప్రతి మగవాడూ ఎందుకని దుష్టుడు? బయట ప్రతి మగవాడు ఎందుకని సున్నిత మనస్కుడు, ప్రేమ మూర్తి? రచయితల రచనల నుంచి వారి నిజ జీవితాన్ని ప్రభావం విడదీయలేమంటారు. నాకు తెలిసి మీరు సుఖంగానే ఉన్నారు. మరి మీ కథలేమిటి ఇలా ఉన్నాయి? సాధారణంగా రచనలను విష్ఫుల్ థింకింగ్ అంటారు.' ఇంకా ఏదో అనబోతున్న శరత్ ఆమె వైపు చూసి ఆగిపోయాడు. భద్రకాళిలా కళ్ళనుండి విస్ఫులింగాలు వెదజల్లుతూ నుంచుంది వసంత.

'నా గురించి అలాంటి ఆలోచనలు చేసే ధైర్యం నీకెలా వచ్చింది? నేను నా భర్తని ప్రేమిస్తున్నాను. పరాయిపురుషుడి వైపు కన్నెత్తి చూడను. నా భర్త ఉత్తమ పురుషుడు. నీది కుళ్ళిన మెదడు. వక్రబుద్ధి' అని అరిచింది. రచనలన్నీ వేసుకుని విసురుగా వెళ్ళిపోయింది.

ఆ వసంత తన గురించి అలాంటి అభిప్రాయం కాక మరో అభిప్రాయం మాధవి దగ్గర ఎలా వ్యక్తపరుస్తుంది?

బిల్ చెల్లించి లేచాడు శరత్. అతడు లేవగానే భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది.

అర్షాద్. కొలీగు. 'ఏం భాయ్. మాధవితో డీల్ కుదరలేదా? డోన్ట్ వర్రీ.... కీప్ ట్రయింగ్. పెద్ద కష్టంకాదు.. కానీ నువ్వా తెలివైన వాడివే.. ఏదో అనుకున్నాను' అన్నాడు. అతనితో పాటు ఉన్న అమ్మాయితో వెళ్ళిపోయాడు. ఆమె అతడి భార్యకాదు.

**అర్షాద్ అన్న** మాటలకు నిర్ఘాంతపోయాడు శరత్.

ఆఫీసు చేరుకున్న చాలాసేపటివరకు అతడి మాటల ప్రభావం నుంచి తేరుకోలేకపోయాడు.

ఒక స్త్రీ, పురుషుడు కలిసి కనిపిస్తే 'అది' తప్ప మరో ఆలోచన రాదా?

ప్రశ్న అయితే వేసుకున్నాడు కానీ సమాధానం అతడికి తెలుసు.

ఈ ప్రపంచంలో ఉన్న వైచిత్రి అదే

ఎదుటి వారి గురించి ఎలా ఊహిస్తాడో, ఎలా మాట్లాడతాడో, మనిషి, అదే విషయం తన దగ్గరకు వచ్చేసరికి ఎవరైనా అలా ఊహించినా, మాట్లాడినా భరించలేడు. ఎదుటివాడిని తక్కువ చేసి మాట్లాడటంలో, ఎదుటి వాడి గురించి చెడుగా మాట్లాడటంలో మానవ మనస్తత్వం ప్రధాన పాత్ర వహిస్తుంది.

తనలోని న్యూనత భావం వల్ల ఎదుటి వాడి ఆధిక్యతను ఆమోదించలేడు మనిషి. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ఎదుట వాడి గురించి అవాకులు చవాకులు పేలతాడు. వాడి గురించి నీచంగా మాట్లాడి సంతృప్తి పొందుతాడు.

కానీ, ఇలాంటి ప్రవర్తన వల్ల ఎదుటివాడికి నష్టంలేదు. కానీ అలా మాట్లాడిన వాడి స్థాయి స్పష్టమవుతుంది.

స్త్రీ పురుష సంబంధం దగ్గరకు వచ్చేసరికి, చదువుకున్నవారు, చదువులేనివారు అని లేదు. అంతా ఒకటే.

ఒక స్త్రీ ఒక పురుషుడు కలిసి సన్నిహితంగా మాట్లాడుతూ కనిపిస్తే చాలు ప్రతి వారి ఊహలు రెక్కలు కట్టుకుని విశృంఖలంగా వీర విహారం చేస్తాయి. ఆ వీర విహార తీవ్రత ఊహించే వారి సంస్కారాన్ని బట్టి ఉంటుంది.

ప్రాకృతికంగానే స్త్రీ, పురుషుల నడుమ ఒక ఆకర్షణ, ఉద్విగ్నత ఉంటుంది. ఒక స్త్రీని చూడగానే పురుషుడు ఆమె రూపం, చూస్తాడు, లావణ్యం చూస్తాడు. ఆమె కూడా ఒక మనిషి అన్న ఆలోచన తరువాత వస్తుంది.

కానీ, ముందుగా ఒక స్త్రీని పురుషుడు అతనిలోని పశువు అంశ ద్వారానే చూస్తాడు. తరువాత అతని సంస్కారం, ఆమె వ్యక్తిత్వం అతడి దృష్టిని మారుస్తుంది. 'చెలియలి కట్ట' నవలలో, ముకుందరావు పాత్రద్వారా పురుషుడిలోని ఈ మనస్తత్వాన్ని అత్యద్భుతంగా ప్రదర్శిస్తాడు విశ్వనాథ సత్యనారాయణ.

రత్నావళిని చూడగానే ముకుందరావు మనసు వెర్రి వేషాలు వేస్తుంది. కానీ ఆమె ప్రవర్తనను గమనించి, ఆమె వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకున్న తరువాత ఆమెను శిష్యురాలిగా స్వీకరిస్తాడు. ఆమెను పండితురాలిని చేస్తాడు.

అది ఆ పాత్ర సంస్కారం. అదిలేని వారు నోటికి వచ్చినంత మాట్లాడతారు. మెదడు ఊహించినట్టు కబుర్లు చెప్తారు.

అందుకే, ప్రాచీన ధర్మాలు పరపురుషుడితో నవ్వుతూ కనిపిస్తే ఆ స్త్రీ ఎంతటి ఉత్తమ వ్యక్తిత్వం కలదయినా నీలాపనిందలకు గురవుతుందంటాయి. ఆ పురుషుడు గాంగేయుడయినా అపవాదులను భరించాల్సి వస్తుందంటాయి.

మానవ మనస్తత్వాన్ని సంపూర్ణంగా కాచి వడబోసి ఏర్పాటు చేసిన సూత్రాలవి.

ఆ సూత్రాలను నియమాలుగా, సర్వ పరిష్వంగాలుగా, అభివృద్ధి నిరోధకాలుగా భావించి ఏం సాధిస్తున్నాం?

ఈనాడు స్కూలుకు వెళ్తున్న పసిపిల్లలు రోడ్లమీద సినిమాల శృంగార పోస్టర్లను కళ్ళప్పగించి చూస్తూ అది నిజమనుకుని ఎదుగుతున్నారు. బస్టాపుల్లో, దారుల్లో కలిసి నడిచే యువతీ యువకుల జంటలను అదోరకంగా చూడకుండా ఉండలేకపోతున్నారు.

***అందుకే ఒక రకంగా చూస్తే ఇప్పుడు పిల్లలకు బాల్యం, అమాయకత్వం అన్నవి లేవనిపిస్తాయి. తిన్నగా యవ్వనంలోకి అడుగుపెడుతున్నారు పిల్లలు ఉషారుగానే వాళ్ళకు ఊహలు నేర్పే సినిమాలు, టీవీలు, బయట సమాజం అన్నీ వాళ్ళల్లో బాల్యం అన్నది లేకుండా చేస్తున్నాయి.***

ఆలోచనలలో మునిగి ఉన్న శరత్‌కు ఎందుకో ఆఫీసులో అందరూ తనవైపు అదోలా చూస్తున్నట్టు అనిపించింది.

అర్షాద్ అందరికీ తనని, మాధవిని హోటల్‌లో చూసిన విషయం చెప్పేశాడా? అందుకే అందరూ తనని అలా చూస్తున్నారు.

అంతలో మరో ఆలోచన వచ్చింది.

దీన్ని మనస్సాక్షి అంటారేమో!

తరచి చూస్తే, మాధవి పిలవగానే ఏమాశించి తాను పరిగెత్తాడు అన్న ప్రశ్న వస్తుంది. నిజాయితీగా సమాధానం చెప్పుకుంటే అసలు నిగ్గు తేలుతుంది. అది నేరభావన కలిగిస్తుంది.

ఎన్ని రకాలుగా సమర్థించుకున్నా, ఎన్ని అబద్ధాలు చెప్పుకున్నా చేదు నిజం మాత్రం సమసిపోదు.

ఇది నేరభావనను కలిగిస్తుంది.

ఆ నేర భావనవల్ల, ఎదుటివారి దృష్టిలో లేనిది మనసు ఊహిస్తుంది. వారి మాటల్లో, చేతల్లో లేని వ్యంగ్యాన్ని చూస్తుంది.

అది కోపానికి, చిరాకుకు దారి తీస్తుంది.

దాని నుంచి తన పనిని సమర్థించుకోవటం మొదలవుతుంది.

అంతలో ఒక ఆలోచన వచ్చింది. అతని శరీరం గడ్డకట్టినట్టనిపించింది. ఒకవేళ ఈ విషయం ఆఫీసులో అందరికీ తెలిస్తే, అది తన భార్యకు తెలిసే వీల్లుంది. తన ఆఫీసులో జరిగే విషయాలన్నీ ఆమెకు తెలుస్తాయి.

తెలిస్తే ఆమె ఎలా రియాక్టవుతుంది?

నిజమే, మాధవిని హోటల్‌లో కలవాల్సిన అవసరం ఏముంది?

ఏం సమాధానం ఇస్తాడు?

నిజానికి, తాను మాధవి మాట్లాడిన మాటలు ఎవరికీ అవసరం లేదు. ఆనాడు తామిద్దరు కలవటమే ప్రాధాన్యం వహిస్తుంది. మిగతావన్నీ అనవసరం. ఈ విషయం ప్రశాంతికి తెలిస్తే, ప్రశాంతి తనని నిలదీసి అడిగితే ఏం చెప్తాడు? ముందే మాధవి వస్తున్నదని తెలిసినప్పటి నుంచీ ప్రశాంతి తనని హెచ్చరిస్తూనే ఉంది.

ఎలాంటి తప్పు చేయకుండా నేరభావము ఎందుకు గురవుతున్నాడు తాను?

ప్రస్తుత సమాజంలో స్త్రీ పురుషులు కాస్త స్వేచ్ఛగా కలవటం సాధారణమే. మరి తానెందుకని అంతగా భయపడుతున్నాడు?

మరి స్వేచ్ఛగా కలిసేవాళ్ళు, ఇంకా అడుగు ముందుకేసి సన్నిహితంగా వ్యవహరించే వాళ్ళకి భయంలేదా?

ఈ భయం వల్ల తాను ఏ విషయంలోను అడుగు ముందు వేయలేకపోతున్నాడా? ఇలాంటి భయాలు లేక, అన్నిటికీ తెగించి ఉండటం వల్ల అర్షాద్ లాంటి వాళ్ళు జీవితాన్ని అనుభవించటం?

భయాల వల్ల అడుగు ముందుకు వేయలేక తాను మంచివాడుగా గుర్తింపు పొందుతున్నాడా?

ఎక్కడో చదివిన మాట గుర్తుకు వచ్చింది.

***అవకాశం లేక చెడ్డవాళ్ళు మంచివాళ్ళుగా, అవకాశం ఉండటం వల్ల మంచివాళ్ళు చెడ్డవాళ్ళుగా మిగిలిపోతున్నారు.***

మంచివాడిగా గుర్తింపు పొందటానికి, చెడ్డవాడిగా పేరు సంపాదించటానికి ఇదేనా తేడా?

ఆఫీసు అయి ఇంటికి వస్తూంటే, ఆఫీసు దాటిన తరువాత దారికి ఇరువైపులా ఉన్న పలు కాలేజీల పిల్లలు, ఆడ, మగ కలిసి చర్చించటం, నడవటం, బైకులపై కూర్చుని ముచ్చట్లాడటం, యువకుడిని గట్టిగా హత్తుకున్న యువతులు బైకులపై వెళ్ళిపోవటం చూశాడు శరత్.

సుమంత్, స్రవంతిలు కూడా ఈ యువతీ యువకుల తరానికి చెందినవారు. వాళ్ళకి తానేమీ లగ్జరీలు ఇవ్వటంలేదు.

బండిలేదు. సెల్‌ఫోన్ ఇవ్వలేదు. వీళ్ళలాగా ఖరీదైన దుస్తులు లేవు. వాళ్ళు ఎలా ఆలోచిస్తూండి ఉంటారు?

ఒక అర్షాద్, మాధవితో తనను చూసి ఏదో అంటే ఇంతగా ఆలోచిస్తున్నాడు. ఈ పిల్లలు, ఇంకా పరిణితి చెందనివారు. ఎదిగీ ఎదగని మనస్సులవాళ్ళు. ప్రపంచాన్ని చూడని వాళ్ళు.

వీళ్ళకు ప్రపంచం గురించి ఎన్నెన్ని సందిగ్ధాలుంటాయి?

ఎన్ని నిరాశలు, నిస్పృహలుంటాయి?

వీరికి మార్గదర్శకత్వం చేయాల్సిన తమకే పలుసందేహాలు, సందిగ్ధాలున్నాయి.

వీళ్ళకి తామేం మార్గదర్శకత్వం చేయగలుగుతాము?

అందుకేనా ఒక దిశ, లక్ష్యం లేక సమాజం డబ్బు సంపాదన తప్ప మరేమీ లేనట్టు నిప్పులో దూకే శలభాల్లా ఆత్రంగా పరుగిడుతోంది?

ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాడు శరత్.

ఇంటికి తాళం వేసి ఉంది.

తాళం తీస్తుంటే మెసేజ్ వచ్చింది ప్రశాంతి నుంచి.

'ఆఫీసు కొలీగ్ కూతురి ఎంగేజ్‌మెంట్ ఉంది వెళ్ళివస్తాను. ఆలస్యమవుతుంది అని.'

తలుపు తెరచి లోపల అడుగుపెట్టాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా కనిపించింది.

గమ్మత్తుగా అనిపించింది.

ఈ నాలుగు గోడల మధ్య ఎన్ని ప్రపంచాలు నివసిస్తాయి. ఎన్నెన్ని అనుభూతులు పొందుతాయి.ఎన్నెన్ని భావనలను భావిస్తాయి.

కొంతకాలానికి వారు వెళ్ళిపోతారు. కొత్తవారు వస్తారు.

కొత్త జీవితాలు. కొత్త భావనలు. కొత్త ఆశలు. ఆరాటాలు.

ఇల్లంతా కలయతిరిగాడు.

అద్దె ఇంట్లో ఉన్నన్ని రోజులు. దాన్ని స్వంత ఇంటిగానే భావిస్తారు. జీవిస్తారు. వెళ్ళిపోయేటపుడు ఖాళీ చేసి వెళ్ళిపోతారు. కొత్తవాళ్ళు వస్తారు.

ఇంతేనా జీవితం?

కహతే హై జ్ఞాని, దునియా హై పానీ

పానీ పె లిఖీ లిఖాయీ

హై సబ్‌కి దేఖీ, హై సబ్‌కి జాని

హాథ్ కిసీకేన అయి

కుఛ్ తేరా, న, మేరా

ముసాఫిర్ జాయేగా కహా....

జ్ఞానులు ఈ ప్రపంచం అభాస అంటారు. నీటిపై రాసిన రాతలు అంటారు. అందరికీ ఈ విషయం తెలుసు. అందరూ దీన్ని అనుభవిస్తారు. కానీ ఎవరికీ దీనిపై నియంత్రణ లేదు. ఎవరూ దీనిపై పట్టు సంపాదించలేకపోయారు. ఇక్కడ ఏదీ ఎవరిదీ కాదు. ఓ పథికుడా.. ఎక్కడకు పోతావు?

ఎందుకో అంతా శూన్యంగా అనిపించింది.

ఇంట్లో మనుషులు తిరుగుతుంటే ఇల్లు ఓ రకంగా తోస్తుంది. ఎవ్వరూ లేకపోతే మరో రకంగా ఉంటుంది.

తన గదిలోకి వెళ్ళి 'గైడ్' సినిమా పాటల సీడీ తీసిపెట్టాడు.

తాత్వికతను ధ్వనిస్తూ ఎస్డీ బర్మన్ స్వరతరంగాలు గదిలో నిండాయి. అతడి హృదయలోతులలో ప్రకంపనలు కలిగించసాగాయి.

వహాకౌన్ హై తెరా, ముసాఫిర్ జాయేగా కహా

దమ్ లేలే ఘడీ ఛర్, యే చాయా పాయెగాకహా

❦❦❦

'ఇవాళ ఎందుకు వాళ్ళమీద అంత ఇంట్రెస్ట్ వచ్చింది?' వ్యంగ్యంగా, ఒకింత ఆశ్చర్యం నటిస్తూ అడిగింది ప్రశాంతి.

తడబడ్డాడు శరత్. 'ఏం లేదు.. అసలు పిల్లల్ని నేను పట్టించుకోనని అంటావుకదా! కాస్త వాళ్ళ గురించి, వాళ్ళ ఫ్రెండ్స్ గురించి తెలుసుకుందామని' సమాధానం ఇచ్చాడు శరత్.

'స్రవంతి ఫ్రెండ్ ఇంటికి వెళ్ళింది. కంబైన్డ్ స్టడీసట. వాడి సంగతి తెలియదు. పెద్దవాడయి పోయాడు' కంచాలు పెడుతూ అంది.

శరత్ మాట్లాడలేదు. మౌనంగా బోజనాలు చేశారు.

టీవీ ఛానెళ్ళు తిప్పుతూ కూర్చున్నాడు శరత్. ఏదీ చూడాలనిపించటం లేదు. అయితే ఏడుపులు, పెడబొబ్బలు, కృత్రిమ మేకప్పులతో, కృతకమైన హావభావాల సీరియళ్ళు, లేకపోతే అతి ధనవంతుల యువప్రేమల హిందీ సీరియళ్ళు, అవీకాకపోతే వెర్రి మొర్రి

హాస్యాల కార్యక్రమాలు తప్ప మరేమీ కనబడటంలేదు. ఇవీ కాకపోతే పసిపిల్లల పెద్ద వాళ్ళే పాటలు, డాన్సులు, వెకిలిమాటలు చేష్టల కార్యక్రమాలు.. వాటిలో తమ తమ రంగాలలో విఫలమయిన వాళ్ళ నీతి బోధలు, జడ్జిమెంట్‌లు.

ఒక్క కార్యక్రమంలో కూడా ప్రజలకు విజ్ఞానం ఇద్దామని, పలు విభిన్నమైన విషయాల గురించి లోతైన అవగాహన కల్పించాలన్న తపన లేదు. పైగా, వార్తల ఛానళ్ళయితే ఏదో సెన్సేషన్ కల్పిద్దామని, ప్రపంచం అపుడు నాశనమైపోతుంది, ఇతర గ్రహాల మనుషులు వచ్చారా? లాంటివి కార్యక్రమాలు చూపిస్తారు. అదీ నెగిటివ్ ఆలోచనలతో.

ఇక కొత్త సినిమాల పాటలు, హిందీ, అయినా తెలుగు అయినా చూడాలంటేనే భయంగా ఉంటుంది.

ఇలాంటివి చూస్తూ పెరిగిన పిల్లలకు స్త్రీ పురుష సంబంధం విషయంలో ఆరోగ్యకరమైన అభిప్రాయాలు ఎలా ఉంటాయి?

ఛానళ్ళు తిప్పుతూంటే ఓ వార్తా ఛానెల్‌లో ఎవరో ఎవరినో తన్నటం చూపించడం కనిపించింది. అక్కడ ఆగాడు శరత్.

తన భర్తతో సంబంధం పెట్టుకూడదని, అతడి ప్రియురాలని చావబాదుతున్న భార్య, ఆమె తరపు బంధువులు.

వార్త చూసిన శరత్‌కు ఎలాగో అనిపించింది. గబగబా ఛానెల్ తిప్పేశాడు.

అప్పుడే గదిలోకి వచ్చి ప్రశాంతి అంది 'ఏం మనుషులో.. ఏం సంబంధాలో.. 24 గంటలు వార్తలు చూపించాల్సి రావటంతో వీళ్ళకు ఏది వార్తనో, కాదో కూడా తెలియటం లేదు. ఏది దొరికితే దాన్ని దేశం మొత్తాన్ని ప్రభావితం చేసే దానిలా చూపించేస్తున్నారు.'

ప్రశాంతి వైపు చూశాడు శరత్. అతడి భుజంపై తలవాల్చింది. ఆమెని పొదివి పట్టుకున్నాడు. తాను మాధవిని హోటల్‌లో కలసినట్టు తెలిస్తే ఏమంటుంది?

ఇద్దరు వ్యక్తులు ఎంతో సన్నిహితంగా ఉండవచ్చు. కానీ వాళ్ళిద్దరి మనస్సులలో ఏం జరుగుతోందో వారికి తప్ప మరెవరికీ తెలియదు. అంటే శారీరకంగా వ్యక్తులు ఎంత సన్నిహితంగా ఉన్నా, మానసికంగా వారి మధ్య దూరం అనంతమా? ఎంతగా జంటగా ఉన్నా, ఎవరికి వారు ఒంటరివాళ్ళేనా?

'నీకు ఎప్పుడయినా మీ ఆఫీసులో కొలీగులతో బాధలు చెప్పుకోవాలనిపించిందా?' అడిగాడు శరత్.

అతడి వైపు విచిత్రంగా చూసింది ప్రశాంతి తరువాత నవ్వేసింది.

'ఇన్ని రోజులు రాని ప్రశ్న ఇప్పుడెందుకు వచ్చింది? మీ ఆఫీసులో ఎవరయినా మీకు బాధలు చెప్పుకున్నారా? ఎవరు మగా? ఆడనా? కొంపతీసి మాధవి కాదు కదా?' ఆశ్చర్యాన్ని అణచుకుంటూ, ముఖంపై మనసులో భావాలు కనబడకుండా జాగ్రత్త పడుతూ నవ్వేశాడు. 'ఉట్టిగనే అడుగుతున్నాను' అన్నాడు.

'బాధలు ఎవరికయినా చెప్పుకోవాలా? చెప్పుకోవటం వల్ల లాభం ఏమిటి? ఆరుస్తారా? తీరుస్తారా? పైగా మనం చెప్పే మాటలు సంతోషంగా విని ఊరంతా ప్రచారం చేస్తారు. అందుకే మనసులో మాట పెదవి పైకి రానీయకూడదు. అంతెందుకు నా బాధలు మీకే చెప్పను. పరాయి వాళ్ళతో ఎందుకు చెప్తాను?' అంది.

ఆమె చివరి మాట శరత్ గుండెను మెలిపెట్టింది.

'అదేమిటి, నాకు చెప్పవా నీ బాధలు? నాకు చెప్పని బాధలు ఏమున్నాయి?'

'అదే నేననేది. అర్థం చేసుకునే వాడికి చెపితే లాభం ఉంటుంది అర్థం చేసుకోలేని వాడికి బాధలు చెప్పుకుంటే బాధలు పెరుగుతాయి తప్ప తరగవు.'

'ఏమున్నాయి బాధలు?'

ఎందుకో ప్రశాంతి తనతో తన మనస్సులోని మాటలు పంచుకోదనిపిస్తే ఎలాగో ఉంది.

ఆమెకన్నీ తానే. తనకు అన్నీ తానే. అలాంటిది తనతోనే ఆమె బాధలు దాస్తుంది, ఒంటరిగా కుములుతుంది అన్న భావన బాధాకరంగా ఉంది.

ఆ సమయంలో తన మనసులో మాటలు ఆమెకి చెపుతానన్న విషయం శరత్‌కి గుర్తురాలేదు. ఆమె తనపై ఆధారపడాలికానీ, తాను ఎవరిపై ఆధారపడదన్న ఆలోచన అతడికి రాలేదు.

'ఏవో ఉంటాయి. మీకెందుకు? పోయి మీ పాటలు వినుకోండి. పుస్తకాలు చదువుకోండి. ఆ లోకమే బాగుంటుంది ఈ లోకం బావుడదు' అంది –

'చెప్పవచ్చుగా?' రెట్టించాడు శరత్.

'ఏం చెప్పాలి? వాడు మొన్న తాగి వచ్చాడు. ఇవాళ్ళ ఇంకా ఇంటికి రాలేదు. దాని గురించి ఏమైనా పట్టిందా మీకు? అది ఫ్రెండ్సింట్లో స్టడీస్‌కని వెళ్తోంది. ఒక్కసారయినా పట్టించుకున్నారు?'

'అవన్నీ బాధలా? నీ మనసులో బాధలు చెప్పు' హాస్యంగా అనబోయాడు కానీ బరువుగా ధ్వనించింది.

అతడివైపు సూటిగా చూసింది. 'మీ కథల్లో, సినిమాల్లో చూపించినట్టుండవు. నాలాంటి ఆడవాళ్ళ ఆలోచనలు, అసంతృప్తులు. నాలాంటి వాళ్ళ ఆలోచనలు ఎంత సేపూ ఇల్లు, పిల్లల చుట్టే తిరుగుతాయి. వేరే కోరికలుండవు. వేరే అసంతృప్తిలుండవు. అలాంటివి ఉన్న వేరే మొగవాడిని హోటల్‌కి పిలిచి వాడి భుజం మీద తలపెట్టి ఏడుస్తూ బాధలు చెప్పుకోరు' అనేసి వెళ్ళిపోయింది.

పిడుగుపాటుకు గురయిన వాడిలా కూర్చుండిపోయాడు శరత్. ప్రశాంతికి విషయం తెలిసిందా? తెలిస్తే ఎంత వికృతంగా తెలిసింది?

'ఏమిటలా కూర్చున్నారు?'

తాను వంటింట్లోకి వెళ్ళినప్పుడు ఎలా కూర్చున్నాడో, అక్కడ పని చూసుకుని బయటకు వచ్చేసరికీ అలాగే కూర్చుని ఉన్న శరత్‌ని చూసి అడిగింది ప్రశాంతి.

ఆలోచనల్లోంచి తేరుకున్నాడు శరత్. అతడి నోరంతా చేదయిపోయింది. తల సన్నగా నొప్పి పెడుతోంది. కడుపులో గాభరాగా, వికారంగా ఉంది. 'నువ్వెందాక అన్న మాటల గురించి ఆలోచిస్తున్నాను. వేరే మొగవాడిని హోటల్‌కి పిలిచి వాడి భుజం మీద తలపెట్టి బాధలు చెప్పుకోవటం గురించి. నీకెలా తెలిసిందని?' జాగ్రత్తగా అన్నాడు.

పెద్దగా నవ్వింది ప్రశాంతి.

'మీ మగవాళ్ళది అనుమానపు బుర్ర. నేనెవరి భుజం మీద తలపెట్టి ఏడవను లెండి. నేను ఏడిపిస్తాను తప్ప ఏడవను.'

ఆమె తనపై విసురు విసిరిందని గ్రహించినా, ఆమె మాటలతో ఒక్కసారిగా మనస్సులోని బాధ తీసేసినట్టయింది శరత్‌కి.

ఎక్కడకు మాయమయిందో తలనొప్పి 'హుష్‌కాకి' అయిపోయింది. వికారభావన పరారయిపోయింది. శరీరం తేలికగా అనిపిస్తోంది. శరీరం తేలికగా అనిపిస్తోంది.

'నేనన్నది నీగురించి కాదోయ్..' అని ఏదో అనబోయాడు శరత్, తేలికగా..

అతడి మాటలకు అడ్డువచ్చింది ప్రశాంతి.

'నాకు ఒకోసారి పాత కాలం ఉత్తమం అనిపిస్తుంది. ఇలా రోజూ బయట తోడేళ్ళు, నక్కలు, పులుల మధ్య ఎనిమిది తొమ్మిదిగంటలు అతిజాగ్రత్తగా గడపాల్సి వచ్చేది కాదు. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎవరో వచ్చి పలకరిస్తారు. ఏదో అవసరం పడుతుంది. ఒకటికి రెండుసార్లు మాట్లాడాల్సి వస్తుంది. ఇంకేం' కథలు ఊరేగుతాయి. ఊహలు ఆకాశాన్ని తాకుతాయి. మా ఆఫీసులో గంగ అని

ఉందో అమ్మాయి. అమ్మాయంటే అమ్మాయి కాదులెండి. యాభయ్ ఉంటాయి. ఆమె చుట్టూ వేణు అనేవాడు తిరుగుతున్నాడు. వాడో వెధవ. ఇప్పుడు వాళ్ళిద్దరూ బహిరంగంగా రోజూ కాంటిన్‌కి వెళ్ళి 'టీ' తాగుతున్నారు. అదో చర్చనీయాంశం. మనం ఎంతో అభివృద్ధి చెందాం. ప్రోగ్రెసివ్ అనుకుంటాం. కానీ మనిషి ఏమీ మారలేదు. ఏ విషయంలో కూడా.. అయినా నాకు అర్థం కాదు.. అసలు అనవసరంగా ఎవరైనా ఎవరితోనైనా ఎందుకు మాట్లాడాలి? ఆ తరువాత వాళ్ళిలా అన్నారు, వీళ్ళిలా అన్నారు అని ఎందుకు ఏడవాలి?'

ఆమె మాట్లాడే తీరును, ఆవేశాన్ని బట్టి ఆఫీసులో ఏదో అయిందని గ్రహించాడు శరత్.

'ఆఫీసులో ఏమైనా అయిందా?' అడిగాడు మృదువుగా.

'ఏమౌతుంది? ఏమవ్వాలి? ప్రతివాళ్ళకీ వాళ్ళ భార్యలు ఆఫీసులకెళ్ళి డబ్బులు సంపాదించి తేవాలి. ఇంట్లో పనులన్నీ చెయ్యాలి. పిల్లల బాధ్యతలు చూసుకోవాలి. పరపురుషుడి వైపు చూడకూడదు. తన భార్య తప్ప ప్రతి ఒక్క మహిళా అసంతృప్తితో సెక్స్ కోసం అల్లల్లాడిపోతూంటుంది.'

'ఏమైందివాళ్ళ? ఎవరైనా ఏమైనా అన్నారా?' అడిగాడు శరత్.

శరత్ ముందు కూర్చుంది.

'మా ఆఫీసులో ఐలయ్య లేడూ.. వాడే ఫుట్‌బాలర్... మీకూ పరిచయం.'

'ఓ.. గుర్తుకు వచ్చాడు. మన ఇంటికి కూడా వచ్చాడు'

'ఆ వాడే నాతో మాట్లాడాలట. ఒంటరిగా మాట్లాడాలట. బాధలు చెప్పుకోవాలట. ఆఫీసులో కుదరదట. బయట హోటల్‌లో కలుద్దాం అంటాడు.'

'వెళ్ళవద్దూ? పాపం' నవ్వుతూ అన్నాడు శరత్. కానీ అతడి మనసులో విచిత్రమైన భావన కలుగుతోంది.

ప్రశాంతిని పరిశీలనగా చూశాడు.

అతడికి ఓ పాత ఇంగ్లీషు సినిమా డైలాగు గుర్తుకు వచ్చింది.

దాన్లో తన భార్య అందంగా ఉందని ఎవరో అన్నారని భర్తకు కోపం వస్తే, భార్య 'you are blind to one because I am your wife' అంటుంది. నేను నీ భార్యని కాబట్టి నా అందం నీకు కనబడదంటుంది.

వ్యంగ్యం అయినా చేదు నిజం.

శరత్ మనసులో నేరభావన కలిగింది.

ప్రశాంతి వైపు, సరిగ్గా చూసి ఎన్నో ఏళ్ళయింది.

ఒకే ఇంట్లో ఉంటున్నా, రోజూ కలుస్తూనే ఉన్నా, రోజూ కలసి పనులు చేస్తూనే ఉన్నా ప్రశాంతిని తాను సరిగ్గా చూడటమే లేదు. ఆమె అందాన్ని గమనించటంలేదు.

'ఇంకానయం.. అడ్డమైన వెధవల బాధలు వినటమేనా నా పని? సిగ్గులేకపోతేసరి. ఇంకోసారి జోక్ కయినా అలా అన్నారంటే చీపురు తిరగేస్తా' అంది నవ్వుతూ.

శరత్ కూడా ఆమె నవ్వుతో నవ్వు కలిపాడు. హఠాత్తుగా నవ్వటం ఆగి ఆమె కళ్ళల్లోకి చూసి చెప్పాడు.

'నిజంగా నువ్వు చాలా అందంగా ఉంటావు ప్రశాంతీ. నేనే గమనించలేదు.' అన్నాడు.

నవ్వింది ప్రశాంతి. ఆమె ఏదో అనేలోగా సెల్ మోగింది.

'ఇంత రాత్రి ఎవరు చేస్తారు?' అంటూ లేచింది.

'మీ ఐలయ్య ఏమో!' అన్నాడు శరత్.

ఫోనెత్తి 'హలో' అంది.

'అమ్మ.. నేను .. రాత్రికి రావటంలేదు. ఇక్కడ ఫ్రెండ్స్‌తోటే ఉంటున్నాను' ముద్దగా వస్తోంది సుమంత్ స్వరం.

క్రితం రాత్రి తాగి ఇంటికి వచ్చినందుకు తిట్లు తిన్నాడు. ఇప్పుడు తాగినందుకు ఇంటికి రావటంలేదు.

ఆమె ముఖంలో మార్పు చూసి అడిగాడు శరత్ 'ఎవరు?'

'మీ పుత్రరత్నం. రాత్రికి ఇంటికి రాడట. తాగి ఎక్కడో పడుకుంటున్నాడు.'

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

శరత్ మనసులో జాలి పొంగింది. ఆమెని దగ్గరకి తీసుకున్నాడు.

'చిన్నప్పుడు పిల్లలు మాట వినకపోతే బ్రతిమిలాడతాం. ఆశలు చూపిస్తాం. బెదిరిస్తాం. కానీ పెద్దయిన పిల్లలు మాట వినకపోతే మౌనంగా దేవుడికి దండం పెట్టుకుని, వాడి భవిష్యత్తు బాగుండాలని ప్రార్థించటం తప్ప ఏమీ చేయలేం అన్నాడు మృదువుగా.

'వీడికి ఈ తాగుడు ఎక్కడ నుంచి అలవాటయిందండీ' అంది బేలగా.

'పిల్లలకు మనం ఇంట్లో మంచి చెప్తాం. కానీ బయట ప్రపంచం ప్రభావాన్నుండి మనం తప్పించలేము. మనం ఇచ్చిన సంస్కారం, వాడి వ్యక్తిత్వం మాత్రమే వాడి మార్గాన్ని నిర్దేశిస్తాయి. వాడి భవిష్యత్తును నిర్ణయిస్తాయి. తాగుడు చెడుకాదు. ఏదైనా హద్దు దాటితే హానికరం. చూద్దాం. వాడి అదృష్టం ఎలా ఉందో'

'అంటే తాగొద్దని మీరు వాడికి చెప్పరా?'

'చెప్తాను. కానీ వింటాడనుకోను. ప్రతి తరానికి తనదైన వ్యాకరణం ఉంటుంది. మనం మన దృష్టితో వాడిని చూస్తున్నాం. మనకు చదువు పూర్తవగానే ఒక ప్రభుత్వ ఉద్యోగం రావాలి. పెళ్ళి చేసుకోవాలి. రిటైరయ్యేసరికి ఎలాంటి బాధ్యతలుండకూడదు. ఇలాంటి ఆలోచనలు తప్ప మరేమీలేవు. ఇప్పటి తరం అలా కాదు. ఈ తరానికి జీవితాన్ని అనుభవించాలి. ఉద్యోగం గురించి బెంగలేదు. బ్రతికేయగలం అన్న ధీమా ఉంది. పైగా, ప్రపంచీకరణ, విదేశీపెట్టుబడులు, అంతర్జాతీయ విపణి మన జీవన విధానాన్ని మార్చేశాయి. మనలాగా, వీళ్ళు యవ్వనంలోనే రిటైర్మెంట్ జీవితానికి ప్రణాళికలు వేసుకోవటంలేదు.

వీళ్ళది దేనికీ భద్రతలేని, అయినా ఏమీ పట్టించుకోని, వీకెండ్ టు వీకెండ్ తరం. అంతెందుకు, వాడెవడో బాధలు చెప్పుకుంటానంటే నీకు అంత కోపం వచ్చింది. కానీ ఇప్పటి తరం అమ్మాయిలు 'కాఫీకి పిలిస్తే' 'కాఫీనా? బీరు తాగటానికి పిలుస్తావనుకున్నాను' అనేట్టున్నారు. నువ్వూ నేనూ అది ఊహించగలమా?'

నవ్వింది ప్రశాంతి. 'ఛాన్స్ దొరికిందని లెక్చరిచ్చేస్తున్నారు' అంది.

'పెళ్ళయిన కొత్తల్లో ఈ లెక్చర్లే బావుండేవి నీకు'

'అప్పుడు మీ లెక్చర్లు కొత్త. ఇలా కూడా ఆలోచిస్తారా అని ఆశ్చర్యంగా ఉండేది. ఇప్పుడు అలవాటయి పోయింది. ఇలా కాక ఇంకోరకంగా ఆలోచిస్తే బాగుండు అనిపిస్తోంది' అంది.

నవ్వాడు శరత్.

ఆమె దృష్టి గడియారంపై పడింది.

'అయ్యో. ఇంత రాత్రయింది స్రవంతి ఇంటికి రాలేదు.' అంది.

'అదీ ఎవరింట్లోనయినా పడుకుంటుందేమో?' అన్నాడు.

'ఒక వయసు వచ్చిన తరువాత పిల్లను ఎక్కడా ఒంటరిగా వదలకూడదు' అంది. ఏదో అనబోతున్న శరత్ నోటికి చెయ్యి అడ్డం పెట్టింది'మళ్ళీ మీ తరం వ్యాకరణం అంటూ లెక్చర్లివ్వకండి. తరం ఏదైనా, సమాజం ఏదైనా ఆడపిల్ల విషయంలో ఏదీమారదు. ఇప్పుడు ఎల్‌కెజి, యూకేజీ ఆడపిల్లల విషయంలో కూడా భయపడాల్సివస్తోంది. వయసు వచ్చిన కూతురిని పట్టించుకోకపోతే ఎలా?' అంది.

తలుపు చప్పుడయింది.

పరుగున వెళ్ళి తీసింది.

ఎదురుగా స్రవంతి. 'హాయ్' అంటూ లోపలకు వచ్చింది.

'ఇంత రాత్రి రోడ్లమీద తిరిగితే ఎలా? భయం లేదా? ఎంత కంబైన్డ్ స్టడీస్ అయినా ఇంత రాత్రిదాకా చదవాలా?' అంది గబగబా.

నవ్వింది స్రవంతి.

'ఏమీ కాదమ్మా అందరం కలిసి చదివితే ఒకరికి తెలియని విషయాలు మరొకరు చెప్తారు. బాగుంటుంది.' అంది లోపలకు వెళ్తూ.

తన కూతురు వెళ్ళిన వైపు చూస్తూండిపోయాడు శరత్.

అంతా గమ్మత్తుగా ఉంది.

పిల్లలు పెద్దవాళ్ళయిపోవటం. వాళ్ళు మంచి చెడూ వాళ్ళు తెలుసుకోగలగటం. తాము నెమ్మదిగా ముసలివాళ్ళయిపోతూండటం ఒకప్పటి ఆవేశం, ఆదర్శం కావాలని ఆలోచన, అనుభవాలు కలిగించిన అవగాహన ఆక్రమించటం...

తన గదిలోకి వెళ్ళి పాటలు ఆన్ చేశాడు.

తాల్ మిలే నదీ కె జల్ మె

నదీ మిలే సాగర్‌మే

సాగర్ మిలే కౌన్ సె జల్ మె కొయీ జానే

ముఖేష్ స్వరం గదిలో నిండింది.

కళ్ళు మూసుకున్నాడు శరత్.

పిల్లలను చూస్తుంటే మనసు గతం వైపు పరుగులు తీస్తోంది. ఆ వయసులో తన ఆవేశాలు, ఆలోచనలు గుర్తుకువస్తున్నాయి. ఇపుడు అవన్నీ ఏమైపోయాయి?

నెమ్మది నెమ్మదిగా రాజీపడటం అలవాటయిపోయింది.

రాజీపడటాన్ని సమర్ధించుకోవటం అలవాటయి పోయింది.

చదువుకునే రోజుల్లో ఏవేవో ఊహించుకున్నాడు. ఏవేవో సాధించాలనుకున్నాడు. చదువు పూర్తయ్యేసరికి నిజజీవితం వేరు, కలల జీవితం వేరు అని అర్ధమయింది. జీవితం కోసం ఉద్యోగంలో చేరక తప్పలేదు.

ఆ ఉద్యోగం తన ఊహలకు పూర్తిగా భిన్నమైనది.

చేరినప్పుడు వెంటనే వేరే ఉద్యోగం చూసుకుని దీన్ని వదిలేయాలని నిశ్చయించుకున్నాడు. కానీ ఇపుడు రిటైర్మెంట్ గురించి ఆలోచిస్తున్నాడు.

లడక్ పన్ కేల్ మె ఖోయా

జవానీ నీంద్ భర్ సోయా

బుడాపా దేఖ్‌కర్ రోయా

యహీ ఖిస్సా పురానా హై... పాడుతున్నాడు ముఖేష్.

కఠోరమైన జీవిత సత్యాలు అనుకున్నాడు శరత్.

'సాయంత్రం మా అమ్మాయి డాన్స్ ప్రోగ్రామ్ ఉంది. తప్పకుండా రావాలి' కొలీగు కల్పన శరత్ చేతిలో ఇన్విటేషన్ పెట్టింది.

కార్డు అందంగా ఉంది. కార్డుమీద అమ్మాయి నృత్యభంగిమ ఉంది.

కార్యక్రమానికి వచ్చి పెద్దల జాబితా చూశాడు. నిజంగానే పెద్దలు వస్తున్నారు.

'రావోయ్. నేనూ వెళ్తున్నాను' అని మరో కొలీగ్ బలవంతం చేయటంతో వెళ్ళాడు శరత్.

హాలు కిటకిటలాడుతోంది.

నృత్యం ఆరంభమయింది.

స్టేజ్‌కి ఓ కార్నర్‌లో కూర్చున్న యువతి పాట ఆరంభించింది.

ఆమె స్వరం వింటూనే ఉలిక్కిపడ్డాడు శరత్.

అతడి శరీరాన్ని ఏదో ఉద్వేగం క్రమ్మేసింది.

ఆ గాయనిని చూడాలని, ఎదురుగా ఉన్న తలలను తప్పుకుని వొంగి చూశాడు. అమ్మాయి సాధారణంగా ఉంది.

కానీ ఆమె పాట పాడటంలో, పాట పట్ల ఉన్న శ్రద్ధ తెలుస్తోంది. భక్తి తెలుస్తోంది. అంకిత భావం తెలుస్తోంది.

పాట ఆమె స్వరంతో కాదు, ఆత్మతో పాడుతున్నట్టుంది.

ఆమె స్వరం పలికే స్వరతరంగాలు సముద్రపుటలల్లా తాకి అతడిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఆమె ఏం పాడుతుందో అతడికి తెలియటంలేదు. కేవలం ఆమె స్వరం అతడి సర్వేంద్రియాలను తన వశం చేసుకుంది.

స్టేజి మీద నృత్యం చూడలేదు. తన ముందున్న వారిని మరచిపోయాడు. పక్కనున్న వారు అదృశ్యం అయిపోయారు. ఆమె స్వరం తప్ప సర్వ ప్రపంచం శూన్యమైపోయింది. ఆమె పాత ఆపేసరికి అతడికి ప్రపంచం శూన్యం అయిపోయింది.

అనౌన్సర్ ఏదో అనౌన్స్ చేశాడు.

శరత్ దృష్టి ఆ వైపు లేదు. స్టేజ్‌కి ఓ మూల ఉన్న ఆమె పైనే ఉంది.

ఆమె నీళ్ళు తాగుతోంది.

నీళ్ళు గొంతునుండి క్రిందకు జారుతూ.. ఆ సుమధుర స్వరతరంగాలు వెలువడే కంఠాన్ని స్పృశిస్తాయన్న భావన కలిగితేనే ఎందుకో అసూయగా అనిపించింది.

ఇంతలో ఆమె మళ్ళీ గళం విప్పింది.

తటవన మునిజన సకల అసురసుర

సన్నుత పాద కింకిణి ఝుమ్ ఝుమ్

ఝణ ఝణ ఝణ ఝణ మాస్వర లయగతి

ఘన ఘన ఘన ఘన వితి హరి సేవిత

తాండ విడంబర వ్యాఘ్రమ శంకర

శరత్ కళ్ళముందు ఆమె స్వర తరంగాలు తాండవం చేస్తున్న నటరాజు దివ్యరూపాన్ని నిలిపాయి.

తన్మయుడై పోయాడు. ఒళ్ళుపై మరచిపోయాడు.

అతడు అక్కడ కూర్చుని ఉన్నాడు భౌతికంగా. కానీ అతని శరీరం నుండి అతడు వేరై ఆకాశం దాటి అంతరిక్షం చేరి, నక్షత్రాలు, పాలపుంతలు ప్రమథగణాలుగా సంచరిస్తుంటే శివతాండవం చేస్తున్న భావన కలుగుతోంది.

ఆ హాలు విశ్వమైపోయింది. విశ్వ వేదికపైన సహస్ర చూపులతో, జటాజూటం గాలికి నదీపాయలుగా వంపులు తిరిగి ఎగురుతున్న శివుడు అతడి కళ్ళముందు నిలిచాడు.

అదోరకమైన తీవ్ర భావావేశానికి గురయ్యాడు శరత్.

తనెవరో తెలుస్తోంది. తన శరీరం తెలుస్తోంది. కానీ తాను తన శరీరంకాదనిపిస్తోంది.

నృత్యం అయిపోయింది.

అందరితోపాటు యాంత్రికంగా లేచాడు. బయటకు నడిచాడు.

'అరే శిల్ప బాగా పాడింది కదా. ఇంత బాగా పాడుతుందనుకోలేదు. ఆమె కూడా మన ఆఫీసే' ఇద్దరు కొలీగులు మాట్లాడుకుంటున్నారు.

చివరి మాట వినగానే ఒక్కసారిగా ఈలోకానికి వచ్చిపడ్డాడు.

'ఆ పాట పాడినామె మన ఆఫీసా?' ఒక్కసారిగా అడిగాడు.

'అవును' చెప్పాడు కొలీగు.

'నాకు ఆమెని పరిచయం చేస్తారా?' అడిగాడు శరత్ అనాలోచితంగా.

**'అవును కల్పన కూతురు శిల్ప.** కల్పన కూడా డాన్స్ నేర్చుకుంది. చాలా చక్కగా డాన్స్ చేసేది. పెళ్ళయిన తరువాత, డాన్సు మానేసింది. వాళ్ళమ్మాయి శిల్పకు డాన్స్ నేర్పించాలని ప్రయత్నించింది. కానీ అమ్మాయికి డాన్స్ కన్నా పాట మీద ఆసక్తి. దాంతో పాట వైపు మళ్ళింది. చాలా బాగా పాడుతుంది.' చెప్పాడు కొలీగు.

శరత్ కళ్ళు శిల్పని వదలటం లేదు.

ఆమె అందం సాధారణం. కానీ ఆమె ప్రతిభ అసాధారణం.

***మనిషి రూపలావణ్యాలు చూడగానే ఆకర్షిస్తాయి. కానీ ప్రతిభ వ్యక్తికి వింత అందాన్నిస్తుంది. అది ఎన్నటికీ తరగని అందం. అది ఆకర్షించదు. వ్యక్తి మనస్సుని కట్టి పడేస్తుంది. భగవంతుడి కళానైపుణ్యాన్ని ప్రతీకాత్మకంగా అనుభవానికి తెచ్చి అలౌకికానందాన్ని కలిగిస్తుంది.***

అందుకే మాములుగా అందవిహీనంగా భావించి, చూడకముందే మరచిపోయేటటువంటి రూపం కలవారు, తమ ప్రతిభ వల్ల ఎల్లప్పటికీ మరుపురాని వ్యక్తులుగా మిగిలిపోతారు. అందగాళ్ళకన్నా ఎక్కువ అందంగా కనిపిస్తారు. శిల్పను దూరంం నుంచి చూస్తుంటే శరత్ మనస్సులో పలురకాల విభిన్నమైన భావాలు చెలరేగుతున్నాయి.

కొలీగు శరత్ మీదకు వంగాడు. చెవిలో గుసగుసగా చెప్పాడు.

'శిల్పకు పెళ్ళయింది. మొగుడొదిలేశాడో తెలియదు, మొగుడిని వదిలేసిందో తెలియదు, మొత్తానికి అమ్మ దగ్గరే ఉంటోంది'

ఒక్కసారిగా భూమి మీదకు వచ్చి పడినట్టయింది శరత్‌కు. కొలీగ్ వైపు చూడాలనిపించటంలేదు. కళను కళగా, కళాకారుడిని కళాకారుడిగా, వ్యక్తిని వ్యక్తిగా చూసే పరిణతిని ప్రజల నుంచి ఊహించటం మూర్ఖత్వమేమో అనిపిస్తుంది.

ఒక మనిషి మనిషిగా గొప్పవాడు కాకపోవచ్చు. కానీ అతడు అతి గొప్ప కళాకారుడవచ్చు. అతడి ద్వారా దివ్యమైన ప్రతిభ ప్రకటితమవవచ్చు.'

అతడి ద్వారా ప్రకటితమవుతున్న దివ్య ప్రతిభను చూసి, వ్యక్తిగా కూడా అతడు దివ్యంగా ఉండాలని కోరుకోకూడదు.

కళాకారుడి వ్యక్తిగత జీవిత ప్రభావం అతడి కళపై ఉన్నా, కళను వ్యక్తిగత జీవితం ఆధారంగా కొలవటం కూడని పని

కానీ అందరూ చేసేపని అదే

ఆస్కార్ వైల్డ్ అంతటి గొప్ప ప్రతిభావంతుడు వ్యక్తిగత జీవితంలోని వైచిత్రివల్ల అప్రతిష్టపాలై నిరాదరణకు గురవాల్సివచ్చింది.

మైకెల్ జాక్సన్‌లాంటి ప్రతిభావంతుడు వ్యక్తిగత జీవితంలోని ఆరోపణల వల్ల అప్రతిష్టపాలయ్యాడు.

ఇలా చూస్తూ పోతే కళాకారుడిని కళద్వారానే కొలవాలి. వ్యక్తిగత జీవితం ప్రభావాల్ని విశ్లేషించాలి తప్ప, దాని ఆధారంగా 'కళ'ను నిర్ణయించకూడదు.

కొలీగు పక్కనుంచి కదిలాడు శరత్,

'వెళ్ళిపోతున్నావా? పరిచయం చెయ్యమన్నావు?' అడిగాడు కొలీగు.

'ఆఫీసులో కలుస్తాను. నాకు ఆలస్యమవుతోంది' అన్నాడు శరత్ అతడివైపు చూడకుండా.

'సరే. నువ్వొచ్చావని కల్పనతో చెప్తాను' అన్నాడు కొలీగు.

మౌనంగా బయటకు వచ్చాడు శరత్.

దారంతా అతని మనస్సులో శిల్ప స్వరం ధ్వనిస్తూనే ఉంది. ఆనందం కలిగిస్తూనే ఉంది.

కానీ ఉండి ఉండి ఆనందాన్ని భగ్నం చేస్తూ కొలీగు మాటలు చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి.

మాట శక్తి అటువంటిది.

ఎవరైనా ఒకమాట అంటే, దాన్ని ఎంత తేలికగా కట్టిపారేసినా దాని ప్రభావం తగ్గదు. అందుకే వాక్కుకు అంత ప్రాధాన్యం ఇచ్చారు.

వేసిన బాగాన్నయినా ఉపసంహరించవచ్చుకానీ అన్నమాటను ఉపసంహరించలేమన్నారు.

ఆ రోజు ఇంటికి ఎలా వచ్చాడో, ఎలా తిన్నాడో, ఏమేం మాట్లాడాడో, ఎలా నిద్రపట్టిందో అతడికి గుర్తులేదు.

కేవలం ఆ అమ్మాయి స్వరతరంగాలు తప్ప అతడికి మహాచైతన్యం లేదు.

మరుసటి రోజు ఆఫీసుకి వెళ్ళేటప్పుడు శరత్‌లో సందిగ్ధం మొదలయింది. ఏదైనా అనుభవం తీవ్రత కాలం గడుస్తున్న కొద్దీ తగ్గుతుంది. తీవ్రత తగ్గిన కొద్దీ ఆలోచన పెరుగుతుంది. ఆలోచనలోని అయోమయం సందిగ్ధతికి దారి తీస్తుంది. ఆ అమ్మాయి గానం విన్నప్పుడు వెంటనే వెళ్ళి కాళ్ళమీద పడాలనిపించింది. ఆలోచిస్తున్నకొద్దీ ఆమె గానామృతం హృదయంలో ఆనంద సరస్సును ఏర్పరచింది ఆమెని కలవాలనిపించింది.

కానీ ఇపుడు ఆమె కలవటం వల్ల లాభం ఏమిటన్నా ప్రశ్న ఉదయించింది. అవును లాభం ఏమిటి?

ప్రజలు కళాకారుల పట్ల వెర్రి అభిమానం ప్రదర్శిస్తారు.

సినీనటులంటే పడి చచ్చిపోతారు. వాళ్ళు గొప్ప అని నిరూపించటం కోసం కొట్టుకుని చచ్చిపోతారు. కానీ లాభం ఏమిటి?

విదేశాలలో పాపస్టార్లంటే వెర్రి. వాళ్ళ దర్శన మాత్రంలో పూనకం వచ్చినట్టు ఊగిపోతారు వాళ్ళు విసిరేసే వస్తువుల కోసం కొట్టుకుంటారు.

ఇదంతా ప్రతిభ స్పందననా? కళ కలిగించిన ఆనందం వల్ల కలిగిన తీవ్రభావననా?

లేక, మనిషి వ్యక్తిత్వంలో ఉన్న లోపం వల్ల, వ్యక్తికి తనపై తనకు ఉన్న తక్కువ భావం వల్ల కలిగే అప్రాకృతిక వికృతియా?

బహుశా జీవితంలో ఏదో సాధించిన వారిని చూసినప్పుడు, భగవంతుడూ తమకు అందించిన కళశక్తిని సక్రమంగా వినియోగించుకుని ప్రదర్శించే వారిని చూసినప్పుడు సామాన్యులలో, భగవంతుడిచ్చిన శక్తిని వినియోగించుకోలేక వ్యర్థం చేస్తున్న భావన కలుగుతుందేమో!

ఆ భావన కలగటం వల్ల నెలకొన్న ఆత్మన్యూనతా భావాన్ని కప్పిపుచ్చుకునేందుకు పైనున్న వారిని క్రిందకు దిగజార్చి ఊహించటం వల్ల, వారిని తక్కువ చేయటం వల్ల వ్యక్తి తన నేరభావనను కప్పిపుచ్చుకుని న్యూనతను సంతృప్తిపరచుకుంటాడేమో!

అదీకాక, కళాకారుడిగా వ్యక్తివేరు, వ్యక్తిగా వేరు.. ఈ రెంటి మధ్య వైరుధ్యాన్ని అర్థం చేసుకోగలవారు అరుదు.

ఒకవేళ కళాకారుణిగా వేదికపైన కనిపించిన శిల్పకూ, నిజజీవితంలోని శిల్పకూ నడుమ ఉండే తేడాను తాను భరించలేకపోతే... ఇంతవరకూ తనలో ఉన్న ఒక అద్భుతమైన భావన మలినం అయిపోతుంది కదా!

కాబట్టి, ఆమెని కలవటం వల్ల లాభం ఏముంది?

అదీకాక, తనకు శాస్త్రీయ సంగీతం రాదు. పాటలో మెళుకువలు తెలియవు. రాగపరిజ్ఞానం లేదు. లయ జ్ఞానంలేదు. ఆమెతో తానేం మాట్లాడతాడు?

ఇలాంటి పలు రకాల ఆలోచనలు, సందిగ్ధాలతో సతమతమయ్యాడు శరత్. పలుమార్లు ఆమె ఉండే సెక్షన్ కనుక్కొని వెళ్ళి కలవాలనుకుని లేచాడు మళ్ళీ మార్చుకున్నాడు.

చివరికి ఆమెని కలవకూడదనే నిశ్చయించుకున్నాడు.

కలసి ఆమె గానాన్ని పొగడితే, ఆమెకుండే శతకోటి అభిమానుల్లో ఒకడయిపోతాడు. అందువల్ల లాభంలేదు. నష్టంలేదు.

ఇలాంటి పలు ఆలోచనలతో శరత్ ఇల్లు చేరేసరికి అతడికన్నా ముందే ప్రశాంతి ఇంటికి వచ్చి ఉంది.

ఆమె ముఖం గంభీరంగా ఉంది.

ఏదో జరిగిందని తెలుస్తోంది.

'ఏమైంది?' అడిగాడు శరత్, ఆతృతను అణచుకుంటూ.

ప్రశాంతి మాట్లాడలేదు. శరత్ వైపు నిరసనగా చూసింది.

'ఎందుకలా ఉన్నావు? ఏమైందో చెప్తేకదా నాకు తెలిసేది?' అన్నాడు. కోపంగా చూసింది మాట్లడలేదు.

'తుమ్ రూఠీ రహో, మై మనాతా రహూ' పాట అందుకున్నాడు.

'కర్ణకఠోరంగా పాట ఆపండి' అరిచింది.

ఆపేశాడు. 'ఏమైందో చెప్పు.. లేకపోతే వేరేపాట పాడతాను' నవ్వుతూ అన్నాడు.

'మీకన్నీ హాస్యమే. అంతా పాటలే. ఇవాళ సుమంత్‌తో మాట్లాడాల్సిందే .' కోపంగా అంది.

'ఏం మాట్లాడాలి?' అడిగాడు.

'మీరు పెళ్ళెందుకు చేసుకున్నారు? పిల్లల్ని ఎందుకు కన్నారు? వాళ్ళని పట్టించుకోక పోతే ఎలా? డబ్బులు తెచ్చి నా చేతిలో పోస్తే సంసారంలో బాధ్యతలు తీరిపోతాయా?' నిలదీసి అడిగింది.

'ఇప్పుడేమైంది?' చిరాకుగా ధ్వనించింది శరత్ స్వరం. సంభాషణ ఏ వైపు వెళ్తోందో తెలియటంలేదు. సంభాషణకు కారణం తెలియటంలేదు. దాంతో చిరాకు వస్తోంది.

'ఏమవ్వాలి? ఏమైనా అయితే పట్టించుకుంటారా?'

'అసలేమైంది?'

'ఏమైందంటే పట్టించుకుంటే తెలుస్తుంది. సుమంత్ రాత్రి ఇంటికి రాలేదు. ప్రొద్దున్నా రాలేదు. ఎక్కడున్నాడో తెలుసుకున్నారా?'

'ఫ్రెండింట్లో ఉన్నాడన్నాడు కదా? అటునుంచి అటే కాలేజీకి వెళ్ళి ఉంటాడు.'

'మీది అమాయకత్వమో, మూర్ఖత్వమో తెలియటంలేదు.'

'ఏమైందిప్పుడు?'

'వాడు ఫ్రెండింట్లో లేడట. రాత్రి వాడి ఫ్రెండ్స్‌తో తాగి కారులో వెళ్తూంటే డ్రంకిన్ డ్రైవింగ్‌లో పట్టుబడ్డారట. వాళ్ళ ఫ్రెండుని పట్టుకుంటే కారులోని మిగతావాళ్ళూ, వాడికి మద్దతుగా స్టేషన్ బయట కారులోనే కూర్చున్నారట. ఇవ్వాళ ప్రొద్దున్నే కౌన్సిలింగ్ చేసి వదిలేశారట.

కుర్చీలో కూర్చున్నాడు శరత్.

అతడికి ఏం చేయాలో పాలుపోవటంలేదు.

ఏం చేయాలి? ఏమనాలి?

'మరిప్పుడేడి?'

'అందరూ ఫ్రెండింట్లో ఉన్నారు. సాయంత్రం వస్తాడట. వాళ్ళ ఫ్రెండు వాళ్ళ నాన్నగారు బిజినెస్‌మేనట. గొడవ లేకుండా ఆయన మేనేజ్ చేశారు'

'నీకెలా తెలిసింది?' అతికష్టం మీద అడిగాడు.

'అందుకే అంటాను. మనుషులతో కలవండి. కాస్త మనుషులతో తిరగండి అని. ఎపుడూ మీలోకంలో ఉంటే బయట ప్రపంచంలో ఏమౌతుందో మీకేం తెలుస్తుంది?' తల వంచుకున్నాడు శరత్.

'మా కొలీగ్ కొడుకు కూడా వీళ్ళతో ఉన్నాడు ఆయన చెప్పాడు. ఆయన వెళ్ళి నాలుగు తగిలించి కొడుకుని ఇంటికి తెచ్చాడు. గదిలో పెట్టి బంధించాడు.' కసిగా చెప్పింది ప్రశాంతి.

'నువ్వు చెయ్యగలవా అలాంటిపని?' అన్న భావన ఆమె స్వరంలో ధ్వనించింది శరత్ మాట్లాడలేదు.

'ఇప్పటికైనా వాడిని నిలదీసి అడగండి. అసలు వాడేమవ్వాలనుకుంటున్నాడు? వాడి భవిష్యత్తు ఏమిటి? ఇలా తాగి తందనాలాడతాడా? ఏమైనా ఉపయోగకరమైన పనిచేస్తాడా? కనుక్కోండి'

ఆమె మాట్లాడుతుండగానే సుమంత్ ఇంట్లోకి అడుగుపెట్టాడు. తల్లి తండ్రివైపు ఓసారి చూశాడు. తన గదిలోకి వెళ్ళిపోయాడు.

'అడగండి' అన్నట్టు శరత్ వైపు చూసింది ప్రశాంతి.

'ఇంటికి వచ్చిన వాడిని రాగానే అడగటం బాగుండదు' సౌంజ్ఞ చేశాడు శరత్.

'మీరింతే' అన్నట్టు చూసి గబగబా లోపలకు వెళ్ళింది.

లోపల సంభాషణ వినిపిస్తోంది శరత్‌కి.

'ఏరా... రాత్రంతా రాలేదు.. తాగి తందనాలాడారా?'

'అమ్మా.. నాకు క్యాంపస్ సెలక్షన్ వచ్చిందమ్మా. నాతో పాటే నా ఫ్రెండ్స్‌కి కూడా మంచి ఆఫర్. ఆ సంతోషంలో...'

'క్యాంపస్ సెలక్షన్ వచ్చిందా?' సంభ్రమంగా అడిగింది ప్రశాంతి.

'అవునమ్మా.. చదువయిపోగానే జాయినవ్వాలి. బొంబాయి వెళ్ళాలి. అయితే మేం నలుగురం కలిసే ఉంటాం కాబట్టి సమస్యేలేదు. అదీగాక, శేషు లేడూ వాళ్ళ బాబాయి బొంబాయిలోనే ఉంటాడట. ఆయన అన్నీ చూసుకుంటాడు.'

'క్యాంపస్ సెలక్షన్ వచ్చింది. మాకు చెప్పాలనిపించలేదా? ఇంటర్వ్యూ అయినట్టు కూడా చెప్పలేదు?' ప్రశ్నించింది సంబరంగా.

'మీకు టెన్షన్ ఎందుకమ్మా. ఇంటర్వ్యూ అయినప్పటినుంచి ఏమైందని టెన్షన్ పడతారు. రాకపోతే బాధపడతారు. వస్తే చెప్దామనుకున్నాను.'

'ఇపుడయినా చెప్పావు సంతోషం. ఉండు దిష్టితీసేస్తా' అంటూ బయటకు వచ్చింది.

నిలబడి వింటున్న శరత్‌ని చూసి సంతోషంగా నవ్వింది. గబగబా వంటింట్లోకి వెళ్ళింది.

శరత్‌కి గమ్మత్తుగా అనిపించింది.

మనుషుల భావాలు, భావ తీవ్రతలు ఎంత చంచలం, క్షణికాలు అనిపించింది. క్షణం క్రితందాకా వాడిని అడగండి, కడిగేయండి అని తనతో పోరిన వ్యక్తి, మరో క్షణంలో వాడికి దిష్టి తీయటానికి సిద్ధపడుతోంది కోపం మరిచిపోయి.

ఎలాగయితే ప్రతిభ అందవిహీనతను అందంగా మారుస్తుందో, అలాగే ఏదో ఒకటి సాధించటం వ్యక్తి బలహీనతలను మరచిపోయేట్టు చేస్తుంది.

సుమంత్‌కి ఉద్యోగం రావటం, అతడి తాగుడును మరిచిపోయేట్టు చేస్తుంది.

ప్రశాంతి హడావిడిగా వెళ్ళి దిష్టి తీసేసింది.

'ఇంకేం వీడు సెటిల్ అయిపోతే, ఇక స్రవంతి పెళ్ళి చేసేస్తే మన బాధ్యతలు తీరిపోతాయి' అంది సంతోషంగా.

శరత్ నవ్వాడు. తన గదిలోకి వెళ్ళి పాటలు 'ఆన్' చేశాడు.

ఎక్ పల్ హై హస్ నా, ఎక్ పల్ హై రోనా
కైసాహై. యె జీవన్ క ఖేలా
ఎక్‌ఫల్ హై మిల్‌నా, ఎక్‌పల్ బిఛడ్‌నా
దునియా హై దోదిన్ క మేలా..
యే ఘడీన జాయే బీత్..

ఒక క్షణం సంతోషం. మరో క్షణం విషాదం.. ఇదే జీవితమనే ఆట. ఒక క్షణం కలయిక, మరో క్షణం వియోగం. జీవితం రెండురోజుల సంబరం... కాబట్టీ అందుబాటులో ఉన్న క్షణాన్ని జారవిడుచుకోవద్దు.

హృదయలోతుల్లోని భావాలను స్వర రూపంలో ప్రకటిస్తున్నాడు ముకేష్.

తన గదిలో కూర్చుని కొడుకు గదివైపు చూశాడు శరత్.

సుమంత్ స్నానం చేసి వచ్చాడు. భోజనం చేస్తున్నాడు. ఉత్సాహంగా కబుర్లు చెపున్నాడు. కానీ తనవైపు కన్నెత్తి చూడటం కానీ తనతో ప్లేస్‌మెంట్ సంగతి చెప్పాలని కానీ ప్రయత్నించకపోవటం గమనించాడు శరత్.

'మానవ సంబంధాలు ఎంతో విచిత్రమైనవి' అనుకున్నాడు.

ఇంతలో స్రవంతి 'అమ్మా...అబ్బా' అంటూ ఇంట్లోకి వచ్చింది.

'ఊరంతా తిరిగినప్పుడు లేదు. ఇంట్లో అడుగుపెట్టగానే వచ్చిందా?' అడిగింది ప్రశాంతి.

'అలసిపోయానమ్మా... కంబైన్డ్ స్టడీస్' మరి అంది స్రవంతి.

కాస్సేపటికి ముగ్గురూ కబుర్లు చెప్పుకోవటం ప్రారంభించారు. తన గదిలో పాటలు వింటూ కూచున్నాడు శరత్.

అతడికి ప్రశాంతంగా అనిపిస్తోంది.

చూస్తూ చూస్తూ పిల్లలు ఎదిగిపోతున్నారు. ఎవరి బ్రతుకులు వారు నిర్ణయించేసుకుంటున్నారు.

ఇదేనా జీవితం?

అతడికి అందరూ చెప్పే పక్షుల ప్రతీక గుర్తుకు వచ్చింది.

పిట్టలు గూడు కడతాయి. గుడ్లు దాస్తాయి. పొదుగుతాయి. పిల్లలకు ఆహారం తెచ్చి పెడతాయి. కాపాడతాయి. రెక్కలు రాగానే పిట్టలు ఎగిరిపోతాయి.

పిట్టలయితే మళ్ళీ సంవత్సరానికి మళ్ళీ గూడుకడతాయి.

మనుషులకు జన్మమ్ ఒకటే గూడు.

ఇంతేనా జీవితం?

మంద్ర స్థాయిలో మృదువుగా పాడుతున్నాడు కిశోర్ కుమార్.

యే జీవన్ హై, ఇస్ జీవన్ కా

యహీహై యహీహై రంగ్ రూప్

థోడే గమ్ హై, థోడీ ఖుషియా

యహీహై యహీహై హహీహై ఛాల్ధూప్

పాట వింటుంటే ఆలోచన వచ్చింది.

కొంచెం సుఖం. కొంచెం దుఃఖం... సుఖం వచ్చినప్పుడు కాలం వేగంగా గడచి అది కొంతకాలమే ఉన్నట్టుంటుంది. దుఃఖం మాత్రం దీర్ఘ కాలం ఉన్నట్టుంటుంది. ఇప్పుడు అంతా సులభంగా శాంతంగా ఉంది. దీని తరువాత దుఃఖమా?

'**చాలా థాంక్సండీ..** నిన్న మా అమ్మాయి పాట విన్నారు. మీకు నచ్చిందని చెప్పారు' కార్యక్రమానికి వచ్చిన వారి సీటు దగ్గరకు వచ్చి ధన్యవాదాలు చెప్తోంది కల్పన.

ఆమె తన దగ్గరకు వచ్చి 'థాంక్స్' చెప్పగానే అన్నాడు శరత్.

'నిజంగా. కార్యక్రమానికి రావటం నా అదృష్టం. చాలా బాగా పాడింది. నేనూహించలేదు' అన్నాడు మనఃస్ఫూర్తిగా.

'నా బాధ అదేనండి. చాలా చక్కగా పాడుతుంది. కానీ తన స్వరాన్ని ఉపయోగించుకుని పైకి వెళ్ళాలన్న ఆలోచనలేదు. పాట ఆనందం కోసం, ఆత్మశాంతికోసం, డబ్బుకోసం కాదంటుంది. ఎంత చెప్పినా వినటంలేదు. నా జీవితం ఇలా అయిపోయింది. నేను నేర్చుకున్న కళ ఎందుకూ పనికి రాకుండా అయిపోయింది. దాని 'కళ' వ్యర్థం కాకూడదని నా తపన.' ముక్కూ మొహం తెలియని వాడితో తన బాధలు పంచుకుంటోందంటేనే ఆమె ఎంతగా బాధపడుతోందో అర్థం చేసుకోవచ్చు.

కానీ.. ఒక వ్యక్తి 'కళ' వ్యర్థమయిందో, సార్థకమయిందో ఎవరు నిర్ణయిస్తారు? దానికి కొలబద్దమేమిటి?

ఒక అత్యద్భుతమైన కళాకారుడు ఎవరికీ తెలియకుండా అనామకుడిగా మిగిలిపోవచ్చు. కానీ అలా అనామకుడిగా మిగిలిపోయినా ఆ వ్యక్తి తన కళలోనే ఆనందంగా, సంతృప్తిగా ఉండవచ్చు.

మరో కళాకారుడు, కళాప్రదర్శన ద్వారా గొప్ప పేరు సంపాదించవచ్చు. అతని కళవల్ల ప్రజలకు అమితమైన ఆనందం కలగవచ్చు. కానీ లోలోపల ఆ కళాకారుడు అసంతృప్తితో రగులుతూండవచ్చు.

గొప్ప పేరు సంపాదించినా అసంతృప్తితో రగిలే కళాకారుడి కళ సార్థకమయినట్టా?

అనామకుడిగా మిగిలినా సంతృప్తిగా తన కళను కొద్దిమందికే ప్రదర్శించే కళాకారుడి కళ సార్ధకమయినట్టా?

'మీ అమ్మాయి ఉద్యోగం చేస్తోందా?' అడిగాడు శరత్.

'చేస్తోంది, మన ఆఫీసులోనే. కానీ దానికున్న టాలెంట్‌కి అది ఈపాటికే సినీరంగాన్ని ఏలుతూ ఉండేది' అంది కల్పన.

శరత్ మాట్లాడలేదు.

సినిమా ఇప్పుడు మన జీవితాలను శాసిస్తోంది. సినిమానే జీవితం అయిపోయింది. ఒక రచయిత ఎంత గొప్పవాడైనా సినిమాలకు రాస్తేనే అతడి 'కళ'కు సార్ధకత.

ఒక గాయకుడు ఎంత గొప్పవాడయినా సినిమాల్లో పాడితేనే అతడి కళకు సార్ధకత.

ఒక నటుడు ఎంత గొప్పవాడయినా సినిమాలలో నటిస్తేనే అతడి కళకు సార్ధకత.

సినిమాలేనా కళకు సార్ధకత?

సినిమా అన్నది పలు విభిన్నమైన కళల సమ్మిశ్రితం. అలాంటప్పుడు కళాకారులు తమ తమ వ్యక్తిత్వాలు, అహాలు మరిచి కళాప్రదర్శన అత్యుత్తమ స్థాయిలో పరిమితులలో ఒదిగి ప్రదర్శించటమేనా ఆధునిక సమాజంలో కళకు సార్ధకత?

'మళ్ళీ ఇవాళ సాయంత్రం త్యాగరాయగాన సభలో మా అమ్మాయి పాట ఉంది. మీరు వీలుంటే రండి' అందామె.

తల ఊపాడు శరత్.

సాయంత్రం కాగానే వద్దనుకుంటూనే త్యాగరాయ గాన సభ చేరుకున్నాడు. అది ఓ సినిమా పాటల కార్యక్రమం.

బయట పోస్ట మీద ఓ ఇరవయ్యి దాకా గాయనిల బొమ్మలున్నాయి. దాన్లో ఓ మూల ఉంది శిల్ప బొమ్మ.

బొమ్మవైపు తదేకంగా చూశాడు శరత్.

ఎవరిలో ఏ దివ్యశక్తి ఉందో ఎలా గుర్తించటం?

ఇరవైమంది గాయనుల బొమ్మల్లో ఒక బొమ్మ శిల్ప.

ఇప్పుడు ఆ బొమ్మలు చూస్తుంటే ఎవరు ఆకర్షణీయంగా ఉన్నారో దృష్టి వారిమీదకే వెళ్తుంది. కానీ గొంతు విప్పేదాకా ఎవరి కళ ఎంతో ఎవరికీ తెలియదు. కార్యక్రమం ఆరంభమవుతున్న సూచనగా మైకులో మాటలు వినిపించాయి. హాలు నిండుగా ఉంది.

సినిమా పాటల కార్యక్రమం అయితే ఎంత మంది ఉన్నారు..!

'ఇదే శాస్త్రీయ సంగీత కార్యక్రమమో, నృత్యమో అయితే ఎంత మంది ఉండేవారు? త్యాగరాయ గానసభలో పెద్ద హాలు పక్కనే మినీ హాలు ఉంటుంది. దాన్లో సాహిత్య కార్యక్రమాలు 'అనాధ'ల్లా సాగుతాయి. ఏవో కొన్ని కార్యక్రమాలు తప్ప పది దాటదు సంఖ్య.

ఒకరొకరు వస్తున్నారు. పాటలు పాడుతున్నారు.

కొందరు రెండు మూడు పాటలు పాడుతున్నారు.

శిల్పను పిలవటంలేదు.

అందరూ బాగానే పాడుతున్నా పాటలలో ఏదో లోపం ఉన్నట్టనిపిస్తోంది శరత్‌కు.

ప్రతివాళ్ళూ పాటలు పాడతారు.

గొంతు బావున్న ప్రతి వారి పాట బాగున్నట్టు అనిపిస్తుంది.

కానీ ఒక ఘంటసాల, ఒక రఫీ, ఒక ముఖేశ్, ఒక కిషోర్, ఒక మన్నాడే - ఇలా ఎందుకని కొందరు కళాకారుల పాటలే గీటు రాయిల్లా మిగిలిపోతాయి?

గాయనిలు ఎందరున్నా ఒక గీతారాయ్, ఒక లత మాత్రమే ఎందుకని ఇతరులకన్నా ప్రత్యేకంగా మిగిలిపోయారు?

శరత్ సందేహానికి సమాధానం త్వరలోనే లభించింది.

శిల్ప స్టేజ్ మీదకు వచ్చింది. పాట ఆరంభించింది.

ఓ... నిర్దయీ ప్రీతమ్.

అప్రతిభుడయ్యాడు శరత్.

ఆమె పాట పాడుతున్నట్టు లేదు. పాటను అనుభవిస్తున్నట్టుంది. పాటే తాను అయిపోయింది. ఆమె రాగాలాపననే వ్యక్తి శరీరంలోని ఆత్మను సంగీతమనే స్వరాలు తీగలతో బంధించి ఉత్తమ లోకాలకు లాక్కువెళ్ళేందుకు నాందీ ప్రస్తావన అనిపించింది.

ఓ నిర్దయీ ప్రీతమ్

ప్రణయ్ జగాకే

హృదయ్ చురాకే

చుప్ హువే క్యూం తుమ్....

అందరూ పాడతారు. పాటలో పలు విభిన్న భావాలను ప్రదర్శిస్తారు. కానీ కొందరే పాటను అనుభవిస్తూ పాడతారు. పాటే తామై పోతారు.. అలాంటి వారి 'కళ' ఇతరులకు భిన్నంగా నిలుస్తుంది.

ఇదీ తేడా!

మంచి గొంతు ఉంటే సరిపోదు.

అపారమైన ప్రతిభ ఉంటే సరిపోదు.

కావాల్సింది . తాదాత్మ్యం.. తన కళలో తన వ్యక్తిత్వాన్ని మిళితం చేసి కళనే తానైపోవటం.

ఆమె పాట అయిపోయిన తరువాత ఇతరుల పాట వినలేకపోయాడు.

లేచి వచ్చేశాడు..

ఇల్లు చేరుకున్నాడు.

స్రవంతి ఏదో అంది

అతడికి అది వినిపించలేదు.

ఆమె నవ్వినప్పుడు నవ్వాడు.

పిల్లలేదో అన్నారు...

నవ్వాడు..

అతడి చెవులలో హృదయంలో ఆమె పాటనే ధ్వనిస్తోంది.

అందరూ పడుకున్నా అతడు నిద్రపోలేకపోయాడు.

టేప్‌లో లతా పాటను వింటూ కూర్చున్నాడు...

'కళ' సరస్వతి స్వరూపం..

అది వ్యాపారం కాదు. అది పొగడ్తలు, ప్రశంసలు కాదు.

'కళ' అన్నది భగవతార్చన లాంటిది. తనలోని కళాప్రతిభను అతి పవిత్రంగా భగవంతుడికి అర్పణ చేస్తున్నట్టుగా ప్రదర్శించటం కళకు సార్ధకత. మిగతా పేర్లు ప్రశంసలు, డబ్బులు, బహుమతులు అన్నీ వ్యర్ధం.. అతడికి ప్రాచీన భారతంలో అనేక శిల్పులు తమ వ్యక్తిగతాలకు, అహాలను వదిలి తమ కళను భగవదంకితంగా భావించి మందిరాలలో నిల్చిన శిల్పాలు గుర్తుకు వచ్చాయి.

అవును.. కళాకారులు ఎవరో కూడా తెలియరు.

ఎవరో శిల్పి పేరు చెప్తారు. ఈ మందిరం ఆ రోజు కట్టించాడని చెప్తారు.

కానీ మందిరం అణువణువునా ఏకాగ్రతతో భగవదత్తమైన కళను భగవదంకితంగా ప్రదర్శించిన కళాకారుల గురించి ఎవరికీ తెలియదు.

అదీ కళకు సార్థకత!

ప్రపంచ వ్యాప్తంగా, ఏ నాగరికతలోనయినా కళను భగవదంకితంగా భావించి ప్రదర్శించినంత కాలం ఉత్కృష్టమైన కళ అత్యుత్తమ రీతిలో ప్రకటితమయింది. కళ వ్యాపారమైన మరుక్షణం దిగజారింది 'కళ' కాదు ... వ్యక్తి... సమాజం.

యే చందా శీతల్ కహలాతా

ఫెర్ క్యూ మేరే అంగ్ జలాతా

ఫూల్ సకోమల్, చాన్ మదన్ కా

శూత్ బన్‌కే తన్ మే ఛుబ్ జాతా!

ఎంత అద్భుతమైన భావం!

శీలతలమనుకునే చంద్రుడు విరహతాపంతో ఉన్న ఆమె శరీరాన్ని దహిస్తున్నాడు. పూలంతటి కోమలమైన మదనుడి బాణాలు, శూలంతో ఆమె శరీరంలో గుచ్చుకుంటున్నాయి.

ఎంత సున్నితమైన శృంగార భావం. ఎంత గొప్పగా విరహవేదనను ప్రదర్శిస్తున్నాడు కవి!

ఇది సినిమా పాటనా?

కాదు ఇది అత్యద్భుతమైన కవిత్వం.

సరస్వతీదేవి పాదాలపైన వాలిన అత్యంత సుందరమైన కుసుమం!

కళకు సార్థకత అది సినిమాలో ప్రదర్శితమయిందా? అన్న దాని వల్లరాదు. ఆ కళాకారుడు ఎంత చిత్తశుద్ధితో కళను ప్రదర్శించాడు అన్నదాని మీదనే ఆధారపడి ఉంటుంది.

మురికి నీళ్ళలో ప్రతిఫలించేటప్పుడు చంద్రుడు తన వెన్నెలను తక్కువ చేయడు కదా!

చంద్రుడు వెన్నెల వెదజల్లటంలో లోపం లేదు. తేడా ఉండదు. తేడా ఆ వెన్నెలను అందుకుని, అనుభవించే వారి హృదయంలో ఉంటుంది.

అలాగే కళాకారుడూ తన కలను చిత్తశుద్ధితో, నిజాయితీగా హృదయ పూర్వకంగా ప్రదర్శించాలి. మిగతాది అందుకునే వారి సంస్కారంపై ఆధారపడి ఉంటుంది.

'ఇవాళ లంచ్ బయట తినేయండి. వంటకాలేదు. అన్నీ నేనొక్కర్తినే చూసుకోవటం ఎలా వీలవుతుంది?' అంది ప్రశాంతి.

'ఏమైంది?' అడిగాడు శరత్.

'కుక్కర్ పాడయింది. రిపేర్ చేయించటం కుదరలేదు. మీరేమో నిన్న ఆలస్యంగా వచ్చారు. నేనే కుక్కరు రిపేరు చేయించాలి. వండాలి. బయటకు వెళ్ళి డబ్బు సంపాదించాలి అంటే ఎలా కుదురుతుంది? ఎవరో ఒకరు సహాయం చేయవచ్చుకదా! మీ రెండుకూ పనికిరారు. ఎదిగిన పిల్లలు ఉన్నారు. వాళ్ళు దేనికీ సహాయానికి రారు. అన్ని తాపత్రయాలు నాకే కదా! ' ఆమె మాటలు వింటూ మౌనంగా తయారయ్యాడు శరత్.

ఇద్దరూ కలిసి బయలుదేరారు.

దారంతా ప్రశాంతి ఏదో మాట్లాడుతూనే ఉంది.

అన్యమనస్కంగా ఆమె మాటలు వింటూ డ్రైవ్ చేశాడు శరత్. అతడి హృదయాంతరాళాలలో 'ఓ నిర్దయీ ప్రీతమ్' పాట ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఏదో అలవికాని ఆనందం, విషాదాలు కలగలసి ఉబికి ఉబికి వస్తున్నాయి.

అన్యమనస్కంగా ఉన్న శరత్ దగ్గరకు ప్రభాకర్ వచ్చాడు. ప్రభాకర్ అతడి కొలీగు.

'శరత్ నీతో మాట్లాడాలి. కాస్త టీ తాగుతూ మాట్లాడుకుందాం' అన్నాడు ప్రభాకర్.

అతడి ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ ఏదో అనబోయిన శరత్, అతని ముఖం చూసి ఆగిపోయాడు.

వర్షించటానికి సిద్ధంగా ఉన్న మేఘాలలా ఉన్నాయి అతడికళ్ళు. ఎంతో ప్రయత్నం మీద భాధను అణచిపెడుతున్నట్టున్నాడు అతడు.

'పద' అన్నాడు శరత్.

బయట హోటల్‌లో ఇంకా పూర్తిగా కూర్చోకముందే ఏడుపు మొదలుపెట్టాడు ప్రభాకర్.

శరత్‌కి ఏమనాలో తెలియలేదు. ఇబ్బందిగా ఉంది.

అంత పెద్ద మనిషి చిన్న పిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడుస్తూంటే ఏం చేయాలో తోచలేదు. పైగా అతడి ఏడుపుకి హోటల్‌లో ఉన్న వాళ్ళు ఈ వైపుకి చూడటం ఇంకా ఇబ్బందిగా ఉంది. అలా చూస్తున్న వాళ్ళల్లో పరిచితమైన ముఖాలు ఉండడం ఆ ఇబ్బందిని తీవ్రం చేస్తోంది.

ఏడుపు ఉధ్రుతం తగ్గిన తరువాత లేచి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చాడు..

కాస్సేపు మౌనంగా శరత్ ఎదురుగా చేతుల్లో ముఖం దాచుకుని కూర్చున్నాడు ప్రభాకర్.

'ఏమైంది?' మృదువుగా అడిగాడు శరత్.

మళ్ళీ ప్రభాకర్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

'నేను ఎవ్వరికీ చెప్పుకోలేను. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందంటారు. అలాగుంది నా పరిస్థితి.' అన్నాడు ప్రభాకర్. మాట్లాడుతూంటేనే అతడి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఎందుకో కారణం తెలియకుండానే ప్రభాకరరావును చూస్తే జాలిగా అనిపించింది. అంత వయసున్న మనిషి పసిపిల్లవాడిలా ఏడవాల్సి రావటం బాధాకరం. ఎందుకంటే మనిషి ఎదుగుతున్న కొద్దీ అనేక అనుభవాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కష్టాలు సుఖాలు అన్నీ అనుభవిస్తాడు. కాబట్టి ఎంతటి విషాదకరమైన పరిస్థితినయినా సంయమనంతో ఎదుర్కోగలుగుతాడు. కనీసం ఇలా అందరి ముందు పట్టుకోల్పోయి ఏడ్చేంత దుస్థితి ఉండకూడదు. కానీ...

'నీకు తెలుసుగా. నాకు ఒక కూతురు ఒక కొడుకు అని...' ఆరంభించాడు ప్రభాకరరావు.

శరత్‌కి తెలియదు.. తనలో ఇదొక లోపం గమనించాడు శరత్. సాధారణంగా ఇతరులు వ్యక్తిగత విషయాలు తెలుసుకుంటారు. ఒకరితో ఒకరు కుటుంబ స్థాయిలో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటారు. కానీ శరత్‌కు ఎవరి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం ఉండదు. అందుకే అనేకులతో అతడి స్నేహం ఆఫీసువరకే పరిమితమైపోతుంది. కానీ తనకు తెలియదని చెప్పకుండా తెలుసన్నట్టు తల ఊపాడు.

మన ఆఫీసులో చాలా తక్కువ మందికి తెలుసు. నా కొడుకు మెదడెదగనివాడు. చిన్నప్పుడు చాలా సతాయించాడు. వాడికి వయసొచ్చింది కానీ ఏమీ తెలియదు. పసిపిల్లవాడిలా చూసుకోవాలి. కానీ వయసు వల్ల అపుడప్పుడు చిరాకు పడతాడు. గోల చేస్తాడు. మా ఇద్దరి బెంగ మా తరువాత వాడు ఏమౌతాడో అనే!

అతడి వైపు పరిశీలనగా చూశాడు శరత్.. ఒక మనిషిని చూసి అతడి మనసులో ఉన్న బాధలు, హృదయానికయిన గాయాలు, అతడి ఎదలోతుల్లో అణగిన తుఫానులు తెలుసుకోవటం అసాధ్యం.

ఇన్నాళ్ళూ ప్రభాకరరావు గురించి ఉన్న అభిప్రాయం ఒక్కసారిగా మారిపోయింది. అతడిపైన జాలి కలిగింది.

ప్రభాకరరావు చెప్తూపోతున్నాడు. 'చిన్నప్పటి నుంచి నా కూతురిని, తమ్ముడి బాధ్యత నీదేనని చెప్తూ పెంచాము. తనని మానసికంగా సిద్ధం చేశాం. కానీ అది డిగ్రీ పూర్తి అవుతూనే ఓ పనికిరాని వెధవ ప్రేమలో పడింది. ఎంతో చెప్పి చూశాం. వినలేదు. ఇంట్లోంచి పారిపోయి పెళ్ళిచేసుకుంది.' చెప్తూంటేనే ప్రభాకరరావు ముఖంలో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. తనని కాదని కూతురు వేరే పెళ్ళి చేసుకున్నదానికన్నా, తమ్ముడి బాధ్యతను విస్మరించి, ఒక మనిషికి సాటి మనిషి మీద ఉండాల్సిన కనీస జాలి దయలను విస్మరించిందన్న బాధ అధికంగా కనిపిస్తోంది.

'అది పారిపోయి పెళ్ళి చేసుకున్న నేను బాధపడలేదు. ఆమె ఇంటర్మీడియెట్ ఫెయిలయి, ఎందుకూ పనికిరానివాడిని పెళ్ళి చేసుకుందని నేను బాధపడలేదు. వాళ్ళిద్దరూ తిండికి లేక బాధ పడుతుంటే నేను తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాను. నిన్నరాత్రి.. ఏదో అల్లరి చేశాడని అది, దాని భర్త ఇద్దరూ కలసి నా కొడుకుని చితకబాదారు. అడ్డువెళ్ళిన తల్లిని తోసేసింది. నా అల్లుడు నాపై చెయ్యి ఎత్తాడు. నేను అందుకూ బాధపడటం లేదు. కానీ నా కూతురు భర్తనే సమర్థించింది. నా ఇంట్లో ఉంటూ నా తిండి తింటూ మా మీదే చెయ్యెత్తారు. అదీ ఎందుకంటే తెలివిలేని నా కొడుకుని కొట్టినందుకు. నేను ప్రొద్దున్నే చెప్తాను ఇల్లొదిలి వేరే వెళ్ళిపొమ్మని.. అదీ బాధ. ఎందుకిలా అయిపోయింది.. నేను పెంపకంలో ఎక్కడా లోపం చెయ్యలేదు. అడిగింది ఇచ్చాను. చదువు చెప్పించాను..' అతడి కంటి నుండి బొటబొటా నీళ్ళు కారుతున్నాయి.

'నేనెందుకు బ్రతకాలి? ఎవరికోసం బ్రతకాలి? నా కూతురి గురించి నాకు బెంగలేదు. దాని బ్రతుకు అది బ్రతుకుతుంది. నా బెంగ నా మెదడెదగని అబ్బాయి.. నా భార్య గురించే. నేను లేకపోతే వాళ్ళిద్దరినీ బ్రతకనివ్వరు. నాకేదైనా హోమ్ ఉంటే చూడు. నా ఇల్లు వాళ్ళకి రాసిస్తాను. బ్రతికి ఉన్నంతకాలం నా కొడుకుని వాళ్ళు చూడాలి. నేను, నా భార్య నా పెన్షన్ మీద బ్రతుకుతాం..' ఏదేదో మాట్లాడుతున్నాడు ప్రభాకర్.

అతడి బాధ అర్థమవుతోంది శరత్‌కి.

సమాజంలో ప్రేమే దైవం అని ప్రచారం చేయటం ఓ గొప్ప పనిలా చలామణీ అవుతోంది. అదీ యువతీ, యువకుల ప్రేమ మాత్రమే దాన్లో తల్లిదండ్రులు ఈ తమ్ముడు, చెల్లెళ్ళ ప్రసక్తిలేదు. కేవలం లైంగిక ఆధారిత స్త్రీపురుష స్వార్థ ప్రేమను దైవంలా ప్రచారం చేస్తున్నారు. దాన్లో ఆలోచనకు తావులేదు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ఎలాంటి ఆశలు పెట్టుకుంటారన్న దానిపై ఆలోచనలేదు.

తల్లిదండ్రులు విలన్లు... దుష్మన్ జమానా.. జాలిమ్ జమానా.. అని ప్రేమను కాదన్న తల్లిదండ్రులను తిట్టటమే అభ్యుదయం. విచక్షణను విస్మరించటమే ప్రోగ్రెస్సివ్.

పెళ్ళికాకపోతే ఒక ప్రేమ పెళ్ళయితే పరపురుషుడితోనో, స్త్రీతోనో ప్రేమ ప్రోగ్రెస్సివ్.

దీన్లో మానవ సంబంధాల ప్రసక్తేలేదు. దాని ఫలితమే ఇది... అనిపించింది శరత్‌కు.

ఇటీవలే ఏదో పత్రికలో ఓ కథ చదివాడు. ఓ అమ్మాయి తండ్రి కుదిర్చిన పెళ్ళిని కాదంటుంది. అది తండ్రికి చెప్పదు. ఓ ఫ్రెండుని చెప్పింది. దాన్ని తన నిర్భయ స్వేచ్ఛ అంటుంది. పనిలేని వాళ్ళు, తెలివి లేని వాళ్ళు, కళ్ళకు గంతలు కట్టుకున్నా వాళ్ళంతా దాన్ని పొగిడేసి ఆకాశానికెత్తేశారు. శరత్‌కు అదే ఆశ్చర్యం అనిపిస్తుంది.

ఇంత ఆలోచనలు లేని మూర్ఖులా, మేధావి రచయితలు? ఏది స్వేచ్ఛ? ఏది విశృంఖలత్వం? ఏది వివక్షణ? ఏది మూర్ఖత్వం? ఏది అభ్యుదయం? ఏది నిజజీవితం? వంటి మౌలిఖమైన విషయాలు తెలుసుకోకుండా విచ్ఛిన్నకరమైన ప్రతిదాన్ని అభ్యుదయమని సమాజాన్ని భ్రష్టు పట్టించటమేనా వీళ్ళ పని?

ప్రభాకర రావును చూస్తే ఏమంటారు?

అతడికి పిల్లలను పెంచటం రాలేదని పిల్లల పెంపకం మీద ఓ లెక్చరిస్తారేమో!

లేచాడు ప్రభాకరరావు.

'సారీ.. థాంక్స్... నాకు తేలికగా ఉంది' అని గబగబా వెళ్ళిపోయాడు. మనిషి పైకి తనకు బోలెడంత మంది స్నేహితులున్నారని భ్రమపడతాడు. కానీ మనిషి ఎప్పుడూ ఒంటరే.

మనసులోని మాటను నిర్భయంగా చెప్పుకొనేందుకు ఓ మనిషిలేని ప్రతిమనిషీ ఒంటరే.

బిల్లు చెల్లించి బయటకు వస్తుంటే శరత్ దృష్టికి ఎటు చూసినా గలగలా నవ్వుతూ, జంటలు జంటలుగా మాట్లాడేస్తూ, ఒకరినొకరు తట్టుకుంటూ సినీనటుల్లా తిరుగుతున్న యువతీ యువకులే కనిపిస్తున్నారు.

వీళ్ళలో ఎంతమంది ప్రేమ నిజమైంది? అసలా వయసులో ప్రేమ అంటే తెలుస్తుందా? వీళ్ళలో ఇంతమంది ఇంటర్నెట్ పోర్న్ సైట్లలో మిగిలిపోతారు? ఎంతమంది ప్రేమలు విఫలమై బండరాళ్ళుగా మారతారు? ఎంతమంది సమాజం మీద ముద్రవేసే స్థాయికి ఎదుగుతారు?

వాళ్ళని చూస్తూంటే శరత్‌కి తన పిల్లలు గుర్తుకు వచ్చారు. అతని మనసు బాధతో నిండింది. వాళ్ళూ ఈ తరం వాళ్ళే. ఏదేమైనా పిల్లలతో సన్నిహితంగా మెలగాలి నిశ్చయించుకున్నాడు శరత్.

**'ఏమైంది మీకివాళ?'** నవ్వుతూ అడిగింది ప్రశాంతి.

ఆమెకి శరత్ వంటింట్లోకి రావటం కొత్తగా ఉంది. దానికి తోడు సహాయం చేస్తాననటం గమ్మత్తుగా ఉంది. అందుకే అడిగింది.

నవ్వాడు శరత్ 'ఏం? నేను వంటింట్లోకి రావద్దా? సహాయం చేయవద్దా? నాకు ఆ మాత్రం హక్కులేదా?' అడిగాడు.

'బాగుంది.. ఇన్నాళ్ళకి గుర్తుకు వచ్చింది మీకు మీ హక్కు. రండి పాటలు వింటూ కూర్చోండి. నా పని నన్ను చేయనివ్వండి. కాలికీ చేయికీ అడ్డుపడకండి' అంది నవ్వుతూ.

'లేదు ప్రశాంతీ.. నాకు ఇవాళే అనిపించింది. అసలు నేను ఏం చేస్తున్నాను? ఎందుకు చేస్తున్నానో అర్థం కావటంలేదని. లేస్తున్నాను. ఆఫీసుకి వెళ్తున్నాను. ఇంటికి వస్తున్నాను. మళ్ళీ లేచి వెళ్తున్నాను. ఏదో సముద్రం ఒడ్డున ఇసుకలో కూచుని ఎగిసిపడే అలలను చూస్తూ కాలికి తడి అంటకుండా ఉంటున్నట్టు ఉంటున్నాను అనిపిస్తోంది. వాడి గురించి తెలియదు. పిల్ల ఇష్టాఇష్టాలు తెలియదు. నీ రోజు ఎలా గడుస్తుందో తెలియదు. నీ బాధలు తెలియవు. ఏదీ తెలియకుండా అందరి నడుమ ఉంటూ కూడా నా ప్రత్యేక ప్రపంచంలో నేనుంటున్నట్టనిపించింది. అందుకే అందరితో కలవాలని నిశ్చయించుకున్నాను. అది ముందు వంటింటితోటే ప్రారంభిస్తున్నాను' అన్నాడు శరత్.

ఆమె నవ్వింది. 'ఇన్నాళ్ళకి మీకు జ్ఞానోదయమైనందుకు నవ్వాలో, ఇప్పుడు కాలికీ వేలికీ మీరు అడ్డుపడతారని ఏడవాలో తెలియటంలేదు. మీరు ఓ రకంగా ఉండటం అలవాటయింది. ఇప్పుడు మరోలా ఉంటే భరించటం కష్టం' అంది.

'అంటే.. నేరస్తుడు జీవితాంతం నేరస్తుడిగానే బ్రతకాలా? వాడికి మంచివాడు అయ్యే అవకాశం ఉండదా? ఎంత క్రూరమైనదీ ప్రపంచం' నటించాడు శరత్.

'చాల్లెండి. పొండి.. మీ తలత్ మహమూద్‌లు, ముఖేష్‌లు పిలుస్తున్నారు. మీ పుస్తకాల పేజీల్లోంచి రచయితల ఆత్మలు మీకోసం ఘోషిస్తున్నాయి. పొండి నన్ను ప్రశాంతంగా పనిచేసుకోనీయండి' బలవంతాన శరత్‌ను వంటింటి నుంచి బయటకు నెట్టింది.

అతడికి తన గదిలోకి వెళ్ళాలనిపించలేదు.

ముందు గదిలో కూర్చుని టీవీ పెట్టాడు.

అంతా కొత్త కొత్తగా ఉంది చానళ్ళు తిప్పుతూంటే..

అన్నీ వెర్రి మొర్రి చేష్టలు, పిచ్చిమాటలు, ప్రతీకారపు పలుకులు, అక్రమ సంబంధాల కులుకులు.. లేకపోతే, చిన్న పిల్లల పెద్దల పాటలు పాడటం, పెద్దలు చిన్నపిల్లల్లా గంతులు... చూడలేకపోయాడు. టీవీ కట్టేశాడు.

నవ్వుకుంటూ వచ్చింది ప్రశాంతి.

'నేను చెప్పానా! మీరీ ప్రవాహంలో ఇమడాలన్నా ఇమడలేరు. పొండి.. మీ ప్రపంచద్వారాలు తెరుచుకుని ఉన్నాయి. మిమ్మల్ని పిలుస్తున్నాయి' నాటకీయంగా అంది. ఆమె వైపు ముగ్ధుడయి చూస్తున్నాడు శరత్.

ఎంత అందంగా ఉంది!

మనిషి భౌతిక రూపం, పైపైని అందం మాత్రమే.

ఎదుట మనిషిని అర్థం చేసుకుని, అతని ఇష్టాఇష్టాలను గౌరవిస్తూండటాన్ని మించిన అందం ఏముంది?

ఆమె తనని విమర్శించవచ్చు. ఈసడించవచ్చు... అదంతా తాను నిర్వహించవలసిన బాధ్యతలను సైతం ఆమెనే నిర్వహించవలసి రావటంవల్ల కలిగిన చిరాకు తప్ప మరోమాట కాదు.

'ప్రశాంతీ' అంటూ ఆమెని దగ్గర తీసుకున్నాడు. 'నువ్వు చాలా మంచిదానివి. నేను నీకు తగినవాడిని కానేమో' అన్నాడు.

వివాహం వ్యక్తుల జీవితాలకు నిర్ణయాత్మక దిశనిస్తుంది. సరైన వ్యక్తితో జీవితం పంచుకోగలగటాన్ని మించిన అదృష్టం మరొకటి లేదు. అలాకాని పక్షంలో, కనీసం అర్థం చేసుకునే వ్యక్తి దొరకటం అదృష్టమే.

కానీ వివాహం వల్ల ఇరువురి జీవితాలు మరొకరికి తగ్గట్టు మారిపోతాయి.

'ఇన్నేళ్ళ తరువాత మీరు అలా అనటం బాగాలేదు. మన జీవితాలు అయిపోయాయి. ఇప్పుడంతా పిల్లల జీవితమే.. మనదేముంది?' అంది ప్రశాంతి అతడినుంచి విడిపించుకుంటూ.

ఆమె వెళ్ళిపోయిన తరువాత ఒక్కడే ఆలోచిస్తూ కూర్చున్నాడు శరత్.

రాత్రి పది దాటుతుండగా స్రవంతి వచ్చింది. 'అమ్మా అలసి పోయాను' అంటూ.

'ఇంత ఆలస్యమయిందేమిటి?' అడిగాడు శరత్.

శరత్ వైపు విచిత్రంగా చూసింది స్రవంతి. 'కంబైన్డ్ స్టడీస్ నాన్నా. అమ్మతో చెప్పాను' అని తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఏం చేయాలో తోచలేదు శరత్‌కు. కాస్సేపు టీవీ చానల్స్ తిప్పాడు.

వంటింట్లో స్రవంతి, ప్రశాంతిలు మాట్లాడుకోవటం వింటూ కూచున్నాడు. నెమ్మదిగా తన గదిలోకి వెళ్ళాడు.

ఎందుకో ఆ పుస్తకాలు, ఆ పాటల సీడీలు చూస్తూంటే ఎప్పటిలాగా ఆనందంగా అనిపించలేదు.

ఇలా ఒంటరిగా పాటలు వింటూ, పుస్తకాలు చదువుతూ జీవితకాలం గడిపేశాడు.

ఆ సమయమంతా ఏమైంది?

చూస్తూ చూస్తూ ముసలివాడయిపోతున్నాడు. పిల్లలు పెద్దవాళ్ళయి తమ నిర్ణయాలు తామే తీసేసుకుంటున్నారు.

ఏమొచ్చింది తనకు? ఏం సాధించాడు తాను?

ఏమైపోయింది సమయం? ఏమైపోయింది జీవితం?

టేప్ 'ఆన్' చేశాడు.

సబ్ కె రహతే లగ్‌తా హై ఇసా, కోయీ నహీ హై మేరా!

సూరజ్ కో ఛూనే నిక్‌లాథా, ఆయా హాథ్ అంధేరా"

అందరూ ఉన్నా తన వారెవరూ లేరు... సూర్యుడిని తాకాలని చేయిచూస్తే, చేతికి అంధకారం అందింది.

దాదాపుగా అందరి జీవితాలు ఇంతేనా?

అయినా తాను ఒంటరి వాడిగా భావించుకోవటం పొరపాటు. తనకి అందరూ ఉన్నారు. వారు తనవారు కాకుండా పోవటంలో వారిదోషం లేదు. దోషం తనదే. ఎందుకంటే, వారిని తనవారుగా చేసుకోవాలని ప్రయత్నించలేదు.

వారు తనని అర్థం చేసుకోవాలని ఆశించాడు..

అంత స్వార్థపరుడా తాను?

హఠాత్తుగా ఆశాభోన్స్‌లే గొంతుతో గది నిండింది.

జీనేకి బహానే లాఖోహై, జౌనా తుఝ్‌కో ఆయాహినహీ..

కోయీభి తెరా హోసంతథి, పడుతూనే అస్నాయా హి నహీ!

జీవించటానికి లక్షకారణాలున్నాయి. కానీ జీవించటం నీకు రాలేదు. ఎవరయినా నీ వారయ్యేవారు, కానీ వారిని స్వీకరించటం నీకు రాలేదు.

ఆ పాట తన వైపే వేలు చూపిస్తున్నట్టనిపించింది శరత్‌కు.

ఈ ప్రపంచంలో మన నిరాశలు, వేదనలన్నీ ఇలాంటివేనేమో!

మనసులో ఆశ ఉంటుంది. కానీ దాన్ని సాధించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయం. కానీ అది అందలేదని నిరాశ చెందుతాం. కుములుతాం.

ప్రయత్నించకుండానే రాని ఫలితం గురించి బాధపడుతూంటాం జీవితాంతం.

'హలో' స్వరం విని తలెత్తి చూశాడు శరత్.

ఆమెని చూడగానే గుర్తుపట్టాడు. శిల్ప!

'మిమ్మల్ని నా పాట కార్యక్రమానికి ఆహ్వానించమని అమ్మ చెప్పింది.'

ఇన్విటేషన్ అందుకున్నాడు శరత్. ఆరోజు సాయంత్రమే. 'తప్పకుండా వస్తాను' అన్నాడు.

'థాంక్స్' అంది వెళ్ళిపోయింది.

ఏదో ఒకటి చేసి ఆమెతో ఇంకాస్సేపు మాట్లాడాలనిపించింది శరత్‌కు. కానీ ఏం మాట్లాడాలో తెలియలేదు.

ఆమె అటు వెళ్ళగానే పక్కనుండి సుగంధం వచ్చింది. చూశాడు. మాధవి వచ్చింది.

'ఏంసార్.. వెళ్తున్నారా పాటకి?' అడిగింది.

'ఏమో చెప్పలేను' అన్నాడు శరత్. ఆ రోజు హోటల్‌లో కలిసిన తరువాత ఆమె మళ్ళీ మాట్లాడటం ఇదే

'జాగ్రత్త. ఆమె గొంతు ఎంత మంచిదో, ప్రవర్తన అంత మంచిదికాదు' అనేసి శరత్ రియాక్షన్ కోసం ఎదురుచూడకుండా 'హాయ్ శిల్పా' అంటూ వెళ్ళింది.

'మానవ మనస్సులు, మానవ సంబంధాలు ఎంతో గమ్మత్తయినవి' అనుకున్నాడు శరత్.

'ఈ ఆదివారం అందరం పిక్నిక్‌కి వెళ్దాం. మా ఆఫీసులో ఒకాయనకి ఫార్మ్‌హౌస్ ఉంది. కొందరిని ఫామిలీస్‌తో రమ్మన్నాడు. వెళ్దాం' అన్నాడు శరత్.

తాను తన పిల్లలకు ఎంత దగ్గరవ్వాలని ప్రయత్నిస్తే, వారు అంత దూరం పారిపోవటం గమనిస్తున్నాడు శరత్. అంతేకాదు, తాను దగ్గర ఉంటే, ఇబ్బంది పడుతున్నట్టు, ముళ్ళమీద ఉన్నట్టు ఉంటున్నారు.

తనకు, వారికీ నడుమ ఏదో ఇనుపతెర అడ్డున్నట్టుంది. అంతేకాదు, తనకూ ఇతర ప్రపంచానికీ నడుమ ఏదో ఛేదించలేని గోడ అడ్డుగా ఉన్నట్టనిపిస్తోంది శరత్‌కు.

'ఎలా ఏర్పడిందీ అడ్డుగోడ? ఎందుకు ఏర్పడింది?' ఎంత ఆలోచించినా అర్థంకావటంలేదు.

పిక్నిక్ మాట శరత్ ఎత్తగానే స్రవంతి మూతి ముడిచింది. సుమంత్ పెదవి విరిచాడు.

'నాన్నా, ఆ రోజు నాకు ఫ్రెండ్స్‌తో ప్రోగ్రాం ఉంది' అన్నాడు.

'నా ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ ఉంది నాన్నా. ఓన్లీ మేం ఫ్రెండ్స్ ' అంది స్రవంతి.

'ఎక్కడమ్మా పార్టీ?' తనకు కలిగిన నిరాశ పైకి కనిపించకుండా అడిగాడు.

శరత్ ఎప్పుడూ వినని పేరు చెప్పింది. అది తనకు అలవాటైన హోటల్‌లాంటిది కాదు, యువతకు నచ్చే 'మీటింగ్ ప్లేస్' అని శరత్ గ్రహించాడు.

'అటునుంచి సినిమాకి వెళ్తాం నాన్నా. సాయంత్రం ఇంటికి వస్తాం. నా క్లోజ్ ఫ్రెండ్ నాన్నా' అంది స్రవంతి.

'అయితే ఓ పని చేద్దాం. మీరిద్దరూ సాయంత్రం దాకా రారు కాబట్టి, నేనూ అమ్మా వెళ్తాం. ఏం ప్రశాంతి?' అడిగాడు శరత్.

ఇబ్బందిగా చూసింది ప్రశాంతి.

'ఆదివారం లలితా సహస్రనామాలు చదవాలని అనుకున్నాం. నేను వస్తానని మాటిచ్చాను. ప్రొద్దుటి నుంచి సాయంత్రం దాకా ఉంటుంది' చెప్పింది.

నవ్వాడు శరత్.

'నో ఫామిలీ... నో పిక్నిక్.... నేనూ వెళ్ళను..' అన్నాడు.

మరింత ఇబ్బందిగా చూసింది ప్రశాంతి.

'ఏమిటి?' అడిగాడు.

'ఆ రోజు ఫ్రెండ్సంతా ముందు మన ఇంటికి వస్తారు. మీరు ఉంటే ఇబ్బందిగా ఫీలవుతారు' అంది.

పెద్దగా నవ్వాడు శరత్. 'ఓకే. ఆ రోజు ఇంట్లో ఉండద్దు. బయటకు పొమ్మంటావు అంతేనా?' అడిగాడు.

'మీరు ఎంత బాగా అర్థం చేసుకుంటారండీ మమ్మల్ని' అంది ప్రశాంతి.

అందరూ నవ్వారు. అందరితో తాను నవ్వాడు కానీ శరత్‌కు ఎలాగో అనిపించింది.

ఆదివారం ప్రొద్దున్నే లైబ్రరీకి బయలుదేరాడు శరత్.

అదేమిటో.. వెళ్ళటానికి ఒక్క ఫ్రెండు ఇల్లులేదు. ఎవరితోను 'ఈ ఆదివారం మనం కలిసి తిరుగుదాం' అనో 'మీ ఇంటికి వస్తాను' అనేంత సాన్నిహిత్యం లేదు. సినిమాకు వెళ్ళలేడు.

ఒక్క లైబ్రరీలోనే గడపగలడు.

వెళ్ళి లైబ్రరీలో సంగీతానికి సంబంధించిన పుస్తకాలుండే చోటు వెతికాడు. పండిట్ వి.ఆర్. పట్వర్ధన్ రాసిన 'రాగ్ విజ్ఞాన్' పుస్తకం కనిపించింది. తీసుకున్నాడు. తనకు సంగీత పరిజ్ఞానం సరిగ్గా లేకపోవటం శరత్‌ను ఎంతగానో బాధిస్తుంది. చిన్నప్పుడు స్కూలుకి వెళ్ళి చదువుకునేందుకు ఫీజు కట్టటమే గగనంగా ఉండేది. ఇక వేరే ఏదన్నా నేర్చుకోవటం అన్న ఆలోచనే రాలేదు.

డబ్బులు సంపాదించే సరికి బాధ్యతలు ఎదురుచూస్తున్నాయి.

ఇప్పుడు ఆనందించగలడు వింటూ. కానీ సంగీత పరిజ్ఞానం సాధించలేడు. ఏదైనా చేయాలి. సాధించాలనే తపన, ఉత్సాహాలు అడుగంటాయి. ఈ జీవితం ఇలా జరిగిపోతే చాలన్న నిర్లిప్తత, నిరాసక్తతలు ప్రవేశించాయి. కానీ సంగీతాన్ని వివరించే పుస్తకం దొరికితే చదవకుండా ఉండలేడు.

పుస్తకం చదువుతూంటే పలురకాల ఆలోచనలు శరత్ మనస్సులో కదలసాగాయి. భారతీయమైన ఆలోచన ఏదైనా దైవం, ఆధ్యాత్మకతలతో ముడిపడి ఉంటుంది. ఎలాంటి ఆలోచన అయినా విశ్వసృష్టికారుడి స్వరూపాన్ని దర్శించాలన్న, తపన అతడి గురించి తెలుసుకోవాలన్న ప్రయత్న ఫలితమే అనిపిస్తుంది. ఎవరో అతడి ఎదురుగా కూర్చున్నట్టు అనిపించింది. పట్టించుకోలేదు. ఒక అధ్యాయం పూర్తయిన తరువాత మరో అధ్యాయం ఆరంభించే ముందు ఆగాడు. ఎదురుగా చూశాడు.

అతడి వైపే చూస్తున్న శిల్ప కనిపించింది.

ఏమనాలో తోచలేదు అతడికి. నవ్వాడు.

ప్రతిగా నవ్వింది. 'మీరు కార్యక్రమానికి రాలేదు?' అడిగింది.

'వేరే పని ఉండటంతో రాలేదు.' అన్నాడు శరత్ ఏమనాలో తెలియక.

'మీకు సంగీతం అంత ఇష్టమా?' పుస్తకం వైపు చూస్తూ అడిగింది.

నవ్వాడు శరత్ సమాధానంగా.

'మీరు పాడగలరా?' అడిగింది.

'లేదు.. విని ఆనందిస్తాను అంతే..' అన్నాడు.

'లంచ్ సమయం అయింది.. వెళ్ళరా?' అడిగింది లేస్తూ.

ఆమె లైబ్రరీకి పుస్తకాలు మార్చుకోవటానికి వచ్చిదని, తనని చూసి ఈవైపుకు వచ్చిందనీ అర్థమయింది శరత్‌కి.

'లేదు.. నేను రోజంతా ఇవాళ ఇక్కడే. భోజనం చేసి వచ్చి కూర్చుంటాను మళ్ళీ అన్నాడు.

'అయితే రండి.. నేనూ భోజనం చేయాలి..' అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా బయటకు దారి తీసింది.

శరత్‌కు ఏమనాలో తోచలేదు. ఇది అనూహ్యమైన పరిణామం. కానీ ఆమె నడుస్తూనే ఉంది. అతడు వస్తున్నాడో, లేదో చూడటంలేదు.

వెళ్ళాలో, వద్దో తెలియటంలేదు శరత్‌కు.

చివరికి లేచాడు. ఆమెను అనుసరించాడు.

‘రెండు మీల్స్‘ ఆర్డరిచ్చింది.

ఆ హోటల్, అక్కడి వాతావరణం చూస్తూంటే ఐశ్వర్యం ఉట్టిపడుతున్నట్టు అనిపిస్తోంది శరత్‌కు.

ప్రతి టేబుల్ దగ్గర మినరల్ వాటర్ బాటిళ్ళున్నాయి.

ఇలాంటి ఖరీదయ్యైన తిండి తింటుంటే ఏదో తెలియని నేరభావన అతడిని ఆవరిస్తుంది. బయట తిండికి లేనివాళ్ళు కోకొల్లలుగా ఉన్నారు. ఇక్కడ అందరూ తినే తిండికోసం ఇన్ని డబ్బులు ఖర్చు పెట్టటం నేరంలా అనిపిస్తుంది.

పైగా, వందరూపాయలు సంపాదించటానికి ఎందరో ఎంతో కష్టపడుతూంటే, ఇక్కడ తాను వందలు వందలు ఖర్చుపెడుతూండటం ఎలాగో అనిపిస్తుంది. ఇలా అవసరం కన్నా ఎక్కువ తిని మళ్ళీ దాన్ని వదల్చుకోవటం కోసం వ్యాయామాలు, డాక్టర్ల మందులు అవసరం అవాల్సి రావటం బాధకలిగిస్తుంది.

తనకి ఎంత కావాలో తెలుసుకోలేని మనిషికి ఎంత తెలివి ఉండి ఏం లాభం? అనిపిస్తుంది.

‘ఏమిటాలోచిస్తున్నారు?‘ అడిగింది శిల్ప.

‘ఏమీలేదు. ‘ నవ్వాడు.

‘అమ్మ మీ గురించి చెప్పింది. చాలా మంచి వారని చెప్పింది. ఎవరిజోలికి వెళ్ళారని, అనవసరంగా ఎవరినీ ఏమీ అనరని, బాగా చదువుతారని, చక్కగా ఆలోచిస్తారని చెప్పింది.‘

నవ్వాడు శరత్ ‘మీరు ఇప్పుడు చెప్పినవన్నీ మంచితనానికి అనర్థమైన విషయాలు‘ అన్నాడు.

శిల్పకూడా నవ్వింది. ‘నేనూ మీలాగే. నాకు అనిపిస్తుంది, జీవితంలో ఏదైనా ఒక విషయం గురించి తీవ్రమైన తపన, విజన్ లేని వారికి ఇతరుల విషయాలు తెలుసుకోవటంపై ఆసక్తి ఉంటుంది. ఎవరేం చేస్తున్నారు, ఏం అనుకుంటున్నారు వంటి అప్రస్తుతం, అప్రధానమైన విషయాలపై ఆసక్తి ఉంటుంది. ఏదో విషయంపై ఎంత తీవ్రమైన తపన అంటే, మిగతా ప్రపంచమంతా అదృశ్యమైపోయేంత తీవ్రమైన తపన ఉంటుందో.. వాళ్ళకు ఇతర ప్రపంచం అనవసరం ఉండదు‘ అంది.

‘మీ విషయంలో అది కరెక్టేనేమో. నా విషయంలో అది తప్పు. నాకే విషయంపై తీవ్రమైన తపనలేదు. నేను ఏ విషయంలోనూ ప్రావీణ్యం సాధించలేదు‘ అన్నాడు. ఆమె ఏదో అనబోయింది. ఇంతలో రెండు పెద్ద కంచాలు, వాటి నిండుగా గిన్నెలు తెచ్చి పెట్టాడు వెయిటర్.

అప్పడాలు, పూరీలు నిండిన బుట్ట తెచ్చిపెట్టాడు.

శరత్ మనసు మూల్గింది. ఇన్ని ఐటమ్స్‌కూ న్యాయం చేయలేడు. వాటి ఖర్చుకూ న్యాయం చేయలేడు.

చుట్టూ చూశాడు.

అందరూ సంతోషంగా ఉన్నారు. నవ్వుతూ మాట్లాడుతున్నారు. వేరెవరికీ లేని ఆలోచనలు, అభ్యంతరాలు తనకెందుకు?

హఠాత్తుగా శరత్‌కి ఓ ఆలోచన వచ్చింది.

తనకూ ప్రపంచానికి మధ్య అడ్డు తెరని ఎవరో నిర్మించినది కాదు. తన మనస్సు, తన స్వభావం నిలిపింది.

ఆ అడ్డుతెర అలా ఉండాలని తన ప్రకృతి నిర్దేశించింది. దాన్ని తాను ఏమీ చేయలేడు. తన స్వభావం నిర్మించిన తెరను ఛేదించిన వారు తనకు సన్నిహితమౌతారు. దాన్ని ఛేదించలేని వారు ఎంత సన్నిహితమయినా తెరకు ఆవలనే ఉండిపోతారు. ఎంత సన్నిహిత సంబంధమయినా తెరకావలనే తప్ప ఆ తెరను దాటి రాలేరు.

ఎవరయినా ఆ తెరను దాటివస్తారు? లేక, జీవితాంతం తనిలాగే తెరకు ఇటువైపు, ప్రపంచం ఆ వైపుగా మిగిలిపోతుందా?

'ఏమిటీ.. ఏం తినాలా అని ఆలోచిస్తున్నారా?' తిండి పదార్థాల వైపు చూస్తూ, ఏం చెయ్యాలో తెలియనట్టు కూర్చున్న శరత్‌ని అడిగింది శిల్ప.

'ప్రాబ్లమ్ ఆఫ్ ప్లెంటీ గురించి ఆలోచిస్తున్నాను' అన్నాడు శరత్.

'అదేమిటి?' అడిగింది శిల్ప.

'ఇక్కడ చూడండి.. ఎంతెంత ఆహారమో.. అదే బయట అడుగుపెట్టగానే, అడుక్కునేవాళ్ళు, ముసలివాళ్ళు, పిల్లలు.. చిన్న పిల్లలనెత్తుకున్నవాళ్ళు.. వాళ్ళకి భవంతులు, భవంతుల లోపల ఉన్న తిండి పదార్థాల గురించి ఊహ అయినా ఉంటుందా? వీటన్నిటిని చూస్తూ, వాళ్ళ మనసుల్లో ఎలాంటి భావాలు మొదలవుతాయో అనిపిస్తుంది. ముఖ్యంగా, పసిపిల్లలు.. వాళ్ళకి ఏమీ తెలియదు. రోడ్లమీద అడుక్కుంటూ, చిల్లరకోసం తపన పడుతూ, అదే సమయానికి కార్లలో వెళ్ళే తమ వయసువారిని చూస్తూ వాళ్ళేమనుకుంటారో అనిపిస్తుంది. నిజానికి మనిషికి ఎంత కావాలి? అవసరమైన దానికన్నా ఎక్కువ తిని బుర్రలు పెంచుకుని కరిగించుకోవటానికి కష్టపడి, రోగాలు తెచ్చుకుని..' శిల్ప ప్లేటుని పక్కకు తోసేయటంతో ఆగిపోయాడు శరత్ 'సారీ' అన్నాడు.

శిల్ప మాట్లాడలేదు. మౌనంగా చుట్టూ చూస్తూ కూర్చుంది.

'అందుకే నాకెవరూ ఫ్రెండ్స్ లేరు. నేను ఎవరితో కలవలేను. ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియదు. ఎప్పుడు ఏమాలోచించాలో తెలియదు' నొచ్చుకుంటూ అన్నాడు శరత్.

నిజంగానే అతడికి బాధగా అనిపించింది. 'ఎందుకో ఈ అమ్మాయి దగ్గర మాట్లాడాలనిపించింది. ఎక్కువ మాట్లాడేశాను' అనుకున్నాడు.

'నాకూ ఒకోసారి అనిపిస్తుంది, మనిషికి ఎంతకావాలి? ఏం కావాలి? అన్నది తెలియదు. ఒక జంతువుకి ఆ బాధలేదు. ఒక పశువుకి లేదు. ఒక పక్షికి లేదు. చీమకు లేదు. దోమకు లేదు. కానీ తెలివి ఉన్న మనిషికే ఈ బాధలు' అంది. శరత్ మాట్లాడలేదు.

'మనుషులు తమ కళ్ళకు కనబడుతున్నదే నిజమనుకుంటారు. కానీ వాళ్ళు నిజమని అనుకుంటున్నదానికి వెనుక కళ్ళు చూపించేదేకాదు, వాళ్ళ మెదడు ఊహించేదీ ఉందని గ్రహించరు. ఆ మెదడు ఊహ వెనుక వాళ్ళ భయాలు, సందిగ్ధాలు, అభద్రత భావాలు, అపోహలు అన్నీ ఉంటాయని గ్రహించలేరు. కానీ తమ ఆలోచననే నిజమని అనుకుంటారు' అంది శిల్ప.

ఆమె వైపు తలెత్తి చూశాడు శరత్.

'అందరూ నేను పెళ్ళయిన తరువాత మొగుడిని వదిలేశానని చెప్పుకుంటారు. వాడే నన్ను వదిలి పారిపోయాడని ఇంకొందరంటారు. కానీ, ఏం జరిగిందో తెలిసింది ఇద్దరికే నాకూ, ఆయనకు. ఆయన అందరికీ చెప్పుకుని తిరుగుతారు. నేను ఎవరికీ ఏమీ చెప్పను.' నవ్వింది.

'సారీ.. ఇప్పుడు మనం ఆర్డరిచ్చి తినకపోతే, పదార్థాలు వ్యర్థం అవటమే కాదు డబ్బు కూడా వేస్టవుతుంది.' అన్నాడు.

ఇద్దరూ మౌనంగా తినటం ప్రారంభించారు.

ఇంతలో కిలకిలా నవ్వుతూ అబ్బాయి, అమ్మాయిల గుంపు హోటల్‌లోకి వచ్చింది. చీకూ చింతాలేకుండా నవ్వుతూ తుళ్ళుతూ వాళ్ళు టేబుళ్ళని ఆక్రమించారు. హోటలంతా గోలగోలగా తయారయింది.

వాళ్ళల్లో ఒకడు 'హేపీ బర్త్‌డే టూయూ' అని పాట అందుకున్నాడు. అందరూ అదే పాట అందుకున్నారు.

తాము ఎంతో ఆనందిస్తున్నట్టు ప్రపంచానికంతా తెలియాలన్నట్టుంది వాళ్ళ ప్రవర్తన. శరత్ మనసులో తన కూతురు స్రవంతి మెదిలింది.

'నా ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ ఉంది నాన్నా, ఓన్లీ మేం ఫ్రెండ్స్' స్రవంతి మాటలు గుర్తుకువచ్చాయి.

స్రవంతి కూడా ఇలా 'ఓన్లీ ఫ్రెండ్స్' అంటే అబ్బాయిలు, అమ్మాయిలతో పార్టీ చేసుకుంటూంటుందా?

ఆ వయసులో మనసులో ఎలాంటి భావనలు లేకుండా అబ్బాయిలు, అమ్మాయిలు కలవటం సాధ్యమా?

'మీ అమ్మాయి గుర్తొచ్చిందా, వాళ్ళని చూస్తుంటే?' అడిగింది శిల్ప.

ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు శరత్ 'మనుషుల మనస్సుల్లో మాటలు గ్రహించేశక్తి ఉందా మీకు?' అడిగాడు.

అందంగా నవ్వింది శిల్ప.

'నేనూ, రామ్ ఎప్పుడు ఇలా బయటకు వచ్చినా, ఓ అబ్బాయి, అమ్మాయిని కనిపిస్తే భరించలేకపోయేవాడు. నేను పెళ్ళికి ముందు ఇలా హోటళ్ళకు, వాటికీ తిరిగానని ఊహించుకుని బాధపడేవాడు. కాస్సేపటికి తన ఊహనే నిజమని అనుకునేవాడు. ఎవరెవరితో ఎలా ఎలా ఎంజాయ్ చేశానో చెప్పమని వేధించేవాడు.'

శరత్ మెల్లిగా అన్నాడు 'అసూయ అనేది మనుషుల మౌలిక లక్షణం. స్త్రీలకయినా, పురుషులకయినా. చిన్నపిల్లల్లో కూడా ఉంటుంది. మీరు వేరే పిల్లవాడిని దగ్గర తీయండి. తననీ దగ్గర తీసుకోమని పిల్లవాడు పరుగెత్తుకు వస్తాడు. కొందరు అసూయను అదుపులో పెట్టుకుంటారు. కొందరు పెట్టుకోలేరు. అది తేడా.'

శరత్ వైపు నిశితంగా చూసింది శిల్ప. 'మీరన్నది నిజమే. నాకు కూడా రామ్ వేరే అమ్మాయిల వైపు చూస్తే ఓరకంగా అనిపించేది. వారి శారీరక లావణ్యాన్ని పొగుడుతుంటే కోపం వచ్చేది. కానీ..'

'మీ అసూయను మీరు అదుపులో పెట్టుకున్నారు. అతడు అదుపులో పెట్టుకోలేకపోయాడు.'

'కావచ్చు.. కానీ, ఒకరు అనుక్షణం మిమ్మల్ని అనుమానంగా చూస్తూ, విమర్శిస్తూ ఉంటే ఎలా ఉంటుందో ఊహించండి.'

'ఊహించగలను. కానీ వ్యక్తుల నడుమ సాన్నిహిత్యం పెరిగి, అవగాహన పెరిగితే ఈ అసూయ అణగిపోతుంది. అపార్థాలు తొలిగిపోతాయి. అవగాహన పెరుగుతుంది. పెళ్ళయిన కొత్తల్లో ప్రశాంతిని ఆఫీసు దగ్గర దింపిన తరువాత చిత్రహింసను అనుభవించేవాడిని. తను ఏక్టివ్‌గా ఎలర్ట్‌గా ఉండే కాలమంతా ఆఫీసులో కొలీగుల నడుమ గడుపుతుంది. తనకి ఆఫీసులో ఎలాంటి సమస్య వచ్చినా కొలీగులే తీరుస్తారు. ఆమె ఆఫీసు జీవితం నాకు సంబంధం లేదు. అప్పుడామె నా భార్యనే కానీ నాదికాదు. రోజుకి ఎనిమిది తొమ్మిదిగంటలు ఆఫీసు, ఏడుగంటలు నిద్ర, మిగతా సమయం ఇంటి పనులకు పోతే భార్య భర్తల నడుమ అనుబంధం, అవగాహనలు దృఢతరమెలా అవుతాయి? అసూయలు, అపోహలు ఎలా తొలుగుతాయి? ఈ ఆలోచనతో పెళ్ళయిన కొత్తల్లో సతమతమయ్యాను. తరువాత ఇద్దరం వీలయినంత సమయం కలసి గడపాలని నిర్ణయించుకున్నాం. నెమ్మదిగా అసూయలు ఆవిరైపోయాయి. అపోహలు అదృశ్యమయ్యాయి. సంబంధం ధృడతరమయింది. ఇప్పుడామెని ఆఫీసు కొలీగు బండిమీద ఇంటికి తెచ్చి దింపినా ఏమీ అనిపించని స్థితికి చేరుకున్నాను' చెప్పాడు శరత్.

ఆలోచిస్తూ కాస్సేపు మౌనంగా ఉంది శిల్ప. తరువాత మెల్లిగా అంది.

'మీరన్నది నిజమేనేమో! ఇప్పుడు భార్యాభర్తలిద్దరికీ కూర్చుని తీరికగా మాట్లాడుకునే తీరికలేదు. అపోహలను తొలిగించుకుని అవగాహన పెంచుకునే సమయం లేదు. నా ఫ్రెండు పెళ్ళయిన నెలలో గర్భవతి అయింది. పిల్లవాడు పుట్టుకొచ్చాడు. మళ్ళీ సంవత్సరం మళ్ళీ గర్భవతి అయింది. మరో పిల్లవాడు పుట్టాడు. ఇక ఆమె ప్రపంచమంతా పిల్లలే అయ్యారు. భార్యాభర్తలిద్దరూ కలసి పట్టుమని పదినిమషాలు మాట్లాడుకోలేదు పెళ్ళయి ఇన్నేళ్ళయినా..' అంది.

తల ఊపాడు శరత్.

'మా తరం ఒకరకంగా అదృష్టవంతమయిన తరం. సినిమాలు, నవలలు ఇన్ని ఊహలు రొమాన్టిక్ ఆలోచనలు అణచుకుని నిజజీవితంలో బ్రతకటం అలవాటు చేసుకున్నాం. కానీ తరువాత తరాలలో స్వార్ధం పెరిగింది. పెద్దలంటే గౌరవం పోయింది. వ్యక్తిగతానికి ఇచ్చిన ప్రాధాన్యం సమిష్టికి ఇవ్వటం తగ్గింది. ఐ మానవ సంబంధాలపైనే కాదు. సాంసారిక బంధాలపైన కూడా ప్రభావం చూపుతోంది. వ్యక్తులతో అసంతృప్తి, ప్రేమరాహిత్య భావన వినాశనకారి అయ్యే స్థాయికి పెరుగుతోంది.'

'బహుశా నాకూ, రామ్‌కీ నడుమ అదే జరిగి ఉంటుంది. నాకు నృత్యం ప్రాణం. నేను చదివిన గ్రంధాలు, చూసిన సినిమాలు నాలో ఓ రకమైన రొమాంటిక్ భావనలు కలిగించాయి. రామ్ అనుభవాలు, ఆలోచనలు అతని రొమాంటిక్ ఆలోచనలు నాకు భిన్నమైన రీతిలో ఏర్పరచాయి. ఇద్దరం కలసి కూర్చుని ఒకరి మనసులోని భావాలు మరొకరికి చెప్పుకుని అర్ధం చేసుకునే ఓపిక, తీరిక, పరణితులు లేకపోవటం వల్ల బహుశా మేము విసిగిపోయామేమో' ఆలోచిస్తూ అంది శిల్ప.

'అందుకు బాధపడుతున్నారా?' అడిగాడు శరత్.

'ఏమో చెప్పలేను. మన కథల్లో, సినిమాల్లో తాళి తెంపి, భర్తను వదిలేసి వచ్చే మహిళను గ్లోరిఫై చేస్తూ చూపిస్తారు. ఆమె విజేత అని పొగుడుతారు. అవి చదువుతుంటే, ఆ సినిమాలు చూస్తుంటే నవ్వొస్తుంది. పెళ్ళి కాకుండా ఒంటరిగా ఉండటం వేరు. పెళ్ళయి భర్తతో వేరుపడి ఒంటరిగా ఉండటం వేరు.' అంది.

'ఎలా?' అడిగాడు శరత్.

నవ్వింది.

'పెళ్ళికాకముందు ఏవేవో ఊహలు కలలు ఉంటాయి అమ్మాయికి. పెళ్ళయిన తరువాత అవన్నీ తాను పెళ్ళిచేసుకున్న వ్యక్తి పరిధిలోకి ఒదిగింపచేయాల్సి వస్తుంది. కానీ, మగవాడి దృష్టిలో పెళ్ళికాని అమ్మాయిపై ఉన్న గౌరవం పెళ్ళయి ఒంటరిగా ఉంటున్న మహిళపై ఉండదు. మగవాడి దృష్టిలో ఆడవాళ్ళు లైంగిక సౌఖ్యాలు అందించే వస్తువులే పెళ్ళయినా, కాకున్నా కానీ పెళ్ళయి ఒంటరిగా ఉంటుందంటే ఎంతో చులకన. ప్రతి ఒక్కడూ ఆశ పడేవాడే చిన్న సహాయం చేసి తాను చెప్పినట్టు వినమని నిర్బంధించే వాడే ఎవడికి వాడు సానుభూతి చూపుతూ 'అవకాశం' కోసం ఎదురు చూసేవాడే ఇలాంటి సమయాల్లో అనిపిస్తుంది, ఒక్క మొగుడని వాడుంటే, వాడు ఎలాంటి వాడయినా ఉండే గౌరవం, భద్రతలు వేరు. వాటి కోసం వాడిని భరించటమా, లేక, తుఫానులో ఎండుటాకులాంటి పరిస్థితిని ఎదుర్కోవటమా? ఏది మంచిది? అని అప్పుడప్పుడు ఆలోచిస్తూంటాను' అంది.

'నాకు తెలుసు ఇలాంటి బాధ. దీనికి తోడు, భర్తతో వేరు పడటాన్ని తమలో ఏదో లోపంగా భావించి మహిళలు తాము ఇతరులకే మాత్రం తీసిపోమని, తాము ఇంకా ఆకర్షణీయంగా ఉన్నామని, భర్త లేకపోయినా తాము ఏ లోటూ లేకుండా ఉన్నామని నిరూపించుకోవాలని తపన పడతారు. మగవారు తమ నుంచి ఏదో ఆశిస్తూ చుట్టూ తిరగటం వారికి సంతృప్తినిస్తుంది. మగవాళ్ళ మనస్సుల్లో ఏముందో కూడా తెలిసి ఒక స్థాయి వరకూ దగ్గరకు రానిస్తారు. తరువాత దెబ్బతిన్నట్టు బాధపడతారు. నాకు తెలిసిన ఒకామెకు వారానికో అన్న, నెలకో తమ్ముడు దొరుకుతూంటారు. ఎవరితోనూ ఆమె స్నేహం దీర్ఘకాలం కొనసాగదు. చూసేవాళ్ళు ఏవేవో ఊహిస్తారు. కానీ జాలిపడటం మినహా మరేం చేయలేము' అన్నాడు శరత్.

'నేను ఆయన అనుమానాన్ని, అసూయను భరించాను. కానీ నా పాటను దూషిస్తే భరించలేకపోయాను. కృష్ణ రాధల రాసకేళిలో బూతును, లైంగికతను చూస్తే సహించలేకపోయాను. పదిమంది ముందు గొంతెత్తి అలాంటి పాటలు పాడితే, మా ఇద్దరి మధ్య సెక్స్ సంబంధం లేదని, అతడు నన్ను సంతృప్తి పరచలేకపోతున్నాడని అందరూ భావిస్తారని, నేను కోరుకుంటున్నది అదేనని

అన్నప్పుడు మౌనంగా ఉండలేకపోయాను. ఇప్పుడు ఆలోచిస్తే నేనే తొందరపడ్డానేమో అనిపిస్తుంది. అప్పుడు ఒక్కడి అనుమానాన్నే భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతి ఒక్కడి ఆశను, అనుమానాన్ని భరించాల్సి వస్తోంది' అంది.

మాటల్లో భోజనం ముగించారు.

బర్త్‌డే పార్టీ పిల్లల గోల తీవ్రంగా ఉంది. ఇద్దరూ ఆవైపు చూస్తూ మౌనంగా ఉన్నారు.

వెయిటర్ బిల్లు తెచ్చి పెట్టాడు.

శిల్ప తీసుకునే లోగా శరత్ తీసుకున్నాడు.

'నేను మిమ్మల్ని లంచ్‌కి పిలిచాను' అంది శిల్ప.

'నేను ఇప్పుడిస్తాను. మీరు మరోసారి ఇవ్వండి' అన్నాడు శరత్.

'అంటే మరోసారి నాతో లంచ్ చేయాలని ఉందా?'

నవ్వాడు శరత్' మీతో లంచ్ కన్నా మీతో మాట్లాడటం బాగుంది. లంచ్ నెపంతో మీతో మాట్లాడవచ్చన్న ఆశ ఉంది.' అన్నాడు.

అప్పుడు గమనించాడు, ఆ హోటల్ లో మంద్రస్థాయిలో హిందీ సినిమా పాటలు వినిపిస్తున్నాయి. ఇద్దరూ ఒకేసారి విన్నారు ఆ పాటని.

యూన్ హి తుమ్ం ముఝ్ సె బాత్ కర్ హో

యా కొయీ ప్యార్ కా ఇరాదా హై"

ఒకరి వైపు ఒకరు చూసుకున్నారు.

ఆమె కళ్ళల్లోకి చూస్తూ మైమరచిపోయాడు శరత్

అంతలో అతడి మనసులో ఎక్కడో చదివిన ఓ కొటేషన్ మెదిలింది.

'మగవాడి శరీరానికి వయసు పెరుగుతుంది కానీ మనసుకు వయసుండదు. అది ఎల్లప్పుడూ ప్రేమ కోసం తపించి ఎదురు చూసే పదహారేడేళ్ళ పిల్ల వాడి వయసులోనే ఉంటుంది. '

శరత్ నవ్వాడు.

'ఎందుకు నవ్వుతున్నారు?' అడిగింది శిల్ప లేస్తూ.

'ఏమీ లేదు' అన్నాడు.

'ఇప్పుడెటు?' అడిగింది.

'నేను లైబ్రరీకే... మీరు?'

'నాకు రిహార్సల్ ఉంది. వస్తారా?'

తల అడ్డంగా ఊపాడు శరత్. 'మీ ప్రపంచంలోకి అడుగిడాలంటే భయంగా ఉంది. నా ప్రపంచంలోనే ఉంటాను' అన్నాడు.

'ఛాయిస్ మీదే బై.. థాంక్స్ ఫర్ ఎవ్రీథింగ్' అంది.

ఆమె వెళ్తూ వెళ్తూ వెనక్కి తిరిగి చూసింది.

జేబులోంచి డబ్బులు తీసి బయట అడుక్కుంటున్న ముసలామెకి ఇస్తున్నాడు శరత్.

ఆఫీసులో అందరికీ స్వీట్లు పంచుతున్నాడు అప్పారావు.

'ఏమిటీ విశేషం?' అడిగాడు శరత్.

'మా అబ్బాయికి క్యాంపస్ సెలక్షన్ వచ్చింది. సారీ ఎబౌట్ యువర్ సన్' అన్నాడు అప్పారావు.

శరత్‌కి అర్ధం కాలేదు.

'ఇప్పుడేంటి క్యాంపస్ సెలక్షన్? ఎప్పుడో అయిపోయింది కదా? మా అబ్బాయి సెలక్టయ్యాడు. సారీ ఎందుకు?'

శరత్ వైపు విచిత్రంగా చూశాడు అప్పారావు .

'మీ అబ్బాయి చెప్పలేదా?'

'ఏమిటి?'

'అసలు ఫస్ట్ రౌండ్‌లోనే సెలక్ట్ కాలేదు మీ వాడు. ఇంతకు ముందు క్యాంపస్ సెలక్షన్‌లో సెలక్ట్ కాలేదు. మీ వాడు కాలేజీకే సరిగ్గా రావటం లేదట' చెప్పి ముందుకు వెళ్ళిపోయాడు అప్పారావు.

శరత్ కేమీ అర్ధం కాలేదు. అయోమయంగా అనిపించింది.

అప్పారావు వాళ్ళబ్బాయి, తనబ్బాయి ఒకేకాలేజీలో, ఒకే క్లాసులో చదువుతున్నారు. తనకు అబద్ధం చెప్పాడా వాడు?

ఆ రోజు తాగి వచ్చాడు. ఇంట్లో వాళ్ళు తిడతారని భయపడి అబద్ధం చెప్పాడా? క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికయినందుకు సంతోషంతో తాగాడా?

ఎంపిక కానందుకు విషాదంతో తాగాడా?

శరత్‌కు అయోమయంగా ఉంది.

కొడుకు తనకు అబద్ధం చెప్పినందుకు బాధగా వుందో? తనని అమాయకత్వంతో ఆటలాడుకునే తెలివి వాడికున్నందుకు భయంగా ఉందో అర్ధం కావటం లేదు. ఇది ప్రశాంతికి తెలిస్తే ఏమనుకుంటుంది? ఎలా రియాక్టవుతుంది?

ఆలోచిస్తున్న శరత్ దగ్గరకు శిల్ప వచ్చింది.

'రేపు మేము పాట ప్రాక్టీస్ చేస్తున్నాం. మీరు రావాలి' అంది.

తల ఊపాడు శరత్ అన్యమనస్కంగా.

ప్రశాంతికి ఎలా చెప్పాలి?

చెప్పాలా? వద్దా?

కఠినమైన నిజం చెప్పి బాధించటమా? అబద్ధంలోనే ఆనందంగా ఉండనీయటమా? కానీ నిజం నిప్పులాంటిది. దాగదు. పైగా దాచిన వాడిని కాలుస్తుంది.

'ఏమిటి ఏదో ఆలోచనలో ఉన్నారు? వస్తారా రారా?' అడిగింది శిల్ప.

'వస్తాను' అన్నాడు.

ఓసారి అతడివైపు చూసి వెళ్ళిపోయింది శిల్ప.

ఆమె వెళ్ళగానే మాధవి వచ్చింది. 'జాగ్రత్త సార్. మీకు వలలేస్తున్నట్టుంది. వెళ్తూ వెళ్తూ తిరిగి చూస్తూ వెళ్ళింది.'

ఆలోచిస్తూ ఏదో లోకంలో ఉన్నవాడిలా ఆమె వైపు చూశాడు శరత్.

'అతడి మనసులో తనని కొడుకు ఎంత మోసం చేశాడు?' అన్న భావన కత్తులతో గుచ్చుతున్నట్టూ గుచ్చుతోంది. తనకే ఇలా ఉంటే, ప్రశాంతి ఇంకా ఎంత బాధపడుతుంది? ఏం చేయాలి? ఆలోచిస్తూ లేచాడు శరత్.

‘**ఏమిటలా ఉన్నారు?**‘ చనువుగా శరత్ పక్కన కూర్చుంటూ అడిగింది శిల్ప.

అప్పటికే ఆఫీసులో అందరి కళ్ళు ఈ వైపుకి తిరిగాయి. కొందరి కళ్ళల్లో కుతూహలం, ఇంకొందరి కళ్ళల్లో అసూయ..

ఇబ్బందిగా ఉంది శరత్‌కు.

శరత్ ఇబ్బందిని గమనించి నవ్వింది శిల్ప. ‘లంచ్‌లో ఫ్రీయేనా?‘ అడిగింది.

తల ఊపాడు శరత్.

‘ఓకె. మీట్ మి అట్ చిల్లీస్ అట్ 12.30‘ అని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన తరువాత ఆలోచన మొదలయింది శరత్‌లో.. ఆమె అడగగానే తల ఊపేశాడు. వెళ్ళాలా? వద్దా?

ఫోన్ చేసి లంచ్ కేన్సిల్ అందామనుకున్నాడు. ఫోన్ తీశాడు. కబురు పంపాడు. కానీ ‘కాల్‘ చేయలేదు.

వెళ్ళకపోతే ఏమౌతుంది?

ఇంకోసారి పిలవదు. ఎదురు చూసి తిట్టుకుని వెళ్ళిపోతుంది వెళ్తే...?

వెళ్తే ఏమౌతుంది? ఏమీకాదు.

మాట్లాడతారు. వింటారు... అంతే...

అంతేనా?

అంతే.... అనుకుంటే. నిరాశగా అనిపించింది.

నిరాశ ఎందుకు?

ఏం వాంఛిస్తున్నాడు ఆమెతో స్నేహంలో?

ఇంకా లోతుగా ఆలోచించాలంటే భయంగా అనిపించింది.

‘రారనుకున్నాను‘ అంది శిల్ప శరత్‌ని చూడగానే.

‘రావద్దనుకున్నాను. కానీ రాకుండా ఉండలేకపోయాను‘ అన్నాడు శరత్.

‘ఎందుకు రావద్దనుకున్నారు?‘

‘అది ఇప్పుడు అనవసరం. వచ్చిన తరువాత ఎందుకు రావద్దనుకున్నానన్నది అప్రస్తుతం అవుతుంది‘ నవ్వుతూ అన్నాడు శరత్.

‘ఎందుకో మిమ్మల్ని చూస్తే అందరి నడుమ ఒంటరి వాడిలా అనిపించారు. మీకు కంపెనీ ఇవ్వాలనిపించింది‘ అంది శిల్ప.

‘అందమైన ఆనందం కలిగించే అబద్ధం‘ అన్నాడు శరత్.

‘మానవ సంబంధాలే అందమైన అబద్ధం. ఎంత గొప్ప అబద్ధమైతే అంత ఎక్కువ ఆనందం.‘

‘బహుశా మీరు అజ్ఞానం అనుకుంటున్నది అజ్ఞానం కాదేమో.. మీరు అనుకున్నా విజ్ఞానాన్ని మించిన జ్ఞానం శాంతినిచ్చే విజ్ఞానం మరేదో ఉందేమో!‘

‘మీరు మరీ లోతైన తత్త్వంలోకి వెళ్తున్నారు. అంత లోతు వెళ్తే లంచ్ వ్యర్థమౌతుంది.‘

'అదే సమస్య.. శరీరానికి తిండి పట్టాలంటే, మెదడుకు తిండి వేయకూడదు... మెదడుకు తిండి వేస్తే శరీరానికి సరిపడదు. ఇంతకీ ఏమిటీ సమస్య?'

'సమస్య ఏమిటి? నాకేం సమస్య లేదే?'

'ఉంది. మనిషి ఎంతగా అబద్ధాలాడినా.. అతని కళ్ళు నిజం చెప్తాయి... చెప్పండి... మన మధ్య సమస్యలు పంచుకునేంత సాన్నిహిత్యం ఉందో లేదో తెలియదు కానీ.. ఎందుకో మిమ్మల్ని బాధించే అంశం తెలుసుకోవాలనిపిస్తోంది.

'మా అబ్బాయి సమస్య. వాడు క్యాంపస్ సెలక్షన్ వచ్చిందని అబద్ధం చెప్పాడు. అది నాకు తెలిసింది. నేను వాడిని నిలదీయాలా? లేదా? అర్థం కావటంలేదు. అసలు అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు వాడికి. వాడిని ఉద్యోగం చేసేసి డబ్బులు సంపాదించేయమని ఎవ్వరం అనటంలేదు. అయినా అబద్ధం ఎందుకు చెప్పాడో అర్థం కావటంలేదు. వాళ్ళమ్మ వాడికి ఉద్యోగం వచ్చేసిందని సంబరపడిపోతోంది. నిజం తెలిస్తే బాధపడుతుంది. అదీ సమస్య. పరిష్కారం ఏమిటి?' అడిగాడు శరత్.

'కాలం..' అంది శిల్ప.

'కాలం అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుందని నాకూ తెలుసు. కానీ.. వాడు అబద్ధం చెప్పాడన్న బాధ నన్ను వదలటంలేదు. అవసరం లేని చోట అబద్ధం చెప్పటం బాధ కలిగిస్తోంది.'

'అది మీ సమస్య' వెంటనే అంది శిల్ప.

ఆమె వైపు చూసి ఏదో అనబోయి ఆపేశాడు శరత్.

నవ్వింది శిల్ప 'మనిషి అబద్ధం ఎందుకు చెప్తాడో మీకు తెలుసు. బాల్యంలో అబద్ధాలు చెప్పటం ఒక గుర్తింపు కోసం. లేనిది ఉన్నదన్న సంతృప్తికోసం. తాను ఎవరికీ తక్కువ కానన్న భావనను పంచుకోవటం కోసం. ఇది మనిషితోపాటు ఎదుగుతుంది. వ్యక్తిత్వాన్ని బట్టి, పరిస్థితులను బట్టి పలు విభిన్నమైన రూపాల్లో ప్రదర్శితమౌతుంది. బాల్యంలో అబద్ధాలు చెప్పటం, ఎదిగిన తరువాత సాధించే గొప్ప పనులకు సూచన అంటారు.'

'బాల్యంలో అబద్ధాలు చెప్పటం వేరు. ఎదిగి ఊహ వచ్చిన తరువాత మంచి, చెడు తెలిసి అబద్ధాలు చెప్పటం వేరు. ఏదో ఓరోజు నిజం తెలియక తప్పదని తెలిసి అబద్ధం చెప్పటం వేరు. నడిచినంత కాలం గడవనీ అన్న నిర్లక్ష్యం నన్ను బాధిస్తోంది.'

'ఇది చాలా చిన్న విషయం. తనని తాను మభ్యపెట్టుకోందే మనిషి జీవించలేడు. మీకు తెలుసు. ఎంతమంది నటీనటులు అవార్డులను ఎలా కొంటారో! తమ సంతానానికి ప్రతిభలేకున్నా తమ పలుకుబడితో వారిని ఎలా ప్రతిభావంతులుగా నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నారో? ఎంతమంది రచయితలు అవార్డులను ఎలా కొంటున్నారో? ఆ కొనుక్కున్న ప్రశంసలన్నీ నిజమైనవిగా తమని తాము ఎలా మభ్యపెట్టుకుంటున్నారో! మీ అబ్బాయి ఐడెన్టిటీ క్రైసిస్‌తో బాధపడుతున్నట్టున్నాడు. తన స్నేహితులు ఉద్యోగాలు తెచ్చేసుకోవటం, ముందుకు పోవటం చూస్తూండి ఉంటాడు. తనకి ఉద్యోగం రాకపోవటం అతడిని బాధిస్తూ ఉంటుంది. అందుకని కట్టుకథ చెప్తున్నాడు. మీరు చూడండి.. ఇదో పెద్ద సమస్య కాకూడదు.'

'వాడు తాగుతున్నాడు' అదేదో పెద్ద ఘోరమైన విషయం చెప్తున్నట్టు చెప్పాడు. అంతే.. శిల్ప పగలబడి నవ్వటం మొదలు పెట్టింది. నవ్వి నవ్వి ఆమె కంటనీళ్ళు వచ్చాయి.

ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాడు శరత్.

ఆమెకు పొలమారింది. నీళ్ళు తాగింది.

'ఎందుకు నవ్వుతున్నారు?' అడిగాడు శరత్.

'నవ్వకపోతే ఏడవమంటారా? ఇంకా పాత రాతియుగంలో ఉన్నవాడిలా మాట్లాడుతూంటే.. తాగటం నేరంకాదు. బహుశా, మీరు చిన్నప్పటినుంచీ తాగుడు తప్పని నేర్పించి ఉంటారు. అందుకని అది నేరం అన్నది మీ మనస్సులో నాటుకు పోయింది. ఇప్పటి తరానికి ఎంతో తేడా ఉంది. మీరు ఆ అంతరాన్ని అర్థం చేసుకోవాలి. మీరు ఎదిగేటప్పుడు చదువు తప్ప మరో విషయం పై దృష్టి మళ్ళనిచ్చేవారు కాదు కదా?'

'అవును'

'ఇప్పుడు అలా కాదు. పిల్లలు చదువుతో పాటే ఏదో ఆట నేర్చుకుంటున్నారు. సంగీతమో, వాయిద్యమో నేర్చుకుంటున్నారు. మీ తరంలో హీరోలంతా బుద్ధిమంతులు. మీరూ బుద్ధిమంతులు. ఇప్పుడు హీరోలు పోకిరీలు లోఫర్లు. ఇప్పటి తరం అలానే ఉంది. కానీ ఆ పోకిరీతనంలోనే వారు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఎదుగుతున్నారు. అందరూ పోకిరీలు లోఫర్లే అయితే మరి విదేశాలలో మన దేశ ప్రతిభతో కలిగిస్తున్నదెవరు? ఇంత సాంకేతిక అభివృద్ధి దేశంలో ఎలా సాధ్యమయింది? ఆలోచించండి. మీరు నీడను చూస్తునారు. దీపం వెలుగును చూడటం లేదు.'

'అంటే, వాడిని అలా తాగనివ్వమంటారా? అబద్దాలు చెప్తూంటే, అబద్ధమని తెలిసి వదిలేయమంటారా?

'అది సమస్య కానంత వరకూ పట్టించుకోకండి. మీకు తెలుసు కదా.. ఒక వయసులో తల్లిదండ్రులు ఏమి చెప్పినా పిల్లలు వ్యతిరేకంగా అర్థం చేసుకుంటారు. మీరు తాగొద్దని తిడితే మీ మీద కోపంతో మరింత తాగుతాడు. అప్పుడేం చేస్తారు? మీరు అతడి అబద్ధాన్ని బహిర్గతపరిస్తే అవమాన భారంతో ఏమైనా చేయవచ్చు.. అప్పుడు ఏం చేస్తారు? ఈ కాలంలో మనం పిల్లలకు అన్నీ ఇస్తున్నాము కానీ ఆత్మవిశ్వాసం ఇవ్వటంలేదు. లేకపోతే.. ఈ సూసైడ్‌లు యువతలో ఇంతగా ఉండేవా?'

'మీరు నన్ను భయపెడుతున్నారు?'

'నేను ప్రాక్టికల్‌గా ఆలోచించమంటున్నారు. మీ అపోహలు, అభిప్రాయాల దృష్టితో మీ పిల్లవాడిని చూసి, వాడి ప్రవర్తన పై తీర్పు నివ్వవద్దంటున్నాను. వాడిని వాడిగా చూడమంటున్నాను. వాడి దృష్టితో ప్రపంచాన్ని చూసే ప్రయత్నం చేయమంటున్నాను. మనకు బాల్యంలో ఒక పెన్సిల్ కొనటమో, నోట్‌బుక్ కొనటమో ప్రాణాంతకమైన సమస్యగా ఉన్నప్పుడు, పెద్దలకు అది సిల్లీ సమస్య. ఎదిగిన తరువాత పిల్లల దృష్టిలో సిల్లీ విషయం, పెద్దలకు ప్రాణాంతకమైన సమస్య' ఆ తరువాత చాలాసేపు వాళ్ళిద్దరి మధ్య మౌనం తాండవించింది. మౌనంగా భోజనం ముగించారు.

'వెళ్దామా?' అడిగింది శిల్ప. మౌనాన్ని భంగం చేస్తూ.

తల అడ్డంగా ఊపాడు శరత్.

'నాకూ వెళ్ళాలని లేదు' నవ్వింది శిల్ప.

ఇంట్లో సుమంత్‌ని గమనిస్తూంటే శరత్‌కి ఆశ్చర్యంగా ఉంది. వాడిలో తాను అబద్ధం చెప్పానన్న భావన ఏకోశానా లేదు. ప్రశాంతి ఉద్యోగం గురించి ఎలాంటి ప్రశ్నలు అడిగినా, వాడు సమాధానం చెప్తున్నాడు. చూస్తూంటే, తన అబద్ధం నిజమని భ్రమిస్తున్నాడనిపిస్తోంది.

'ఫ్రెండ్స్ దగ్గర నుంచి తెలుసుకున్నదంతా అమ్మకి చెప్తూ మభ్యపెడుతున్నాడు' అనుకున్నాడు శరత్.

శరత్ కావాలని వాళ్ళ మాటలలో కల్పించుకుని ఏమీ ఎరగనట్టు రెండు మూడు ప్రశ్నలు అడిగాడు. వాటికీ సమాధానాలు చెప్పాడు.

నిజం తెలియకపోతే తాను అబద్ధాలాడుతున్నాడని తెలుసుకోలేకపోయేవాడినని అనుకున్నాడు శరత్.

ఎక్కడినుంచి వచ్చి ఉంటుంది వీడికీ నటన? అనుకున్నాడు.

వాడిని నిజం అడిగేయాలని పెదవిదాకా వచ్చింది కానీ అణచుకున్నాడు. తాను వాడికి తండ్రి. వాడు నటిస్తే వాడికన్నా ఎక్కువగా తాను నటించగలడు అనుకున్నాడు.

'వీడికి ఉద్యోగం వచ్చేసింది. ఆ తరువాత స్రవంతి పెళ్ళి చేసేస్తే మన బాధ్యతలు అయిపోయినట్టే.' అంది ఆ రాత్రి నిద్రకు ఉపక్రమిస్తూ ప్రశాంతి.

'ఒకవేళ వాడి ఉద్యోగం విషయం అబద్ధమైతే? వాడికి ఉద్యోగం లేకపోతే..?' నవ్వుతూ అన్నాడు శరత్.

'పోతే. పోనీండి. వాడికేమీ డబ్బుకి తక్కువా? ఇద్దరం సంపాదిస్తున్నాం. వాళ్ళ కోసం కాకపోతే ఎవరికోసం? అయినా ఎపుడూ మంచి ఆలోచించాలి మీకసలు అలాంటి ఆలోచన ఎందుకు వచ్చింది?' ఎదురు ప్రశ్నించింది.

ఆమె మాటలు వినపడనట్టు, నిద్రలోకి జారుకున్నట్టు నటించాడు శరత్.

**'ఏమోయ్.. ఫ్రీయేనా?'** కొలీగు మధు అడిగాడు శరత్‌ని.

'ఎందుకని?' అడిగాడు శరత్.

ఈ మధుతో ఫ్రీ అంటే ఒక బాధ. బిజీ అంటే ఇంకో బాధ.

'ఎందుకో చెప్తే అప్పుడు ఆలోచించి ఫ్రీయో, బిజీయో చెప్తావా?' అడిగాడు.

మధుతో మాట్లాడటమంటేనే అందరూ అందుకే హడలిపోతారు.

'అలాగని కాదు. నువ్వు ఎందుకో చెపితే, దాన్ని బట్టి నాకున్న పని ప్రాధాన్యమో, నీ పని ఇంపార్టెంటో నిర్ణయించుకుని ప్రయారిటీని బట్టి బిజీయో కాదో చెప్దామని' సమాధానం ఇచ్చాడు శరత్.

శరత్ మాటలు అర్ధమయ్యేందుకు కాస్సేపు పట్టినట్టుంది. మౌనంగా శరత్ వైపు చూస్తూ నిలబడ్డాడు మధు. తరువాత అన్నాడు.

'మా అబ్బాయి వాళ్ళ కాలేజీకి ఓసారి వెళ్ళాలి. నువ్వొస్తావేమోనని' నసిగాడు మధు.

'ఎందుకని?' అడిగాడు శరత్.

'మా అబ్బాయి ఫీజు కట్టానంటాడు. కాలేజీ వాళ్ళు ఫీజు కట్టలేదని మెసేజ్ ఇచ్చారు'

'మీ అబ్బాయిని రసీదు అడగలేదా?'

'ఆన్‌లైన్‌లో కట్టాడట రసీదు రాదట. ఆటోమేటిక్‌గా జమ అయిపోతుందట. కాలేజీ వాళ్ళు చూసుకుని ఉండరు. కంగారు పడవద్దంటాడు మావాడు. అయినా ఓసారి వెళ్ళి విషయం తెలుసుకుందామని.'

తనని ఎందుకు రమ్మన్నాడో శరత్ ఊహించాడు. మధుకి బండిలేదు. బండి నడపలేడు.

'సరే పద' అంటూ లేచాడు శరత్.

అతడితో వెళ్ళటానికి శరత్ ఒప్పుకోవటం వెనుక మరో కారణం ఉంది. మధు వాళ్ళబ్బాయి చదివేదీ, శరత్ వాళ్ళబ్బాయి చదివే కాలేజీనే.

దారి పొడుగునా మధు ఏదో మాట్లాడుతున్నాడు. అన్యమనస్కంగా వింటూ డ్రైవ్ చేస్తున్నాడు శరత్.

అతడికి తన కొడుకు చదివే కాలేజీ చూడాలని ఉందనేకన్నా, హఠాత్తుగా వెళ్తే విద్యార్థులు ఎలా వుంటారో తెలుస్తుంది, తన కొడుకు ఎలా ఉన్నాడో తెలుస్తుందన్న ఆలోచన వుంది అనటం సబబు.

అయితే ఎలాంటి ఘోరమైన సత్యం తెలుస్తోందన్న భయం కూడా ఉంది.

అందుకే ఓ పక్క ఉత్సాహంగానూ, మరో పక్క భయంగానూ ఉంది.

ఇంతలో ఫోను మ్రోగింది. కారు పక్కకి ఆపి చూశాడు. శిల్ప ఫోను చేస్తోంది.

'రేపు సెలవు పెట్టగలరా?' అడిగింది.

పక్కనున్న మధు వైపు చూశాడు శరత్.

సెల్‌ఫోన్లోంచి మాటలు ఒకోసారి బయటకు వినిపిస్తాయి. అందుకని అతడు వింటున్నాడేమోనని చూశాడు.

ఈ సంభాషణ పట్టించుకుంటున్నట్టు లేడు మధు. బయట రోడ్డు పక్క అతుక్కుపోయి నడుస్తున్న ఓ యువ జంటను దీక్షగా చూస్తున్నాడు. 'ఎందుకని?' అడిగాడు శరత్.

'ఎందుకని అడగకుండా సమాధానం చెప్పలేరా?' అడిగింది శిల్ప నవ్వుతూ.

'సెలవు పెట్టవచ్చు' అన్నాడు శరత్.

'అయితే సెలవు పెట్టేయండి. ఆఫీసు సమయానికి మనం ఆఫీసులో కాకుండా బయట కలుద్దాం.'

'ఎక్కడ?' గొంతు తడి ఆరిపోతూంటే అడిగాడు శరత్.

ఎందుకో అప్పటికే అతడి శరీరం ఉద్విగ్నమయమైపోయింది. ఏదో అలవికాని తీయని, ఇబ్బందికరమైన జలదరింపు శరీరాన్ని కుదిపేస్తోంది.

'అది రేపు చెప్తాను. సీక్రెట్‌లు ముందే చెప్తే ఎలా?' అంది.

ఫోను పెట్టి డ్రైవ్ చేస్తున్నా శరత్ మనసు మనసులో లేదు. ఏదో తెలియని ఉద్విగ్నత, ఉత్తజాలు కుదిపేస్తున్నాయి.

'ఎందుకు?' అన్న ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

శిల్ప లీవు పెట్టమంది. ఎందుకని?

రోజంతా తనతో గడుపుతుందా? ఎలా?

అర్థం పర్థంలేని ఆలోచనలు, ఊహలతో సతమతమవుతున్నాడు శరత్.

కాలేజీ దగ్గర పడుతూండగానే, రోడ్డుకి ఇరువైపున ఉన్న చెట్ల దగ్గర పలు యువతీ యువకుల జంటలు రకరకాల భంగిమలలో కనిపించటం ఆరంభమయింది.

కారు స్లో చేసి వాళ్ళని పరిశీలిస్తూ నడపసాగాడు శరత్.

ఎందుకో తెలియకుండానే అతడి గుండె విచిత్రంగా కొట్టుకుంటోంది.

వీళ్ళల్లో ఏ అమ్మాయితోనో సుమంత్ సన్నిహితంగా కనిపిస్తే? అన్నీ అనుభవించి, తెలిసిన తనే శిల్ప, రేపు కలుద్దాం అనగానే ఉత్తేజితుడయి, ఉద్విగ్నతను అనుభవిస్తుంటే, ఏమీ తెలియని, ఇంకా ఏమీ అనుభవించని యువతీయువకులు ఇంత సన్నిహితంగా వుంటే ఎలాంటి వికార భావాలు జనించవా? ఎందుకో అతడి మనసంతా చేదయిపోయింది.

ఓ చోట అమ్మాయి బండిపై కూర్చుని వుంటే అబ్బాయి ఆనుకుని నుంచుని కబుర్లు చెప్తున్నాడు. ఇంకో చోట ఇద్దరూ చెట్టుకి ఆనుకుని ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూస్తూ చేతులు పట్టుకుని నుంచున్నారు.

మరో చోట ఓ గుంపులా నిలబడ్డ అమ్మాయి అబ్బాయి ఏదో నవ్వుకుంటున్నారు పగలబడి.

మధు వైపు చూశాడు శరత్.

మధు కూడా వాళ్ళనే చూస్తున్నాడు.

మధునే కాదు, ఆ దారిలో వెళ్ళే వాళ్ళంతా అత్యంత ఆకర్షణీయము, ఆధునికము అయిన అమ్మాయిల వైపు, దుస్తులవైపు అదోరకంగా చూస్తూ వెళ్తున్నారు.

శరత్‌కు తెలిసిన విషయమే అయినా తన సంతానం కూడా ఇలాంటి వారిలో ఒకడే అన్న ఆలోచన అతడికి ఎలానో అనిపించింది.

ఇద్దరూ కాలేజీలోకి వెళ్ళారు.

కాలేజీ ఆవరణలో కూడా అదే పరిస్థితి.

అయితే గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. లేకపోతే జంటగా కూర్చుని వున్నారు.

అక్కడక్కడా అబ్బాయిల బృందాలు, అమ్మాయిల బృందాలు వీళ్ళవైపు చూస్తూ కామెంట్లు వేసుకుని నవ్వుతున్నాయి.

'నేనిక్కడే నిలబడతాను. నువ్వెళ్ళి పని చూసుకునిరా' అన్నాడు శరత్.

మధు ఆఫీసు లోపలకు వెళ్ళాడు.

ఎక్కడయినా సుమంత్ కనిపిస్తాడేమోనని వెతికాడు శరత్. ఎక్కడా లేడు.

ఇంతలో ఓ నడివయసు వ్యక్తి వచ్చాడు శరత్ దగ్గరకు.

అతడి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు శరత్.

'మీ అబ్బాయి ఈ కాలేజీలో చదువుతున్నాడా?' అడిగాడతడు.

'అవును. మీరెవరు?' అడిగాడు శరత్.

'మా అబ్బాయి కూడా ఇదే కాలేజీలో చదువుతున్నాడు. కానీ, వాడేదో ఉద్యమంలో పాల్గొన్నాడని సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఎత్తివేయమని బ్రతిమలాడటానికి వచ్చాను.'

'ఏం ఉద్యమం?' అలాంటి సంఘటన పేపర్లో చదివినట్టు కానీ, సుమంత్ చెప్పినట్టు కానీ శరత్‌కి గుర్తులేదు.

'ఉద్యమం అంటే ఉద్యమం కాదు. క్లాసులో ఏదో అన్యాయం జరిగిందంట. మార్కులు ఇవ్వటంలో టీచర్ అమ్మాయిలకు పక్షపాతం చూపించారట. క్లాసులో అందరూ అభ్యంతతం తెలిపారట. క్లాసులు వదిలి బయటకు వచ్చారట. దాన్లో ఇతరులకు కాలేజీ యూనియన్ల అండలున్నాయి. వీడికి ఏదీలేదు. దాంతో అన్ని గొడవలకు మావాడే కారణమని వీడిపై, యాక్షన్ తీసుకున్నారు. నేను వచ్చి మా వాడి తరపున క్షమార్పణలు చెప్పుకున్నాను. మావాడికి ఎలాంటి ఉద్యమాలు, పోరాటాలతో సంబంధం లేదని కాళ్ళు పట్టుకుని చెప్పాను. మధ్యాహ్నం తరువాత నిర్ణయం చెప్తామన్నారు. ఎదురు చూస్తున్నాను.'

శరత్ మనసు బాధతో నిండింది.

కాలేజీ క్యాంపస్‌లో పలు యూనియన్ల పోస్టర్లు, జెండాలు కనిపిస్తున్నాయి. స్లోగన్లు కనిపిస్తున్నాయి. కానీ అసలు విద్యార్థికి ఇవేవీ రక్షణ కావు. తను శరణు వేడితేనే రక్షిస్తాయి. తమ మాట వింటేనే అండనిస్తాయి.

శరత్ దృష్టి యూనియన్ల జెండాల వైపుండటం చూసి విషాదంగా నవ్వాడాయన. ఏదో యూనియన్‌లో వుంటే, వాళ్ళ వాళ్ళకేమైనా అయితే ఇల్లెక్కి గోలపెడతారు. అల్లర్లు చేస్తారు. యాజమాన్యానికి అది భయం. అందుకని వాళ్ళ జోలికి వెళ్ళరు. అమాయికుల జోలికే వస్తారు. చూస్తున్నాం కదా, కాలేజీకి చదువుకని వచ్చినవాళ్ళు క్యాంపస్‌లలో దాక్కుని 'మమ్మల్ని అరెస్టు చేయండని' పోలీసులకే సవాళ్ళు విసిరేకాలం యిది. వీళ్ళవల్ల మామూలు విద్యార్థుల చదువు పాడవుతోంది. కానీ అమాయకుల కాలం కాదిది' అన్నాడాయన విషాదంగా.

శరత్ ఏమీ మాట్లాడలేదు. చుట్టూ చూస్తూ మౌనంగా నిలబడ్డాడు.

'మీరెందుకు వచ్చారు?' శరత్ ఏమీ అనకపోవటంతో ఆయన అడిగాడు.

'ఫ్రెండ్ కోసం వచ్చాను. ఆఫీసులో వున్నాడు.'

'అదృష్టవంతులు మీ అబ్బాయి బుద్ధిగా చదువుకుంటున్నట్టున్నాడు. ఈ కాలంలో పిల్లల చదువు పూర్తయి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడితే మన జన్మ ధన్యమయినట్టే. ఈ మధ్యలో ఏ అమ్మాయి ప్రేమలో పడి సూసైడ్ చేసుకున్నా, విఫలమై దాడి చేసినా, ధర్నాలు, పోరాటాలు చేసినా, డ్రగ్గులు, మాదకద్రవ్యాలకు అలవాటు పడినా... ఏమిటో ఈ జీవితం' అన్నాడాయన.

ఇంతలో మధు వచ్చాడు. చెమట తుడుచుకుంటూ 'పద' అన్నాడు.

శరత్ కారు స్టార్ట్ చేస్తూంటే మధు హఠాత్తుగా శరత్ వైపు తిరిగి అడిగాడు.

'ఏమిటి.. మీ అబ్బాయి క్యాంపస్ సెలక్షన్ రిజెక్ట్ చేశాడా?'

'వస్తే కదా! రిజెక్ట్ చేయటానికి?' నవ్వాడు శరత్.

'లేదు. నేను ఆఫీసులో మీ అబ్బాయిని చూశాను. ఎవరో కౌన్సిలింగ్ చేస్తున్నారు. చాలా మంచి కంపెనీ మాది. చక్కని ఉద్యోగం. మంచి అవకాశం వదులుకోవద్దని చెప్తున్నాడు.'

శరత్ మాట్లాడలేదు. 'మీ అబ్బాయి ఫీజు విషయం ఏమైంది?' రోడ్డువైపు చూస్తూ అడిగాడు శరత్.

'ఏమౌతుంది. మన పిల్లలకు టెక్నాలజీ తెలుసు. మనకు తెలియదు. తెలియని వాడిని తెలిసినవాడు మోసం చేయటమే ప్రపంచరీతి. నెట్‌లో డబ్బులు కట్టినా, ప్రింటౌట్ వస్తుందట. మా వాడు డబ్బులు వాడేసుకుని వుంటాడు. మళ్ళీ ఫీజు డబ్బులు కట్టాను. క్లాసులోంచి పిలిపించమన్నాను. వాడు క్లాసులో లేడు. నెలరోజులుగా కాలేజీకి రావటం లేదట' కారులో వెనక్కి జారి కళ్ళు మూసుకున్నాడు మధు.

శరత్ మాట్లాడలేదు. మౌనంగా డ్రైవింగ్ పై దృష్టి కేంద్రీకరించాడు.

రాత్రికి సుమంత్ కలిసినప్పుడు అడిగాడు శరత్

'ఏమిటీ... క్యాంపస్ సెలక్షన్‌ని వద్దన్నావట?'

ఆశ్చర్యంగా చూశాడు శరత్ వైపు సుమంత్.

'నీకెలా తెలుసు?' అడిగాడు.

'తెలిసింది. మా కొలీగు వాళ్ళ అబ్బాయి కోసం కాలేజీకి వెళితే, చెప్పారట నాకు చెప్పమని. '

తల వంచుకున్నాడు సుమంత్.

'ఎందుకు వద్దన్నావురా? ఇక నీ చదువైపోయిన తరువాత ఉద్యోగం గురించి బెంగలేదనుకుని ప్రశాంతంగా వుంటే ఇలా చేస్తున్నావేమిటి?' కోపంగా అడిగింది ప్రశాంతి. ఆమె వేపు తలెత్తి చూసి తలదించుకున్నాడు సుమంత్.

'సుమంత్ బయట జాబ్ సిట్యుయేషన్ ఎలా వుందో నీకు తెలియదు. ఇంజనీర్లు క్లాస్‌ఫోర్ ఉద్యోగం చేయటానికి సిద్ధపడుతున్నారు. ఎంతెంతో అర్హతలున్న వారు ఏదో ఒక ఉద్యోగం దొరికితే చాలన్నట్టున్నారు. ఈ కాలంలో కాలేజీ చదువయిపోయేలోగా దొరికితే ఉద్యోగం దొరికినట్టు. లేకపోతే ఏ ఉద్యోగం దొరుకుతుందో తెలియదు. తరువాత ఏదో దొరికితే దాన్లో చేరిపోవాలి. జీవితాంతం తిట్టుకుంటూ బ్రతకాలి' అన్నాడు శరత్ అనునయంగా.

'నాకంతా తెలుసు నాన్నా.'

'మరి తెలిసి ఎందుకు ఉద్యోగం వద్దంటున్నావు?' అడిగింది ప్రశాంతి.

'నాకు మీలాగా గానుగెద్దుల్లా, బానిసలా, జీతం కోసం ఎదురుచూసే పక్షుల్లా బ్రతకాలని లేదు.'

గది నిశ్శబ్దమైపోయింది.

ప్రశాంతి, శరత్‌లు ఒకరివైపొకరు చూసుకున్నారు.

'మేము గానుగెద్దులమూ, బానిసలమా?' పళ్ళబిగువున అడిగింది ప్రశాంతి.

'కాకపోతే మహారాజులు, మేనేజర్లా?' విసురుగా అడిగాడు సుమంత్.

కుర్చీలో వెనక్కి చేరగిలబడి కొడుకువైపు శాంతంగా చూశాడు శరత్.

'అవున్నాన్నా పుట్టినప్పటినుంచీ చూస్తున్నాను. మీవి గుమాస్తా బ్రతుకులు. ఎంతసేపూ నెల తిరిగేటప్పటికి వచ్చే జీతం, ఖర్చులు, ఇంక్రిమెంట్లు, లీవులు తప్ప ఏముంది మీ జీవితంలో? నాలుగు రోజులు లీవు కావాలంటే ఆఫీసర్ కాళ్ళా వేళ్ళా పడాలి. వాడివ్వడు. లెక్చరిస్తాడు. అయినా పడివుండాలి. నాకలాంటి ఎదుగూ బొదుగూలేని గుమాస్తా జీవితం అవసరం లేదు.'

'నీది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కదా! గుమాస్తా జీవితం ఎలా అవుతుంది?' అడిగింది ప్రశాంతి. నవ్వాడు సుమంత్.

'సాఫ్ట్‌వేర్ ఉద్యోగమయినా ఏముంది? ఎక్కడో ఒకడి క్రింద ఊడిగం చేయాల్సిందే వాడి కనుసన్నల్లో మెలగాల్సిందే ఒదిగి ఉండాల్సిందే వాడికి నచ్చకపోతే పింక్ స్లిప్ అందుకుని ఏడుస్తూ రోడ్డుమీద పడాల్సిందే '

'మరేం చేస్తావు?'

సుమంత్ మాట్లాడలేదు.

'భవిష్యత్తు ప్రణాళిక లేకుండా వచ్చిన ఉద్యోగం వదిలేస్తే ఎలా? వున్న పక్షి, చెట్టు పై వున్న పక్షులకన్నా ఉత్తమం అంటాను. చెట్టుమీద రెండున్నాయి అని చేతిలో ఉన్నదాన్ని వదిలేస్తే ఎలా?' అంది ప్రశాంతి బుజ్జగిస్తున్నట్టు.

'నేనేమీ గుడ్డిగా వదిలెయ్యలేదు. నేను, నలుగురు ఫ్రెండ్స్ కలసి కంపెనీ పెడుతున్నాం.'

నోరు తెరిచింది ప్రశాంతి.

'కంపెనీయా? వ్యాపారమా?' ఆశ్చర్యంగా అడిగింది.

'క్రియేటివ్ గయ్స్ అండ్ గాల్స్ మా కంపెనీ పేరు.' జేబులోంచి పెన్‌డ్రైవ్ తీసి కంప్యూటర్‌కి అతికించాడు.

'క్రియేటివ్ గయ్స్ అండ్ గాల్స్ సమర్పించు' అన్న అక్షరాలు తెరపై కనబడ్డాయి.

'రంగుపడుద్ది' షార్ట్‌ఫిల్మ్ అన్న పేరు వచ్చింది.

అయిదునిముషాల లఘు చిత్రం అది.

'ఏమిటది?' అడిగింది ప్రశాంతి.

చివరలో దర్శకుడిగా సుమంత్ పేరుంది.

'మేము సినిమా నిర్మాణం చేయాలని అనుకుంటునాం. ఈ సినిమా మేమంతా డబ్బులు వేసుకుని తీశాం. యూట్యూబ్‌లో యాభైవేలు దాటాయి వ్యూస్..'

'మాకింత వరకూ చెప్పలేదేం?' అడిగింది ప్రశాంతి.

'మీకు అర్థం కాదు. మీరు ఒద్దంటారు. మీకెంతసేపూ మిడిల్ క్లాస్ గుమాస్తా మెంటాలిటీ, వెచ్చగా గొంగళి కప్పుకుని పడుకోవటమే జీవితం అనుకుంటారు. ఎదుగుదల గురించి ఆలోచన లేదు. ఛాలెంజ్ లేదు. నాకు అలాంటి జీవితం వద్దు. మీరు నేను చెపితే ఒద్దంటారు. ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తారు. అందుకే చెప్పలేదు. చూడండి. ఎంతబాగా వచ్చిందో సినిమా అందరూ నాకు మంచి భవిష్యత్తు ఉందంటున్నారు.'

'కానీ.. సినిమా రంగంలో గెలవటం, అదీ ఎవరి సహాయం లేకుండా నిలబడటం కష్టం' అన్నాడు శరత్.

'అదే మెంటాలిటీ.. కష్టాలు ఊహించి కదలటం మానేస్తే ఎక్కడున్న గొంగళి అక్కడే వుంటుంది. రిస్క్ లేకపోతే ఎదుగుదల వుండదు. నేను రిస్క్ తీసుకోదలచుకున్నాను మేమంతా ఒప్పందాలు చేసుకున్నాం. నా నిర్ణయం మారదు' లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

శరత్, ప్రశాంతి ఒకరివైపు ఒకరు చూసుకుంటూండిపోయారు.

**ప్రొద్దున్న శరత్‌కి** మెలుకువ వచ్చేసరికి ప్రశాంతి, సుమంత్‌ని బ్రతిమలాడుతోంది. 'సినిమాలు మనలాటి వాళ్ళకి కావురా. ఎంతోమంది సినిమాల్లోకి వెళ్ళి దెబ్బతిని దివాణం లేకుండా తిరగటం చూస్తున్నాం కదరా! నీకీ పిచ్చి ఎలా పట్టిందిరా? ఇంజనీరింగ్ చదువుతున్నావెందుకు? అప్పుడే సినిమా కోర్సు ఏదయినా చేస్తే బావుండేది కదా!'

'అమ్మా.. మీతో ఇదే గొడవ. మనం ఎందుకు బ్రతుకుతున్నాం చెప్పు? ప్రతిక్షణం గురించి, డబ్బు గురించీ ఆలోచిస్తూ బ్రతకటం ఒక బ్రతుకేనా? చెప్పు, మీరిద్దరూ ఎప్పుడయినా మీ కోసం ఒక్క క్షణమైనా బ్రతికేరా? నాన్న అయినా తన గదికి వెళ్ళి ఒంటరిగా తన పుస్తకాలు, పాటల నడుమ తనకు ఇష్టమైనట్టు బ్రతుకుతారు. నువ్వు? ఆఫీసు, ఇల్లు, వంట తప్ప నీకంటూ జీవితం ఏది? నీకోసం నువ్వు గడిపిన క్షణం ఏది? నాకు అలా జీవితం ఎవరికోసమో గడిపేసి ఎంత త్యాగం చేశాం అని అనుకోవటం, అదేదో గొప్పగా భావించటం ఇష్టంలేదు. నాకు నా జీవితం నా ఇష్టమైనట్టు, నా కోసం బ్రతకాలని ఉంది. అది తప్పా? మీరు కోరేది నేను సుఖంగా, సంతోషంగా ఉండాలనే కదా? నాకు సినిమాలంటే ఇష్టం. నేను రేపు డబ్బు లేక మలమల మాడినా, రోడ్ల మీద బిచ్చమెత్తుకుంటూ తిరిగినా నాకు సంతోషమే. ఎందుకంటే, నేను నా ఇష్టాన్ని అనుసరించాను. ఎవరో చెప్పింది చేసి జీవితాంతం ఏడుస్తూ, కుములుతూ బ్రతకటం లేదు.'

ప్రశాంతి ఏడవటం ఆరంభించింది.

'అమ్మా.. నువ్వు ఏడవకు. ఏడ్చినా నా నిర్ణయం మారదు. నన్ను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చెయ్యాలని ప్రయత్నించకు.' వెళ్ళిపోయాడు సుమంత్.

శరత్ గదిలోకి తొంగి చూశాడు.

ఒంటరిగా కూర్చుని శూన్యంలోకి చూస్తోంది ప్రశాంతి. ఆమె కళ్ళనిండా నీళ్ళున్నాయి. జాలిగా అనిపించింది శరత్‌కు. ఆమెపై ప్రేమ పొంగి పొర్లింది. దగ్గరగా వెళ్ళాడు. శరత్‌ని చూడగానే ఆమె కళ్ళల్లోంచి నీళ్ళు జలజల జాలువారాయి.

ఆమెని దగ్గరకు తీసుకున్నాడు శరత్. అతని గుండెల్లో తలదాల్చి వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది ప్రశాంతి.

ఆమెని మరింత దగ్గరగా హత్తుకుని తల నిమురుతూ మౌనంగా ఉండిపోయాడు శరత్.

అతని మనసులో అనేక విచిత్రమైన భావనలు పడి లేస్తున్నాయి.

ఎందుకు ఏడుపు? ఎందుకు బాధ?

చిన్నప్పటి నుంచీ పిల్లలు పెద్దలు చెప్పిన మాట వినకుండా ఉండటానికే ప్రయత్నిస్తారు. బెదిరించి, కొట్టి, ఇదివ్వం, అదివ్వం అనో, ఇదిస్తాం, అదిస్తాం అనో పిల్లల్ని లొంగదీస్తారు పెద్దలు. కానీ ఎదిగిన తరువాత పిల్లలు తమ ఇష్టాన్ని అనుసరిస్తే ఎందుకు బాధ?

శరత్ ఒక్క మాట మాట్లాడలేదు. కానీ అతడి స్పర్శలో, సాన్నిహిత్యంలో తనకు తెలియకుండానే సాంత్వన లభించింది ప్రశాంతికి. కాస్సేపటికి కళ్ళు తుడుచుకుంది.

'పదండి. తయారవండి. ఆఫీసుకి లేటవుతుంది' అంది.

నవ్వాడు శరత్. 'గానుగెద్దు జీవితానికా?' అడిగాడు.

శరత్‌వైపు కోపంగా చూసింది ప్రశాంతి.

'అవును. ఈ గానుగెద్దు జీవితం గడుపుతూ సంపాదించిన డబ్బుతోనే ఈరోజు వాడు నేను నా ఇష్టం అనే స్థాయికి ఎదిగాడు. వాడి అది మరిచిపోతే వాడికే నష్టం. వాడు అన్నంత మాత్రాన నేను గానుగెద్దు అవుతానా? అయినా, మనం ఎదిగేటప్పుడు ప్రపంచం ఇలా ఉండేదా? ఈ సెల్‌ఫోన్లు, యూట్యూబులు, ఫేస్‌బుక్‌లు ఉండేవా? ఇన్ని ఉద్యోగాలు, ఇంత అవకాశాలూ ఉండేవా? ప్రభుత్వోద్యోగం కోసం ఎంత పోటీ ఉండేది? అంత మందిలో అంత పోటీని తట్టుకుని ఉద్యోగం సంపాదించాం. వాడిని సంపాదించమనండి. పోటీ పడలేక 'సినిమా' అని తప్పించుకుంటున్నాడు వెధవ' అంది.

శరత్‌కి నవ్వు వచ్చింది. ఆపుకోలేకపోయాడు. పెద్దగా నవ్వేశాడు.

'ఎందుకా విలన్ నవ్వు?' అడిగింది తానూ నవ్వుతూ.

'మొత్తానికి వాడు సినిమా అంటే ఇష్టపడికాదు, ఉద్యోగాలతో పోటీపడలేక సినిమా అంటున్నాడంటావు' అన్నాడు.

'వెర్రివెధవ. వాడికేం తెలుసు? తెలిసీ తెలియక బంగారు అవకాశాలు వదులుకుంటున్నాడు. అదీ బాధ' అంది.

'వాడికి తెలుసో, తెలియదో కానీ నిజంగా నీకోసం నువ్వు కాలం వెచ్చించి ఎంతకాలమయిందో కదా!' అన్నాడు శరత్.

శరత్ వైపు విచిత్రంగా చూసింది ప్రశాంతి.

'వాడేదో తెలిసీ తెలియక మాట్లాడాడు. మీరూ అలా అంటే ఎలా? నేను చాలా సుఖంగా సంతృప్తిగా వున్నాను. నాలో లేనిపోని అసంతృప్తులు కలిగించి అల్లకల్లోలం చేయకండి. నాకు తెలుసు. ఈ వాదనలు, ఈ సిద్ధాంతాలు కడుపునిండి ఒడ్డున చేరినవాడు మాట్లాడేమాటలవి. నా మటుకు నాకు నా కుటుంబమే నా జీవితం, నా కుటుంబ సంక్షేమమే నా సంతృప్తి. ఎప్పుడయితే నేను పెళ్ళి చేసుకున్నానో అప్పుడే 'నేను' అన్నది నశించి 'మనం' అయింది. ఎప్పుడయితే పిల్లలు పుట్టారో అప్పుడు మనం కూడా పోయింది. 'పిల్లలు - మనం' అయింది. సంసారం సాగరం అంటారు. సాగరంలో ఏ నీటి చుక్కకు ఆ నీటి చుక్క ప్రత్యేకమయినా, అంతా నీరే అవుతుంది తప్ప దేన్ని ప్రత్యేకంగా పరిగణించం కదా! ఇదీ అంతే. సంసారం ఏర్పడనంతవరకూ నేనూ, మీరూ. అర్థమయితే సంతోషం. లేకపోతే ఎవరి ఖర్మ వారిది. నా జోలికి రాకండి' అంది.

'నేనేమీ అనటం లేదు. వాడు అన్నదే అన్నాను. నువ్వూ, నీ వ్యక్తిత్వం...'

శరత్ మాటలకు అడ్డు వచ్చింది ప్రశాంతి.

'ఏమిటీ నా వ్యక్తిత్వం? నేనూ, నా అసంతృప్తులు, నా స్వేచ్ఛ అని సంసారాన్నీ పిల్లల్నీ వదిలేసి ఊరెంబడి పడి తిరగనా? అదే నా నా స్వేచ్ఛ? అదే నా వ్యక్తిత్వం. మా ఆఫీసులో చూస్తున్నాను. కమల అని ఉంది. స్త్రీ స్వేచ్ఛ, విముక్తి అని కబుర్లు చెపుతుంది. మగవాళ్ళంతా చుట్టూ చేరతారు. మీద చేతులు వేయనిస్తుంది. ఎటు పిలిస్తే అటు వెళ్తుంది. ఇక అందరూ దాన్నో గొప్పదాన్ని చేసేశారు. ఏ మీటింగ్ అయినా, అదేదో గొప్ప తెలివిమంతురాలయినట్టు స్టేజీ ఎక్కిస్తారు. పొగుడుతారు. దాన్ని చూపించి మేమందరం పాతరాతి యుగానికి చెందిన వాళ్ళమయినట్టు, ఏన్టీ సోషల్ అయినట్టు వ్యాఖ్యానిస్తారు. 'ఆంటీ' అంటూ వెక్కిరిస్తారు. కానీ మాకున్న గౌరవం, ఆత్మవిశ్వాసం దానికి లేవు. మొగుడిని వదిలేయటం గొప్పకాదు. అసంతృప్తులున్నాయని మొగుడిని పిల్లల్నీ వదిలి ప్రియుడితో పారిపోయి

అదేదో గొప్ప పని చేసినట్టు ప్రపంచానికంతటికీ  సిద్ధాంతాలు, నీతులు వల్లించటం గొప్పకాదు. వాళ్ళ శరీరం వాళ్ళకి లాభం అనిపించిన ప్రతివాడికీ అంకితం. నా శరీరం నా భర్తకే అంకితం. ఎక్కడుంది వ్యక్తిత్వం చెప్పండి?'

శరత్ మాట్లాడలేదు. కానీ ఆమె మాటలలో అంతర్గతంగా ఉన్న సంఘర్షణ, క్షోభ అతడికి అర్థమయింది.

మౌనంగా ఆఫీసుకి తయారవసాగాడు.

'స్రవంతి ఏది?' అడిగాడు.

'ప్రొద్దున్నే స్పెషల్ క్లాసుకని వెళ్ళింది' చెప్పింది ప్రశాంతి.

'లంచ్ మరచిపోయారా?'

శిల్ప ఫోన్ చేసి అడిగే వరకు శరత్‌కు శిల్ప లంచ్ చేద్దామన్నది గుర్తుకు రాలేదు. తన ఆలోచనలలో, ఆఫీసు పనుల్లో పడి మరచిపోయాడు.

'వస్తున్నా' అన్నాడు.

'ఏమిటి దీర్ఘాలోచన?' అడిగింది శిల్ప శరత్‌ని చూడగానే.

జరిగింది చెప్పాడు.

'నాకు సుమంత్ ఆలోచనలు ఒకరకంగా అనిపిస్తే, ప్రశాంతి ఆలోచనలు ఇంకో రకమైన ఆలోచనలు కలిగిస్తున్నాయి. సమాజంలో మనుషుల మీద ముద్రలు వేయటం, వ్యక్తిగత బలహీనతలకు సిద్ధాంతాల ముసుగులు వేసి వాటిని సమాజానికంతా అన్వయించి ప్రచారం చేయటం వల్ల మాములు మనుషులలో ఎంత సంఘర్షణ చెలరేగుతోంది కదా అనిపిస్తోంది.' అన్నాడు.

'ఇది తప్పదు. మన సమాజంలో ఇది అధికం. ఇతర సమాజాల పరిస్థితులు వేరు. మన పరిస్థితి వేరు. మన సమాజంలో ప్రతీదీ ధర్మానికి ముడిపడివుంటుంది. దాంతో ప్రతి ఆలోచనా ధర్మంపై దాడిలా తోస్తుంది. ధర్మం పై దాడి చేయటం ఫేషన్ అనుకుని, గొప్పతనం అనుకుని గుడ్డిగా దాడిచేస్తారు. గొప్పగా ఫీలయిపోతారు.' అంది శిల్ప.

'అవును.. ప్రతి ఒక్కరూ పురాణపాత్రలను అవహేళన చేసేవారు. పురాణాలను దూషించి వెక్కిరించేవారే. వారికి పురాణాల గురించి ఏమాత్రం అవగాహనలేదు. పురాణ పాత్రల వ్యక్తిత్వాల పట్ల ఆలోచన లేదు. జంతువులు మల విసర్జన చేసేటప్పుడు ఇక్కడ చేయవచ్చు. ఇక్కడ చేయకూడదా? అని ఆలోచించవు. వీరూ అంతే. ఏ పాత్రను ఎలా అర్థంచేసుకోవాలి? ఏ సంఘటనను ఏ దృష్టితో చూడాలి అన్న అవగాహన లేదు కానీ ప్రతిదానిపై బురద జల్లుతారు. వారిలాంటి వారు వారికి వత్తాసు పలుకుతారు. ప్రజాస్వామ్యాన్ని పదిమంది కూడి గొంతు చించుకుని అరిస్తే అదే ప్రజాభిప్రాయం అవుతుంది. నిశ్శబ్దంగా ఉన్న తొంభై మంది ఈ పదిమందికి తలవంచాల్సి వస్తుంది. అదే జరుగుతోంది' అన్నాడు శరత్.

వాతావరణం బరువెక్కటం గమనించింది శిల్ప. టాపిక్ మార్చింది.

'మీ అబ్బాయి నిర్ణయం మీకు బాధకలిగించటం లేదా?'

'రెక్కలు వచ్చిన పక్షిని గూటిలో పెట్టి బంధించి ఉంచగలమా? వాడి ఇష్టం వాడిది. కానీ వాడికి సినిమా ప్రపంచం గురించి తెలియదు. అంతకన్నా ఎక్కువ రాక్షసమైనది. దానిలో ఎవరి అండదండలు లేకుండా, ఎలాంటి ఆశ్రయాలు లేకుండా నెట్టుకు రావటం ఎంత కష్టమో వాడికి తెలియదు. తెలియకుండా గుడ్డిగా ఆ ప్రపంచం వైపు పరుగులిడుతున్నాడు. ఇప్పుడూ నేనేం చెప్పినా వాడు తప్పుగా అర్థం చేసుకుంటాడు అలాగని నిప్పువైపు పరుగులిడేవాడిని హెచ్చరించకుండా ఉండటం భావ్యమా? ఇది నా సందిగ్ధ పరిస్థితి.'

‘నిజమే. ఆ విషయం పై ఆసక్తి వుంది అన్న తరువాత ‘వొద్దు‘ అంటే ఆసక్తిని చంపినట్టు అవుతుంది. వెళ్ళనిస్తే భవిష్యత్తు ఏమౌతుందో తెలియదు. నేను కూడా ఒక దశలో నా జీవితాన్ని సంగీతానికే అంకితమివ్వాలని అనుకున్నాను. ఉద్యోగాలు చేయకుండా, పెళ్ళిగిళ్ళి లేకుండా సంగీతమే సర్వంగా జీవించాలనుకున్నాను. కానీ కోరికలు వేరు. నిజ జీవితం వేరు. కలలు కలలే. నిజం నిజమే. జీవించాలంటే సంగీతం ఒక్కటే సరిపోదని తెలిసింది. దాని మీద ఆధారపడాలంటే బోలెడన్ని రాజకీయాలు చేయాలని తెలిసింది. మన ప్రతిభకూ మనకు వచ్చే అవకాశాలకూ మధ్య హస్తిమశకాంతరం ఉంటుందని తెలిసింది. ఉద్యోగం చేయక తప్పలేదు. పెళ్ళి చేసుకోక తప్పలేదు. జీవితం అన్నీ నేర్పిస్తుంది. మనిషి చెపితే సాటి మనిషి వినడు. జీవితం అన్నీ నేర్పిస్తుంది. కానీ చాలా కఠినమైన పద్ధతిలో పాఠాలు నేర్పిస్తుంది‘ అంది శిల్ప.

ఆమె మాటలలో దాగిన అర్థం గ్రహించాడు శరత్. మౌనంగా ఉండిపోయాడు. ప్రతి మనిషి ఒక నీటి బిందువులాంటివాడు. కానీ నీటి బిందువులాగే ప్రత్యేక వ్యక్తిత్వం కలవాడు. కానీ సమాజ ప్రవాహంలో కలిస్తే ఎవరికి వారు వ్యక్తిత్వం కోల్పోయి నీటి ప్రవాహంలానే కనిపిస్తారు తప్ప ప్రత్యేకంగా కనబడరు.

తాను లక్షలాది ప్రభుత్వోద్యోగులలో ఒక సంఖ్య. ఒక పి.ఎఫ్ నెంబరు. తన ప్రత్యేకత ఆ నెంబరులో కనబడదు.

మరో లెక్కల్లో ఇద్దరు సంతానం ఉన్న కుటుంబాలలో లేనిది ఒకటి. దాన్లో తన ప్రత్యేకత ఏది?

శిల్ప కూడా అంతే..

లక్షలాది ప్రభుత్వోద్యోగులలో ఒక అంకె ఆమె. ఎంతో మంది పాటగాళ్ళలో ఒక నెంబరు.

ఇద్దరూ ఎవరి ఆలోచనలలో వారు మౌనంగా ఉన్నారు.

చాలాసేపటికి శిల్ప అంది.

‘నాకు సినిమా రంగంలో తెలిసిన వాళ్ళున్నారు. నన్ను కొందరు ప్లేబాక్ పాడమని అడిగారు. అది వేరే కథ. వాళ్ళ రిఫరెన్స్ ఇస్తాను. మీ అబ్బాయిని వెళ్ళి కలవమనండి. వాళ్ళు ఏదైనా సహాయం చేస్తారు‘ అంది.

నవ్వాడు శరత్.

‘నా సహాయం లేకుండా వాడంతట వాడు తన జీవిత పథాన్ని నిర్దేశించుకోవాలని అనుకుంటున్నాడు. మళ్ళీ నేనేదో రిఫరెన్సులు ఇచ్చి వాడి వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం నాకు ఇష్టం లేదు. అదీగాక, ప్రతివ్యక్తి తన భవిష్యత్తును నొసటి పై రాసుకుని ఈ భూమి పైకి వస్తాడని నా నమ్మకం. వాడికి ఏది రాసి ఉంటే అది జరుగుతుంది. మనం ఆత్రపడి, బాధపడి లాభం లేదు‘ అన్నాడు.

‘ఇది పలాయన వాదం‘ అంది శిల్ప నవ్వుతూ.

‘నాకు వాదాలు వివాదాలు తెలియదు. నేను నమ్మింది అది. ధూప్ థీ నసీబ్ మేతో, ధూప్ మే లియా హై దమ్, చాంద్‌నీ మిలీ తో హమ్, చాంద్ నీ మె సోలియే‘ అన్నాడు శరత్.

**‘హమ్ హై రాహీ ప్యార్ కే** హమ్ సె కుఛ్ న బోలియే‘ హమ్ చేసింది శిల్ప.

‘బాగా గుర్తుపట్టారే?‘ అన్నాడు శరత్ నవ్వుతూ.

‘చాలా గొప్ప పాట. అప్పుడు కళాకారులు సినిమాను జీవితానికి దర్పణంగా భావించి జీవిత సత్యాలను పాటలలో ప్రతిబింబించేవారు. ఇప్పుడు పాటలలో జీవితం లేదు, సత్యం లేదు. అందుకేనేమో ఇప్పటి పాటలు విని మెచ్చుకుని మరిచిపోతాం. అప్పటి పాటలు విని పరవశించి జీవితాంతం పాడుకుంటూ ఆనందాన్ని అనుభవిస్తాం‘ అంది శిల్ప.

నవ్వాడు శరత్ 'మీరు నా టాపిక్ ఆరంభిస్తున్నారు. ఈ విషయం మాట్లాడుతూ నేను ఒళ్ళు పై మరచిపోతాను. నేను గమనించనంత వరకూ ఆ కాలంలో కవులు సినీ సాహిత్య రచనను వృత్తిగా స్వీకరించినా వారు దాన్ని చులకన చేయలేదు. తమ కవితతో వ్యాపారం చేయలేదు. వారు సినీ సందర్భానికి, పాత్రల వ్యక్తిత్వానికి తగ్గట్టు తమ కవితను ఒదిగింప చేసి ప్రదర్శించినా తమ వ్యక్తిత్వాన్ని పాటలలో ప్రదర్శించారు. అందుకే పాట వినగానే ఈ గేయ రచయిత ఎవరో ఊహించవచ్చు. పాటను గాయకుడు పాడే విధానాన్ని బట్టి నాయికా నాయకులను ఊహించవచ్చు. బాణీని ఆర్కెస్ట్రాను బట్టి సంగీత దర్శకుడు ఎవరో చెప్పవచ్చు. ఆ కాలంవారికి అది కళాప్రదర్శన. ఈ కాలం వారికి వ్యాపారం. అదీ తేడా. దుకాణంలో ఏదో వస్తువు కొంటాం. ఉపయోగం తీరిన తరువాత మరిచిపోతాం. అదే కళావస్తువయితే భద్రంగా షోకేసులో పెట్టుకుంటాం. చూసి ఆనందిస్తాం. అదీ తేడా' ఆవేశంగా చెప్పాడు శరత్.

నవ్వింది శిల్ప 'మీలో చిన్నపిల్లవాడు సజీవంగా ఉన్నాడు' అంది.

'ఏం?' ఎర్రబడింది శరత్ ముఖం.

'మీరు మాట్లాడుతూంటే తన ఫేవరేట్ హీరోని సమర్థిస్తూ పాషనేట్‌గా వాదించే పిల్లవాడు గుర్తుకు వస్తున్నాడు' అంది.

శరత్ కూడా నవ్వేశాడు.

'నిజమే కావచ్చు. కానీ నాకు బాధ కలిగించే విషయం ఏమిటంటే పాండిత్యం అన్న పదానికి అర్థం మారిపోతోంది. అధ్యయనం, ఆలోచన, విశ్లేషణ అన్న పదాలు మరుగున పడుతున్నాయి. ఎవరికి ఎలా తోస్తే అలా మాట్లాడేయటం, అదే గొప్ప అన్నట్టు వాదించేటయం, గొంతు చించుకుని అరచి నిజాన్ని అణచి వేయటం కనిపిస్తోంది తప్ప నిలచి ఆలోచించి నిజానిజాలు విచారించే విచక్షణ అన్నది సమాజంలో కనిపించటంలేదు.'

'విచక్షణ... అంటే మనువు చెప్పిందేనా?' నవ్వుతూ అడిగింది శిల్ప.

'అలాగే అనిపిస్తోంది. విచక్షణ అనగానే 'మనువు' గుర్తొస్తున్నాడంటేనే ఎంతగా విచక్షణ రహితం అయిందో సమాజం బోధపడుతుంది. నాకు అర్థంకానిదేమిటంటే వీళ్ళు మనువాదులని తిట్టేవారికీ మనుస్మృతి తెలియదు. పడుతున్న వారికీ తెలియదు. గుడ్డివాడు గుడ్డివాడి మీద రాళ్ళు విసురుకుంటున్నట్టు విసురుకుంటున్నారు. గొంతు చించుకున్న వాడిది నిజం అంతే..'

'అందరూ ఇలాగే ఉన్నారు.' అంది శిల్ప.

శరత్ మాట్లాడలేదు. ఎందుకో శిల్ప కళ్ళల్లోకి చూశాడు. ఆమె అతడి వైపే చూస్తోంది. ఆ కళ్ళల్లో ఏదో భావం ఉంది. అది శరత్‌కి అర్థం కావటం లేదు. కానీ అతడి గొంతు పెగలటం లేదు.

ఆమెనుంచి కన్ను తిప్పుకోవాలనిపించటంలేదు. ఆమె వైపే చూస్తూండటం సభ్యంగా అనిపించటంలేదు.

ఆమె కూడా అతడివైపే చూస్తోంది. ఆమె మనసులో చిత్రమైన సంచలనం కలుగుతోంది. ఆమెకీ అర్థంకావటంలేదు. కానీ అతడితో వీలయినంతకాలం గడపాలనిపిస్తోంది ఆమెకు.

శరత్‌కు కూడా ఆమె వైపు చూస్తూ, వీలయినంత సేపు అలాగే ఉండాలని ఉంది.

వెయిటర్ తెచ్చి బిల్లు పెట్టాడు.

వెంటనే రియాక్టయింది శిల్ప బిల్లు డబ్బులు ఇచ్చింది. 'నెక్స్ట్ టైమ్ మీరు ఇవ్వండి' అంది.

'మళ్ళీ ఎప్పుడు?' అడిగాడు శరత్.

'త్వరలోనే' అంది శిల్ప లేస్తూ.

'అమ్మా మా సినిమా గురించి పేపర్లో వచ్చింది' ప్రశాంతికి పేపర్‌లో చూపించాడు సుమంత్.

'ఏదీ' సంతోషంగా చూసింది ప్రశాంతి.

'నువ్వు లేవేమిటి ఫోటోలో?' అడిగింది నిరాశగా.

'అదంతే అమ్మా. అంతా చేసేది నేనే కానీ పెట్టుబడి పెట్టిన వాళ్ళు ఫోటోలో కనబడితే వాళ్ళకి ఆనందం. వాళ్ళ ఆనందమే మాకు ఆనందం. నా పేరు రాశారు చూడు.'

'సహాయకుడిగా రాశారు' అంది ప్రశాంతి.

'అవునమ్మా.. పెట్టుబడులు పెద్ద పేరును చూసి వస్తాయి. నేను ఇంకా అన్‌ప్రూవ్డ్ టాలెంట్ కదమ్మా. అసలు సినిమా ప్రపంచమే వేరమ్మా. ఇప్పుడు పేరు వచ్చిన వాళ్ళు ఎందరో చిన్న చిన్న పనులు చేస్తూ, ఎన్నో ఏళ్ళు అలా అందరి విశ్వాసాన్ని చూరగొని అవకాశాలు సాధించినవారు. అందినవకాశాన్ని ఉపయోగించుకుని పెద్ద స్టార్లయ్యారు. మేము చాలా అదృష్టవంతులం. మాకు పెద్ద కష్టాలు పడకుండా సినిమా తీసే అవకాశం వచ్చింది. దీనికి మా ఫ్రెండ్స్ చాలా కష్టపడ్డారు. అందుకని వాళ్ళుకూడా ఫోటోలో ఉన్నారు. నేను కేవలం పని ద్వారానే ఉపయోగపడుతున్నాను. డబ్బు సహాయం లేదు. అందుకని నేను క్రిందనే ఉన్నాను'

సుమంత్ ఇస్తున్న వివరణ వింటుంటే శరత్‌కి జరుగుతున్నది అర్థమవుతున్నది. సుమంత్‌ని పక్కకు నెడుతున్నారని తెలుస్తోంది. కొన్నాళ్ళకి ప్రాజెక్టు నుంచి సుమంత్‌ని బయటకు నెడతారు. అప్పుడు ఆ దెబ్బకి సుమంత్ ఎలా తట్టుకుంటాడా అని ఆలోచిస్తున్నాడు శరత్.

సుమంత్ బయటకు వెళ్ళబోతూంటే పిలిచాడు శరత్.

'ఏదీ, మీ ప్రెస్‌క్లిప్పింగ్ మాకు చూపించవా?' అడిగాడు.

అయిష్టంగా పేపర్ శరత్‌కి అందించాడు సుమంత్.

'నువ్వు డబ్బులేమీ పెట్టలేదా?' అడిగాడు శరత్.

'నువ్విస్తే కదా?' విసురుగా అన్నాడు సుమంత్.

'నువ్వడిగావా? ' తిరిగి అడిగాడు శరత్.

'నేను అడిగినా ఇస్తారు? మీరు డబ్బులివ్వరు లెక్చరిస్తారు. అందుకని నేను పెట్టుబడి పెట్టలేదు. అందుకే నాకు వాళ్ళు ప్రాధాన్యం ఇవ్వలేదు.'

'సుమంత్.. నువ్వింకా చిన్నపిల్లవాడివి. ఈ ప్రపంచరీతి నీకు తెలియదు. ఇక్కడ ఎదుటివాడిని మోసం చేయటం గొప్ప. ఒకవేళ ఈ ప్రాజెక్టు నుంచి నిన్ను తొలగిస్తే నువ్వేమీ బాధపడకు. ఇదే జీవితం కాదు. నా ఫ్రెండు అవసరమైతే రిఫరెన్సులు..'

'నా గురించి మీరు బాధపడకండి. నా బ్రతుకు నేను చూసుకోగలను. నా వ్యవహారాల్లో మీరు జోక్యం చేసుకోకండి చాలు' విసురుగా అని బయటకు వెళ్ళిపోయాడు సుమంత్.

'శుభం పలకమంటే ఏదో అన్నాడట. అలా ఇంకా వాళ్ళ సినిమా స్టార్ట్ కానేలేదు. అప్పుడే వాడిని బయటకు గెంటేయటం గురించి మీరు మాట్లాడితే ఎలా?' అరిచింది ప్రశాంతి.

శరత్ మాట్లాడలేదు. టేప్ ఆన్ చేశాడు.

'ఏయ్ దిల్ హై ముష్కిల్ జీనా యహా

జర హట్‌కె, జర బచ్‌కే యేహై బొంబయ్ మెరి జాన్ '

జాగ్రత్తలు చెప్తున్నాడు రఫీ. ఒకప్పుడు అది బొంబాయికి వర్తించేవి. ఇప్పుడు మొత్తం ప్రపంచానికి వర్తిస్తుంది అనుకున్నాడు శరత్.

'మధు వాళ్ళబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడట.'

ఆఫీసంతా అందరూ అదే చర్చిస్తున్నారు.

ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం అందరూ నిర్ధారణగా చెప్తున్నా, ఎందుకో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కొందరు మధు ఇంటికి వెళ్ళివచ్చారు. 'ఫ్యానుకి వేలాడి ఆత్మహత్య చేసుకున్నాడు' అని వారు చెప్తున్నారు. ఫీజు కట్టటం విషయంలో తేడా రావటం వల్ల మధుతో కలసి కాలేజీకి తాను వెళ్ళటం గుర్తుకు వచ్చింది శరత్‌కు.

అంతలోనే ఏమైంది?

'విఫల ప్రేమట?' ఎవరో చెప్పారు.

'ప్రొఫెసర్‌తో ఏదో గొడవ వస్తే ఫెయిల్ చేశారట' ఇంకెవరో అన్నారు.

'లేదు.. ఎవరో కులం ఆధారంగా తిట్టారట. వాళ్ళతో తగువులాడేడని సస్పెండ్ చేస్తే భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడట.'

'ఈ ఆత్మహత్య ఆధారంగా కాలేజీలో గొడవలు జరుగుతున్నాయట. శవాన్ని ఇంటివాళ్ళకి ఇవ్వకుండా విద్యార్థులు దాచి పెట్టారట' ఇంకెవరో అన్నారు. వింటున్న శరత్ మనస్సు విడిపోయింది.

ఎందుకని యువతలో నిరాశ ఇంతగా హద్దులు దాటుతోంది? ఆత్మహత్య మహాపాపం అన్న భావన అడుగంటి, ఆత్మహత్యచేసుకున్న వాడి ఆధారంగా ఎవరికి వారు లబ్ధి పొందాలన్న ఆత్రం ఎందుకు పెరుగుతోంది? తన చుట్టూ వున్న వారి మాటలు వినలేక దూరంగా నడిచాడు శరత్. ఆఫీస్ పార్క్ పచ్చగా కళకళలాడుతోంది. చెట్లపైన చిలుకలు కువకువమంటూ ఒక కొమ్మపై నుంచి మరో కొమ్మపైకి దూకుతున్నాయి. ఉడతలు పరుగులిడుతున్నాయి.

ఎంత అందం ఉందీ ప్రపంచంలో. ఏరోజుకారోజు అవే విషయాలు, అవే దృశ్యాలు ఎంతో భిన్నంగా, ఎంతో వైవిధ్యంగా కనిపిస్తాయి. ఎందుకని వీటిని చూసి ఆనందించలేకపోతున్నారు మనుషులు?

జీవితం అయాచితంగా లభించే అద్భుతమైన వరం. దాన్లో కష్టాలు, సుఖాలు, ఆనందాలు, అవమానాలు, ఆశలు, నిరాశలు అన్నీ కలగలసిన వరం అది. దాన్ని అనుభవించాలి. కష్టం కలిగితే భోరున ఏడవాలి. సుఖం కలిగితే విపరీతంగా ఆనందించాలి. ఏడుపు వచ్చిన సమయంలో ఏడుస్తూ రాబోయే నవ్వు గురించి ఆలోచించాలి. నవ్వే సమయంలో రాబోయే ఏడ్పును గుర్తుంచుకుని మరింతగా నవ్వాలి. అంతేకానీ, అమూల్యమైన జీవితాన్ని, కారణం ఏదైనా పారేసుకుంటారా? బ్రతికి ఉంటే పోరాటం సాగించవచ్చు. మార్పు వైపు అడుగులు వేయవచ్చు, ఏదీ లేకున్న తరువాత తరాన్ని లేక ఆదర్శాలకు అనుగుణంగా తీర్చిదిద్దవచ్చు. అదేమీ లేకుండా ఆత్మహత్య చేసుకుంటే అన్నీ అంతం అయిపోతాయి తలుపుకు తాళం వేసినట్టు.

ఎందుకని ఆత్మహత్యను గ్లోరిఫై చేస్తున్నారు మనుషులు? ఎందుకని ఆత్మహత్య చేసుకుని చచ్చినవాడు 'అమర్ రహే' అని అరుస్తూ ఆత్మహత్య చేసుకోమని పదిమందికి ఊపునిస్తున్నారు?

ఆలోచిస్తున్న శరత్ మదిలో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. ఇలా ప్రాణత్యాగం చేసిన వారిని గ్లోరిఫై చేయటం వల్ల ఇతరులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా అమూల్యమైన జీవితాన్ని పారేసుకుంటారనా, మహాత్మాగాంధీ, దేశం కోసం ఉరిని కౌగిలించుకున్న భగత్ సింగ్‌ను సమర్థించలేదు?

భగత్‌సింగ్ ధైర్యంగా ఉరిని కౌగిలించుకున్నాడు. కానీ అతనే బ్రతికి వుంటే, ఇంకెన్ని వీరోచితమైన పోరాటాలు సాగించి వుండేవాడు? ఎంత జీవితం అతని ఎదురుగా వుండేది?

అమూల్యమైన జీవితాన్ని పారేసుకోవటం ఫేషన్ కావద్దనేనా మహాత్మాగాంధీ భగత్‌సింగ్‌ను సమర్థించలేదు?

అది గ్రహించక ఈనాడు సమాజం ఆత్మహత్యలను గ్లోరిఫై చేసి, ఆత్మాహుతులను హీరోలు చేసి యువతను ఆత్మహత్యలవైపు తరుముతోందా? ఆలోచిస్తున్న శరత్ పక్కన అలికిడి అవటంతో తిరిగి చూశాడు.

'బాస్ రమ్మంటున్నాడు' చెప్పాడు ప్యూన్.

'ఎందుకు పిలిచాడో?' అని ఆలోచిస్తూ ఆవైపు వెళ్ళాడు శరత్.

గదిలో అడుగుపెట్టి బాస్ ముఖం చూడగానే అతడు ఎందుకు పిలిచాడో అర్థమయింది శరత్.

బాస్ ముఖంలో విషాదం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

శరత్ కూచోగానే, రెడ్‌లైట్ వేశాడు బాస్. తమని డిస్టర్బ్ చేయవద్దని సూచన అది.

హఠాత్తుగా ఏడుపు ఆరంభించాడు అతడు.

కంగారు పడ్డాడు శరత్. 'ఏమైంది?' అడిగాడు.

ఎప్పుడూ గంభీరంగా వుండి, పని తప్ప మరొకటి పట్టని ఈయన ఇలా హృదయవిదారకంగా ఏడవటం జీర్ణించుకోలేకపోతున్నాడు శరత్.

🦋🦋🦋

**ఏడుస్తున్న బాస్‌ను** చూస్తూంటే శరత్ మనస్సు చిత్రంగా స్పందించింది. పైకి కనబడే మనుషులు వేరు. మాటల ద్వారా అర్థమయ్యే మనుషులు వేరు. కానీ అస్సలు మనిషిని ఎవ్వరూ గుర్తించలేరు. శరత్‌కి తెలుసు, బాస్ దాంపత్య జీవితం అంత ఆనందప్రదమైనది కాదని. అతనికన్నా పెద్ద వుద్యోగం అతని భార్యది. దాంతో అతని భార్య అతడిని అందరి ముందు చులకన చేస్తుందనీ, లెక్కచేయానీ, పిల్లలకోసం కలసి వుంటున్నామనీ ఓసారి శరత్‌తో ఆయన చెప్పుకున్నాడు. అప్పుడప్పుడు ఇలా బాధ కలిగినపుడు రెడ్‌లైట్ వేసి శరత్‌తో బాధలు చెప్పుకుంటాడు. కానీ ఎప్పుడూ ఇలా ఏడవలేదు. కాస్సేపటికి దుఃఖం తీవ్రత తగ్గింది. లేచి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చాడు. స్టెనోకి ఫోన్ చేసి 'టీ' పంపమని చెప్పాడు.

తరువాత శరత్ వైపు తిరిగాడు.

'ఒకోసారి నేను ఎందుకు బ్రతుకుతున్నానో, ఈ జీవితానికి అర్థం ఏమిటో తెలియదు శరత్! నాకు పెద్ద వుద్యోగం వుంది డబ్బులకు కొదువ లేదు. కానీ నాకు ప్రేమ అన్నది తెలియదు. యవ్వనంలో ప్రేమ గురించి ఎన్నో కలలు కన్నాను. నాలో వున్న ప్రేమ భాండాగారాన్ని నా భార్యపై కురిపించాలనుకున్నాను. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. అంతలో ఆమెకి ఉద్యోగం దొరికింది. అది నా కన్నా వున్నతమైనది. అప్పటి నుంచీ ఆమె మారిపోయింది. ప్రేమ అన్నది మా ఇద్దరి దరిదాపులకు రాలేదు. మా ఇద్దరి బెడ్‌రూమ్‌లు వేరాయ్యాయి. హోదా, డబ్బు మనుషుల సంబంధాలను ఇంతగా మార్చేస్తాయా? పెళ్ళయినప్పుడు ఆమెకు ఉద్యోగమేలేదు. నేను ఆమెని తక్కువ చేయలేదే? నా హృదయంలో ఇంతకాలం దాచిన ప్రేమను ఆమెకు అందివ్వాలని తహతహలాడాను.

నేను ఆఫీసర్‌ని. నా క్రింద ఎంతోమంది వుద్యోగస్తులున్నారు. వారు నన్ను గొప్పవాడిలా చూస్తారు. కానీ నా ఇంట్లో నా భార్య దృష్టిలో నేను పనికిరాని వాడిని. నేను చీపురుపుల్ల అంత కూడా చెయ్యను. కానీ పిల్లలు, వాళ్ళకి నేనంటే ప్రేమ. వాళ్ళకోసం ఏమైనా భరిస్తాను నేను. అందుకే ఎన్నోసార్లు విడాకుల ఆలోచన వచ్చినా దాన్ని నేను పక్కకు పెట్టేశాను. తను కూడా 'డైవోర్సీ' అన్న ట్యాగ్‌వల్ల తన కెరీరు దెబ్బ తింటుందని నాతో కలిసి వున్నట్టు నటిస్తోంది. తనకి నేను అవసరం లేకున్నా పిల్లలకు నేను అవసరం అని నేను అన్నింటినీ భరిస్తూ వచ్చాను. కానీ...'

మళ్ళీ అతని కళ్ళల్లో నీళ్ళూరాయి.

తలుపు కొట్టి ప్యూన్ వచ్చి టీలు పెట్టివెళ్ళాడు.

'నా కూతురు నాతో కలిసి ఒకే ఇంట్లో వుండలేదట. దానికి వాళ్ళమ్మ మద్దతు. హాస్టల్‌లో వుండి చదువుకుంటుందట. రాత్రి ఆలస్యంగా వస్తే, ఎందుకని ఆలస్యం అయిందని అడిగాను. వయసు వచ్చిన పిల్ల కదా, జాగ్రత్తగా వుండాలని అన్నాను. వాళ్ళమ్మ ఎలాగో ఏమీ పట్టించుకోదు. ఆమెకు తీరిక వుండదు. అందుకని నేను చెప్పాను. దానికి వాళ్ళమ్మ నన్ను అనుమానం మనిషి అంది. పురుషాహం నాది అంది. హైసొసైటీకి తగని వాడిని అంది. పాత భావాల బూజు పట్టిన మనిషిని అంది. అమ్మాయిని హాస్టల్‌లో చేర్పించింది. చెప్పు నేను చేసిన తప్పు ఏముంది? అబ్బాయి వేరే నగరంలో హాస్టల్‌లో వున్నాడు. అమ్మాయి వున్న వూళ్ళోనే హాస్పటల్‌లో వుండటం ఏమిటి? ఇక జీవితానికి అర్థం అర్థం ఏముంది? అది హాస్టల్ వెళ్తూ ఏమందో తెలుసా?' అతికష్టం మీద కన్నీళ్ళు ఆపుకున్నాడతడు.

శరత్‌కి బాధగా అనిపించింది.

ఏమవుతోంది మానవ సంబంధాలు? కుటుంబంలో సంబంధ బాంధవ్యాలు అనూహ్యంగా రూపాంతరం చెందుతున్నాయి.

తండ్రి ముందు నిలబడి మాట్లాడాలంటేనే బయపడేవారు ఒకప్పుడు. మామూలు సమయం కన్నా కాస్త ఆలస్యమయితేనే నాన్న ఏమంటాడో అన్న భయం వుండేది. పెద్దలంటే గౌరవం వుండేది. ఇప్పుడవన్నీ ఏమైపోయాయి?

ఆలస్యంగా ఇంటికి రావద్దని తండ్రి అంటే ఆ తండ్రితో కలసి వుండలేదా కూతురు? దానికి తల్లి వత్తాసా?

ఇదే అభ్యుదయమా? ఇదే స్వేచ్ఛా? ఇదే అభివృద్ధా? ఇదే నాగరికతనా?

కానీ.. ఇక్కడ తండ్రి 'ఆలస్యంగా వచ్చావేమిటి?' అని అడిగితే భరించలేని అమ్మాయి హాస్టల్ నియమ నిబంధనలతో ఎలా ఒదుగుతుంది?

హాస్టల్ నిబంధనలతో ఒదిగే అమ్మాయి ఇంట్లో తండ్రి మాటనే వినచ్చుగా? అయినా తండ్రితో కలిసి వుండలేని అమ్మాయి రేపు పెళ్ళయితే భర్తతో, అత్తమామలతో ఎలా సర్దుకుంటుంది?

ఇలా సర్దుకోవటం, సహనం తల్లిదండ్రులలోనే లోపించటం పిల్లలపై ప్రభావం చూపిస్తోందా? ఫలితంగా, సమాజంలో విడిపోవటాలు, ఒంటరి జీవితాలు అధికమౌతున్నాయా? అసంతృప్తులూ, నిరాశలతో వ్యక్తిగత జీవితాలు అల్లకల్లోలమౌతున్నాయా?

హర్ ఎక్ జిస్మ్‌ఘాయత్, హర్ ఎక్ రూహ్‌ప్యాసీ

నిగాహోమే ఉల్ఝన్, దిలోమే ఉదాసీ

యె దునియా హై యా ఆలమ్ - ఎ - బద్ హ వాసీ

సాహిర్ లూధియాన్వీ పాట శరత్ మనస్సులో మెదిలింది.

ప్రతి శరీరం గాయాల మయం. ప్రతి హృదయం ప్రేమదాహోతప్త హృదయం. ప్రతి ఒక్కరి కళ్ళల్లో సందేహాలు, సంశయాలు. మనస్సులలో నిరాశా నిస్పృహలు. ఇది ప్రపంచమా? లేక నిరాశా నిస్పృహల నరకమా?

ఎప్పుడో రాసిన సాహిర్ కవిత ఇప్పటి సమాజానికీ వర్తిస్తుంది.

ఆలోచనల్లో మునిగిన శరత్‌ని చూసినవ్వాడు బాస్.

'నాకు బాధలు చెప్పుకోవటానికి ఎవ్వరూ లేరు. ఎవరికి ఏం చెప్పినా అది రకరకాల వికృత రూపాలు ధరించి మళ్ళీ నా దగ్గరకు తిరిగి వస్తుంది. నువ్వొక్కడివే నా బాధను అర్థం చేసుకుంటావు. మరొకరి దగ్గర మళ్ళీ ఈ మాటలు అనవు. అందుకని నాకు బాధ కలిగినప్పుడల్లా నీ భుజం పై తల పెట్టి ఏడుస్తాను. బాధలు చెప్పుకుంటాను' అన్నాడు.

శరత్ మనస్సు బాధతో మెలితిరిగింది.

ఎంతటి దుర్భరమైన పరిస్థితి.

మనసు విప్పి తన బాధను చెప్పుకోవటానికి మరో వ్యక్తి లేకపోవటం ఎంతటి దయనీయకమైన పరిస్థితి.

తనవారంటూ ఒకరులేని పరిస్థితిలో ఎంత హోదా వుండి ఏం లాభం? ఎన్ని డబ్బులుండి ఏం లాభం?

మనసున మనసై, బ్రతుకున బ్రతుకై

తోడొకరుండిన, అదే భాగ్యము, అదే స్వర్గము.

ఎంత నిజం.

రంభ వూర్వశి మేనకలు స్వర్గం కాదు.

అష్టైశ్వర్యాలు స్వర్గం కాదు.

మణి మరకత మాణిక్యాలు స్వర్గం కాదు.

కార్లు మేడలు మిద్దెలు, నౌకర్లు ఇవేవీ స్వర్గం కాదు. భాగ్యంకాదు.

మనసు విప్పి మాట్లాడేందుకు ఓ మనిషి వుండటాన్ని మించిన భాగ్యం లేదు. దాన్ని మించిన సాధ్యం లేదు.

ఎందరికీ భాగ్యం వుంటుంది? ఎందరికీ సౌఖ్యం లభిస్తుంది?

ఎవరికి వారు ఈ సౌభాగ్యం వేటలో, ఈ సౌఖ్యం పోరాటంలో తమదైన రీతిలో తమదైన విధానంలో సంతృప్తి పొందాలని ప్రయత్నిస్తుంటారు. తమ ఒంటరితనాన్ని మరచిపోవాలని ప్రయత్నిస్తుంటారు. ఈ ప్రయత్నమే వ్యక్తి జీవిత కథనా? తనలోకి తాను చూసుకున్నాడు శరత్.

తనకి ఎప్పుడూ ఎవరికీ బాధను చెప్పుకోవాలనిపించలేదు. ఎప్పుడూ ఏడవటానికి ఓ భుజం కావాలన్న భావన కలగలేదు. ఎప్పుడూ ఎవరితోడో, సాహచర్యమో కావాలన్న తపన లేదు. లేదన్న బాధ లేదు.

తనకు పాటలు వింటూ వాటి భావం అనుభవిస్తుంటే చాలు జీవితంలో ఇంకేమీ అవసరం లేదనిపిస్తుంది.

కవితలు చదువుతూంటే చాలు ఇదే స్వర్గం అనిపిస్తుంది.

పుస్తకాలు చదువుతూ రచయితలు సృష్టించిన మరో ప్రపంచంలో విహరిస్తూంటే అదే సౌఖ్యం అనిపిస్తుంది.

అంతలో అతని మనస్సులో శిల్ప మెదిలింది.

ఈ మధ్య తనకు శిల్పతో ప్రతి విషయం మాట్లాడటం అలవాటయింది.

ఇంతవరకూ ఎవ్వరితో ప్రస్తావించని విషయాలు, మనసులోపలి మాటలు ఆమెతో చెప్పటం అలవాటవుతోంది.

అతని ఆలోచనలను భగ్నం చేస్తూ ఆఫీసరు కదిలాడు.

శరత్ దృష్టి మళ్ళింది.

ఆఫీసర్‌కి తన అవసరం తీరింది.

ఇప్పుడాయన కూతురు దూరమైందని కన్నీరు పెట్టిన తండ్రి కాదు. ఆఫీసరు. బాస్.

లేచాడు శరత్. 'నేను వెళ్తాను. సెక్షన్‌లో పనుంది' అన్నాడు.

'మీరివ్వాల్సిన స్టేట్‌మెంట్ త్వరగా ఇవ్వండి. 'అన్నాడు బాస్ అధికారం వుట్టిపడే స్వరంతో, ఫైళ్ళను దగ్గరకు లాక్కుంటూ.

తనలో తాను నవ్వుకుంటూ బయటకు వచ్చాడు శరత్.

ఈ ప్రపంచం ఎంత విచిత్రమైనదో! అనిపించింది.

ఏ భావనా శాశ్వతం కాదు.

ఏ ఆవేదనా శాశ్వతం కాదు.

ఒక్క క్షణం ఫలానా వారు లేకపోతే జీవితం లేదనిపిస్తుంది. ఏదో బాధను భరించలేమనిపిస్తుంది. కానీ మరుక్షణం ఆ మనిషినే మరిచిపోతాడు. భరించలేమనుకున్న బాధ కొన్నాళ్ళకి మరపున పడుతుంది.

జీవితం సాగిపోతుంది. సాగిపోతూ ఏదో ఓ చోట అంతమౌతుంది.

ఆలోచిస్తూ సెక్షన్‌లోకి వచ్చి కూచున్నాడు శరత్.

పరస్పర భిన్నమైన అనుభూతులతో, ఆలోచనలతో అతని మనస్సు అల్లకల్లోలంగా వుంది.

ఇంతలో పరిమళం దగ్గరగా వచ్చినట్టనిపించి చూశాడు.

మాధవి వచ్చింది.

'ఏం సార్.. శిల్పతో మీకు మంచి దోస్తీ కుదిరనట్టుంది?' అడిగింది.

నిర్ఘాంతపోయాడు శరత్. ఆశ్చర్యం అవధులు దాటింది. అంతలో బాధ ఒక్కసారిగా అలలా ఎగిసిపడింది.

ఈమెకి ఎలా తెలిసింది?

ఈమెకి తెలిస్తే అందరికీ తెలుస్తుంది.

అలా ప్రశాంతికి తెలిస్తే?

ఈ ప్రపంచంలో ప్రతి కర్మకూ ఫలితం వుంటుంది.

మంచికి మంచి ఫలితం వుంటుంది.

చెడుకు చెడు ఫలితం వుంటుంది.

మంచో, చెడో ఫలితం మాత్రం వుండి తీరుతుంది.

అది తాను శిల్పను ఒంటరిగా కలిసినపుడు ఆలోచించాల్సింది. అప్పుడు ఆలోచన అన్నది లేకుండా కలిశాడు. ఇప్పుడీమె ఈ ప్రశ్న అడగ్గానే వులిక్కిపడి ఆలోచనల్లో పడ్డాడు అనుకున్నాడు శరత్.

పైకి 'ఎందుకలా అంటున్నారు?' అనడిగాడు. ఏమీ తెలియనట్టు.

'ఏమీలేదు. శిల్ప ముఖం మిమ్మల్ని చూడగానే వెలుగుతుంది. మీ ముఖం నవ్వుతో నిండుతుంది అందుకని' అంది.

శరత్ నవ్వి వూరుకున్నాడు. మాటలు పెంచితే ఏది ఎక్కడ తేలుతుందో అన్న భయం వుందతనికి.

శరత్ ఏమీ మాట్లాడక పోవటంతో మాధవి అతనికి దగ్గరగా వచ్చింది. రహస్యం చెప్తున్నట్టు అంది 'లంచ్‌లో మొత్తం ప్రపంచంలో మీరిద్దరే వున్నటు మైమరచి మాట్లాడుకుంటూంటే బాగా దోస్తీ కుదిరిందనిపించింది' అంది పిడుగు పడ్డట్టయింది శరత్ పరిస్థితి.

అతడికి అక్కడనుంచి లేచి పారిపోవాలనిపిస్తోంది.

ఇప్పుడీ విషయం అందరికీ తెలిస్తే?

శిల్ప ఏమనుకుంటుంది?

ఆమెని మాటలంటారు? ఏడిపిస్తారా? హేళన చేస్తారా?

శరత్ కడుపులో వికారంగా అనిపిస్తోంది. ఒళ్ళంతా వేడి ఆవిర్లు వస్తున్నట్టు అనిపిస్తోంది.

అతడినే పరిశీలనగా చూస్తున్న మాధవి నవ్వుతూ అంది 'పాపం ఒంటరిది శిల్ప. జాగ్రత్తగా చూసుకోండి' అంది. అని నవ్వుతూ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళేటంతోటే లేచి గబగబా బయటకు వెళ్ళాడు శరత్.

అతడికి ఒంటరిగా వుండాలని వుంది. అందరికీ దూరంగా పారిపోవాలని వుంది.

అతడి కళ్ళముందు పలు భయంకరమైన దృశ్యాలు కదులుతున్నాయి. ఆఫీసులో అందరూ తనను పరిశీలనగా చూస్తున్నట్టు అనిపిస్తోంది. అందరూ తననూ శిల్పనూ చూసి సైగలు చేసుకుంటూ ఏవేవో చెప్పుకుంటున్నట్టు అనిపిస్తోంది. హేళనగా నవ్వుతున్నట్టు అనిపిస్తోంది.

ఆఫీసులో ఇలాంటి వ్యవహారాల గురించి అందరూ మాట్లాడుకునే సాధనం, వాళ్ళని చూసే విధానం శరత్‌కి తెలుసు. ఎంతో అసహ్యంగా వుంటుంది. జుగుప్సాకరంగా వుంటుంది. ఇద్దరి మధ్య వున్నంత కాలం ఎంతో అందంగా, వున్నతంగా వున్నది, మూడో వ్యక్తి కంటపడగానే అసభ్యంగా, నేరంగా మారుతుంది. వణుకుతున్న వేళ్ళతో శిల్ప నెంబరు వెతకసాగాడు. దొరకగానే ఫోను చేశాడు.

'హలో' అంది శిల్ప.

**శిల్ప 'హలో' అన్న** తరువాత ఏం మాట్లాడాలో అర్థం కాలేదు శరత్‌కు. తాను శిల్పకు ఫోను చేయటం ఎంత మూర్ఖత్వమో అర్థమయింది.

ఎవరో ఏదో అనగానే తాను రియాక్టవటం ఏమిటి? వెంటనే శిల్పకు ఫోను చేయటం ఏమిటి?

దీన్లో శిల్ప ఏం చేస్తుంది?

ఎందుకని అలా రియాక్టయ్యాడు?

అంటే తన మనసులో ఏదో మూల శిల్పను కలవటం 'తప్పు' అన్న భావన తనకు వుందా?

శిల్ప పట్ల తన మనసులో తాను బహిరంగంగా ప్రకటించని భావనలు వున్నాయా? ఇప్పుడు మాధవి మాటలవల్ల వాటి స్వరూపం బయట పడుతుందన్న భయం తన విచక్షణను హరించిందా?

'హలో' అంది శిల్ప మరోసారి.

'హలో శిల్పా!' అన్నాడు శరత్. అతడి గొంతు బొంగురుగా ధ్వనించింది.

'ఏమీ నా భాగ్యము.. మీరే ఫోను చేశారు?' అంది నాటకీయంగా.

'ఏమీలేదు.... మాట్లాడాలనిపించింది' అన్నాడు శరత్

'చెప్పండి.. ఫోనులో చెప్తారా? బయట కలుద్దామా?' అంది శిల్ప.

శరత్ గొంతు పెగలలేదు. అతడి మెదడు మొద్దు బారిపోయింది.

అంతవరకూ తాను శిల్పను బయట కలుస్తున్నాడని వేరేవారికి తెలిసిందన్న ఆలోచన అతడిని కలవర పరిచింది. కానీ ఇప్పుడు శిల్ప 'బయట కలుద్దామా?' అనటంతో ఒక్కసారిగా కలవరం అణగిపోయింది. ఉద్విగ్నత ఉత్తేజమై ఉరకలు వేసింది. ఆమెను కలవాలనిపించింది. మిగతా ఆలోచనలు, భయాలు అదృశ్యమై పోయాయి. ఆవిరైపోయాయి.

'బయట కలుద్దాం' అన్నాడు.

'ఎక్కడ?' వెంటనే అడిగింది.

అతడికి ఏం చెప్పాలో తెలియలేదు. 'మనం కలుస్తున్నట్టు ఎవరి కంటా పడనిచోటు' అన్నాడు అనాలోచితంగా.

నవ్వింది శిల్ప 'వహీ జహా కోయీ ఆతా జాతా నహీ' అంది.

'నువ్వే ఆలోచించు. నువ్వే నిర్ణయించు. నా మెదడు పనిచేయటంలేదు' అన్నాడు శరత్.

నవ్వింది శిల్ప 'ఇన్నాళ్ళూ మిమ్మల్ని కలవాలని నేనే తపిస్తున్నానని అనుకున్నాను.

'ఖుద్ ఢూండ్ రహీ హై షమ్మ జీసే క్యా బాత్ హై.. ఉస్ పర్వానే కీ' అని పాడుకుంటున్నాను.

బాగుంది మీరు పిలవటం. థాంక్యూ నేను మెసేజ్ ఇస్తాను.' అంది శిల్ప.

ఫోను పెట్టేసిన శరత్‌కు శిల్ప ఇచ్చిన రిఫరెన్స్ తెలుసు.

'ఆంఖోంసె జొ ఉత్‌రీ హై దిల్మే, తస్వీర్ హై ఎక్ అన్‌జానే కీ' అనే పాట పల్లవిలోని పాదం ఆమె కోట్ చేసింది.

కళ్ళల్లోంచి హృదయంలోకి ఒక అపరిచితుడు చిత్రం జారి స్థిరపడిదన్న అర్థం వస్తుంది. అంటే ఆమె కళ్ళు ఓ అపరిచితుడిని చూశాయి. ఆ అపరిచితుడి స్వరూపం ఆమె హృదయంలో స్థిరపడింది. అప్పటి నుంచీ ఆమె అతడి కోసం వెతుకుతోంది.

సాధారణంగా ఉర్దూ, పార్సీ కవితలలో స్త్రీని దీపంతోనూ, అంటే షమ్మ, పురుషుడిని దీపం పురుగు 'పర్వానా'తోనూ పోలుస్తారు.

దీపం చుట్టూ తిరుగుతుంది దీపం పురుగు. దీపంలో పడి మాడిపోతానని తెలిసి కూడా దీపంలో పడుతుంది.

దీపం అక్కడే వుంటుంది. దీపాన్ని వెతుకుతూ వెళ్ళి దాన్లో పడి పురుగు మాడిపోతుంది.

స్త్రీ పురుష సంబంధంలో పురుషుడు చొరవతీసుకుంటాడు. స్త్రీని ఆకర్షించాలని ప్రయత్నిస్తాడు. ఆమె వెంట పడతాడు. సాధారణంగా స్త్రీ పురుషుడి వెంట పడి, అతడిని ఆకర్షించాలని ప్రయత్నించి 'నన్ను ప్రేమించమ'ని ప్రాధేయపడదు. అది సినిమాల్లో పురుషులు కల్పించిన పురుష ఫాంటసీ.

సాధారణంగా పర్వానా, షమ్మను వెతుకుతూ వెళ్తుంది. దీపం, దీపం పురుగును వెతుకుతూ పోదు.

కానీ, ఈ సందర్భంలో దీపమే దీపం పురుగును వెతుకుతోంది. అంటే - ఎంత గొప్పదికదా ఆ దీపం పురుగు.

'ఖుద్ ఢూండ్ రహీ హై షమ్మ జిసే క్యా బాత్ హై.. ఉస్ పర్వానే కీ'

ఒక్కసారిగా శరత్ హృదయం ఉప్పొంగింది.

క్షణం క్రితం ఉద్విగ్నత, ఆందోళనలు అన్నీ అదృశ్యమయ్యాయి.

శిల్ప తనను అభిమానిస్తోంది. తనను కలవాలని కోరుకుంటోంది. కానీ తాను చొరవ తీసుకోకపోవటం వల్ల తనే అడుగు ముందుకేసింది.

కానీ ఎందుకోసం? దీని ఫలితం ఏమిటి? పర్యవసానం ఏమిటి?

ఒక్కసారిగా కృంగినట్టయింది శరత్ హృదయం.

అంతలోనే ఇంత వయసు వచ్చినా యవ్వనం నాటి ప్రేమ భావనలు తనలో నశించలేదనన్ భావన బలంగా అతడిని తాకింది.

మనిషి వయసు పరంగా ఎంతగా ఎదిగినా అతడు పసివాడేనా?

తనకు వివాహమయింది. పిల్లలు ఎదుగుతున్నారు. వారు ప్రేమలో పడే వయసులో వున్నారు.

ఇలాంటి పరిస్థితిలో తాను ఇంకా ప్రేమకోసం తపిస్తున్నాడా? ఓ యువతి కలుద్దాం అని అనగానే ఏవేవో ఊహించేసుకుని కలలుగనే యవ్వనపు భ్రమలలోనే వున్నాడా?

ఆ భావనలు తనలో నిద్రాణంగా వున్నాయా? సజీవంగానే వున్నాయా?

శరత్‌కు తిరిగి సీటుకు వెళ్ళాలనిపించలేదు. ఒంటరిగా వుండి తనలో చెలరేగుతున్న పలు విభిన్నమైన భావాలను అర్థం చేసుకోవాలని వుంది. సంచలనాల స్వరూపాన్ని అవగాహన చేసుకోవాలని వుంది.

బయటకు నడిచాడు. దారిలో కనపడినవారు విష్ చేస్తూంటే యాంత్రికంగా 'విష్' చేస్తూ నడిచాడు.

సాధారణంగా ప్రతివారికీ కలలుంటాయి. ఆ కలలకు ప్రాతిపదిక ప్రేమ భావన. ఇంటి వాతావరణంలో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులనుంచి లభించే ఆదరణ, ప్రేమలు వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్నిస్తాయి. సంతృప్తినిస్తాయి. కానీ అతడిలో ప్రాకృతికంగా కలిగే ప్రేమ భావనను అవి తాకను కూడా లేవు.

అది ఒక యువతి మాత్రమే సంతృప్తి పరచగలిగే భావన. కానీ ఆ భావన శాశ్వతమా?

తన జీవితంలో స్రవంతి అడుగుపెటిన తరువాత ప్రేమ రాహిత్య భావన ఆగిపోయింది.

'ఈమె తన స్త్రీ, ఈమె తన ప్రపంచం' అన్న భావన ఆధిక్యం సంపాదించింది. ఊహలు, కలలు, కోరికలు, అన్నీ అణగి, రూపాంతరం చెంది స్రవంతి కేంద్రంగా ఎదిగాయి.

కలలు కలలే. జీవితం జీవితమే.

ఏ కలా నిజం కాదు. ఏ నిజం కలకాదు.

కలను కాలానికి వదిలి నిజంతో రాజీపడి నిజాన్నే కలగనటాన్ని మించిన ఆనందం మరొకటి లేదు. తాను అదే చేస్తూ వచ్చాడు. తాను సంతృప్తిగా, ప్రశాంతంగా వున్నాడని అనుకున్నాడు.. శిల్ప కలిసేవరకూ.

శిల్ప తనలో నిద్రాణమై వున్న ప్రేమ భావనలను జాగృతం చేసిందా?

అణగి వున్న తీరని కోరికలకు వూపిరి పోసి రెక్కలనిస్తోందా?

ఏమిటీ అణగి వున్న ప్రేమ భావన?

శరత్ మనస్సు అల్లకల్లోలంగా వుంది.

ఇది ప్రేమ అనటానికి వీలులేదు. ఇది ఆకర్షణ. తన మనసు మారుమూలల్లో అణగి వున్న రొమాంటిక్ భావనలు జాగృతమై తనకు కలిగిస్తున్న భ్రమ ఇది.

ఇదేనా ఇంద్రియాలు కలిగించే మోహావేశ పరవశం?

భారతీయ తత్వం ఇంద్రియాలు అందించే జ్ఞానం అసంపూర్ణం అంటుంది. ఇంద్రియాలు మనిషికి భ్రమ కలిగిస్తాయని అంటుంది. ఆ భ్రమలో పడ్డ వ్యక్తి తన బుద్దిని విచక్షణను మంచి ఇంద్రియాలు చెప్పినట్టు నడుస్తాడు, నశిస్తాడు అంటుంది వేదాంతం.

'ఆంఖోంసె జొ ఉతరీ హై దిల్మే...' ఇప్పుడు కొత్తకోణంలో అర్ధమౌతోంది. కళ్ళనుంచి హృదయంలో చేరిన రూపం కళ్ళద్వారా హృదయంలోకి చేరింది' పంచేంద్రియాలలో కన్ను ఒకటి.. కళ్ళు మోసం చేస్తాయి. ఇంద్రియాలు ప్రలోభపెడతాయి.

తనకు శిల్ప గురించి ఏం తెలుసు?

శిల్ప రూపం చూశాడు. గానం విన్నాడు. ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆమె సానుకూలంగా స్పందించటంతో తనలో రొమాంటిక్ భావనలు జాగృతం అయ్యాయి.

ఇంతకీ తాను శిల్ప నుంచి ఏమాశిస్తున్నాడు?

శిల్పతో పరిచయంలో ఏం కోరుతున్నాడు?

ఏం సాధించాలనుకుంటున్నాడు?

తనకే తెలియదు. తరచి చూసుకుంటే కళ్ళు.. మనిషికి దారి చూపించి విషయ పరిజ్ఞానం కలిగించే కళ్ళు తనని గుడ్డివాడిని చేశాయి. తనని దారి తప్పించాయి. తనని మోసం చేశాయి.

ఎంతో ఆవేశంగా అనిపించింది శరత్‌కు.

తాను... ఎన్నో పుస్తకాలు చదివాడు. విజ్ఞానవంతులలో ఒకడిగా తనని తాను భావించుకుంటాడు. ఇతరుల కన్నా భిన్నం అనుకుంటాడు.

జీవితంలో అన్నీ అనుభవించాడు. ఒక స్థాయికి చేరుకున్నాడు. మంచి, చెడు గ్రహించగలవాడు తాను ఎలా ప్రలోభంలో పడ్డాడు?

ఇంత ఎదిగినా ఓ యువతి నవ్వుతూ పలకరించగానే, అప్పుడే యవ్వనంలో అడుగుపెట్టిన కుర్రాడిలా కలలు కనటం ప్రారంభించాడు.

శిల్పనుంచి మెసేజ్ వచ్చింది.

'క్రోకిట్ బేకరీలో కలుద్దాం'

వెంటనే సమాధానం ఇచ్చాడు. 'సారీ.. అనుకోని అవాంతరం వచ్చింది. నేను కలవలేను.'

మెసేజ్ ఇచ్చిన తరువాత బాధ అనిపించింది.

'పొరపాటు చేశానేమో?' అనిపించింది.

కానీ అన్ని ఆలోచనలను అణచివేశాడు.

శిల్ప ఇంకా చిన్నపిల్ల. ఆమెలో నిరాశలో వుంది. ఒంటరిగా వుంది.

కానీ తాను అలాకాదు. వయసు పరిణతి కలవాడు. విచక్షనను వుపయోగించాలి. ఇక్కడితో ఈ సంబంధాన్ని ముగించాలి.

ఈ ఆలోచన రావటంతోటే మనసుని ఎవరో మెలిపెట్టినట్టయింది.

శిల్ప తనకేమీ కాదు. ఆమెతో తనకు ఎలాంటి అనుబంధం ఏర్పడలేదు. ఆమెకూ తనకూ నడుమ వున్న అనుబంధ స్వరూపం ఇంకా స్పష్టం కాలేదు.

అయినా, ఇక ఆమెని కలవకూడదు అనుకుంటే ఎలాగో అనిపించింది. ఇక ఆమెని కలవడు, ఆమెతో మాట్లాడడు, ఆమె ఎదురుగా కూర్చుని ఆమెతో పలు విషయాలు చర్చించాడు. ఆమె కళ్ళల్లోకి చూడలేడు, ఆమె అందమైన రూపాన్ని చూడలేడు అన్న భావన అలవికాని ఆవేదనను కలిగిస్తోంది.

తల విదిలించాడు. ఈ బంధానికి ఇంతటితో స్వస్తి చెప్పటం మంచిది. ఇది తన జీవితాన్ని తనపై ఆధారపడిన వారి జీవితాలను అల్లకల్లోలం చేసేలోగా ఇక్కడితో అంతం చేస్తే మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు శరత్. తల విదిలించాడు. గబగబా నడవటం ప్రారంభించాడు.

జిస్ దిల్‌మె బసాధాప్యార్ తెరా, ఉస్ దిల్ కా కభినా తోడ్ దియా

బర్‌నామ్‌న హోనే దేంగె తుఝె, తెర నామ్ హిలే నా ఛోడ్ దియా.

నీ ప్రేమతో నిండిన హృదయాన్ని పగులగొట్టాను. నీ పేరు తలిస్తే నీకు అపకీర్తి వస్తుందేమోనని నీ పేరు తలవటం కూడా మానేశాను.

ముకేశ్ స్వరంలో నిండిన విషాద భావం ఎదలోలోతుల్లోని ఆవేదనను వుబికి వుబికి వెలికి తెచ్చి ప్రక్షాళన చేస్తూంటే, ఆవేదనలో అణగి వున్న అంతులేని ఆనంద స్వరూపం అర్థమవుతోంది శరత్‌కు.

ప్రజలు విషాద గీతాలను ఎందుకు అంతగా ఇష్టపడతారో అర్థమౌతోంది. ప్రతి వ్యక్తితో తాను మోసపోతున్నాడు, తనకు అన్యాయం జరుగుతోంది అన్న భావన అంతర్గతంగా వుంటుంది. ముఖ్యంగా ప్రేమ విషయంలో వ్యక్తి విషాదానికే ప్రాధాన్యం ఇస్తాడు. అందుకే ఫలించిన ప్రేమ గాధలకన్నా విషాదగాధలకే ఆదరణ ఎక్కువ. ఆ విషాదం పొందాలన్న భావనను సంతృప్తి పరచే ఇలాంటి

గీతాలు, వ్యక్తుల తీరని కోరికను సంతృప్తి పరుస్తాయి. విషాదంలోనూ ఆనందాన్ని కలిగిస్తాయి. అందుకే ప్రేమ స్వరూప తెలియని వారు, ప్రేమ భావన దరిదాపులకు కూడా రానివారు కూడా విషాద గీతాలు, విఫల ప్రేమగీతాలు వింటూ స్పందిస్తారు. పరవశిస్తారు. పాట వింటూ తన మనసులోని ఆవేదనను, విషాదాన్ని ప్రక్షాళన చేసుకుంటున్నాడు శరత్.

సంగీతం ఎంతో గొప్పది. సాహిత్యం ఇంకా గొప్పది. సంగీతం, సాహిత్యం కలగలిస్తే ఇక వ్యక్తి మనస్సు రెక్కలు కట్టుకుని అనంతాంబరంలో విహరిస్తుంది. వీటికి సుమధర స్వరం తోడయితే ఇక వ్యక్తి హృదయ లోలోపల్లోనే అనంతాంబరపు నీలినీడల అద్భుత సౌందర్యం సాక్షాత్కారమవుతుంది. అలౌకికానందానుభూతికి నాందీ ప్రస్తావన జరుగుతుంది.

'ఎపుడూ పాటలు వింటూ ఏవో లోకాల్లో తేలటమేనా, కాస్త భూమి మీదకు వచ్చి మాములు ప్రపంచపు వ్యవహారాలు పట్టించుకునేదేమైనా వుందా?' ప్రశాంతి మాటలతో ఒక్కసారిగా ఈలోకానికి వచ్చి పడ్డాడు శరత్.

'ఏమైంది మామూలు ప్రపంచపు వ్యవహారాలకు?' అడిగాడు.

'స్రవంతి ఇంకా రాలేదు. ఫోన్ చేస్తూంటే ఎత్తటంలేదు.' ఆందోళనగా చెప్పింది.

టైమ్ చూశాడు. పది దాటుతోంది.

'ఫ్రెండింటికి చదువుకోటానికి వెళ్ళినట్టుంది' అన్నాడు.

'అదేదో చూడండి. ఆడపిల్ల ఇలా రాత్రిళ్ళు బయట తిరగటం మంచిదికాదని గట్టిగా చెప్పండి. పిల్లలకు తండ్రి భయం వుండాలి. తల్లి ఎంత అరిచినా వాళ్ళు తేలికగా తీసుకుంటారు.'

నవ్వుతూ ఏదో అనబోయాడు. ప్రశాంతి అడ్డుపడింది.

'మీ తెలివితేటల మాటలు కట్టిపెట్టండి. ముందు అమ్మాయిని ఎక్కడుందో తెలుసుకోండి' అంది.

'నువ్వు కంగారు పడకు. అది చిన్నపిల్లకాదు. మంచి చెడు తెలుసు.' దాని గురించి నువ్వెందుకు కంగారు పడతావు? ఇల్లు తప్ప ఎక్కడికీ పోదుకదా!'

కోపంగా చూసింది శరత్ వైపు 'దానికి మంచీ చెడు తెలుసు. దాని స్నేహితులందరికీ మంచీ చెడూ తెలియాలని లేదు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ మంచి చెడు తెలియాలని లేదు. ఎంత వయసు వచ్చినా మంచీ చెడూ తెలియక దెబ్బతినేవారు ఎందరో వున్నారు. ఇంకా విచక్షణ లేని యవ్వనంలో వుంది. దానికి మంచీ చెడు తెలిసినా దాని వయసుకు మంచీ చెడు తెలియదు. దాని యవ్వనానికి మంచీ చెడు తెలియదు. అంతవరకూ మనం జాగ్రత్తలు తీసుకోవాలి.' అంది ప్రశాంతి.

ఆమె మాటలు కొరడా దెబ్బల్లా తగిలాయి శరత్ మనసుకు.

'మంచి చెడు అసలు మనిషికి ఎపుడయినా తెలుస్తాయా?' అనుకున్నాడు బయటకు అడుగుపెడుతూ.

సందు మలుపు తిరుగుతూ ఆగిపోయాడు.

సందు చివరలో హోండా మోటరు ఆగి వుంది. దానిపై ఇద్దరు యువకులు కూర్చుని వున్నారు. వారి ఎదురుగా ఇద్దరు యువతులు నుంచుని మాట్లాడుతున్నారు చూడగానే వాళ్ళు కాలేజీ విద్యార్థినీ విద్యార్థులని తెలుస్తోంది.

వాళ్ళు లోకం మరచి మాట్లాడుకుంటున్నారు. వచ్చిపోయే వాళ్ళ చూపులను పట్టించుకోకుండా.

వారిలో స్రవంతిని సులభంగా గుర్తుపట్టాడు శరత్.

అతడి రక్తం మొత్తం పొంగి చేతుల్లోకి వచ్చింది. ఆవేశం ఉప్పెన అయి ఎగసింది.

ఆ వైపు వేగంగా అడుగులు వేయబోయి ఆగిపోయాడు. తానూ నీడల్లో ఒదిగి వాళ్ళని గమనించసాగాడు.

**ప్రపంచం లేనట్టు,** ప్రపంచంలో తామే వున్నట్టు మాట్లాడుకుంటున్న వారిని చీకటి నీడలలో ఒదిగి గమనిస్తున్న శరత్ హృదయంలో విచిత్రమైన భావాలు కలగసాగాయి.

ఎదురుగా తన కూతురు తన కొలీగులతో మాట్లాడుతోంది. వారితో కలిసి చదువుతోంది. కాబట్టి వాళ్ళతో మాట్లాడటంలో అసహజం ఏమీ లేదు.

మరి వాళ్ళని చూడగానే ఎందుకని ఆవేశం పొంగుకు వచ్చింది?

తాను, శిల్పతో కూడా మాట్లాడుతున్నాడు. ఇద్దరూ కలిసి హోటల్‌లో కూర్చుని మాట్లాడుకున్నారు.

అది చూసి వేరే వాళ్ళు ఏవేవో అనుకున్నారు. అప్పుడూ కోపం వచ్చింది. వీళ్ళంతా కుళ్ళు బుద్ధులు, ఆడా మగా కలిసి మాట్లాడితేనే ఏవేవో వూహించి కథలల్లేస్తారు. వాళ్ళ మనస్సుల్లో వున్న కుళ్ళును తమకు ఆపాదించారు అని ఈసడించాడు.

మరి ఇప్పుడు?

తన కూతురు తన సహాధ్యాయితో మాట్లాడుతోంది.

అంతే! దానికి తాను ఎందుకని రగిలిపోతున్నాడు. ఏవేవో ఊహించుకుని ఎందుకని ఆవేశపడుతున్నాడు?

ఇదే పని తాను చేస్తే ఎవరూ ఏమీ అనుకోకూడదు. అదే తన కూతురు చేస్తే తప్పు ఎలా అవుతుంది?

పలురకాల ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు శరత్. అతడికి ఏం చేయాలో తెలియటం లేదు.

ఇంతలో స్రవంతి చేతికి వున్న గడియారం చూసింది. ఏదో అంది. అందరూ నవ్వారు.

మోటారు పైనుంచి యువకుడు దిగాడు. వెనక వున్న వాడు బండిని పట్టుకున్నాడు. ఆ మోటారు దిగిన యువకుడు స్రవంతితో ఏదో అన్నాడు.

ఇద్దరూ మిగిలిన ఇద్దరికి 'బై' చెప్పారు.

ఆ అబ్బాయి అమ్మాయి బైక్ ఎక్కారు. వాళ్ళు బండి స్టార్ట్ చేసి వెళ్ళిపోయారు.

స్రవంతి, ఆ ఇంకో అబ్బాయి కలిసి నడవసాగారు ఇంటివైపు.

శరత్ మరింతగా నీడల్లోకి ఒదిగాడు.

స్రవంతి, ఆ అబ్బాయి వెళ్తున్న వాళ్ళకు 'బై' చెప్పి నడవటం ఆరంభించారు, ఏదో మాట్లాడుతూ.

వాళ్ళు శరత్‌ని దాటి వెళ్ళారు. శరత్‌ని గమనించలేదు. ఏదో చర్చలో వున్నారు.

ఇంటి దగ్గరకు వచ్చారు. ఆగారు.

ఆ అబ్బాయి ఏదో అన్నాడు. నవ్వింది స్రవంతి. 'రేపు కలుద్దాం' అంది.

అబ్బాయి కదలలేదు.

'బై' అంది స్రవంతి.

అతడు ఏదో మెల్లిగా అన్నాడు.

అటూ ఇటూ నిర్ణయించుకోలేని దానిలా, గేటుపై చేయివేసి నిలుచుంది స్రవంతి.

ఊపిరి బిగబట్టి వాళ్ళవైపు చూస్తున్నాడు శరత్.

అతడికే అర్థంకాని అనేక భావనలు అతడిలో పరుగులు పెడుతున్నాయి.

ఒకోసారి ఆవేశంగా అనిపిస్తోంది. మరోసారి నిరాశ కలుగుతోంది. ఇంకోసారి ఎందుకో తెలియదు, ఎవరిమీదనో తెలియదు ద్వేషం కలుగుతోంది. ఉద్విగ్నత అలలు అలలుగా కడుపు లోలోతుల్లోంచి చెలరేగుతూ శరీరమంతా విస్తరిస్తోంది.

ఆ అబ్బాయి మళ్ళీ ఏదో అన్నాడు.

నవ్వి అతడివైపు అడుగు వేయబోయి, గేటు తీసి లోపలకు అడుగుపెట్టింది స్రవంతి.

గేటు మూసేసి చెయ్యి వూపి లోపలకు పరిగెత్తింది.

ఆ అబ్బాయి కాసేపు అలాగే నిలబడ్డాడు.

తరువాత నడవటం మొదలు పెట్టాడు.

నీడలలోంచి బయటకు వచ్చాడు శరత్.

అతడికి ఎలాగో అనిపిస్తోంది. తనలో ఏం జరుగుతోందో అర్థం కావటంలేదు. తన భావనల స్వరూపం అతడికి బోధపడటంలేదు.

స్రవంతిని తప్పు పట్టటానికి లేదు. ఆమెని ఏమీ అనటానికి లేదు.

తాము పెరిగిన వాతావరణం వేరు. వీళ్ళు పెరుగుతున్న సమాజం వేరు.

తాము ఎదిగేటప్పుడు అమ్మాయిలవైపు దొంగచూపులు చూసేవారు. ఎవరయినా అమ్మాయి ధైర్యంగా మగపిల్లలతో మాట్లాడితే వింత చూసినట్టు చూసేవారు.

ఆ అమ్మాయి చాలా 'ఫాస్టు' అనుకుని చెవులు కొరుక్కునేవారు.

ఆ కాలంలో అమ్మాయిలతో మాట్లాడేవారు హీరోలు. అబ్బాయిలతో మాట్లాడే అమ్మాయిలు చెడ్డవారు.

అప్పుడు కో- ఎడ్యుకేషన్‌లు అతి తక్కువగా వుండేవి.

ఇప్పుడు పరిస్థితి అలాలేదు.

ఇప్పుడు చిన్నప్పటి నుంచీ అబ్బాయి, అమ్మాయిలు కలసి చదివే అవకాశాలున్నాయి. కలిసి చదువుతారు, కలిసి ఎదుగుతారు.

తమలాగా వారికి స్త్రీ పురుష సంబంధాల పట్ల సంకోచాలు, విజయాలు, వుద్విగ్నతలు లేవు. వారి కది సహజం.

కాబట్టి తన అపోహలు, సంకుచితాల దృష్టితో ఈ తరం వారి భావాలను స్నేహాలను కలవటం కుదరదు.

కానీ...కానీ... స్త్రీ పురుషుల నడుమ ఆకర్షణ ఏనాడయినా ఒకటే. మన్మధుడిని దగ్ధం చేయగలిగాడు శివుడు. కానీ గెలవలేకపోయాడు.

శివుడికే అలాంటి పరిస్థితి ఎదురయితే సామాన్య మానవుల పరిస్థితి ఏమిటి?

ఎదిగీ ఎదగని వయసులో, స్త్రీ పురుష సంబంధాల పట్ల ప్రచారంలో వున్న ఆకర్షణీయమైన విషయాల ప్రలోభాలను తట్టుకునే విచక్షణ లేని యువతీయువకులు స్వేచ్ఛగా కలిస్తే ఎలా వుంటుంది?

వయసయి, జీవితాన్ని అనుభవించిన తానే శిల్ప కాస్త సన్నిహితంగా రాగానే వూహలు అల్లేశాడు. కలలు కనేశాడు. అలాంటిది, ముక్కుపచ్చలారని, విచక్షణలేని, పరిణతి లేని యువతీయువకులు సన్నిహితంగా, స్వేచ్ఛగా వుండటం వల్ల మానసికంగా ఎన్నో సమస్యలు వస్తాయి.

స్వేచ్ఛకోసం వువ్విళ్ళూరుతున్న సమాజం ఈ దిశగా ఎందుకని ఆలోచించటం లేదు?

ఆలోచిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టాడు శరత్.

లోపలనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

'వయసొచ్చిన పిల్లవు, అలా రాత్రిళ్ళు బయట తిరగటం మంచిదికాదు. ఆ చదువేదో ఇంట్లో చదువుకో. లేకపోతే వాళ్ళనే ఇక్కడికి రమ్మను. అయినా ఇపుడు ఇంటర్నెట్ అందుబాటులో వుంది. ఇంట్లో కూర్చుని స్కైప్‌లో కంబైన్ స్టడీ చేయవచ్చుగా' అంటోంది ప్రశాంతి.

స్రవంతి ఏమందో వినబడలేదు.

'రోజులు బాగాలేవమ్మా! మనకేం కాదు, నాకేం కాదు అని విర్రవీగకు. ఎప్పుడు ఏమౌతుందో ఎవరికీ తెలియదు. అయిన తరువాత బాధపడి లాభం లేదు. ముందు జాగ్రత్తలు తీసుకోవటంతో తప్పులేదు' అంది ప్రశాంతి.

తన గదిలోకి వచ్చాడు శరత్.

గదినిండా పుస్తకాలు, సీడీలు కనిపించాయి.

ఎందుకో ఒక్కసారిగా నిరాశగా, అనిపించింది.

ఏమిటీ జీవితం?

తాను తన జీవితమంతా ఈ పుస్తకాల నడుమ, పలురకాల భావాలను ఉద్దీపింపచేసే పాటలు వింటూ గడిపాడు.

బయటి ప్రపంచాన్ని పట్టించుకోలేదు. తనదైన ఓ ప్రత్యేకమైన పథంలో జీవితం గడిపేస్తున్నాడు.

ఆఫీసులో వున్నా, ఎక్కడ వున్నా, ఏం చేస్తున్నా తన ఆలోచనలతో, తనదంటూ సృష్టించుకున్న ఓ గూడులో జీవితం గడిపేస్తున్నాడు. ఎవరేమన్నా పట్టించుకోవటంలేదు. ఎవరెటు పోయినా పట్టిలేదు.

అప్పుడప్పుడూ బయట ప్రపంచాన్ని చూసి ఆశ్చర్యపోతున్నాడు. విస్తుపోతున్నాడు. మనుషులు ఇలా కూడా వుంటారా? అని ఆశ్చర్యపోయి మళ్ళీ తన లోకంలోకి వెళ్ళిపోతున్నాడు.

కానీ తన ప్రమేయం లేకుండా బయట ప్రపంచం తన ప్రత్యేక ప్రపంచపు తలుపులు తడుతోంది. తన ప్రపంచంలో ప్రవేశిస్తోంది.

తన కొడుకు తనదైన ప్రపంచం సృష్టించుకున్నాడు.

తన కూతురు తనదైన ప్రపంచాన్ని సృష్టించుకుంటోంది.

తన భార్యది ఆమెకే ప్రత్యేకమైన ప్రపంచం.

ఎవరికి వాళ్ళు తమ తమ ప్రపంచాలు సృష్టించుకుని తమ తమ గూళ్ళలో నివసిస్తూంటే ఇక అనుబంధాలు, ఆప్యాయతలకు అర్థం ఏమిటి?

మానవ సంబంధాల పరమార్థం ఏమిటి?

కానీ.. తమవి ఎవరికి వారికి ప్రత్యేక ప్రపంచాలున్నా, బయట ప్రపంచం తమ ప్రపంచంలోకి ప్రవేశిస్తోంది. తన ప్రభావం చూపిస్తోంది.

సుమంత్ సినిమాలంటున్నాడు. వాడికి ఆ ప్రపంచంలోని జిలుగు వెలుగులు కనిపిస్తున్నాయి కానీ వాటి క్రింద నీడ కనబడటంలేదు.

స్రవంతి యవ్వనంలోకి అడుగుపెట్టింది. ఆ వయసు ప్రభావం ఎలా వుంటుందో? పైగా ఇప్పుడు యువతులకు రక్షణ లేని పరిస్థితి వుంటోంది. దీన్ని ఎలా తట్టుకుంటుంది? మంచి, చెడు ఎలా గ్రహిస్తుంది?

ఆలోచిస్తూన్న శరత్ దగ్గరకు వచ్చింది ప్రశాంతి.

'అమ్మాయిని వెతుకుతానని వెళ్ళి ఎటు వెళ్ళారు? అమ్మాయి వచ్చేసింది. మీరు తరువాత వచ్చారు?' ప్రశ్నించింది.

'నేను అలా నడుస్తూ వెళ్ళాను. రాత్రిపూట కదా, ప్రశాంతంగా వుంది' అన్నాడు శరత్.

అతడిని పరిశీలనగా చూసి, దగ్గరకు వచ్చి రహస్యం చెప్పినట్టు చెప్పింది ప్రశాంతి. 'మీరు స్రవంతిని ఓ కంట కనిపెట్టాలి. వయసు అలాంటిది. మన జాగ్రత్తలు మనం తీసుకోవాలి.'

'ఎందుకు? ఏమయింది?' మనసులో భావనలు ముఖంపై కనబడకుండా జాగ్రత్తపడ్డాడు.

'ఏమీలేదు. ఇందాక మీరు బయటకు వెళ్ళినప్పుడు, నేనూ బాల్కనీలో నిలబడ్డాను. మన స్రవంతి ఎవరో అబ్బాయితో కనబడింది' చెప్పింది ప్రశాంతి.

'అబ్బాయితో కనబడితే జాగ్రత్త పడాలా?' అన్నాడు శరత్.

అతడివైపు విచిత్రంగా చూసింది. 'లేకపోతే వదిలేస్తారా? ఈ వయసులో వాళ్ళకి మంచి చెడ్డలు తెలియవు. మనం చెప్పాలి. కానీ వయసు ఎలాంటిదంటే మనం ఏం చెప్పినా వాళ్ళు దాన్ని అర్థం చేసుకోరు. మనం అన్నదానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. కాబట్టి జాగ్రత్తగా వ్యవహరించాలి' అంది.

'అదేమీ చిన్నపిల్ల కాదుకదా! తన మంచి చెడ్డలు తనకి తెలుస్తాయి' అన్నాడు శరత్ ఆమెని పరిశీలనగా చూస్తూ.

'ఇంత పెద్దవాళ్ళమయ్యాం.. మనకే తెలియదు ఏది మంచి? ఏది చెడు? చిన్నపిల్ల దానికేం తెలుస్తుంది? ఆ వయసులో ఆవేశం తప్ప ఆలోచన వుండదు. పెద్దలుగా మనం తనకు మార్గదర్శకత్వం చేయాలి.'

'మనకే తెలియనప్పుడు మనం ఏం మార్గదర్శకత్వం చేస్తాం? గుడ్డివాడికి గుడ్డివాడు దారి చూపించినట్టు వుంటుంది.'

కోపంగా చూసింది అతడివైపు.

'మనకు తెలిసిన మంచి చెడు పిల్లలకు చెప్తాం. వింటే వాళ్ళ అదృష్టం. లేకపోతే వాళ్ళ ఖర్మ. ఏమీ పట్టనట్టు వుండలేంకదా?'

ఆమెకు కోపం వస్తున్నదన్న సంగతి గ్రహించి శరత్ మౌనంగా వుండిపోయాడు.

'కాలం బాగా లేదండి. అది మనకు తెలుస్తుంది. ప్రపంచాన్ని జయించగలమన్న విశ్వాసంతో, భవిష్యత్తు గురించిన కలలు కళ్ళల్లో నింపుకున్న యువతకు ప్రపంచరీతి తెలియదు. మీకు నేను చెప్పలేదు, మా ఆఫీసులో కుసుమ సంగతి?'

'ఎవరా కుసుమ?

'అదేనండి.. మొన్న జూనియర్ అయినా ప్రమోషన్ వచ్చిందని చెప్పావే?'

'గుర్తులేదు.'

'అది...ప్రమోషన్ కోసం ఆఫీసర్‌కు లొంగిపోయింది. వీళ్ళిద్దరూ టిఫిన్ రూమ్‌లో కలిశారు. అయితే ఈ మధ్య ఆఫీసంతా సర్వైలెన్స్ కెమేరాలు పెట్టారు. ఆ సర్వైలెన్స్ కెమేరాలకు వారి కామకేళి అంతా చిక్కింది. ఇది ఆఫీసంతా పాకింది. అయితే, ఆఫీసర్ కదా ఏదో చేసి అంతా సమసిపోయేట్టు చేశాడు. కానీ ఒక వీడియో ఎలా వచ్చిందో బయటకు వచ్చింది. సోషల్ మీడియాలో పెట్టారు. దాన్ని తొలగింపచేశాడు. కానీ అప్పటికే అందరూ చూశారు. ఆ అమ్మాయి భర్త విడాకులు అడుగుతున్నాడు. ఆఫీసరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయాడు. ఇప్పుడు అది ఆఫీసులో తల ఎత్తుకుని తిరగలేకపోతోంది. ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తోంది.'

'ఇది నాకెందుకు చెప్తున్నావిప్పుడు?' ఎందుకో నాలిక చేదు ఐన భావన కలుగుతోంది శరత్‌కు.

'ఎందుకంటే కుసుమ కూతురు బాయ్ ఫ్రెండ్‌తో ఎక్కడికో వెళ్ళింది. ఆ బాయ్ ఫ్రెండ్ వీళ్ళిద్దరి వ్యవహారాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు అమ్మాయికి తెలియకుండా దాన్ని వాట్సాప్ లో ఫ్రెండ్స్‌కి పంపాడు. అది చూపించి మిగతా అబ్బాయిలు అమ్మాయిని గోలపెట్టారు. ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది. అర్థమయిందా, అమ్మాయిలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎంత జాగ్రత్తగా వున్నా, ప్రపంచం ఎంత భయంకరంగా వుందంటే, ఏమీ చెప్పలేము. కాస్త భయపెట్టండి దాన్ని, జాగ్రత్తలు నేనేం చెప్తాను. వీళ్ళు అబ్బాయిలతో

మాట్లాడటం, స్వేచ్ఛగా తిరగటం గొప్ప అనుకుంటారు. కానీ జరగనిది జరిగిన తరువాత చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుని లాభం లేదు. ఆ తరువాత మీ ఇష్టం' అంది వెళ్ళిపోతూ.

ఆమె వెళ్ళిన వైపు చూస్తూ కూచున్నాడు శరత్.

ఆమె అన్న మాటలలో నిజం అతడికి తెలుసు.

ఆడవారు మానసికంగా శక్తిమంతులు. మగవారి పశుబలం వారి మానసిక శక్తిముందు దిగదుడుపే. కానీ వారి శరీరం మానసిక శక్తితో సహకరించదు. అందుకు సరిపోదు.

అందుకే మగవారు మాయమాటలతో వారిని బలహీనులను చేయగలరు. శారీరక స్పర్శతో వారిని వివశులను చేయగలరు. వారిని తమకు కొంగిపోయేట్టు చేసుకోగలరు. ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేయగలరు.

'అందుకే నువ్వు నన్ను ప్రేమించకపోతే నేను ఛస్తా' అని హీరో అనగానే హీరోయిన్ లొంగిపోతుంది. 'ఫోరా నీ చావు నువ్వు చస్తే ఇంకొకడు. దేశం గొడ్డుపోలేదు' అనలేదు.

అందుకే 'నా మాట వినకపోతే నేను వెళ్ళిపోతాను' అనగానే ప్రేయసి లొంగిపోతుంది.

'నేనంటే ఇష్టంలేదా?' అని ఒంటరిగా కలవని ప్రేయసిని బ్లాక్ మెయిల్ చేస్తే ఒంటరిగా కలుస్తుంది. దెబ్బ తింటుంది.

ఈ బలహీతనత మహిళ స్వభావంలోనే వుంది. ప్రకృతిలోనే వుంది. ఎంతో వయసు వచ్చిన వారు కూడా ఏదో ఓ రూపంలో ఈ బలహీనతకు లొంగిపోతారు.

కొడుకు బాధపడతాడనో, కూతురు మనసు గాయపడుతుందనో, భర్త ఏమనుకుంటాడనో.. కారణం ఏదయినా ఫలితం ఒక్కటే.

పెద్దవారే ఈ లక్షణాన్ని అధిగమించలేనపుడు పిల్లలు ఎలా దాటగలరు?

అంతలో శరత్‌కు ఓ ఆలోచన వచ్చింది.

ఆ అబ్బాయి ఏమి అడిగివుంటాడు?

స్రవంతి సంకోచించి, వెనక్కు వచ్చి వెళ్ళిపోయింది.

వాడు ఏమి అడిగి వుంటాడు?

శరత్‌కు ఎలాగో అనిపించింది.

తన కూతురు.. తన దృష్టిలో చిన్నపిల్లనే. కానీ తాను చిన్నపిల్లవాడు కాదు.

ప్రపంచం దృష్టిలో చిన్న పిల్లవాడు.

తొలిసారిగా తన ప్రమేయం లేకుండా ఎందుకో తెలియకుండా మనసులో ఓ రకమైన భయం భావన మెదిలింది.

క్రూరమృగాలు మనిషి ముసుగువేసుకుని తిరుగాడే ఈ ప్రపంచంలో ఏమైపోతారు తన పిల్లలు?

తాను భద్రంగా పెంచాడు - భద్రంగా జీవిస్తున్నాడు.

కానీ తన సంతానం, ప్రపంచంలోకి దూసుకు వెళ్తున్నారు.

ఎలా తట్టుకుంటారు వారీ భయంకరమైన క్రూరమృగాలున్న ప్రపంచాన్ని.

తలుపు చప్పుడయింది.

తూలుతూ లోపలకు వచ్చాడు సుమంత్.

'మళ్ళీ తాగి వచ్చావా?' కోపంగా అడిగింది ప్రశాంతి.

'కొంచెం.. అమ్మా.. ఇదంతా కామన్. సినిమా నడుస్తోంది. పార్టీ చేసుకున్నాం..'

ఏదేదో మాట్లాడుతున్నాడు సుమంత్.

తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రివ్వుమని చల్లనిగాలి వీచింది. శరత్ టేబుల్ పై నున్న పుస్తకాల కాగితాలు రెపరెపలాడాయి.

గబగబా వెళ్ళి కిటికీ తలుపులు మూసేశాడు.

బయటి గాలి లోపలకు రాకుండా కిటికీ తలుపులు మూశాడు. కానీ బయట ప్రపంచాన్ని బయటనే ఎలా ఆపగలడు?

**ఆరోజు ఆఫీసులో** అంతా అన్యమనస్కంగా గడిచింది.

ఎన్నోమార్లు శిల్పకు ఫోను చేయాలనుకున్నాడు. కానీ నెంబరు కలిపిన తరువాత చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు. 'సెండ్'కి నొక్కకుండా వదిలేశాడు.

'కాస్సేపటికి శిల్పనే చేయవచ్చు కదా' అనుకున్నాడు.

ఆమె చేస్తుందేమోనని ఎదురు చూశాడు.

కానీ ఆమె చేయలేదు.

ఎందుకనో అతడికి అన్నీ శిల్పతో చెప్తేకానీ మనశ్శాంతి వుండదనిపిస్తోంది. తన ఆందోళనలు, సందిగ్ధాలన్నిటికీ సమాధానం ఆమె దగ్గర లభిస్తుందనిపిస్తోంది.

'అదొక బలహీనత' అనుకుని సర్దిచెప్పుకోవాలని ప్రయత్నించాడు.

ఈ ప్రపంచంలో మనిషి ఒంటరిగానే వస్తాడు. ఒంటరిగానే వెళ్తాడు. ఈ మధ్యలో ఎవరిదో తోడు కావాలని, ఓ భుజం ఆసరా కావాలని ఆశించటం మానవ మనస్సు బలహీనత తప్ప మరొకటి కాదు.

ఎవరి బాధ మరొకరు పడలేరు. ఎవరి బాధను వాళ్ళే అనుభవించాలి.

కానీ తనకి ఎందుకు బాధ?

స్రవంతిని ఆ అబ్బాయితో చూసినప్పటి నుంచీ శరత్ మనస్సు మనస్సులో లేదు.

ఏం చేయగలడు తాను?

రోడ్డుపైన చూస్తూనే వున్నాడు. ఏదైనా కాలేజీ వుందంటే బయట అబ్బాయిలు అమ్మాయిలు గుంపులు గుంపులుగా మాట్లాడుతూ కనిపిస్తారు.

ఈ గుంపుల్లో తన కూతురు కూడా ఒకరై.

నదిలో అడుగుపెట్టి కాలికి తడి అంటకూడదనటం కుదురుతుందా?

తాను పుట్టినప్పటి నుంచీ చూస్తూనే వున్నాడు, యవ్వనంలో తొందరపడటం, జీవితాంతం ఆ ఫలితాన్ని అనుభవిస్తూండటం. సగం సినిమాలు అలాంటివే.

అవి చూస్తూ కూడా ఎలా తప్పు చేస్తారు మనుషులు?

బహుశా తప్పు చేసేటప్పుడు అది తప్పు అనిపించదేమో? అయినా తాను తప్ప అందరూ శిక్షను అనుభవిస్తారనిపిస్తుందేమో? ఆ క్షణంలో ప్రపంచం అదృశ్యమైపోతుందేమో.

అంతలో అతనికి ఎంతో నచ్చిన లతా పాట గుర్తుకు వచ్చింది.

***ఉమ్మీదోంకె హసీన్ మేలే, తమన్నా వోంకె వోరేలే.***

*నిగాహోనే నిగా హోంసే అజబ్ కుఛ్ ఖేల్ థే ఖేలే*

*హవా మే జుల్ఫ్ లషరాయి, నజర్ పే బేఖుదీ ఛాయి*

*ఖులేథే దిల్కే దర్వాజే, మొహబ్బత్ భీ ఛలీ ఆయీ*

*తమన్నా హోంకీ దునియా పర్ జవానీ చాగయీ*

*వొ భూలీ దాస్తాన్, లో ఫిర్ యాద్ ఆగయీ*

*నజర్‌కే సామ్‌నే ఘటాసీ ఛాగయీ!*

కోరికల అందమైన జాతరలు, ఆశల పల్లకీలు కళ్ళు. కళ్ళతో చిత్రమైన ఆటను ఆడాయి. గాలికి ఎగిరిన ముంగురులు కళ్ళపై మైకం కమ్మింది. హృదయపు ద్వారాలు తెరుచుకున్నాయి. ప్రేమ వచ్చింది. కోరికల ప్రపంచంపై యవ్వనం రాజ్యం చేసింది. ఎంత అందంగా వర్ణించాడు యవ్వనంలోని ప్రేమను.

*'తమన్నా హోంకే దునియాపర్ జవానీ చాగయీ '*

వ్యక్తిగతంగా ఎన్నెన్ని ఆశలు, కోరికలు, ఆశయాలు వున్నా యవ్వనం ముందు అన్నీ దిగదుడుపే. అందుకే స్త్రీ పురుషులు ఆ క్షణంలో అన్నీ మరిచిపోతారు. అదొక మైకం. అదొక వున్మాదం. జలపాత ధారలో వుండే దూకుడు. తెగింపు, ధైర్యం, ఉత్సాహాలు... కానీ ఆవేశం తగ్గి నిజానిజాలు గ్రహింపుకు వచ్చేసరికి, వెనక్కు తిరిగి చూసుకుంటే

*కహాసే ఫిర్ చలీ ఆయే, యె కుఛ్ భట్కేహువే సాయె*

*యె కుఛ్ భూలే హువే నగ్మే, జో మేరీ ప్యార్‌నే గాయే*

*యె కుఛ్ బిఛ్‌డీ హులీ యాదే యె కుఛ్ టూటే హువీ సప్నే*

*పరాయే హోగయ్‌తో క్యా, కభీ యేభీతోథే అప్నే*

*నజానే ఇన్‌సె క్యూ మిల్‌కర్, నజర్ షర్మాగయీ!*

ఎక్కడినుంచి వచ్చాయో దారితప్పి ఈ జ్ఞాపకాలు, నా ప్రేమ పాడిన ఈ పాటలు, జ్ఞాపకాలు, పగిలిన స్వప్నాలు.. ఇవన్నీ ఇప్పుడూ పరాయి అయి వేరైనా ఒకప్పుడు నావే. కానీ ఈనాడు వీటిని చూస్తూంటే సిగ్గుతో నా కళ్ళు దించుకోవాల్సి వస్తోంది ఎందుకు? - శరత్ మనస్సు బాధతో మెలిపెట్టినట్టయింది.

అతడి కళ్ళముందు అమాయకమైన కూతురి ముఖం కనిపించింది. ఎవడినో ప్రేమించటం యవ్వనంలో, ఆ ప్రేమ సఫలం కాకపోవటం, తరువాత ఇంకెవడినో పెళ్ళి చేసుకోవటం, తాను సుఖపడలేకపోవటం, చేసుకున్నవాడిని సుఖపెట్టలేకపోవటం... జీవితాంతం అదేదో బాధతో, ఏదో కోల్పోయినట్టు భావిస్తూ దుఃఖిస్తూ సుఖం శాంతి లేక జీవితం గడుపుతుందా తన కూతురు?

*బడే రంగీన్ జమానే థే, తరానే హీ తరానే థే*

*మగర్ అబ్ పూఛ్‌తాహై దిల్, వో దిన్ థే యా ఫసానాథే*

*ఫకత్ ఎక్ యాద్ హై బాకీ, బస్ ఎక్ ఫర్యాద్ హై బాకీ,*

*వొఖుషియా లుట్ గయీ లేకిన్, దిల్ ఎ బర్బాద్ హై బాకీ*

*కహాథే జిందగీ మేరీ, కహా పర్ ఆగయా!*

నిజం, ప్రేమ సాగుతున్నంత కాలం ప్రపంచం అందంగా వుంటుది. ప్రతిక్షణం గీతంలా సాగుతుంది. కానీ వెనుతిరిగి చూసుకుంటే అవి నిజంగా అనుభవించానా? లేక కలా? అనిపిస్తుంది. ఇప్పుడు మిగిలింది జ్ఞాపకమే. 'అయ్యో' అని మొరపెట్టుకోవటం

మిగిలి వుంటుంది. అప్పటి ఆనందాలు అదృశ్యమైపోతాయి. కానీ పగిలిన వేదనా భరితమైన హృదయం మిగిలి వుంటుంది. ఎలాంటి జీవితం, ఎలా అయిపోయింది. అని బాధ పడటం తప్ప మిగిలిందేమీ లేదు.

ఈ ఆలోచనలన్నీ చేదుగా అనిపించాయి.

చుట్టూ చూశాడు.

సహ ఉద్యోగులందరూ ఆనందంగా ఏదో చర్చించుకుంటున్నారు. కొందరు సీరియస్‌గా పని చేసుకుంటున్నారు.

వీళ్ళల్లో చాలామందికి కాలేజీల్లో చదివే కూతుళ్ళున్నారు.

వీళ్ళంతా ఇంత ప్రశాంతంగా ఎలా వుండగలుగుతున్నారు?

తానెందుకు వీళ్ళలా హాయిగా వుండలేకపోతున్నాడు?

తన కూతురు ఓ యువకుడితో మాట్లాడుతూ కనిపించింది. దానికి తాను ఇంతగా ఆలోచించాలా. ఏదో ఘోరం జరిగిపోయినట్టు ఊహించేసుకుని ఆనందాన్ని కోల్పోవాలా? ఆలూ లేదు చూలూ లేదు అన్నట్టుంది తన పరిస్థితి. తనకి తాను సర్ది చెప్పుకున్నాడు.

తన దృష్టి పనివైపుకు మళ్ళించాడు. కానీ వుండుండి ఏదో ఆలోచన అతడిని బాధిస్తునే వుంది.

ఎప్పుడూ లేనిది ఇలా అడుగుతున్న తండ్రి వైపు విస్మయంగా చూసింది స్రవంతి.

'నేను, సరిత కంబైన్డ్ స్టడీ చేస్తున్నాం నాన్నా అందుకని వెళ్తునాను వాళ్ళ ఇంటికి' అంది సమాధానంగా

శరత్ మాట్లాడలేదు. మౌనంగా బయటకు నడిచాడు.

'ఎటు వెళ్తున్నారు?' వెనకే వచ్చి అడిగింది ప్రశాంతి. ఇంటికి వచ్చిన తరువాత ఎంతో అర్జంటు పని వుంటే తప్ప బయటకు కదలడు శరత్. అలాంటిది అతడు బయటకు వెళ్ళటం ఆశ్చర్యం అనిపించింది ప్రశాంతికి.

'ఇప్పుడే వస్తాను. సందు చివరవరకే' అన్నాడు శరత్ బయటకు నడుస్తూ అతడికి తాను చేయబోతున్న పని అసహ్యంగా వుంది. తనని తానే తిట్టుకుంటున్నాడు. కానీ విషయం తెలుసుకుంటే కానీ అతడికి మనశ్శాంతి లభించేట్టు లేదు.

తన స్వంత కూతురిపై గూఢచార పని చేస్తున్నాడు శరత్.

కాసేపటికి స్రవంతి బయటకు వచ్చింది. బ్యాగు భుజానికి వ్రేలాడుతోంది. నెమ్మదిగా నడుస్తోంది.

ఆమె సందు తిరగటం చూసి తాను సమాంతరంగా సందు తిరిగాడు శరత్.

అతడికి ఓ వైపు అసహ్యంగా అనిపిస్తోంది తాను చేస్తున్నపని. కానీ తన అనుమానం తీరాలంటే అది తప్ప మరో పనిలేదు. అందుకనే తనని తాను తిట్టుకుంటూ, అసహ్యించుకుంటూ ఆమెని వెంబడిస్తున్నాడు.

బస్టాపు దగ్గరకు వచ్చింది స్రవంతి.

సరిత ఇంటికి బస్సు ఎక్కనవసరం లేదు.

శరత్ మనస్సులో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. తుఫాను గాలులు వీస్తున్నాయి.

తెలియని విషయం మనిషిని బాధించదు. బాధించే విషయం తెలుసుకోవాలని లేదు.

తన కూతురు తనతో అబద్ధం చెప్పిందా?

ఇన్నిరోజులూ కంబైన్డ్ స్టడీస్ అని చెప్తున్నది అబద్దమా?

ఇంతలో స్రవంతి స్నేహితురాలు సరిత బస్టాపుకు వచ్చింది.

'ఇద్దరూ కలిసి మరో ఫ్రెండింట్లో కలిసి చదువుతారా?'

వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుతూ నుంచున్నారు.

బస్సు వచ్చింది.

వాళ్ళిద్దరూ బస్సు ఎక్కారు.

బస్సును అనుసరించాలా? వద్దా?

కాస్సేపు తటపటాయించాడు.

దీని అంతేదో తేల్చుకోవాలనుకున్నాడు. బస్సును అనుసరించాడు.

సరిత దగ్గరకు కంబైన్డ్ స్టడీస్ కోసం అంది. సరితను కలిసింది కానీ కంబైన్డ్ స్టడీయా కాదా? అన్నది తెలియదు.

ఆలోచిస్తూ, జాగ్రత్తగా బస్సు వెనకే నడపసాగాడు.

బస్సు ఆగినపుడు దిగేవారిని జాగ్రత్తగా చూస్తూ, బస్సును వెంబడించాడు. బస్టాపులో దిగారిద్దరూ.

బస్టాపుకు అటువైపు వున్న సినిమా థియేటర్‌లోకి దారి తీశారు.

'ఇక్కడా కంబైన్డ్ స్టడీస్?' శరత్ మనస్సు భగ్గుమంది.

సినిమాకి వెళ్తానంటే వద్దని ఎప్పుడూ అనలేదు. డబ్బులిచ్చి మరీ పంపించాడు. ప్రశాంతి తిట్టేది కూడా.

కానీ పిల్లలు సినిమాలు చూడాలని అంటే వద్దంటే దొంగతనంగా చూడటానికి అలవాటు పడతారని తానే వెళ్ళమన్నాడు.

ఎప్పుడు ఏ పని చేసినా అబద్ధాలు చెప్పి, దొంగతనంగా కాదు, ధైర్యంగా చేయాలని చెప్పేవాడు.

అవన్నీ ఏమైపోయాయి?

అక్కడ సినిమా హాలులో ఇంకో నలుగురు స్నేహితురాళ్ళు కలిశారు. అందరూ కలసి దగ్గరలోనే వున్న మెక్‌డొనాల్డ్స్‌లో కూచున్నారు. అంతా అద్దాలుండటంతో బయటకు కనిపిస్తోంది.

కాస్సేపటికి ఒక బైక్ మీద ముగ్గురు చొప్పున ఆరుగురు యువకులు వచ్చారు.

వాళ్ళూ వీళ్ళూ ఒకరినొకరు 'గ్రీట్' చేసుకున్నారు.

అందరూ ఒకే టేబుల్ దగ్గర కూర్చున్నారు.

తాను చూస్తున్నది కలా? నిజమా? అర్థం కావటంలేదు శరత్‌కు. ఇప్పుడేం చేయాలి?

అయినా అసలు ఏం జరిగిందని ఏమైనా చేయాల్సిన అవసరం ఏముంది?

ఈ కాలంలో అందరు యువతీ యువకులు కలిసి తిరుగుతున్నారు.

కలసి పార్టీ చేసుకుంటారు. కలసి తిరుగుతున్నారు.

ఆఫీసులో సైతం పిక్నిక్‌లకు వెళ్తారు. రిసార్టులకు వెళ్తారు.

ఇదంతా కామన్.

కానీ అందరూ వెళ్ళటం వేరు, తన కూతురు అందరిలా వుండటం వేరూనా?

తాను ఎవ్వరితో కలవకుండా వేరుగా, భిన్నంగా వుంటాడు కాబట్టి తన కూతురుకూడా అలాగే వుండాలా?

ఎవరి వ్యక్తిత్వం వారిది. ఎవరి జీవితం వారిది.

ఎంత సర్ది చెప్పుకున్నా సమాధాన పడలేకపోతున్నాడు.

ఇంతలో వారంతా బయటకు వచ్చారు.

అందరూ జంటగా విడిపోయారు. ఇద్దరిద్దరూ కలసి మాట్లాడుతూ నడుస్తున్నారు. థియేటర్‌లోకి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన వైపు చూస్తూ నిలబడ్డాడు శరత్.

కూతురు అబద్ధం చెప్పినందుకు బాధపడాలా? కోపం ప్రదర్శించాలా?

కంబైన్డ్ స్టడీస్ అని సినిమాకు వెళ్ళినందుకు తిట్టాలా?

ఏం చేయాలో తెలియక రోడ్డుమీద అలాగే నిలబడిపోయాడు శరత్.

చుట్టూ వాహనాలు పెద్ద రొదతో పరుగిడుతున్నాయి. కాలం నిశ్శబ్దంగా పరుగులిడుతోంది.

శరత్ నిశ్శబ్దంగా, మౌనంగా స్థాణువై నిలబడి వున్నాడు.

**ఫోను మోగుతోంది.**

ప్రశాంతి చేస్తోంది. కానీ తియ్యబుద్దికావటం లేదు. మాట్లాడాలనిపించటం లేదు.

తాను ఫోన్ తీయకపోయినా, మాట్లాడకపోయినా ప్రశాంతి కంగారు పడుతుందని తెలుసు శరత్‌కు.

కానీ అతడికి ఎవ్వరితో మాట్లాడాలనిపించలేదు.

అతడి మనసంతా సినిమా థియేటర్‌లో ఏం జరగబోతోంది అన్న దానిపైనే కేంద్రీకృతమయి ఉంది.

భగవంతుడు మనిషికి ఇచ్చిన అత్యద్భుతమైన వరం ఊహాశక్తి.

భగవంతుడు మనిషికి ఇచ్చిన అతిఘోరమైన శాపం ఊహాశక్తి.

మనిషి తన ఊహాశక్తిని ఉపయోగించి భవిష్యత్తులో జరగబోయేది గ్రహించగలడు, కష్టనష్టాలను ఊహించగలడు. అలా ఊహించి రాబోయే కష్టాలను నష్టాలను ఎదురుకునేందుకు మానసికంగా సిద్ధం కాగలడు. మానసిక స్థయిర్యం సాధించి ఎలాంటి పరిస్థితినయినా చిరునవ్వుతో తట్టుకోగలడు.

మనిషి తన ఊహాశక్తిని ఉపయోగించి లేని కష్టాన్ని ఊహించగలడు. తాను చూస్తున్నదాన్ని తప్పుగా అర్థం చేసుకుని లేని ఘోరమైన ప్రమాదాన్ని ఊహించవచ్చు.

ఆ ఊహా ప్రమాదం నిజమైనదని భ్రమచెంది కృంగిపోవచ్చు. నిరాశ చెందవచ్చు ఎంతగా అంటే, తన ప్రాణాలు తీసుకునేంతగా.

తన ఊహ తన భ్రమ అన్న భావన కలగక అదే నిజమని భావించి సర్వనాశనం చేసుకోవచ్చు.

తన ఏ ఊహ నిజమైనది, ఏ ఊహ భ్రమ అన్న విచక్షణ జ్ఞానం ప్రదర్శించటం ఉత్తమ వ్యక్తిత్వానికి నిదర్శనం.

ఈ విషయాలన్నీ శరత్‌కు తెలుసు. అందుకే అతడు తాను చూస్తున్నదాన్ని అర్థం చేసుకోవాలని సరైన రీతిలో నిజాన్ని గ్రహించాలని తపనపడుతున్నాడు. కానీ మానవ స్వభావంలో ఒక వైచిత్రి ఉంది.

తన ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధం లేనంత వరకూ మనిషి ఎలాంటి మోహ మాయలకు లోను కాకుండా విషయాన్ని విశ్లేషిస్తాడు. అవగాహన చేసుకుంటాడు.

కానీ తనకు సంబంధం ఉన్న విషయం దగ్గిరకు వచ్చేసరికి పక్షపాతం చూపకుండా వుండలేడు. పలు భావనలకు గురికాకుండా ఉండలేడు. ఆ విషయంతో సంబంధం లేకుండా నిర్మోహంగా విశ్లేషించలేడు. అందుకేనేమో, దేవుడు ఎవరికీ అందనంత ఎత్తులో ఆకాశంలో కూర్చుని నిర్మోహంగా, నిర్భావంగా మనుషుల తలరాతలు రాస్తూంటాడు. ఎలాంటి బంధాలు, భావాలు లేకుండా తీర్పులు చెప్పేస్తూంటాడు అనుకున్నాడు శరత్.

ఇదే పరిస్థితి తన స్నేహితుడికి వచ్చి వాడు తనకీ విషయం చెప్పి సలహా అడిగి ఉంటే తానేం చెప్పేవాడు? ఆలోచించాడు శరత్.

'కంగారు పడాల్సిన అవసరంలేదు. కాలం మారింది. మనం ఎదిగేటప్పుడు అమ్మాయి మన వైపు చూస్తేనే కలలు కనేవాళ్ళం. అమ్మాయిలతో మాట్లాడేవాళ్ళని అసూయగా చూసేవాళ్ళం. ఇప్పుడు వేరు. ఇప్పుడు అబ్బాయిలు, అమ్మాయిలు చిన్నప్పటి నుంచీ కలసి చదువుతున్నారు. కలసి ఎదుగుతున్నారు. తమ తరంలాగా అమ్మాయి ఓ అద్భుతమైనది కాదీ తరంవారికి. తమ తరం వారు ఒక అమ్మాయితో మాట్లాడితే ఆమే సర్వస్వం అనుకునేవారు. కానీ ఈ తరం అలాకాదు. వీళ్ళకి బంధాలలో శాశ్వతత్వంపై నమ్మకంలేదు. వీళ్ళకి కెరీరుపైనే దృష్టి తప్ప కామంపై కాదు. వీళ్ళకి అదంత పెద్ద విషయం కాదు. వాళ్ళని నిలదీసి, అడిగి, గిల్టీగా ఫీలయ్యేట్టు చేసి లేనిపోని ఆలోచనలు కల్పించే బదులు వాళ్ళని స్వేచ్ఛగా వదిలెయ్. గమనించు కానీ అడ్డుపడకు. పరిస్థితి అదుపు తప్పుతూంటే అప్పుడు జోక్యం చేసుకో. అంతవరకూ వాళ్ళ సమస్యలను వాళ్ళే పరిష్కరించుకోనీ' అని సలహా ఇచ్చేవాడు.

'లేనిపోనివి ఊహించుకుని అనవసరంగా బాధపడకు అని సర్ది చెప్పేవాడు. వాళ్ళకి లేని వికారాలకు ఆకారాలు కల్పించి వాళ్ల మనస్సుల్ని వికలం చేయకు అనేవాడు. కానీ... తన కూతురికే ఆ పరిస్థితి వస్తే?' శరత్ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

హాలులో చీకట్లో ఏం జరుగుతోంది?

అది ఊహించిన కొద్దీ అతడి మనస్సు అల్లకల్లోలం అవుతోంది.

ఏమీ జరగకపోతూండవచ్చు.

ఫ్రెండ్స్ కలసి సినిమా చూస్తారు. ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోతారు.

కానీ... ఇలా సన్నిహితంగా ఉన్న వాళ్లలో వికార భావాలు జనించవా? జనించకుండా ఎలా వుంటాయి?

మరి దీని పర్యవసానాలు ఎలా ఉంటాయి?

విదేశాలలో తమ కూతుళ్లు వయసొచ్చాక 'డేటింగ్' చేయకపోతే తల్లిదండ్రులు బాధపడతారని చదివాడు.

తమ కూతురిలో ఏదో లోపం ఉందని కంగారు పడతారని చదివాడు. ఇంకా లైంగిక చర్యలో పాల్గొనలేదని అమ్మాయిలు, ఆ అనుభవం పొందకపోతే తమలో లోపం ఉందని బాధపడతారనీ చదివాడు.

అత్యంత ప్రాకృతం అయిన చర్యగురించి కంగారు పడనవసరం లేదనీ చదివాడు. కానీ..కానీ..

ఎందుకో మనసును సమాధాన పరచుకోలేకపోతున్నాడు.

పలు ఊహలు కళ్ళెం లేని గుర్రంలా పరుగాడుతున్నాయి విచ్చలవిడిగా.

విచ్చలవిడిగా పరుగెత్తే గుర్రాల తాకిడికి దుమ్మూధూళి ఆకాశానికి ఎగిసినట్టు అతడి మనస్సు అల్లకల్లోలంగా ఉంది.

ఉండి ఉండి ఫోను చేస్తోంది ప్రశాంతి.

తాను ఎలాగో బాధపడుతున్నాడు ఆమెని ఎందుకు బాధపెట్టడం అనుకున్నాడు.

ఫోనెత్తాడు.

'ఏమైంది ఫోనెత్తటం లేదు?' కంగారు, కోపం కలగలసి ధ్వనించింది ప్రశాంతి స్వరం.

'ఫ్రెండు కలిశాడు' అబద్ధం చెప్పాడు శరత్.

'ఎప్పుడొస్తున్నారు?' అడిగింది.

'వస్తాను' అన్నాడు. కానీ ఇంటికి వెళ్లాలనిపించటంలేదు.

ఏదో శూన్యం, ఏదో నిరాశ, ఏదో ఆక్రోశం, ఏదో ఆవేశం...

తన మనస్సు తనకే అర్థంకావటంలేదు శరత్‌కు.

మనస్సును మయూరంతో పోలుస్తారు.

అది మేఘాలు దట్టంగా క్రమ్ముకుంటే ఆనందంతో నృత్యం చేస్తుందంటారు.

ఇప్పుడు తన మనసులో మేఘాలు దట్టంగా అలముకున్నాయి.

కానీ తన మనస్సు నాట్యం చేయటంలేదు.

రోదిస్తోంది.

నెమ్మదిగా హాలునుంచి ఒకరొకరే బయటకు రావటం ఆరంభమయింది.

అంటే.. సినిమా అయిపోయింది.

రెండు మూడు గంటలు అలా గడచిపోయాయి.

లోపల వాళ్ళు సినిమా చూస్తూ గడిపితే, తాను ఇక్కడ తన ఊహల్లో దృశ్యాలు చూస్తూ చిత్రహింసను అనుభవిస్తూ గడిపాడు.

నిజంగా, ఈ ప్రపంచం ఎంత చిత్రమైంది.

మనుషులు ఒకరినొకరు ప్రేమిస్తారు ఒకరికి మరొకరు ఎంతో సన్నిహితులం అనుకుంటాము. అనుబంధం ఆప్యాయతల గురించి మాట్లాడతారు.

కానీ.. తరచి చూస్తే అంతా కల్పన.

ఎవరి బ్రతుకు వారిదే ఎవరి ఏడ్పు వారిదే ఎవరి చావు వారిదే

తన కూతురంటే తనకి పంచప్రాణాలు.

కానీ తన కూతురి మనసులో ఏముందో తాను గ్రహించలేడు.

తన కూతురి ఆలోచనలు తనకు తెలియవు.

తన కూతురి భావనలు తనకు తెలియవు.

మరి అనుబంధానికి, అర్థం ఏమిటి?

ఆప్యాయతలకు అర్థం ఏమిటి?

తన మనసులో భావనలు తన జీవన సహచరి అయిన తన భార్యకు తెలియవు.

ఆమె ఆశ నిరాశలు తనకు తెలియవు.

మళ్ళీ ఒకే ఇంట్లో కలసి ఉంటాం. కలసి ఎదుగుతాం.

మనలోంచి మనవల్ల వచ్చిన పిల్లల గురించి మనకు తెలియదు.

తమకు జన్మనిచ్చి, ప్రేమ పంచి పెంచి పోషించిన తల్లిదండ్రుల గురించి పిల్లలకు ఏమీ తెలియదు.

ఎవరి బ్రతుకు వాళ్ళది.

ఎవరి సంతోషాలు వారివి.

ఎవరికి వారే అయిన ఈ ప్రపంచంలో ఎందుకీ తాపత్రయాలు?

ఆలోచిస్తున్న శరత్‌కు వాళ్ల నలుగురు కనిపించారు.

నవ్వుతూ తుళ్ళుతూ వస్తున్నారు వాళ్లు.

మిగతా వారు వీళ్లవైపు దొంగచూపులు చూస్తూ పోతున్నారు.

కొందరి కళ్లల్లో పొర్పూ, కొందరి కళ్లల్లో కుతూహలం, కొందరి కళ్లల్లో నిరసన, ఇంకొందరి కళ్లల్లో అసూయ.

'తల్లిదండ్రులు ఈడొచ్చిన పిల్లల్ని ఇలా వదిలేసి ఎలా ఉంటారో?'

ఎవరి మాటనో వినిపించింది శరత్‌కు.

'బరితెగించిన పిల్లలు. చూడండి అడ్డు అదుపు లేదు.'

ఇంకెవరో 'అరే అది మా ఇంటి దగ్గరే ఉంటుందిరా' ఎవరిదో మాట.

'వాడు నాకు తెలుసురా. గొప్ప ఫోజులు కొడతాడు తనకో గర్ల్ ఫ్రెండ్ ఉందని. అది ఎవడు పడితే వాడితో తిరుగుతుంది. వీడిని తన్నిపోయినప్పుడు తెలుస్తుంది గర్ల్‌ఫ్రెండ్ మజా.'

గాలిలో తేలుతూ వస్తూన్న మాటలు వింటూ కూచున్నాడు శరత్.

తమ చుట్టూ చెలరేగుతున్న ఆలోచనల అలలతో సంబంధం లేనట్టు వాళ్ల ప్రపంచంలో వాళ్లున్నారు.

ఆడపిల్లలిద్దరూ ఓ వారగా నిలబడి ఎదురు చూస్తున్నారు.

మగపిల్లలు బళ్లు తెచ్చారు.

ఇద్దరూ చెరో బండి ఎక్కారు.

స్రవంతి బండి ఎక్కి వెనక కూర్చుని ఎదురుగా ఉన్న అబ్బాయిపై వాలిపోయింది.

వాడు హీరో అయినట్టు జుట్టు ఓ చేత్తో వెనక్కుతోసి, బండిని హఠాత్తుగా ముందుకు దూకించాడు.

స్రవంతి తూలి వాడిని మరింత గట్టిగా పట్టుకుంది.

శరత్ గుండె భగ్గుమంది.

వాడిని పట్టుకుని నవ్వి వాడినెత్తిన ఒకటి మొట్టింది.

ఇంతలో ఇంకొకడు వచ్చి ఇంకో అమ్మాయిని ఎక్కించుకున్నాడు.

ఆ అమ్మాయి వాడిని దగ్గరగా హత్తుకుని కూర్చుంది.

ఇద్దరూ బళ్లను అతివేగంగా ముందుకు దూకించారు.

అడ్డున్న మనుషులను తప్పించుకుంటూ 'రయ్'మని దూసుకుపోయారు.

వాళ్లు వెళ్తూ వదిలిన పొగను చూస్తూ నిస్పృహాయంగా చూస్తూ కూచున్నాడు శరత్.

కాలం తనని వదిలి వెళ్తుంటే, అది వదిలిన ధూళిని చూస్తూ దారి పక్కన పడిపోయి ఉన్న భావన కలిగింది శరత్‌కు.

ఎందుకో ఒక్క క్షణం అతడికి నిరర్థకంగా, నిష్ఫలంగా తన జీవితం అయిన భావన కలిగింది.

ఏదో అవ్వాలనుకున్నాడు. ఏమయ్యాడు?

ఏదేదో సాధిద్దామనుకున్నాడు. ఏమయ్యాడు?

జీవితం, నీరు తన చేతివేళ్లల్లోంచి పారిపోయినట్టు జారిపోతోంది.

స్వప్న్ ఝరే ఫూల్‌సే, మీత్ ఛుభే శూల్ సే

లుట్ గయే సింగార్ సభీ బాగ్ కి బబూల్ సే

ఔర్ హమ్ ఖడే ఖడే బహార్ దేఖ్‌తే రహే

కార్వాన్ గజర్ గయా, గుబార్ దేఖ్‌తే రహే

స్వప్నాలు వాడిపోయాయి. స్నేహితుడన్న వాడు శూలంతో గాయం చేశాడు. పూలతోటలో శాఖలుకున్న అలంకారాలన్నీ దోచుకున్నారు. నేను మాత్రం నిలచి వసంతం వస్తుందని ఎదురు చూస్తూనే ఉన్నాను. జీవితం నన్ను దాటి వెళ్లిపోయింది. అందువల్ల ఎగసిన ధూళిని చూస్తూ కూచున్నాను.

కార్వాన్ గజర్ గయా! గుబార్ దేఖ్‌తే రహే

తాను కూర్చున్న స్థలం నుండి కదలలేదు శరత్.

అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు శరత్‌కు. వెయిటర్ వచ్చి 'సాబ్.. ఆప్ పైసే దియేతో మై దుకాన్ బంద్ కర్ కి జాతా హూ' అనటంతో ఉలిక్కిపడ్డాడు శరత్.

**'రాత్రి అంత లేటయిందేమిటి?'** ప్రొద్దున్న పిల్లలిద్దరూ వెళ్ళిపోగానే అడిగింది ప్రశాంతి.

'ఫ్రెండు కలిశాడు' ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు శరత్.

'ఎవరా ఫ్రెండు?' అడిగింది ప్రశాంతి.

గంటలు గంటలు అన్నీ మరచిపోయి గడిపేంత ఫ్రెండ్లెవరూ శరత్‌కి లేరని ప్రశాంతికి తెలుసు. అదీకాక, ఇన్నేళ్ళు ఓ వ్యక్తితో గడిపిన తరువాత అతడు నిజం చెప్తున్నాడో లేదో గ్రహించటం సులభం. అందుకే రెట్టించింది ప్రశాంతి.

'నాతో స్కూలులో కలసి చదివాడు చాలాకాలం అయిందికదా, చాలా మాట్లాడుకున్నాం' అబద్ధం చెప్పాడు శరత్.

ప్రశాంతి ముఖం చూస్తే ఆమె తాను అబద్ధం చెప్తున్నాడని గ్రహించిందని శరత్‌కు అర్థమవుతూనే ఉంది. కానీ ఎందుకో ఆమెకు నిజం చెప్పాలనిపించటం లేదు.

శరత్ అబద్ధం చెప్తున్నాడని ఆమె గ్రహించింది.

ఒక వ్యక్తికి ఓ విషయం చెప్పాలని లేనప్పుడు అతడిని రెట్టించి అడగటం వల్ల లాభం వుండదు.

అది మరిన్ని అబద్ధాలకు దారి తీస్తుంది. దాని పర్యవసానం మనసులు గాయపడటం. సంబంధాలు దెబ్బతినటం. అందుకే ఇక రెట్టించలేదు ప్రశాంతి. కానీ శరత్ తన దగ్గర 'ఏం దాస్తున్నాడో?' అన్న ఆలోచన ఆమె మనసులో కలిగింది.

మౌనంగా ఆఫీసుకి తయారయి 'పదండి' అంది.

శరత్ కూడా మాట్లాడలేదు. మరో వివరణ ఇవ్వలేదు.

ఈనాటి ఆమె మౌనం భవిష్యత్తులో రాబోయే తుఫానుకు నాందీ ప్రస్తావన అని అతడికి తెలుసు. కానీ 'సమస్య వచ్చినప్పుడు దాని పరిష్కారం ఆలోచించవచ్చులే' అనుకున్నాడు.

'నీకు తెలుసా? మన భాగ్యలక్ష్మి లేదూ, ఆవిడ కూతురు మతాంతర వివాహం చేసుకుందట' శరత్ దగ్గరకు వచ్చి మాటలు కలిపాడు ఓ కొలీగు.

అనాసక్తంగా విన్నాడు శరత్. అతడి మనసులో కూతురు, తన మగ సహాధ్యాయులతో ఉన్న దృశ్యమే కదలాడుతోంది. ఏదో తెలియని బాధ కలుగుతోంది. దానికి ఉపశమనం ఏమిటో తెలియటం లేదు.

రాత్రి శరత్ ఇంటికి వచ్చేసరికి స్రవంతి భోజనం చేసి నిద్రపోయింది.

'బాగా చదివి అలసిపోయి ఉంటుంది' అంది ప్రశాంతి.

దాంతో ఆమెకు నిజం చెప్పి బాధించాలనిపించలేదు శరత్‌కు. అందుకని అబద్ధాలు చెప్పాడు.

'ఏమిటో, ఈ కాలంలో పిల్లలకు ఆవేశం తప్ప ఆలోచనలు ఉండటంలేదు' అన్నాడు కొలీగ్. తల ఊపాడు శరత్.

'మన ఆఫీసులోనే చూడు, రెండు మతాంతర వివహాలు, నాలుగు కులాంతర వివాహాలు ఒక పక్క కులాల వారీగా, మతాల వారీగా మనుషుల మధ్య అడ్డుగోడలు గట్టిపడుతున్నాయి. మరోవైపు ఇలాంటి వివాహాలు పెరుగుతున్నాయి. నువ్వు మేధావిగా, ఇదేమిటో నాకు కాస్త వివరించు' అన్నాడు అతడు.

శరత్ నవ్వి ఊరుకున్నాడు.

తన కొలీగు అన్నమాటలలో సత్యం ఉందని శరత్‌కు తెలుసు.

ఇటీవలి కాలంలో 'కులం' ఆధారంగా విద్వేషాలు ప్రదర్శించటం, దూషించటం ఎక్కువయిపోయింది. ఇదంతా విద్యావంతులయి సామాజికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారే ప్రదర్శించటం కూడా ఎక్కువయింది. వీరిలో మతం మారిన వారే అధికంగా 'దళితులు', అన్యాయాలు, అక్రమాలు, అణచివేతలు అంటూ విమర్శించటం, 'మనువాదం నశించాలి', అంటూ హిందూ ధర్మాలను దూషించటం కూడా అధికమయింది. అయితే కొన్ని విషయాలను బహిరంగంగా అనకపోవటమే మేలు అని శరత్‌కి తెలుసు.

అందుకే పైకి అన్నాడు. 'నాకేమనిపిస్తున్నదంటే, మనం అంతగా కులాలను పట్టించుకోవటంలేదు. కానీ మతం మారిన వారే మన కులవ్యవస్థపై అధికంగా వ్యాఖ్యానిస్తున్నారు. బాధపడి అరుస్తున్నారు'

కొలీగు పెద్దగా నవ్వాడు. 'నేను అదే అందామనుకుంటున్నాను. నాకు తెలిసిన ఓ మహానుభావుడున్నాడు. అతడు రిజర్వేషన్, ఆధారంగా ఓ పెద్ద పొజిషన్ ప్రభుత్వ సంస్థలో సాధించాడు. అతడు వీలు చిక్కినప్పుడల్లా మన పండుగలను హేళన చేస్తాడు. రాక్షసులు దేవతలంటాడు. దేవుళ్ళు అగ్రవర్ణాల వారంటాడు. నరకాసురుడిని చంపటం దళితులపై దాడి అంటాడు. ఓసారి అడిగాను, నరకాసురుడు, విష్ణువుకు భూదేవికి పుట్టినవాడు. దళితుడు ఎలా అయ్యాడని? అదంతా అగ్రవర్ణాల కుట్ర అంటాడు. మనువాదం నశించాలి అంటాడు. ఎక్కడ ఏం జరిగినా అది మనువాదం, అగ్రవర్ణాల కుట్ర అంటాడు. తీరా చూస్తే వాడికి నగరంలో ఎనిమిది ఫ్లాట్లున్నాయి. ఊళ్ళో ఎకరాల కొద్దీ భూములున్నాయి. వాళ్ళ పిల్లలు ఖరీదైన ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారు. కానీ దళితుడినని అణచివేతకు గురవుతున్నానంటాడు. నేను అడిగా, నువ్వు మతం మారగానే నీ కులం, పోయింది. నీ మతం మారింది. ఇంకా దళితుడనని ఎలా అంటావయ్యా? అని నా మీద విరుచుకు పడ్డాడనుకో. నిజానికి మతం మారిన వాళ్ళే అధికంగా గోల చేస్తున్నారనిపిస్తుంది' అన్నాడు.

'నాకు అదేమిటో తెలియదు కానీ, ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూసి, గోరంతలు కొండంతలు చేసి సమాజంలో ద్వేషం వెదజల్లి అడ్డుగోడలు నిర్మించాలని వీళ్ళు చేస్తున్న ప్రయత్నాల వెనుక ఓ ప్రణాళిక ఉందనిపిస్తుంది' అన్నాడు శరత్.

'ఏమిటది?'

'ఆరంభంలో రిజర్వేషన్లు అమలు జరిపినప్పటి తరంలో ఒక రకమైన ఆదర్శం, ఆవేశం ఉండేవి. ఒక తరం పోయి, రెండో తరం వచ్చేసరికి పరిస్థితులు మారాయి. రిజర్వేషన్ లబ్ధిపొంది పైకి వచ్చిన వారు వారి తరువాత తరం ఇంకా లాభం పొందుతూనే ఉన్నారు. కానీ లబ్ధిపొందనివారు, ఇన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలియని వారు అలానే ఉన్నారు. ఇంకా దిగజారారు. ఇంకో రెండు తరాలు పోయేసరికి ఆదర్శాలు, ఆవేశాలు పోయాయి. జీవిత సమస్యలు ముందుకు వచ్చాయి. రిజర్వేషన్‌ని వారికి తామేదో నష్టపోతున్నామన్న ఆలోచన పెరిగింది. ఉన్నవారికి తమ సౌకర్యం పోగొట్టుకోవటం ఇష్టంలేదు. లేనివారికి సౌకర్యం అందటమే లేదు. ఇదిగో, ఈ ద్వైదీభావనల నడుమ, స్వార్థాల నడుమ, జీవిత సమస్యల వల్ల సమాజంలో మళ్ళీ 'కుల' భావన చెలరేగుతోంది. ఇలాకాక రెండు తరాలు రిజర్వేషన్ లబ్ధిపొందినవారు స్వచ్ఛందంగా తమకు ఎలాంటి ఊతకర్ర అవసరంలేదు అన్న ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తే, రిజర్వేషన్లు

లేని వారు కావాలని గోలచేయటం, వారి గోల చూసి తమదేదో పోతుందని వీళ్ళు గోల చేయడం తగ్గదు. ఈ గోలల నడుమ ఇంతవరకూ లబ్ధిపొందని వాడు అలాగే ఉంటున్నాడు. సమస్య జటిలం అవుతోంది తప్ప పరిష్కారం కావటంలేదు.' అన్నాడు శరత్.

'ఓహో.. అందుకేనా. ఓ యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే దానికి పెద్ద గోల చేశారు, అతడు దళితుడు కాడని తెలిసీ, అతడి ఆత్మహత్యకూ అణచివేతకూ సంబంధం లేదని తెలిసికూడా! ఇక ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకోలేదు.'

'అంతా రాజకీయం - స్వార్థం.. కొందరు ప్రభుత్వాఫీసులలో లంచ్ సమయాల్లో అన్నం తినే సమయంలో వివక్షత చూపుతారనీ, బొట్టు పెట్టే విషయంలో ఓ ఇష్యూ చేస్తారనీ కథలు రాస్తున్నారు. వాటిని పొగిడేసి గొప్ప 'నిజం' జీవితం వారు కథల్లో చూపుతున్న దానికి భిన్నంగా ఉంది. ఈ నిజం కథలలో ప్రదర్శించే ధైర్యం ఏ రచయితా చేయటంలేదు. చేసినా వారికి ఆదరణ లభించదు.'

'ఏమిటా నిజం?'

'నా స్వీయానుభవం చెప్తాను. మా పాప నాలుగో తరగతి చదివేటప్పుడు దానికి ఓ ఫ్రెండు ఉండేది లూసీ అని. లూసీ ఓ నాలుగు రోజులు స్కూలుకు రాలేదు. ఎందుకంటే బైబిల్ క్లాసులు జరిగేయట. ప్రొద్దున్నే ఓ బస్సొచ్చి పిల్లలందరినీ చర్చికి తీసుకు వెళ్తుంది. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, అక్కడే సాయంత్రం మళ్ళీ ఇంటికి తెచ్చి దింపుతారు బస్సులో. ఆ నాలుగు రోజులు పిల్లలకు బైబిల్ పాఠాలు, దైవ సంబంధిత విషయాలు, క్రిష్టియన్ల నడవడి నేర్పుతారట. అది అయిన తరువాత మా అమ్మాయి ఆ ఫ్రెండుతో ఆడటానికి వెళితే 'నువ్వు క్రిష్టియన్‌వి కావు. నీతో ఆడటం పాపం' అందట లూసీ. ఏడుస్తూ ఇంటికి వచ్చింది మా అమ్మాయి. 'నన్ను ఆడనివ్వటంలేదు. మనం ఎందుకు క్రిష్టియన్లం కాము?' అని ఏడ్చింది. అప్పటివరకు మా పాపకు హిందూ, క్రిష్టియన్ అన్న పదాలు తెలియవు. ఆ తరువాత ఓ రోజు మా ఇంటికి వచ్చింది లూసీ. మీరీ దేవుళ్ళని ఎందుకు పూజిస్తారు? ఇదంతా అబద్ధం... మూర్ఖత్వం అంటూ లెక్చరిచ్చింది. అంతేకాదు, పాటలు పాడమంటే క్రిష్టియన్ల భజన గీతాలు పాడింది. అప్పుడు అనిపించింది నాకు ప్రతి మతానికి వాళ్ళ మతం గురించి చిన్నప్పటి నుంచే చెప్పే వ్యవస్థ ఉంది. క్రిష్టియన్లకు బైబిల్ పాఠాలు, ముస్లింలకు మదర్సాలు ఉన్నాయి. మనం మన పిల్లలకు దైవం గురించి ఏం చెప్తాం? ఎప్పుడు చెప్తాం? ఒక పద్ధతి ప్రకారం వాళ్ళకి తెలిసే వీలు లేదు. అందుకే వాళ్ళు తాము ఏమిటో తెలియకుండా పెరుగుతున్నారు. ధర్మాన్ని కాదనటం గొప్పగా భావిస్తున్నారు. అదే ఇతర మతాలలో మతానికి ప్రాధాన్యం. మనకు కాదు. పైగా ధర్మభంగం గొప్పతనం. మన ధర్మాన్ని మన పిల్లలు వాళ్ళంతట వాళ్ళు తెలుసుకోవాల్సి వస్తోంది. కానీ అప్పటికే జరిగే నష్టం జరిగిపోతోంది. మనల్ని మనం చులకన చేసుకుని, న్యూనతా భావానికి గురయ్యే స్థితికి చేరుకుంటున్నాం. ఇది నీకు ఎవ్వరూ ఎక్కడా చెప్పరు. ఇదిగో ఇక్కడి నుంచే మన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మన ధర్మాల్ని తిట్టినా, దేవుళ్ళని తిట్టినా, ధర్మగ్రంథాలను దూషించినా మనం సమాధానం ఇచ్చి స్థితిలో లేము. కనీసం వాటిని సమర్థించే స్థితిలోనూ లేము. ఎందుకంటే మన ధర్మం గురించి మనకేమీ తెలియదు. వాడు వక్ర దృష్టితో చూసి చేసిన ఆరోపణలే నిజం అనుకునే మూర్ఖ అజ్ఞాన దశలోనే ఉన్నాం మనం.' ఆవేశంగా చెప్తాడు శరత్.

అంతవరకూ మౌనంగా విన్న అతడి లేచాడు. 'నువ్వింత మత తత్వవాదివి అనుకోలేదు. నువ్వు ఆరెస్సెస్ వాడివని నాకు తెలియదు' అని గబగబా వెళ్ళిపోయాడు. ఆశ్చర్యపోయాడు శరత్. ఇంత వరకూ బాగానే మాట్లాడినవాడు ఇప్పుడిలా అంటాడేమిటి? హఠాత్తుగా మత తత్వం, ఆరెస్సెస్ ఎక్కడినుంచి వచ్చాయి?

'ఏం సార్.. ఏమంటున్నాడు మను లక్ష్మీనారాయణ?' అంటూ వచ్చాడు ఇంకో కొలీగు.

ఆశ్చర్యం నుంచి తేరుకోని శరత్ జరిగినదంతా చెప్పాడు.

అంతా విని నవ్వాడు అతడు. 'మీరు లక్ష్మీనారాయణ గురించి తెలిసినట్టులేదు. అతడు కన్వర్టు. ఇటు రిజర్వేషన్ లబ్ధి పొందుతున్నాడు. ఇలా మాట్లాడి ఎదుటివాడి మనస్సు గ్రహిస్తాడు. ఇక మీ జోలికిరాడు. అతడు మన ఆఫీసులో క్రిష్టియన్

అసోసియేషన్‌లో ఆఫీసరు బేరర్. జాగ్రత్త. ఇంకోసారి మనసులో మాటలు ఇలా బయటకు చెప్పకండి. మళ్ళీ మీరు అవమానించారని ఎస్సీ ఎస్టి ఏట్రో సిటీస్ ఏక్ట్ క్రింద కేసు పెట్టగలడు'

శరత్ ఆశ్చర్యం 'షాక్'గా మారింది. 'క్రిష్టియన్. అయినా లక్ష్మీనారాయణ అన్న పేరు.'

'మారదు. రిజిష్టరులో అతనిపేరు కె.లక్ష్మీనారాయణ. కొండలపల్లి లక్ష్మీనారాయణ. లాభాలు పొందేటప్పుడు వేరు. మతం ప్రసక్తి వస్తే వేరు.' శరత్ ఆశ్చర్యం చూసి పెద్దగా నవ్వుతూ వెళ్ళిపోయాడు అతడు.

చాలాసేపు అలా ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు శరత్.

తాము విద్యావంతులు. మానసిక పరిణతి రావాల్సి వయసులో ఉన్నవారు. కానీ తమ నడుమనే ఇన్ని అడ్డుగోడలు, మోసాలు, ద్వేషాలు.. స్వార్థం అన్ని బంధాలను, కప్పిపెడుతోంది.

అలాంటిది ఇంకా ముక్కుపచ్చలారని యువతీయువకులు ఈ విద్వేషాలను, ఈ విషాగ్నులను ఎలా తట్టుకోగలరు?

అతడి మనసులో భాధ మరింత పెరిగింది.

తామూ తమ సంతానం కోసం ఎలాంటి సమాజాన్ని తయారు చేస్తున్నారు?

ఈ ఆలోచనలు తాత్కాలికంగా అతడి మనసులోంచి స్రవంతికి సంబంధించిన ఆలోచనలను వెనక్కు నెట్టాయి.

అతని ఆలోచనలను భంగం చేస్తూ సెల్‌కు మెసేజ్ వచ్చింది.

చూశాడు. శిల్ప నుంచి వచ్చింది.

Never get too much attached to anyone unless they feel the same towards you, because, one sided appectations can mentally destroy you.

అది చూడగానే బాధ అనిపించింది.

వెంటనే శిల్పకు ఫోను చేయాలనిపించింది.

కానీ పలురకాల విభిన్నమైన సందిగ్ధితిలో కొట్టిమిట్టాడుతున్న మానసిక స్థితిలో ఉన్న అతడి మరో సందిగ్ధాన్ని కొని తెచ్చుకోదలచుకోలేదు. అతి కష్టం మీద శిల్పకు ఫోను చేయాలన్న కోరికను అణుచుకున్నాడు. లక్ష్మీనారాయణతో కలిగిన అనుభవంతో అతడి మనసు పాడయిపోయింది. సాధారణంగా ఎవ్వరితో మనసు విప్పి మాట్లాడాడు శరత్. అలాంటిది ఎందుకో మాట్లాడాడు.

కానీ తాను మాట్లాడిన ప్రతిమాట నిజం అని శరత్‌కి తెలుసు.

ఇతరులకు వాళ్ళ మతం గురించి చిన్నప్పటి నుంచే బోధిస్తారు. కానీ త్తమ ధర్మంలో అలాంటి వ్యవస్థలేదు. తల్లిదండ్రులకే ధర్మం తెలియదు. కష్టం కలిగినప్పుడు మొక్కుతుంటావు. శాంతులు చేయిస్తారు. ఆ తరువాత 'అంతా మూర్ఖత్వం' అని వాదిస్తారు. పెద్దలకే తెలియదు. పిల్లలకు ఏం మార్గదర్శకతం చేస్తారు? తమ ప్రమేయం లేకుండానే తమ జీవితాలు ఓ చట్రంలో బిగుసుకుపోయాయి. దాన్లో ఇమడలేరు. బయటకు రాలేరు.

తన చుట్టూ ఉన్న మనుషులను చూస్తూంటే ఈ భావన బలపడుతోంది ఇంతలో ఏదో మెసేజ్ వచ్చింది.

తీసి చూశాడు.

శిల్పనుంచి

ఓ హిందీ పాట పంపింది.

చూశాడు.

లతా మంగేష్కర్ స్వరం అతని హృదయాన్ని తట్టింది.

వో జో మిల్‌తే థె కభీ హై మెరీ నిగాహో మె కభీ

అజ్ యూ మిల్తె హై జైసె కభీ పహెచాన్ నథీ

అతడు నన్ను ఒకప్పుడు పిచ్చివాడిలా, నన్ను విడచి ఉండలేని వాడిలా కలిసేవాడు. ఇప్పుడు అసలు పరిచయం లేని వాడిలా కలుస్తున్నాడు.

దేఖ్‌తె భీ హై మెరీ నిగాహో మె కభీ

అజ్‌నబీ జైసె మిలా కర్తే హై రాహో మె కభీ

ఇస్ కదర్ ఉన్ కీ నజర్,

ఒకప్పుడు కళ్ళను చూడకుండా ఉండలేకపోయేవాడు. దారుల్లో అపరిచితుడిలా కలిసేవాడు. అతడి కళ్ళకు నేను ఇంతగా అపరిచితను కాదేమో!

శరత్ హృదయం మెలిపెట్టినట్టయింది.

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

పాట మళ్ళీ మళ్ళీ విన్నాడు.

ఎంత అద్భుతమైన భావన. ఎంత తపన పడి వుంటే ఇలాంటి భావనను అంత సుందరంగా అక్షరాలలో పొదగటం సాధ్యమవుతుంది.

లతా స్వరం ప్రతి అక్షరానికీ ఎంతో లోతునిస్తూ, భావాన్ని పలవరిస్తూ ధ్వనిస్తోంది. శిల్ప మనసులో భావనలను లత పలుకుతోంది.

కానీ... ఇక ఆగలేకపోయాడు శరత్.

గబగబా ఆమె నెంబర్లు నొక్కాడు. సెండ్ దగ్గర ఒక్క సెకను ఆగాడు.

'ఆగారేం? ఫోను చెయ్యండి' శిల్ప స్వరం వినిపించింది.

ఆశ్చర్యంగా తలె ఎత్తాడు శరత్.

'తూ ఖామోష్ క్యూ హై యే మాలూమ్ నహీ మాగర్,

దిల్ డూబ్ సజాతా హై జబ్ తూ ఖామోష్ హోతాహై' అంది నవ్వుతూ

'నువ్వు మౌనం ఎందుకు వహించావో తెలియదు కానీ, నువ్వు మౌనంగా ఉంటే నా మనసు దుఃఖంలో మునిగిపోతుంది.'

**మౌనంగా చుట్టూ** చూస్తూ కూచున్నాడు శరత్.

అంత ఎత్తునుంచి ప్రపంచం అందంగా కనిపిస్తోంది. మనుషులు అస్సలు సరిగ్గా కనబడటంలేదు. వాహనాలు పాకే చీమల్లా ఉన్నాయి. ఇళ్ళు అగ్గిపెట్టెల్లా ఉన్నాయి. మొత్తం నగరం కంప్యూటర్ 'మదర్‌బోర్డ్'లా కనిపిస్తోంది.

నవ్వొచ్చింది శరత్‌కు.

ఏదైనా విషయాన్ని వివరించాలంటే, మరో తెలిసిన దానితో పోల్చి చెప్పటం ఆనవాయితీ. ఇప్పుడు ఇంత ఎత్తునుంచి చూస్తూంటే కనబడే భవంతులు, రహదారులు కంప్యూటర్ మదర్ బోర్డుని తలపించటం ఆధునిక సామాజిక పరిస్థితుల నిదర్శనం.

కాళిదాసు కాలంలో ఇవేమీలేవు. అందుకని అతని వర్ణనలు ఆ కాలానికి తగ్గట్టు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఉన్నాయి. కానీ మనం కాళిదాసు వర్ణనల ఔన్నత్యంతో ఈనాటి వర్ణనలను పోల్చి ఆనాటి వారి భావనా బలాన్ని పొగిడి, సమకాలీన సాహిత్యాన్ని తక్కువ చేస్తాం. ఇది పొరపాటు.

ఏ సమయంలోని కళలను ఆ కాలంనాటి కొలమానాలతోనే తూచి అంచనా వేయాలి. అలాగే ఆ కాలం నాటి మనుషుల మనస్తత్వాలను, వ్యక్తిత్వాలను కూడా ఆ కాలం నాటి పరిస్థితులు, వ్యవస్థలాంటి అంశాల ఆధారంగా అంచనా వేయాలి తప్ప వారి పరిస్థితులకు భిన్నంగా ఉన్న పరిస్థితుల ఆధారంగా కాదు. మరి ఇప్పుడు తన కొడుకు కూతుళ్ళ ప్రవర్తనను ఆలోచనా విధానాన్ని తాను ఏ తూనిక రాళ్ళతో తూచాలి?

తాను పెరిగినప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు వేరు. మరి, తన ఆలోచనలు, అభిప్రాయాలతో వారిని నిర్దేశించాలా?

'మీరు నాతో లేరు? ఎక్కడ ఉన్నారు?' మృదువుగా అడిగింది శిల్ప.

శరత్ మాట్లాడలేదు.

ఆఫీసులో శిల్ప ప్రత్యక్షంగా కలసి 'ఎందుకు కలవటంలేదు?' అని అడిగినప్పుడు ఏమీ చెప్పలేకపోయాడు.

మనిషి ఎదురుగా లేనప్పుడు ఏదేదో అనాలనుకుంటాం.. కానీ ఎదురుగా మనిషి ఉన్నప్పుడు అవన్నీ ఆవిరైపోతాయి. అనాలనుకున్నవి మారిపోతాయి.. పైగా ఆ వ్యక్తి శిల్ప అంత అందమైనది, అయితే అనుకున్నవన్నీ అయోమయం అసంభవం. ఎందుకంటే, ఆమెని చూడగానే కలిగే అనిర్వచనీయమైన ఆనందానుభూతిని అర్థం చేసుకోవాలనే ప్రయత్నంలోనే వ్యక్తి సమయం గడిచిపోతుంది. అక్కడి మాటలు అనవసరం.

శరత్ ఏమీ మాట్లాడక పోవటంతో శిల్ప మళ్ళీ అంది.

'ఈ మధ్య ఎందుకని నన్ను అవాయిడ్ చేస్తున్నారు? మనం చిన్నపిల్లలం కాదు. టీనేజర్లం. అంతకంటే కాదు. మరి ఎందుకని అలా తప్పించుకుని తిరుగుతున్నారు? ఉన్నదేదో చెప్పవచ్చు కదా! అంది.

నిట్టూర్చాడు శరత్.

'అదే పెద్ద సమస్య. మనం టీనేజర్లం కాకపోవటం పెద్ద సమస్య. టీనేజర్లం అయితే ముందూ వెనుక ఎలాంటి ఆలోచన ఉండేది కాదు. ఎలాంటి సంకోచాలు, సందిగ్ధాలు ఉండేవికాదు. ఇప్పుడు మనం ఇలా కలవటం, ఎవరికయినా ఏమని సమాధానం ఇస్తాం? సంజాయిషీ ఏమని ఇస్తాం?' అడిగాడు శరత్.

అతడి వైపు పరిశీలనగా చూసింది శిల్ప. 'ఎవరికయినా ఎందుకని సంజాయిషీ ఇవ్వాలి?'

నవ్వాడు శరత్.

'మేడమ్... మనం ఎంతగా ఈ ప్రపంచంతో సంబంధంలేని వారమని అనుకున్నా మన చుట్టూ మన ప్రమేయం లేకుండా అనేక బంధాలు, బంధనాలు ఉన్నాయి. మనం ఎంతగా విస్మరించినా అవి మనపై ప్రభావం చూపిస్తాయి. నాకు మీ సాంగత్యం నచ్చింది. మీతో ఇలా ఒంటరిగా సమయం గడపటం, సాధారణంగా ఎవరితో చర్చించని విషయాలు చర్చించటం, ఆలోచనలు పంచుకోవటం ఎంతో నచ్చింది. ఒక రకంగా చెప్పాలంటే, మనసులో అణగారి ఉన్న ఒక కల నిజమవుతోంది. ఒక స్వప్నం సాకారమవుతోంది. కానీ దీని పర్యవసానం ఏమిటి? టీనేజిలో కలవటానికి ఈ వయసులోని పరిచయానికి నడుమ తేడా అది ఇదే అప్పుడు లేని జవాబుదారీ తనం ఇప్పుడుంటుంది. అప్పటి ప్రవర్తనలో ఆలోచన కన్నా ఆవేశం అధికంగా ఉంటుంది. ఇప్పుడు ఆవేశం కన్నా ఆలోచన అధికంగా ఉంటుంది. ఎందుకంటే, అప్పుడు మొత్తం జీవితం వ్యక్తి ముందు ఉంటుంది. ఇప్పుడు గత జీవితం బరువు భుజం మీద ఉంటుంది.'

'ఎవరైనా ఏమైనా అన్నారా?' మృదువుగా అడిగింది.

‘మనసున్నవాడిని ఎవరూ ఏమీ అనక్కర్లేదు. మనస్సాక్షి అనుక్షణం ప్రశ్నిస్తూనే ఉంటుంది‘అన్నాడు.

నవ్వింది ‘అలాంటి వాళ్ళు జీవితంలో ఏమీ అనుభవించలేరు. ఆనందించలేరు. ఎప్పుడూ సందేహాలతో, అనిశ్చింతతో సతమతమవుతూ ఉంటారు‘ అంది.

‘నిజమేనేమో. నాకు నీ పరిచయంలో ఉన్న ఆనందం మరెక్కడాలేదు. కానీ ఈ వయసులో ఇప్పుడు ఇలా ఆనందిస్తూంటే, మరోవైపు నా కూతురు మరెవరితోనో సినిమాకు వెళితే, అబద్ధం చెప్పి వాడిని కలుస్తూంటే, నేను నన్ను ఎలా అర్ధం చేసుకోవాలి, నా కూతురిని ఎలా అర్ధం చేసుకోవాలో నాకు తెలియటంలేదు. తనకి ఎలా మార్గదర్శనం చేయాలో తెలియటంలేదు‘ శరత్ స్వరంలో ఆవేదన స్పష్టంగా ధ్వనించింది.

చాలాసేపు ఇద్దరి మధ్య మౌనం తాండవించింది. ఉండుండి వీస్తున్న గాలి తప్ప నిశ్శబ్దాన్ని మరో శబ్దం భంగం చేయటంలేదు.

‘ఏమైంది?‘ అడిగింది శిల్ప చాలాసేపటి తరువాత.

దూరంగా దీపాలు వెలగటం మొదలయింది. గాలి దిశమారింది. ఆకాశంలో మిలమిల మెరుస్తూ తారలు దర్శనమివ్వటం మొదలయింది. ఆకాశం రంగు నెమ్మదిగా నలుపులోకి దిగజారుతోంది.

తన కూతురు అబద్ధం చెప్పటం, తాను ఆమె ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్ళటం అంతా శిల్పకు చెప్పాడు శరత్.

ఒక పెద్ద బరువు దిగినట్టనిపించింది అతనికి.

తన బాధను ఎవరితోనయినా పంచుకోవాలని ఉంది. కానీ భార్యతో చెప్పలేడు. ఈ మాట వింటే ఆమె విపరీతమైన రియాక్షన్ ప్రదర్శిస్తుంది. తన కొలీగుల్లో వ్యక్తిగత విషయాలు చెప్పుకుంటారు కానీ తను ఎవరితో ఏమీ చెప్పడు. చెప్పినా వాళ్ళు తరువాత అవకాశం చూసి హేళన చేస్తారు. ఎత్తి పొడుస్తారు తప్ప అర్ధం చేసుకోరు. వారితో ఏదైనా ఆంతరంగిక విషయం చర్చించటం అంటే తన బలహీనతను తానే బహిరంగ పరచటం. తనను గాయపరచే ఆయుధాన్ని తానే అందించటం వంటింది. అందుకే కొలీగులతో అంటీ ముట్టనట్టు ఉంటాడు.

ఇలాంటి పరిస్థితులలో శిల్ప తప్ప మనసులో మాట పంచుకోవటానికి మరెవరూ లేరు. కనీసం శిల్ప అయినా ఉంది. లేకపోతే?

‘మనసున మనసై, బ్రతుకున బ్రతుకై, తోడొకరుండిన, అదే భాగ్యమూ, అదే స్వరమూ‘ అంటే ఇదేనా?

ఇదేనా అసలైన భాగ్యము? అసలైన స్వర్గము?

శిల్ప వైపు చూశాడు.

అతడి మాటలు సానుభూతితో వింటోంది ఆమె.

ఆమె ముఖంలో ఆలోచన, సానుభూతి, ఒకరకమైన అవగాహనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అది చూస్తూంటేనే ఎంతో ఎంతో సంతృప్తిగా ఉంది శరత్‌కు. అతని మనసులోంచి బాధను ఎవరు తోడేస్తున్న భావన కలిగిది.

‘ఇప్పుడు చెప్పు.. నిన్ను కలవటం నాకు ఆనందంగా ఉన్న, నిన్ను కలిసినప్పుడల్లా నా కూతురు గుర్తుకు వస్తుంది ఏది తప్పు? ఏది సమంజసం? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి.‘

చల్లగాలి వీయటం ఆరంభమయింది.

ఆకాశం నల్లబడింది పూర్తిగా. రక్తహీనతతో బాధపడుతున్నట్టున్న తారలు, ఇప్పుడు ఆరోగ్యంతో తొణికిసలాడుతున్నట్టు చీకటి ఆకాశం తెరపై తళతళలాడుతున్నాయి. ఇంతవరకూ అందంగా కనిపించిన దృశ్యాలు అదృశ్యమై వాటి స్థానాన్ని దీపపు వెలుగులు మిణుగురు పురుగుల్లా ఆక్రమించాయి. కదిలే వాహనాలు కాంతి ప్రవాహాల్లా కనిపిస్తున్నాయి.

'నీ బాధ అర్థమయింది. కానీ ఒకటి ఆలోచించు. మనం కలవటంలో, పిల్లలు కలవటంలో మౌలికమైన తేడా ఉంది. మన పరిమిత దృక్కోణంలో చూస్తే రెండూ పొరపాటే. కానీ మన పరిస్థితులు, పిల్లలు పెరుగుతున్న వాతావరణం, వారి చుట్టూ ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే, రెండూ స్వాభావికంగా జరగాల్సిన పరిణామాలే అనిపిస్తాయి' అంది మెల్లిగా.

ప్రశ్నార్థకంగా చూశాడు ఆమె వైపు.

'శరత్...' తొలిసారిగా అతడిని పేరుతో సంబోధించింది శిల్ప.

శరత్ హృదయంలో ఒక ఆనంద వీచిక ఎగసి పడింది. తన పేరు ఇంత మధురంగా, ఇంత తీయగా ఎప్పుడూ ధ్వనించలేదు.

మళ్ళీ ఆమె తనను తన పేరుతో పిలిస్తే బాగుండుననిపించింది. మళ్ళీ అలా పిలవమని అడగాలని అనుకున్నాడు. కానీ ఏదో బిడియం, ఏదో సందిగ్ధం అతడిని వెనకకు లాగింది.

'శరత్.. మనది మరో ప్రపంచం. పిల్లలది వేరే ప్రపంచం. ఈ రెండు ప్రపంచాల నడుమ ఎంతో తేడా ఉంది. మనకున్న సందేహాలు, సందిగ్ధాలు బిడియాలు, భయాలు ఈ తరానికి లేవు. ఉండవు కూడా. వారు చిన్నప్పటినుంచీ తమకు కావాల్సింది పోరాడి సాధించటానికి అలవాటు పడుతున్నారు. తమ భావాలను, అభిప్రాయాలను వ్యక్తపరచటానికి వెనుకాడని పరిస్థితుల్లో పెరుగుతున్నారు. గమనించు, మనం ముగ్గురం, నలుగురం ఉండేవారం. ఇచ్చిపుచ్చుకోవటం, పంచుకోవటం, కలిసి తిరగటం, త్యాగాలు చేయటం, పక్కవారి గురించి ఆలోచించడం మనకు స్వాభావికంగా అలవడింది. పైగా, ఏది మంచి, ఏది చెడు అన్నది పెద్దలు చెప్పేవాళ్ళు. స్కూళ్ళలో తెలిసేది. ఇప్పటి తరం చూడు. ఒకరో, ఇద్దరో పిల్లలుంటారు. తల్లిదండ్రులిద్దరూ వారి వారి ఉద్యోగాల గొడవలు, అహంకారాల గొడవలు, అపార్థాల ఆరాటాల్లో ఉంటారు. పిల్లలకు అడిగింది ఇచ్చేస్తారు. విసుక్కుంటారు. ఎంత ప్రేమగా చుసినా, ఎంతగా పిల్లలతో సమయం గడిపినా పెద్దలలోని అసంతృప్తులు, ఆందోళనలు, పిల్లలపై ప్రభావం చూపిస్తాయి. పెద్దలలోని ఆందోళనలను, గిల్టీఫీలింగ్‌లను పిల్లలు తమకనువుగా వాడుకుంటారు. తమకు కావాల్సింది పోరాడి సాధించుకుంటారు. అందుకే గమనించు, పెద్దలపట్ల అమర్యాదకరంగా ప్రవర్తించకున్నా, గౌరవం ప్రదర్శించటం కనబడటంలేదు. టీచర్లు, అధ్యాపకులు, ఎవ్వరికీ గౌరవం ఇవ్వటంలేదు. కాలేజీలో పిల్లలు, పాఠాలు విని అధ్యాపకులను గౌరవించాల్సిన పిల్లలు, వాళ్ళనే కాలర్లు పట్టిలాగటం, ఎదిరించి ధర్నాలు చేయటం, ఘెరావ్‌లు చేయటం చూస్తున్నాం. అదీ చదువు విషయంలో కాదు. ఇతర అంశాల ఆధారంగా మరోవైపు ఇలా బహిరంగంగా భావాలు వ్యక్తపరచలేని వారు మానసికంగా కృంగిపోవటం కనిపిస్తోంది. నీకు తెలుసా, ప్రస్తుతం మన దేశంలో మానసిక రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. మానసిక వైద్యులను సంప్రదిస్తున్న వారిలో యువత అధిక సంఖ్యలో ఉండటం గమనార్హం. అందుకే నువ్వు నీ దృష్టిలో నీ పిల్లల ప్రవర్తన మంచి చెడులను నిర్ణయించటం మానెయ్. వాళ్ళ దృష్టితో వాళ్ళని చూసి వాళ్ళ ప్రవర్తనను అర్థం చేసుకోండి. మీ దృష్టితో మీ ఆలోచనలతో వాళ్ళ ప్రవర్తనను నిర్ణయించకండి' అంది శిల్ప.

ఆమె చెప్పిన మాటలు గురించి ఆలోచిస్తూ అన్నాడు శరత్ 'అంటే నేను ఇప్పుడు వాడు సినిమాల్లోకెళ్ళి దెబ్బతిని జీవితాన్ని నాశనం చేసుకుంటూంటే చూస్తూ మౌనంగా ఉండాలా? నా కూతురు ఎవరితోనో సన్నిహితంగా ఉంటూ, తరువాత నష్టపోతే చూస్తూ ఊరుకోవాలా?'

నవ్వింది. 'నేను అలా అన్నానా? అయినా, మీ అబ్బాయి దెబ్బతింటాడని, మీ అమ్మాయి నష్టపోతుందని నెగిటివ్‌గా ఎందుకని ఆలోచిస్తారు? వాళ్ళకేం కావాలో తెలుసుకుని, తమ లక్ష్యాన్ని అందుకోవాలని వాళ్ళు చేస్తున్న ప్రయత్నానికి మీరు ప్రోత్సాహం, మద్దతు ఇచ్చి చూడండి. వాళ్ళని వెనక్కు లాగే బదులు, వాళ్ళకు అండగా నిలబడండి. ఏమీ చేయకున్నా కనీసం నిరుత్సాహ పరచకండి' ఆవేశంగా అంది.

ఆమె మాట్లాడటంలో, ఆమెలో అణిగి ఉన్న ఆవేశమేదో తెలివి వస్తున్న భావన కలిగింది శరత్‌కు.

బహుశా, ఆమె మనసులోని కోరికను అణచిపెట్టుకుని పెద్దలు చెప్పినట్టు విన్నదేమో, 'తానూ అంతే కదా!' అనుకున్నాడు శరత్.

కానీ మనిషికి వ్యక్తిగత కోరికలకు, సామాజిక బాధ్యతలూ నడుమ ఘర్షణ అనేది అనివార్యం.

పెద్దలు తమ అభిప్రాయాలను పిల్లలపై రుద్దటం అనేది స్వాభావికంగా జరిగే చర్య. ఎంత ఎదిగినా, జీవితంలో ఎంతగా విజయం సాధించినా, మనసులో ప్రతివ్యక్తికీ ఏదో ఒక మూల ఒక అసంతృప్తి, ఒక నిరాశ ఉంటుంది. అది అతని ఆలోచనను ప్రభావితం చేస్తుంది. వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. మొత్తం ప్రపంచాన్ని వ్యక్తి ఆదృష్టితోనే చూస్తాడు. తాను తన దృష్టిని మార్చుకోవాలి.

'తన పిల్లలను వాళ్ళ దృష్టితో చూసే ప్రయత్నం చేయాలి' అనుకున్నాడు శరత్. ఆకాశంలో వెన్నెల విరిసింది. ఆ వెలుగులు జగతి అంతా పరచుకున్నాయి. అప్రయత్నంగా శరత్, శిల్ప చేయి పట్టుకుని 'థాంక్స్' అన్నాడు. అన్న తరువాత తన చేయి ఆమె చేతిలో ఉండటం గమనించాడు. వదలబోయాడు. శిల్ప అతడి చేయిని వదలలేదు.

చల్లగాలి రివ్వున వీచింది.

**శరత్ శిల్ప వైపు** చూశాడు.

శిల్ప అతడివైపే చూస్తోంది. ఆమె కళ్ళల్లోని భావం అతడికి బోధపడటంలేదు.

కానీ అతడికీ ఆమె చేయి వదలాలని లేదు. కానీ గట్టిగా పట్టుకోవాలంటే భయంగా ఉంది. అందుకని ఆమె చేతిలో తన చేతిని అలానే వదిలేశాడు.

ఇద్దరిమధ్యా మౌనం అందంగా పరుచుకుంది.

శరత్ ఏదో అనాలనుకున్నాడు అనలేకపోయాడు.

ఆమె ఏదో అన్నట్టుంది. ఆమె పెదిమలు కదిలాయి కానీ శబ్దం రాలేదు. కానీ వాతావరణమంతా వారిద్దరి మనసుల గుసగుసలతో నిండి పరవళ్ళు తొక్కుతున్నట్టుంది.

'రివ్వురివ్వు'మని గాలి సంబరాలు చేసుకుంటూ నృత్యం చేస్తున్నట్టు వీస్తోంది. ఒక్కసారిగా శరత్‌కు తన శరీరం తేలికయిన భావన కలిగింది. ఆమె చేయిద్వారా తన చేయినుంచి తన ప్రాణానికి ఏదో నూతన చైతన్యం అందుతున్నట్టు తోచింది అతనికి.

'ఏమిటిది?' అనుకున్నాడు విస్మయంగా.

స్త్రీ స్పర్శ అతడికి కొత్తకాదు. పెళ్ళయింది. పిల్లలు పెద్దవాళ్ళయి తమతమ భవిష్యత్తులను నిర్ణయించుకునే స్థితిలో ఉన్నారు. కానీ... ఇప్పుడీ యువతి కరస్పర్శ తనలో తనకే తెలియని అనేక భావనలను, స్పందనలను జాగృతం చేస్తోంది. ఇదెలా సాధ్యం?

ఆమె వైపు ఒక అద్భుతమైన వ్యక్తిని చూసినట్టు చూశాడు శరత్.

ఆమె చూపులో కూడా అదే విస్మయం, అదే తన్మయత్వం, అదే భావన కనిపిస్తోంది. ఆమె కళ్ళల్లోకి చూస్తూ, ఆమె వదనంపై ద్యోతకమవుతున్న భావనలను అనుభవిస్తూంటే శరత్ శరీరం సర్వం నూతన చైతన్యంతో పరవళ్ళు తొక్కుతోంది.

తాను శరత్ కాదు. ఇన్నాళ్ళూ సాగించిన జీవితం జీవితం కాదు. ఇన్నాళ్ళ తన అనుభవాలు అనుభవాలు కావు. ఇన్నాళ్ళు తన ఆనందాలు, సౌఖ్యాలు, అనుభూతులు అన్నీ అభాస. అదంతా కల.

'తాను ఇప్పుడే జన్మని ఎత్తాడు. ఇది తన తొలి అనుభవం. ఇది ప్రథమ స్త్రీ స్పర్శ' అనిపిస్తోంది అతనికి.

తానొక నూతన వ్యకి అయి, నూతనత్వంతో చైతన్యవంతుడయినట్టు తోస్తోంది.

యాద్ హై ముఝ్‌కొ మెరీ ఉమ్రకి పహలీ కో ఘడీ

తేరీ ఆఖోంసె కొయీ జామ్ పియాథామైనే

మేరి రగ్‌రగ్ మె కొయీా బర్క్‌సిలహరాయీథీ

జబ్ తెరే మర్మరి హోథోంకొ ఛువాధామైనే!

నా జీవితపు ప్రథమ క్షణం నాకు జ్ఞాపకం ఉంది. అది నీ కనుల నుండి అమృతం నేను సేవించిన ఘడియ. నీ మృదువైన చేయిని తాకిన క్షణం, నా శరీరం అణువణువులో విద్యుల్లత పరవళ్ళు తొక్కుతూ ప్రవహించింది.

అప్రతిభుడయి ఆమెవైపు చూశాడు శరత్. అతడు ఇంతవరకూ ఆమెను చూస్తున్నా ఇప్పుడు ఆమెను చూడటం కొత్తగా చూశాడు. కవులు తమ కావ్యాలతో వర్ణనలు ఊహల ఆధారంగా చేస్తారు. అవన్నీ అనుభవానికి రానివారు ఉత్త ఊహలు అనుకుంటారు. కానీ ఎంతగా ఊహించినా ఆ ఊహకు బీజం నిజంలో ఉంటుంది. కవి మనస్సులో ఉంటుంది. సామాన్యులు చూసే విషయాలలోనే అసామాన్య అంశాలను దర్శిస్తారు సృజనశీలురు. ఇంతకాలం ఇదొక అద్భుతమైన ఊహ అనుకున్నాడు. కానీ ఇప్పుడు ఆ ఊహలోని నిజం అనుభవానికి వచ్చింది అనుకున్నాడు.

నిజంగానే, శరత్ ప్రమేయం లేకుండా అతని శరీరం ఆకాశం అయింది. ఆకాశంలో ఉండి ఉండి మెరుపు తీగలు మధురంగా జరిపే నృత్యప్రదర్శనకు వేదిక అయింది. ఒక కేంద్రం నుండి ఆరంభమై ఆకాశమంతా మెరుపుతీగ వంపులు తిరిగి పలుదిశల, పలు శాఖోపశాఖలుగా విస్తరించి ప్రవహించే అందమైన నదీ ప్రవాహంలా విస్తరించినట్టు, ఆ మెరుపు తీగలు, అతని శరీరం అణువణువునా విస్తరిస్తున్నట్టు తోచింది. అవి పూల తీగలై పరిమళాలను వెదజల్లుతున్న భావన కలిగింది.

ఊపిరి పీల్చటం మరచిపోయాడు.

కనురెప్పలు వాల్చటం మరచిపోయాడు. ఎక్కడ ఒక చిన్న కదలికకు ఈ సుమధుర సత్యం అదృశ్యమై చేదు నిజం కనులముందు నిలుస్తుందోనన్న భయం అతడికి.

అసలు కదలటం మరచిపోయాడు.

అతడి చుట్టూ ప్రపంచం చైతన్యవంతమై కదులుతోంది. కాలం పరుగిడుతోంది.

కానీ అతడికి కాలం ఆగిపోయింది.

అతని మనసు చైతన్య వంతమై కాలం పరిధిదాటి భౌతిక సూత్రాల బంధనాలు లేని స్వేచ్ఛా లోకంలో విహరిస్తోంది.

శరీరం స్థాణువైపోయింది. ఎందుకంటే, సర్వేంద్రియాలు శరీర పరిధిని విదిలించుకుని విశాల విశ్వంలో అవధులు లేని అద్భుతమైన లోకంలో నూతన ప్రాణాన్ని పోసుకుంటున్నాయి.

అంతలో చంద్రుడు అన్ని అడ్డు తొలగించుకుని ఆమెపై తన వెన్నెల కలశాన్ని ఒక్కసారిగా వొలకబోశాడు.

శరత్ శరీరంలోంచి ఒక నిశ్శబ్ధమైన అలౌకిక ప్రపంచంలో ప్రతివేపు నుంచీ నిట్టూర్పు వెలువడింది. అతని ప్రమేయంలేకుండానే అతడి రెండవ చేయి ఆమె చేతిని తాకింది. అతడు ఆమె ముందు మోకాళ్ళ మీద కూర్చుని, తన్మయుడై ఆమె వదనంకేసి చూడసాగాడు.

అది ఒక భక్తుడు భగవంతుడిని చూస్తున్న చూపు.

అది ఒక దారి తప్పిన వ్యక్తి తన గమ్యం వైపు చూస్తున్న చూపు.

అది ఒక వ్యక్తిలో సకల విశ్వాన్ని దర్శిస్తున్న చూపు.

అది ఒక నశ్వర శరీరంలో సకల చరాచర సృష్టి అనంత స్వరూపాన్ని దర్శిస్తున్న చూపు.

కానీ మనిషి ఎంతగా అనంత విశ్వంలో విహరించినా, అతడి భౌతిక ప్రపంచానికి బద్ధుడు. భౌతిక ప్రపంచం విధించిన సంకెళ్ళలో బంధితుడు. అందుకే అంత అనిర్వచనీయమైన అలౌకిక ఆనందంలో కూడా అతడి మదిలో ఒక భావన మెదిలింది.

తేరె సాయేకొ సమఝ్‌కర్ మై హసీన్ తాజ్‌మహల్

చాందినీ రాత్ మె నజరోంసె తుజే ప్యార్ కరూ...

ఆమె నీడనే అందమైన తాజ్‌మహల్‌లా భావించి, వెన్నెల రాత్రిలో కనులతో ఆమెని ప్రేమిస్తాడట!

తాజ్‌మహల్‌ను సమాధిగా అభివర్ణించి ఆ అందమైన భావనను వికృతం చేయాలని ప్రయత్నిస్తారు కొందరు.

నిజానికి తాజ్‌మహల్, ముంతాజ్ మహల్ సమాధి కావచ్చు. కానీ ఒక అలౌకికమైన భావనను, భౌతిక ప్రపంచంలో ఇంతకన్నా అందంగా వ్యక్తపరచటం కుదరదు.

ఈ భౌతిక ప్రపంచంలో అందమైన భావన వ్యక్తీకరణకు పరాకాష్ట తాజ్‌మహల్. దానికి రాళ్ళెత్తిన కూలీలు ఎవరయినా కావచ్చు. వారెన్ని కష్టాలయినా పడవచ్చు. రాజు ఎంత క్రూరుడయినా కావచ్చు. ముంతాజ్ మహల్ పద్నాలుగు మార్లు గర్భం ధరించి ఉండవచ్చు.

ఇవన్నీ ఒక అందమైన భావన కలిగించే ఆనందం నుంచి వ్యక్తుల దృష్టిని మరలించి, వారిలోని ఆనందాన్ని అనుభవించే సున్నితత్వాన్ని నశింపచేయాలన్న వారి ప్రయత్నాలు.

'అచ్చోంకో బురా స్థాపిత్, కర్‌నా, దునియాకి పురానీ ఆదాల్ హై' అన్నాడో కవి. అందమైన వాటిని, మంచివాటిని చెడుగా నిరూపించటం ప్రపంచానికి అలవాటు'

ఎంత గొప్పగా చెప్తాడు.

తాను... శిల్పను ఇలా కలవటం తప్పు.

ఆమెతో ఒంటరిగా ఉండటం ఇంకా తప్పు.

రాత్రిపూట ఇలా ఒంటరి ప్రదేశంలో ఒంటరిగా ఉండటం ఇంకెంతో తప్పు.

ఆమెను స్పృశించటం ఘోరమైన నేరం.

ఆమెవైపు ఇలా చూడటం ఇంకా ఘోరమైన నేరం.

కానీ... ఇందులో ఉన్న అలౌకికానందానుభూతి నేరం ఎలా అవుతుంది? అలాంటి అనుభూతి ఉంది కాబట్టే నేరమా? ఈ అనుభూతి పదేపదే కావాలనిపిస్తుంది.

తన శరీరంలోనో, మనసులోనో ఏదో ఓ లక్షణాన్ని ఆమె శరీరమో, వ్యక్తిత్వమో, ఆమెలోని ఏదో లక్షణం జాగృతం చేసింది.

దాంతో ఒక రొటీన్ జీవితం గడుపుతూ, రాయిలా ఉన్న తనలోంచి, రొటీన్‌లాంటి రాయిని చీల్చుకుని ఏదో ఓ నూతన సృష్టిలో కదలిక కలిగింది. రాయిని చీల్చుకుని ఓ మొక్క ఎదుగుతోంది.

ఇది ఒక్క ఈమె వల్లనే సాధ్యమవుతుంది.

దాంతో ఆ మొక్క ఎదిగి రాయిని విరిచి వృక్షంలా మారాలంటే నీరు ఎలా అవసరమో, అతడికి ఆమె సాంగత్యం అవసరం అవుతుంది.

కానీ సామాజిక పరిస్థితులు అడ్డం వస్తాయి.

దాంతో అందరినీ ఆమె కోసం వదులుకోవాలి. లేదా, అందరికోసం ఆమెని వదలాలి.

ఏదైనా బాధాకరమే.

అందరినీ ఆమె కోసం వదలటం స్వార్థం.

అది రాక్షసం.

తనమీద ఆధారపడిన వారిని, తనని నమ్మిన వారిని తన ఆనందం కోసం వదిలివేయటం ఎంత ఘోరం?

అలాగని, అందరికోసం తనని తాను చంపుకోవటం ఇంకా ఘోరం.

ఇలాంటి సంఘర్షణలు, ఉద్విగ్నతలు కలగకుండా ముందు జాగ్రత్తగా 'మంచి' నన్నీ 'చెడు' అని ప్రచారం చేస్తుందా సమాజం?

అనేకులు ఆ నియమాలలో ఒదిగి జీవితం సాగిస్తారు. అనేకులు తమకున్న పరిధిలోనే ఆనందం అనుభవిస్తారు. సంతృప్తి చెందుతారు. అసంతృప్తులున్నా వాటిని అణగద్రొక్కుతారు. అవకాశం లేకనో, అవకాశం ఉన్నా ధైర్యం, ఆశలు లేకనో!

కొందరు నియమాలను భంగం చేస్తారు. తమ జీవితాన్ని తమకు ఇష్టమైన రీతిలో సాగిస్తారు.

మరికొందరు నియమాన్ని భంగం చేస్తారు. కానీ తాము నియమ భంగం చేయటం వల్ల తమని తక్కువగా చూస్తారన్న న్యూనతాభావంతో, తమ నియమ భంగాన్ని ఆదర్శంగా ప్రకటిస్తారు. దానికి సిద్ధాంతాల సమర్ధన జోడిస్తారు. నియమంలో ఒదిగిన వారంతా పనికిరాని వారని, చేతకానివారని ప్రచారం చేస్తారు. తాము సంతృప్తితో ఉన్నామని, జీవితాన్ని ఆనందంగా అనుభవిస్తున్నామని, నియమాలలో ఒదిగిన వారు అసంతృప్తితో కొట్టుమిట్టాడుతున్నారని, వారు జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్న పిరికివారని తమని తాము నమ్మించుకుంటారు. అమాయకులను నమ్మిస్తారు.

దీన్లో తాను ఏ వర్గీకరణకు చెందుతాడు?

తన జీవితం నియమాల్లో ప్రశాంతంగా సాగుతోంది.

తుఫానులా ఈ తాజ్‌మహల్ లాంటి అందమైన అలౌకికానందం తన జీవితంలో ప్రవేశించింది.

ఇది శాశ్వతంకాదు. ఇది తనకు అందమైన కల. చేదు నిజం కాదు. నియమం నాగరికత.

వ్యక్తి ఇష్టాయిష్టాలు ఎన్ని ఉన్నా, తనపై ఆధారపడిన వారిని తన సౌఖ్యం కోసం త్యాగం చేసేవాడు తుచ్ఛుడు. వాడెన్ని రకాల అందమైన సిద్ధాంతాల రంగుల వలలు, వాదన జలతారులు అల్లినా... తుచ్ఛుడే తనవారికోసం వ్యక్తిగత అయిష్టాలను, వదులుకోలేని వాడు వ్యక్తికాడు.

ప్రపంచం అల్లిన అందమైన మాయాజాలాలను తప్పించుకుని తన కర్తవ్యాన్ని నిర్వహించి, బాధ్యతను నిలుపుకునేవాడే నిజమైన మనిషి.

అందరికీ ఇలాంటి ఆలోచనలుండవు. సంఘర్షణలుండవు.

బలహీనులు ఆకర్షణలకు లొంగిపోతారు. అలాంటి బలహీన మనస్కులను సంఘర్షణలు, సందిగ్ధల నుంచి తప్పించేందుకే నీతులు, నియమాలు. అందుకే మంచిని చెడులా ప్రచారం చేసి ప్రజలను హెచ్చరిస్తుంది సమాజం.

ఇంకా తమ మధ్య ఏమీ లేదు. ఇప్పుడిప్పుడే తమ నడుమ సాన్నిహిత్యం నెలకొంటోంది.

ఇది సంఘర్షణకు, సందిగ్ధాలకు దారితీసి జీవితాలను అస్తవ్యస్తం చేసేలోగా తాను తనపై నియంత్రణ సాధించాలి.

ఈ సంబంధం వృక్షంలా ఎదిగి వ్రేళ్ళూనుకునేలోగా మొగ్గలోనే త్రుంచేయాలి. తాను పిరికివాడా?

చేతకానివాడా?

కావొచ్చు. ఎవరేమనుకున్నా తన కర్తవ్యం తనది. తన బాధ్యత తనది.

శరత్‌కు ఆశ్చర్యం అనిపించింది.

ఒక అలౌకికానందానుభూతి తరచి చూస్తే వదులుకుని దూరం పారిపోవాల్సిన అనుభవంలా మిగలటం అత్యంత విస్మయాన్ని కలిగిస్తోంది.

అతడికి తెలియకుండానే అతడి చేతులు ఆమె చేతులనుంచి జారిపోయాయి. ఆమెలో కూడా అతడిలో జరుగుతున్న సంఘర్షణ జరుగుతున్నట్టుంది. జారుతున్న అతని చేతులను ఆమె పట్టుకోవాలని ప్రయత్నించలేదు.

అతడికి నిరాశగా అనిపించింది.

ఆమె తన చేతులను పట్టుకుని ఉంటే బాగుంటుందనిపించింది. అది అతడి అహాన్ని సంతృప్తి పరిచింది. కానీ ఆమెకూడా ఇలానే ఆలోచించవచ్చుకదా! అన్న ఆలోచన వచ్చింది.

'అహం!' అంతలోనే అహం!

అతడికి నవ్వు వచ్చింది.

ప్రపచంలో ఆనందాలన్నీ అశాశ్వతం అని ఇంకా అంటారేమో!

ఒక్క క్షణం క్రితం తను ఎవరో తాను మరచిపోయాడు. అంత అద్భుతమైన అనుభవం.

బహుశా మనిషి జీవించేది ఇలాంటి క్షణాలకోసమేనేమో. ఇలాంటి మధురమైన క్షణాలను జ్ఞాపకాల మణిహారంలా మనస్సులో దాచుకుని తనతో తీసుకుని వెళ్తాడు మనిషి, ఇది అస్సలు జీవిత చరిత్ర. చదువు, ఉద్యోగం, డబ్బు సంపాదన, పెళ్ళి, పిల్లలు.. ఇవన్నీ ఒక వ్యక్తి బాహ్య జీవిత చరిత్ర.

కానీ వ్యక్తి అసలు జీవిత చరిత్ర అతని మనసుపొరల్లో లోపల నిశ్శబ్ధంగా ఉంటుంది. అతనితో గాలిలో కలిసిపోతుంది. ఇది బయట ప్రపంచానికి తెలియదు.

చాలాసేపటి మౌనం తరువాత శరత్ అన్నాడు 'వెళ్దామా?'

ఆమె మౌనంగా తల ఊపింది.

ఇద్దరూ నిశ్శబ్ధంగా కారువైపు నడిచారు.

అతడి మనసులో హఠాత్తుగా ఒక ఆలోచన మెదిలింది.

తనకు ఇంత అనుభవం, ఇన్ని ఆలోచనలు ఉన్నా సౌఖ్యాందానుభూతి ప్రవాహంలో పడి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

కానీ ఈ ఆనందం, ఈ అనుభవం, ఈ వివక్షణ లేని యువతీ యువకులు ప్రధమ పరిచయమే, ప్రధమ ఆకర్షణనే సర్వం అనుకుంటారు.

ఆవేశంలో అడుగు ముందుకు వేస్తారు.

వారికి నిజానిజాలు ఎలా తెలుస్తాయి? చెప్పేదెవరు?

జీవితంలో అత్యంత ఆనందానుభూతి లైంగికం కాదని వారికి చెప్పేదెవరు?

వారంతట వారు గ్రహించేసరికి జీవితం చేయిదాటి పోతుంది.

వారు నాగరీక లోకంలోకి ప్రవేశిస్తున్నపుడు, మృదువుగా అతడి చేయిస్పృశించింది శిల్ప 'థాంక్స్' అంది.

'ఎందుకు?'శరత్ గొంతు వణికింది.

'కొన్ని చెప్పగలవి. కొన్ని చెప్పలేనివి. అందుకు' అంది.

ఆమె చేయి తీసేస్తుంటే పట్టుకుని అడిగాడు శరత్. అతని గొంతు అతనికే విచిత్రంగా ధ్వనించింది. 'మళ్ళీ మనం కలవమా?'

అతడిని చూసి విచిత్రంగా నవ్వింది శిల్ప 'మగవాడు ఎంత ఎదిగినా పసిపిల్లవాడే కదా! చిన్నప్పుడు తల్లి కొంగు, పెద్దయ్యాక ప్రేయసి చెంగు వదలడు' అంది.

వెంటనే ఆమె చేయి వదిలేశాడు శరత్. అతడికి ఇదేమాట ప్రశాంతి అనటం గుర్తొచ్చింది.

**'ఏమైంది?'** అతడిలో మార్పును గుర్తించింది శిల్ప.

'ఏమీకాలేదు' అన్నాడు శరత్. కానీ ఎందుకో అతడి ఆనందం ఆవిరైపోయింది. మనిషికి మంచి-చెడు మరొకరు చెప్పనవసరంలేదు. అతడి మనసే చెప్తుంది అని అంటారు. కానీ ఆ మనసుకి కూడా మంచి చెడు అనేవి వ్యక్తి జన్మించిన స్థలం, అక్కడి పద్ధతులు, అతడి సంస్కారం వంటివి చెప్తాయి. అందుకే ప్రపంచంలో మంచి, చెడు అని నిర్థిష్టమైనవేవీ లేవు.

ఒకచోట మంచి, మరో చోట చెడు.

ఒక చోట చెడు, మరో చోట మంచి.

నాగరీక ప్రపంచంలోకి వచ్చిపడ్డారు.

వాహనాల రొద, జనాల శబ్దాలు పెరుగుతున్నాయి.

అప్రయత్నంగా శరత్ ఆమె చెయ్యిని పట్టుకున్నాడు. ఒంటి చేత్తో డ్రైవ్ చేయసాగాడు.

ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

ఇద్దరూ వేరవుతున్నప్పుడు శిల్ప అంది 'మళ్ళీ కలుద్దాం. ఫోను చేస్తాను.'

తల ఊపాడు శరత్.

ఇల్లు చేరేవరకూ శరత్ మనసులో ఒకటే ఆలోచన.. 'మానవ సంబంధాల పరమార్థం ఏమిటి?'

'ఆలస్యం అయిందేమిటి?'

శరత్ ఇంట్లో అడుగు పెడుతూంటే అడిగింది ప్రశాంతి.

ఆమె వైపు చూశాడు శరత్. అతడికి గమ్మత్తుగా అనిపించింది. ప్రశాంతి అందంగా ఉంది. అందులో సందేహం లేదు. ప్రశాంతితో తనకు ఆత్మీయమైన అనుబంధం ఉంది. అందులోనూ సందేహం లేదు. ఆమెతో తనకు అందమైన అనుభవాలున్నాయి. ఆనందకరమైన అనుభూతులున్నాయి. కానీ.. శిల్పను కలిసినప్పుడున్నటువంటి ఆవేశం, ఉద్విగ్నత, అనిర్వచనీయమైన అలౌకికానందం వంటివి అనుభవానికి రాలేదు.

ఎందుకని?

అసలు అలాంటి భావనలు తనలో ఉన్నాయని, అలాంటి అనుభూతులు తాను పొందగలడని శిల్ప తనని తాకేంతవరకూ తనకు తెలియవు. యాంత్రికంగా పనులు చేస్తున్నాడు కానీ అతడి మనసులో పలు ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

మనిషి మనిషికి వ్యక్తిత్వంలో తేడా ఉంటుంది. ఆలోచన విధానంలో తేడా ఉంటుంది. విషయాలను చూసే దృష్టిలో భేదం ఉంటుంది. అర్థం చేసుకునే పద్ధతిలో తేడా ఉంటుంది. కానీ ప్రతి మనిషి అవే పదార్థాలతో తయారవుతాడు.

మౌలికంగా మనుషుల భావనలలో సార్వజనీనత ఉంది. ప్రేమ, ఆనందం, సుఖం, దుఃఖం, కోరికల వంటివన్నీ అందరికీ సమానమే. మరి, ఏ అంశం ఆయా భావనల అనుభూతిలో తేడాని కల్పిస్తుంది?

స్త్రీ, పురుషుల నడుమ ఆకర్షణ మౌలిక భావన.

కానీ ఒక స్త్రీ స్పర్శకు ఓ రకంగా స్పందించటం, మరో స్త్రీ, స్పర్శకు మరో రకంగా స్పందించటం ఏమిటి?

ఆలోచిస్తూ తన చేతులవైపు చూసుకున్నాడు.

అంతా కర్బనమూ... కార్బన్... అణువుల కలయిక.. ఎలక్ట్రాన్, ప్రోటాన్‌ల సంఖ్యలోని తేడాతో ఇన్ని మూలకాలు, మూలకాల కలయికలతో ఇన్ని పదార్థాలు ఏర్పడ్డాయి. తరచి చూస్తే అన్నీ ఎలక్ట్రాన్, ప్రోటాన్‌లే. కానీ ఇన్నిన్ని తేడాలు ఎందుకు?

'అతని మనసులో అద్భుతమైన భావాలతో కూడిన భరత్ వ్యాస్ గీతం మెదిలింది.

**కవికి మధుర్ కల్పనాహో తుమ్**

**యా గాయక్ కీ మధురిమ్ తాన్**

**యా సరితా జల్ నే తరంగ్ హో**

**అరుణ కమల్ నే మధు మాస్కాన్**

**కౌ హో తుమ్, కౌన్ హో....**

ఆ పాట, పదాలు, పదాల భావం తలపుకు వస్తోంటే ఒక ఆనందకరమైన భావన అతడి మనసులో లోతుల్లో కలిగింది.

ఎంత అద్భుతమైన రీతిలో, శుద్ధ హిందీ పదాలతో, సులభంగా బాధపడే రీతిలో కవితను వెలయించాడు! అనుకున్నాడు.

ఒక వ్యక్తిని చూస్తే మరో వ్యక్తిలో ఇలాంటి భావాలు ఎందుకు కలుగుతాయి? అందరినీ చూస్తే ఎందుకు కలగవు?

బహుశా ఒక వ్యక్తిలోని సౌందర్య భావన, సంస్కారాన్ని జాగృతం చేసే లక్షణం ఎదుటి వ్యక్తిలో ఉంటే, ఇతడి సంస్కారం జాగృతమయితే ఆ స్పందన కలుగుతుందేమో! లేకపోతే, ఒక వ్యక్తి మరో వ్యక్తితో మామూలు స్పందనలు కలిగిస్తాడు తప్ప, ఇలాంటి భావనల వెల్లువకు కారణం కాలేడు.

'రాత్రయింది నిద్ర రావటంలేదా?'

అతడి వెనుకగా వచ్చి మెడచుట్టూ చేతులు వేసి హత్తుకుంటూ అడిగింది ప్రశాంతి.

సౌఖ్యంగా అనిపించింది.

మానవ శరీరంలోని మెత్తదనం, వెచ్చదనం, మరో మానవ శరీరాన్ని తాకుతూంటే కలిగే మధుర సౌఖ్య భావన కలిగింది.

ఆమెని దగ్గరకు తీసుకుని కళ్ళల్లోకి చూశాడు.

'నిద్ర రావటం లేదా?' మళ్ళీ అడిగింది.

గమ్మత్తుగా అనిపించింది.

కళ్ళల్లో కనిపిస్తున్న మనిషి వేరు. ఆ శరీరంలో కలుగుతున్న స్పందనలు వేరు. ఇద్దరు వ్యక్తులు కలసి సంవత్సరాలు జీవించవచ్చు. ఒకరికొకరు ఎంతో సన్నిహితంగా భావించుకోవచ్చు. కానీ ఎదుటివారి మనసులో ఎలాంటి ఆలోచనలు చెలరేగుతున్నాయో, ఎలాంటి అనుభూతులు కలుగుతున్నాయో ఎవరికీ తెలియదు. ఎంత వింత ఈ ప్రపంచం అనుకున్నాడు ఆమెని దగ్గరకు హత్తుకుంటూ.

'వాళ్ళ ఫ్రెండ్స్‌తో పిక్నిక్‌కు వెళ్తుందట. మీకు చెప్పమంది. మీరు లేవటం ఆలస్యమవటంతో వెళ్ళిపోయింది కాలేజికి' చెప్పింది ప్రశాంతి కాఫీకప్పు శరత్‌కి అందిస్తూ.

'పిక్నిక్‌కి వెళ్తోందా? ఎటూ?'

'ఏమో నేను అడగలేదు. ఎలాగో మీరు వద్దనరు కాబట్టి వెళ్ళమన్నాను. అదీగాక, మనం వెళ్ళవద్దంటే ఆగే రకం కాదీ తరం.'

శరత్ మాట్లాడలేదు. హఠాత్తుగా ఈ లోకానికి వచ్చి పడ్డట్టయింది.

'ఎప్పుడు వెళ్తోంది?'

'రేపు, ఎల్లుండి'

'రెండు రోజులా?'

'అవును. వాళ్ళ కాలేజీవాళ్ళు తీసుకువెళ్తున్నారట.'

శరత్ మాట్లాడలేదు. కాస్సేపటికి అడిగాడు 'సుమంత్ కనబడటంలేదు?'

'వాడికి ఎక్కడో షూటింగ్ ఉందట. రెండు, మూడు రోజులు రానని చెప్పాడు'

'పిట్టలకు రెక్కలు వస్తున్నాయి' అన్నాడు శరత్.

నవ్వుతూ అతని దగ్గరకు వచ్చింది ప్రశాంతి.

'జీవితం చూస్తూ చూస్తూ అయిపోతోంది కదా!' అంది.

ఆమెని దగ్గరకు తీసుకున్నాడు శరత్. 'అయిపోతోంది కానీ ఏం సాధించామూ? అని ఆలోచిస్తే ఏమీ తెలియటంలేదు' అన్నాడు.

'ఈ మధ్య నాకూ అదే అనిపిస్తోంది. మనం ఏవేవో సిద్ధాంతాలు వేస్తాం. ఊహిస్తాం. ఏదేదో అనుకుంటాం. కానీ ఏది జరిగినా దానికి తగ్గట్టు మారుతూ పోతాం. వెను తిరిగి చూస్తూంటే, మనం ఎక్కడ ఆరంభించాం, ఎక్కడికి చేరుకున్నాం అనిపిస్తుంది.'

'ప్రశాంతీ.. ఎప్పుడయినా నీకు నన్ను పెళ్ళిచేసుకోకుంటే జీవితం ఎలా ఉండేదో అనిపిస్తుందా? నన్ను పెళ్ళి చేసుకున్నందుకు అసంతృప్తిగా, నిరాశగా అనిపిస్తుందా?' అడిగాడు.

నవ్వింది ప్రశాంతి.

'మనిషికి సంతృప్తి. శాంతి అన్నవి ఎప్పుడయినా ఉన్నాయా? నిన్ననే ఎక్కడో విన్నాను. శాంతికోసం సంతృప్తి కోసం జీవితాంతం అశాంతితో అసంతృప్తిపాలవుతాడట మనిషి' అంది.

'ఆఫీసరు ఇన్స్పెక్షన్‌కి వస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి' ఆఫీసులో అడుగుపెడుతూనే 'నోట్' వచ్చింది. స్టాఫ్ అందరికీ పంపించాడు దాన్ని.

ఇక వ్యాఖ్యలు మొదలయిపోయాయి.

'వీడికేం పనిలేదు. అందుకని వస్తూంటాడు' అన్నారెవరో.

ఇక్కడెవరి పెళ్ళో, గృహప్రవేశమో అటెండ్ చేయాల్సి ఉంటుంది. అందుకని ఇన్స్పెక్షన్ వంకన డ్యూటీ వేసుకుని వస్తూండి ఉంటాడు'

'అదేమీ లేదు. పేరుకి ఇన్స్పెక్షన్. ఇటువైపు కూడా రాడు.'

'అంతా అబద్ధం. ఆ వంకన మనల్ని సీట్లలో ఉంచే ప్రయత్నం ఇది'

పలు వ్యాఖ్యలను వింటూంటే నవ్వొచ్చింది శరత్‌కు.

ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని మించిన 'అదృష్టం' మరొకటిలేదు. బయట ప్రపంచం మారుతోంది అత్యంతవేగంగా.

ఉద్యోగాలలో భద్రతలేదు. ఒకడికి ఉద్యోగం పోతే దాన్ని భర్తీ చేసేందుకు వందమంది సిద్ధంగా ఉంటున్నారు, అతి తక్కువ జీతానికి.

ఇకపై పర్మినెంట్ ఉద్యోగుల ఆలోచననే అదృశ్యం అవుతుందని నిపుణులు అంటున్నారు. ఇలాంటి పరిస్థితులలో హక్కులు, భద్రత ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు మించినది ఏదీలేదు.

అయినా అసంతృప్తి ప్రభుత్వ ఉద్యోగులకు.

నిజమేనేమో.. సంతృప్తి, శాంతికోసం ఆరాటంలో మనిషి అశాంతికి, అసంతృప్తికి లోనవుతాడేమో!

నిజానికి ఈ సంతృప్తి, శాంతి ఎక్కడినుంచో రావు. మనిషిలోనుంచే వస్తాయి.

ఇంతలో ఫోను మ్రోగింది... ప్రశాంతి చేస్తోంది.

'ఏమండీ.... సుమంత్.. సీరియస్‌గా ఉన్నాడట.. ఆత్మహత్యా ప్రయత్నం చేశాడట.'

'**ప్రాణానికేం ప్రమాదం** లేదంకుల్. మీరు కంగారు పడకండి.'

ఫోను పెట్టి ప్రశాంతివైపు చూశాడు శరత్. 'ప్రాణానికి ప్రమాదం లేదట. బయలుదేరదామా?' అడిగాడు.

మౌనంగా తల ఊపింది ప్రశాంతి. ఆమె కళ్లల్లో నీళ్లున్నాయి. ముఖంలో విషాదం తెలుస్తోంది. కానీ బాధను బయటపెట్టటం లేదు.

ఫ్లైట్ టికెట్లు బుక్ చేశాడు శరత్. ఆఫీసు నుంచి తిన్నగా ప్రశాంతి ఆఫీసుకి వచ్చాడు.

క్యాబ్‌లో విమానాశ్రయానికి బయలుదేరారు. అమ్మాయి పిక్నిక్‌లో ఉంది కాబట్టి ఇంటిగురించి ఇద్దరికీ బెంగలేదు.

దారిలో ఇద్దరూ ఒకరి చేయి ఒకరు పట్టుకుని కూర్చున్నారు. ఏమీ మాట్లాడుకోలేదు.

నిజానికి ఇద్దరికీ మాట్లాడాలనీలేదు. ఎవరి ఆలోచనలలో వాళ్లున్నారు. శరత్‌కి అంతా గమ్మత్తుగా అనిపిస్తోంది.

జరుగుతున్నది నిజం కాదు, కల అనిపిస్తోంది.

ఆఫీసులో ఎవరో ఇన్‌స్పెక్షన్‌కి వస్తున్నారని గోల. టెన్షన్. అంతలో ఫోను వచ్చింది. దెబ్బకి మనసులోంచి, మెదడులోంచి ఆఫీసు అదృశ్యమయిపోయింది.

'ఇలాంటి సమయంలో వెళ్లిపోతే ఎలా? సీట్లో లేకపోతే సస్పెండ్ చేస్తారు' ఎవరో బెదిరించారు.

శరత్‌కి నవ్వు వచ్చింది. సర్వీసులో చేరినప్పటినుంచీ వింటూనే ఉన్నాడు ఇలాంటి బెదిరింపులు.

ప్రతి ఒక్కడూ ఎదుటివాడిని భయపెట్టాలని ప్రయత్నించేవాడే భయం ద్వారా వాడిని తను చెప్పినట్టు వినేట్టు చేసుకోవాలనుకునేవాడే

'ఎందుకీ ఆరాటం?' అర్థంకాదు.

అసలీ ఉద్యోగాలు చేసేది డబ్బుకోసం. డబ్బు కుటుంబపోషణకు అవసరం.

కుటుంబ సమస్య వచ్చినప్పుడు దానికి ఉద్యోగం అడ్డుపడితే కుటుంబాలే ప్రాధాన్యం. 'ఇది ఎప్పుడు అర్థమవుతుంది వీళ్లకి?' అనుకున్నాడు శరత్. ఏమీ మాట్లాడకుండా వచ్చేస్తూ.

క్యాబ్ ఎయిర్‌పోర్టు చేరింది.

ఫ్లయిట్‌కి చెక్‌ఇన్ ఆరంభమయింది.

ప్రశాంతి తమ చుట్టూ ఉన్న దృశ్యాన్ని చూస్తోంది. మనుషులను చూస్తోంది. రకరకాల మనుషులు, రకరకాల అలంకరణలు...

విమానప్రయాణాలు అలవాటయిన వారికి అంతా సర్వసాధారణంగా అనిపిస్తుంది. కానీ కొత్తగా వచ్చిన వారికి అంతా అద్భుతంగా, వింతగా ఉంటుంది. ఈ అద్భుతాన్ని చూస్తూ వాళ్లిద్దరూ కాస్సేపు తమ మనస్సుల్లో సుళ్లు తిరుగుతున్న బాధను మరచిపోయారు తాత్కాలికంగా.

అంతేనేమో! 'ఈ జీవితంలో ప్రతిభావన పెద్ద గీత, చిన్నగీతల్లాంటివేనేమో! ' అనుకున్నాడు శరత్ మనసులో.

ఒక అనుభవం కలుగుతుంది. దాని అనుభూతిని సంపూర్ణంగా అనుభవించేలోగా, ఇంకో అనుభవం కలుగుతుంది.

దీంతో మొదటి అనుభూతి వెనుకపడుతుంది. నూత్నానుభూతిని దాటి స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఇంతలో మరో అనుభూతి.... ఒకవేళ తరువాత కలిగిన అనుభూతి అంత తీవ్రమైనది కాకపోతే, మొదటి అనుభూతినే మనస్సు పదేపదే స్మరిస్తూంటుంది. అది

అలవాటయి, మిగతా అనుభూతులన్నీ దాని ముందు దిగదుడుపే అవుతాయి. దాంతో మనసు మళ్లీ మళ్లీ మొదటి అనుభవాన్నే కోరుకుంటుంది.

అది లభించకపోయేసరికి నిరాశకు గురవుతుంది. మరింత తీవ్ర మనస్కులు ఆ అనుభవం లేకపోతే జీవితం వ్యర్థం అనుకుంటారు. దానికోసం తపిస్తారు. చివరికి ఆ అనుభవం హిమాలయాల్లా అందనంత ఎత్తున కనిపిస్తుంది. దాంతో ఆ అనుభవంలేని జీవితం వ్యర్థం అనుకుంటాను. తీవ్రమైన నిరాశతో ఆత్మహత్య చేసుకుంటారు.

'ఆత్మహత్య' ఆలోచన రాగానే కొడుకు గుర్తుకు వచ్చాడు.

'ఏమై ఉంటుంది?' అనుకున్నాడు.

ప్రశాంతివైపు చూశాడు.

ఆమె చుట్టూవున్న మనుషులను చూస్తోంది. వాళ్ల ప్రవర్తనను గమనిస్తోంది.

ఎందుకో ఆమె మీద ప్రేమ పొంగింది. ఆమెను దగ్గరకు తీసుకోవాలనిపించింది. ఎన్నెన్ని ఆశలను, నిరాశలను తనలో అదిమి పట్టుకుందో! ముఖ్యంగా తనలాంటి ఏమీ పట్టించుకోని, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ తన లోకంలో తానుండేటటువంటి తనతో, ఎవరితో కలవని, అందరికీ దూరంగా పారిపోయి ఒంటరిగా ఉండాలని వాంఛించే తనతో జీవితం గడుపుతూ, ఎన్నెన్ని విషయాలలో రాజీపడుతూ, ఎన్నెన్ని కోరికలను అణచుకుంటూ, నిరాశలను అదిమిపడుతూ వీలయినంత ఆనందంగా, సంతోషంగా ఉంటూ జీవితం సాగిస్తోందో! అనుకున్నాడు. ప్రతి చిన్న విషయానికీ ఆవేశం ప్రదర్శిస్తూ, నిరాశపడుతూండే వారితో పోలిస్తే, ప్రశాంతిలా ఉన్న దానితో రాజీపడి ఆనందాన్ని జుర్రుకుంటూ బ్రతకటానికి ఎంతో ధైర్యం కావాలి. ఆత్మశక్తి, ఆత్మవిశ్వాసం కావాలి. అవి లేనివారు కొట్టండి, తన్నండి, తెంచుకోండి, తెంపిపారేయండి అని అరుస్తూ, ఆ అరుపులను సిద్ధాంతాలలో ఒదిగించి మనుషుల్లోని ఆత్మశక్తిని, ఆత్మవిశ్వాసాన్ని చంపేస్తున్నారు.

ప్రశాంతి చేయిని తన చేతిలోకి తీసుకున్నాడు.

ఆమె అతనివైపు ప్రశ్నార్థకంగా చూపించి ఇంతలో ఫ్లైట్‌లోకి పంపిస్తున్నట్టు సూచన అందింది.

ఇద్దరూ లేచారు అప్పటికే క్యూ ఏర్పడింది. చిన్న చిన్న పిల్లలు ఓ చిన్న బ్యాగు భుజాన వేసుకుని ఒంటరిగా ప్రయాణం చేస్తున్నారు.

వాళ్లని చూస్తూంటే, వాళ్ల ఆత్మవిశ్వాసం, చొరవ చూస్తూంటే తాము పిల్లల్ని పెంచటంలో ఏదో లోపం చేశామన్న భావన ఇద్దరికీ కలుగుతోంది. బహుశా, పిల్లల్ని స్వేచ్ఛగా తిరగనివ్వకపోవటం, వాళ్లని పట్టి ఉంచాలని ప్రయత్నించటం, ప్రతి విషయానికీ వాళ్లు తమపై ఆధారపడి ఉండేలా చేసుకోవటం పొరపాటేమో! అనిపిస్తోంది శరత్‌కు.

విమానంలో కూర్చున్నారు. శరత్ కిటికీ దగ్గర కూర్చున్నాడు. ఇంతలో ఎవరో 'శరత్' అన్నట్టు వినిపించింది. 'విమానంలో పలకరించేది ఎవరు?' అని చూశాడు. అతడిని పోల్చుకోలేకపోయాడు.

'నన్ను గుర్తుపట్టలేదా?' అంటూ అతడు చొరవగా శరత్ పక్కకు వచ్చాడు. ప్రశాంతితో 'కాస్సేపు నా సీటులో కూర్చోండి మేడమ్' అన్నాడు.

ప్రశాంతి లేచి వెళ్లింది.

'నా పేరు ప్రసాదరావు. మీరూ నేనూ పుస్తకావిష్కరణ సభలో కలిశాం. నేను రచయితను. మీరు ఆ రోజు సాహిత్యం గురించి నాతో చర్చించారు.'

శరత్‌కు గుర్తు వచ్చీ రానట్టుంది.

'మీరు మనుషులను లెక్క చేయరు. ఏదో కలుస్తారు. ఎవరినీ గుర్తుంచుకోరు. ఎందుకంటే మీరు మనుషులు అవసరం కాబట్టి' అంటుంది ప్రశాంతి ఎప్పుడూ.

'ఆ గుర్తుకు వచ్చింది' నటించాడు శరత్.

'ఎక్కడివరకూ?' అడిగాడతడు. చెప్పాడు శరత్.

'నేను ఢిల్లీ వెళ్తున్నాను. సాహిత్య ఎకాడమీ మీటింగ్ ఉంటుంది' గర్వంగా చెప్పాడతడు.

'అలాగా' అన్నాడు శరత్ ఆసక్తిలేనట్టు.

కానీ అతడు అది పట్టించుకోలేదు. 'నేను ఒక్కపైసా ఖర్చులేకుండా, సాహిత్య అకాడమీ డబ్బుల్తో ఇండియా అంతా విమానాల్లో తిరిగాను. ఎకాడమీలో, నా బంధువు ఉన్నాడు. నాకు అందరూ తెలుసు. ఎకాడమీ వాళ్ళు ఎప్పుడు హైదరాబాదు వచ్చినా వాళ్ళకి నేనే హోస్టు. అంతా తిప్పి చూపిస్తాను. అందుకే ఎక్కడ ఏ మీటింగ్ అయినా నన్నే పిలుస్తారు. ఫ్లైట్ చార్జీలిస్తారు. హోటల్ బుక్ చేస్తారు. అన్ని ఖర్చులూ వాళ్ళవే.'

అతడి మాటలు వింటూంటే సాహిత్య సమావేశాలకు సాహిత్యంపై పట్టు ఉన్న వ్యక్తులు అవసరంలేదన్న ఆలోచన వచ్చింది శరత్‌కు.

అదే అడిగాడు. 'కథ అయినా, కవిత అయినా దేనికయినా మిమ్మల్ని పిలుస్తారని అన్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులు అవసరంలేదా?' అడిగాడు శరత్. ఆయన చనువుగా శరత్ తొడమీద చరిచి చెప్పాడు.

'ఇక్కడ ఎవరికీ ఏదీ అవసరం లేదు. ఏదో కథపై పరిశీలన అంటారు. ఎవడో బోడిగుండుగాడు వస్తాడు. 'కథ గురించి నేను మాట్లాడతానండి' అంటాడు. లేకపోతే రికమండేషన్ తెస్తాడు. సరే అంటాం. వాడు అంతకుముందు ఎవరో మాట్లాడిందో, రాసిందో అటూ ఇటూ చేసి పట్టుకొస్తాడు. చదివేస్తాడు. ఎవడు పట్టించుకుంటాడు? ఎప్పుడూ వచ్చి పెద్దల పేర్లు వినిపిస్తే చాలు. ఇదిగో నేను ఈసారి సమావేశంలో 'తెలుగు నవల' గురించి మాట్లాడుతున్నాను. నేను రాసింది పెద్దాయనకు చూపించాను. వారి పేరు వీరి పేరు రాలేదని చూపించాడు కొందరు కావాల్సిన కొత్త వాళ్ల పేర్లు సూచించాడు. అవి జోడించాను. గొప్ప ఉపన్యాసం అన్నాడు. సాహిత్యం ఎవడికి కావాలి?'

'మరి మీరు ప్రస్తావించే వారందరి రచనలు మీరు చదివారా?'

'నాకేం పనిలేదా? వాళ్లు రాసినవన్నీ చదవటం బోరు' అన్నాడాయన ఆవలిస్తూ.

శరత్ ఏదో అనబోయాడు.

'సీటు బెల్ట్ కట్టుకోండి. విమానం టేకాఫ్ అవుతోంది' ఎయిర్ హోస్టెస్ వచ్చింది.

'నేను సీటుకు వెళ్తాను' అంటూ లేచాడాయన.

ముఖమంతా పౌడరు పూసుకుని లిప్‌స్టిక్ అద్దుకుని ఒంటికి హత్తుకునే దుస్తులు వేసుకుని కృత్రిమ అందంతో అసహ్యంగా ఉన్న ఎయిర్‌హోస్టెస్‌ని చూస్తూంటే శరత్‌కి ఈ మధ్య ఎవరో ఎయిర్ హోస్టెస్‌ని 'గగన సఖి' అనాలని అంటే ఇంకెవరో 'ఆకాశపుటమ్మ' అనాలని వాదించటం గుర్తొచ్చింది. నవ్వొచ్చింది.

విమానం గాలిలోకి ఎగిరింది.

నిమిషాలలో విమానం భూమిని వదిలి మేఘాల నడుమ చేరింది.

ఎటుచూసినా మేఘాల సంబంధం... అలలు అలలుగా మేఘాలు... గుత్తులు గుత్తులుగా మేఘాలు.. గుంపులు గుంపులుగా మేఘాలు.

అప్పుడప్పుడు మేఘాల నడుమ నుండి క్రింద అగ్గిపెట్టెల్లా కనిపిస్తున్న ఇళ్లు. సన్నని పాయలా వంపులు తిరిగి, సూర్యకాంతిలో మెరుస్తూ, మెరుపు పట్టీలా కనిపిస్తున్న నది...

ఎందుకో శరత్‌కు ఒక్కసారిగా దేవుడు గుర్తుకు వచ్చాడు.

దేవుడు ఆకాశంలో నుండి మనుషుల ఆటలను గమనిస్తూంటాడని చిన్నప్పుడు చెప్పేవారు.

నిజంగా, ఇంత ఎత్తునుంచి క్రిందకు పైకి చూస్తూంటే మనిషి ఆరాటాలు, పోరాటాలు ఎంత అర్ధవిహీనం అనిపిస్తున్నాయో!

పైన అనంతమైన శూన్యం. క్రింద బొమ్మలాటలాంటి జీవితం.

కదులుతున్నామో, స్థిరంగా ఉన్నామో తెలియని ప్రయాణం నడుమ.

ప్రశాంతి వైపు చూశాడు.

ఆమె కళ్లల్లోనూ అదే భావం.

మళ్లీ క్రిందకు దిగితే జీవితపుటాటుపోటులు, పోరాటాలు....

కిటికీలోంచి బయటకు చూస్తూ, ఆమె అతడి భుజంపై తలవాల్చింది. ప్రతివ్యక్తి జీవితం పరిధి ఓ కిటికీ అనుకుంటే, తన ప్రపంచాన్ని ఆ కిటికీలోంచీ చూస్తాడు మనిషి. ఆ పరిధి దాటి చూడలేడు. అలాంటప్పుడు అంత సంకుచిత పరిధిలోంచి తాను చూస్తున్నవే సంపూర్ణ సత్యం అనుకోవటం ఎంత మూర్ఖత్వం.

'వాడికేం బాధ కలిగిందో, ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఎంత జీవితం ముందుంది. ఎంత ప్రపంచం ఉంది. అన్నీ అనవసరం అని ఎందుకనుకున్నాడో?' అంది ప్రశాంతి మెల్లిగా.

శరత్ మాట్లాడలేదు.

విశాలమైన ఆకారాలతో వెలుగుతూ, చిత్రవిచిత్రమైన రూపాలు ధరిస్తూ పలుభావనలను కలిగిస్తున్న మేఘాలను చూస్తూ కూచున్నాడు.

కాస్సేపటి సీటుబెల్ట్ పెట్టుకోవాలన్న సూచన వచ్చింది.

విమానం క్రిందకు దిగటం ఆరంభమయింది.

మేఘాల దారి వదిలి భూమి దారి పట్టింది విమానం.

భూమివైపు వస్తువులు పెద్దగా స్పష్టంగా కనిపిస్తూ క్షణక్షణానికీ దగ్గర కాసాగాయి.

ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతిని వదిలి మాములు భౌతిక అనుభూతుల ప్రపంచానికి వస్తున్నట్టు అనిపించింది శరత్‌కు. మళ్లీ సంసారం చుట్టుముట్టిన భావన కలిగింది.

**విమానం** దిగి ఫోను చేశాడు శరత్, తనతో ఫోనులో మాట్లాడిన అబ్బాయికి.

'ఉండండి అంకుల్ అక్కడే మేం వచ్చేస్తాం. ప్లీజ్ వెయిట్' అన్నాడా అబ్బాయి.

'అబ్బాయి వచ్చి పికప్ చేసుకుంటాడట' ప్రశాంతితో చెప్పాడు శరత్.

ఆమె చుట్టూ చూస్తూ కూర్చుంది.

'కాఫీ తాగుదామా?' అడిగాడు శరత్.

నవ్వింది ప్రశాంతి. 'ఇక్కడ కాఫీ వందరూపాయలుంటుంది. రుచి బాగుండదు. మీరు కావాలంటే తాగండి' అంది.

శరత్ కదలలేదు.

'ఏం జరిగి ఉంటుంది?' ఈ ఆలోచన అతడిని వదలటంలేదు.

ఆత్మహత్య అన్నది శరత్ దృష్టిలో పిరికివాడి పని జీవితంలో ఎలాంటి కష్టాన్నయినా ఎదురు నిలిచి, తల ఎత్తుకుని అనుభవించగలగాలి. కష్టం భగవదత్తం అనుకోవాలి. కానీ 'ఇక జీవితంలో ఇంకేమీ లేదు' అని నిరాశకు గురవటం, జీవితాన్ని అంతం చేసుకోవటం మూర్ఖత్వం. అర్థవిహీనం అన్నది శరత్ అభిప్రాయం.

కానీ.. తన సంతానమే ఆత్మహత్యకు పాల్పడటం అతడు భరించలేకపోతున్నాడు. ఓ వైపు దుఃఖం ముంచుకు వస్తోంది. మరోవైపు ఆవేశం వెల్లువవుతోంది.

ఎక్కడ ఉంది లోపం?

పెంపకంలో ఉందా?

జీన్స్‌లో ఉందా?

ఇదే సమయానికి ఇతర యువతీయువకులు అనేక దుర్భరమైన పరిస్థితులను తట్టుకుని ఎదిరించి నిలిచి పోరాడటం చూస్తున్నాడు.

ఆ తెగింపు, ఆ పట్టుదల తన సంతానికి ఎందుకివ్వలేకపోయాడు?

ఇది తన పెంపకంలో లోపమా?

రాత్ భర్‌కా హై మెహమాన్ అంధేరా

కిస్‌కె రోకా రుకాహై సవేరా.

శరత్ హృదయ లోతుల్లో ధ్వనించిందా పాట.

చీకటి అన్నది రాత్రి సమయం మాత్రమే ఉండే తాత్కాలికమైన అతిథి వంటింది.

ఎవరు ఎంత ఆపాలని ప్రయత్నించినా ఉదయం కావటాన్ని ఆపలేరు.

చీకటి కష్టం. ఉదయం సుఖం.

కష్టం కలకాలం ఉండదు. అది రాత్రిలాంటిది.

రాత్రిని వెన్నంటి పగలుంటుంది.

కాబట్టి చీకటిని చూసి బెదరద్దు. వెలుతురు కోసం ఎదురు చూడాలి.

లబ్ పె షిక్వా న లా, అష్క్ పీలే
జిస్ తర్హే భీ హో కుచ్ దేర్ జీలే
అబ్ ఉఖడ్ నే క హై గం క డేరా
కిస్కే రోకా రుకా హై సవేరా..

పెదవులపై బాధాతప్తమైన నిట్టూర్పులు రానీయకు. కన్నీళ్లను కారనీయకు. ఏదో ఓ రకంగా ఇంకాస్సేపు జీవించాలని ప్రయత్నించు. ఎందుకంటే, ఇంకాస్సేపటిలో బాధ డేరా ఎత్తి పలాయనం చిత్తగించక తప్పదు. ఆ ఒక్క క్షణం ఓపిక పడితే చీకటి తొలుగుతుంది వెలుతురు వస్తుంది.

బాల్యంలో సుమంత్‌తో ఈ పాట బట్టీ పట్టించాడు. వాడు ఈ పాట పాడుతూంటే పొంగిపోయాడు. వాడికి ఆత్మధైర్యం, ఆత్మవిశ్వాసం నేర్పేసినట్టేనని గర్వించాడు.

కానీ...

'సారీ అంకుల్.. ఆలస్యం అయిపోయింది రండి' అంటూ ఇద్దరు యువకులు వచ్చారు.

బయటకు దారి తీశారు.

కారు స్టార్టయిన తరువాత శరత్ అడిగాడు.

'ఏమైంది?'

శరత్ పక్కన కూర్చున్న యువకుడు నిట్టూర్చాడు.

'ఏం కాలేదు అంకుల్. ఫూలిష్‌గా ప్రవర్తించాడు సుమంత్. యూనిట్‌లో అమ్మాయిని ప్రేమించాడు. ఆమె కాదంది. దాంతో పనిమీద నుంచి ధ్యాస మళ్లింది. డైరెక్టర్ తిట్టాడు. పనిమీద ధ్యాస పెట్టమన్నాడు. అది అవమానంగా ఫీలయిపోయాడు. ఎందుకంటే, డైరెక్టర్ ఆ అమ్మాయి ముందు తిట్టాడు.'

'అందుకూ కారణం ఉంది అంకుల్. ఆ అమ్మాయి డైరెక్టర్‌తో క్లోజ్‌గా ఉంటుందని సుమంత్‌కి అనుమానం. అందుకని అతడితో మాట్లాడవద్దన్నాడు. కానీ అమ్మాయి సుమంత్‌ని కాదని డైరెక్టర్‌తో సన్నిహితంగా ఉంటోంది.' ఇంకో అబ్బాయి చెప్పాడు ప్రశాంతి వైపు చూశాడు శరత్.

ఆమె వింటున్నట్టులేదు. కారు అద్దంలోంచి బయటకు చూస్తూ కూర్చుంది.

శరత్‌కి ఏమనాలో తోచలేదు. తల ఊపి కూర్చున్నాడు మౌనంగా.

'అంకుల్.. సుమంత్‌ని తీసుకు వెళ్లిపోండి అంకుల్' హఠాత్తుగా అన్నాడు ఓ అబ్బాయి.

'అవును అంకుల్. సుమంత్ వెళ్లనంటున్నాడు. అతడివల్ల మొత్తం యూనిట్ మోరేల్ దెబ్బతింటోంది అంకుల్.'

శరత్ తల ఊపాడు.

ఇదంతా సుమంత్ గురించే వింటున్నాడా తను అనిపించింది.

ఎవరో పరాయి వ్యక్తి గురించి వింటున్నట్టుంది.

సుమంత్ ఏమిటి, అమ్మాయి ప్రేమలో పడటం ఏమిటి? ఆమె వేరేవాడితో మాట్లాడితే అసూయగా భావించి గొడవ చేయటం ఏమిటి?

శరత్ కళ్లముందు సుమంత్ ముఖం మెదిలింది.

అంతలో శరత్‌కి పెళ్లయిన కొత్తలో తన ప్రవర్తన గుర్తుకు వచ్చింది.

పెళ్లయిన కొత్తలో ప్రశాంతి వేరే ఎవరివైపు చూసినా భగ్గుమని హృదయం మండేది.

ఇంకెవరితో నవ్వుతూ మాట్లాడినా శరీరం దహించుకుపోయేది.

ఏదో ఓ వంకన ఆమెని ఏడ్పించేవాడు. దూషించేవాడు.

ఆమె ఆఫీసులో ఓ అరగంట ఎక్కువసేపుంటే అసహ్యం ప్రదర్శించేవాడు.

ఆఫీసు కొలీగుతో మాట్లాడుతూ వస్తే చిరాకు పడిపోయేవాడు.

కానీ ప్రశాంతి తనకు మానసికంగా సన్నిహితంగా వచ్చిన తరువాత అసూయ స్థానాన్ని విశ్వాసం ఆక్రమించింది.

ప్రశాంతి మనస్తత్వం, మనస్సులో భావనలు అర్థమయ్యాయి.

ఆడవాళ్లు తాను అనుకున్నంత బలహీనమనస్కులు కారని, ఎవడితో నవ్వుతూ మాట్లాడినా వాడితో ఏదేదో ఊహించుకోవటం అది తన మానసిక బలహీనత అనీ తన ఆత్మవిశ్వాసరాహిత్యం అని అర్థమయ్యాక తనలో అసూయ అదే ఆవిరైపోయింది.

ఇంతకు ముందు కోపం తెప్పించి, తనని మండించిన అంశాలు ఇప్పుడు అస్సలు ప్రాధాన్యం లేని పనికిరాని విషయాలయ్యాయి.

'సుమంత్ కూడా అలాగే ప్రవర్తించి ఉంటాడా?'

తుమ్హే కోయి ఔర్ దేఖే తొ జల్తా హై దిల్

బడీ ముష్కిలోంసె ఫిర్ సంభల్తాహై దిల్

క్యా క్యా జతన్ కర్తే హై తుమ్హే క్యా పతా?

నిన్ను వేరే ఎవరు చూసినా హృదయం భగ్గుమంటుంది. ఎంతో కష్టపడితే కానీ అదుపులోకి రాదు. హృదయాన్ని అదుపులోకి తెచ్చుకునేందుకు ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తావో నీకేం తెలుసు?

ఇదొక ప్రేమ పాట. ప్రేమలోని అసూయకు ప్రామాణికత కల్పించే పాట.

తనకు ప్రశాంతిని అర్ధం చేసుకుని, తనని తాను అర్ధం చేసుకుని తనలో లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఉంది సన్నిహితంగా కలసి జీవించటంవల్ల ఒకరికొకరు అర్ధం చేసుకునే వీలు కలిగింది. దీనికి తోడు తాను చదివిన పుస్తకాలు తనలో కలిగించిన ఆలోచనలు, విచక్షణ కూడా తనని తాను అర్ధం చేసుకోవటంలో, తన తప్పులను సరిదిద్దుకోవటంతో తోడ్పడ్డాయి.

కానీ సుమంత్‌కి ఆ అవకాశం ఏది?

కానీ అది ఆత్మహత్యకు దారితీయటం, అది తప్ప మరో గత్యంతరం లేకపోవటం అన్నది వ్యక్తిత్వలోపం. జీవితం పట్ల గౌరవం కలిగించటంలో విఫలమైన పెంపకం లోపం.

పక్కనున్న అబ్బాయి వైపు తిరిగాడు శరత్.

'ఆ అమ్మాయి డైరెక్టర్‌తో సన్నిహితంగా ఉందని, డైరెక్టర్ తిట్టాడని ఆత్మహత్య ప్రయత్నం చేశాడా సుమంత్?' అడిగాడు.

ఆ అబ్బాయి కాస్సేపు మాట్లాడలేదు. మరో అబ్బాయి వైపు చూశాడు.

తరువాత ఇద్దరూ ఒకరివైపు ఒకరు చూసుకున్నారు. రెండో అబ్బాయి నోరు విప్పాడు.

'మేము షూటింగ్ అయ్యాక మా కథకు దగ్గరలో ఉన్న సినిమాలు చూస్తాం. మేము వరుసగా ప్రేమకథలు చూస్తున్నాం. దాన్లో ఓ సినిమాలో హీరోయిన్ తనని ఇష్టపడకపోతే బిల్డింగ్ మీద నుంచి దూకుతానని హీరో బెదిరిస్తాడు. హీరోయిన్ పరుగున వస్తుంది.'

శరత్ గుండెల్లో ఎవరో కత్తిదించి మెలిపెటినట్టయింది.

'ఇంకో సినిమాలో హీరో "నీ విరహంతో బతికాను. ఈ విషంతో మరణిస్తాను" అని పాడతాడు. విషం తింటాడు. అది సుమంత్‌కి నచ్చింది.'

శరత్, ప్రశాంతి వైపు చూశాడు.

ఆమె మనసులో ఎలాంటి భావాలు ఎగసిపడుతున్నాయో కానీ ఆమె ముఖంలో ఎలాంటి భావం కనబడటంలేదు. కిటికీ బయటకు చూస్తూ కూర్చుంది అసలీ సంభాషణతో తనకు సంబంధం లేనట్టు కూర్చుంది.

'ఇంకో సినిమాలో హీరో బ్లేడుతో నాడి కోసుకుంటాడు బాత్‌టబ్‌లో. అది అమలులో పెట్టాడు. కోసుకునే ముందు అమ్మాయికి ఫోను చేశాడు. ఆమె ఫోను ఎత్తలేదు. ఆమెకు మెసేజ్ పెట్టాడు. ఆమె మెసేజ్ చూసుకుని మాకు చెప్పింది. మేము వెళ్లేసరికి చాలా రక్తం పోయింది. కానీ సమయానికి వైద్యం అందింది. రక్తం దొరికింది. బ్రతికాడు.'

వాళ్ల ప్రతిమాట ఒక పిడుగులా శరత్ హృదయంపై పడుతోంది. లోలోపల అల్లల్లాడిపోతున్నాడు శరత్. విలవిలలాడిపోతున్నాడు. పైకి ఒక్కమాట మాట్లాడటం లేదు. ముఖంలో ఎలాంటి బాధను, భావనను కనబడనీయటంలేదు.

ప్రశాంతి చేయి గట్టిగా పట్టుకుని కూర్చున్నాడు.

అతడికి తన కొడుకు ఎంత దుర్బల మనస్కుడయ్యాడో తెలుస్తోంది.

తన పెంపకంలో లోపం లేదు.

తాను వాడికి నేర్పిన విలువలలో లోపం లేదు.

లోపం, సినిమా ప్రభావానికి లొంగిపోయి, తెరపై జరిగేది నిజమని భ్రమపడే వాడి మానసిక దౌర్భల్యంలో ఉంది.

తాను వాడికి మంచి బుద్ధులు నేర్పగలడు. మంచి చెడు చెప్పగలడు. కానీ తన వేలు విడిచి తన ప్రపంచాన్ని వెతుక్కుంటూ ఒంటరిగా బయట ప్రపంచంలో అడుగిడిన తరువాత తన ప్రభావం పరిమితమైపోతుంది.

తనకన్నా శక్తిమంతంగా ప్రభావితం చేయగల విషయాలు ఆవేశం వస్తాయి.

వాటిని తట్టుకుని తను నేర్పిన విషయాలు నిలబడితే, వాటి ప్రభావం తగ్గుతుంది.

లేకపోతే...

'సినిమాలు చూసి ప్రభావితుడయ్యాడా? వెధవ స్వంత వ్యక్తిత్వంలేదు. ఆలోచన లేదు' మనసులో అనుకున్నాడు. పళ్లు పటపటలాడించాడు.

అంతలో ఒక ఆలోచన బలంగా తాకింది.

తాను మాత్రం సినిమా ప్రభావితుడు కాడా?

తాను చూసిన సినిమాలే కదా తనలో ప్రేమ భావనకు రెక్కల నిచ్చింది.

సాధనాలా తన ప్రేయసి వదనంపై వెన్నెల విరిస్తే చూసి ఆనందించాలని కోరుకోలేదా? సముద్ర తీరంలో ఇద్దరే కూర్చుని అలలు కాళ్లని తాకుతూంటే,

'ఆ నీలె గగన్ తలే, ప్యార్ హమ్ కరే' అని పాడుకోవాలని కలలు కనలేదా?

ఆజా సనం మధుర్ చాంద్నీ మె హం తుం మిలిఏతొ

వీరానే మె భి ఆజాయెగీ బహార్

అని వెన్నెల రాత్రులలో పాడుకోవాలని రొమాంటిక్ కలలు కనలేదా?

అయితే ఆ కాలంలో భగ్నప్రేమికులయితే హీరోలు విషాదగీతాలు పాడేవారు. బాధను పంటి బిగువున అణచుకుని 'తెరీయాద్ దిల్ సే భులానే చలాహూ' అనో 'ఆఖ్రీగీత్ మొహబ్బత్ క సునావూ తో చలూ' అనో,

మైంతో ఎక్ ఖ్వాబ్ హూన్, ఉస్ ఖ్వాబ్ సే తూ ప్యార్ న కర్...

చాహూంగ మైన్ తుఝె సాంఝ్ సవేరే, ఫిర్ భి కభీ అబ్ నాంకొ తేరే ఆవాజ్ మై న దూంగా....

అనో ఇలాంటి ఏవేవో పాటలు పాడేవారు. చివరికి 'ఆఖోమ్ రహ్తీ హై తస్వీర్ తేరీ, సారీ ఉమ్ర్ తేరీ పూజా కరూంగా' అని తన ప్రేమ పవిత్రతను ప్రకటించేవారు.

ఆ ప్రభావం తనపై ఉంది.

ఇప్పటి సినిమాలు బెదిరించటం, ఏసిడ్లుపోయటం, సూసైడ్ బెదిరింపులు చూపుతున్నాయి. ఈ ప్రభావం ఈ తరంపై ఉంటోంది.

ఇందులో పెంపకం లోపం, బలహీన మనస్తత్వాల ప్రసక్తిలేదు.

వ్యక్తి ఎంత తీవ్రమైన ప్రభావానికి గురవుతున్నాడన్నదే ఉంది!

ఆలోచిస్తూ ఆస్పత్రిలో అడుగుపెట్టాడు శరత్.

సుమంత్ ఉన్న గది చేరారు.

బయట ఆగిపోయాడు శరత్.

అతడివైపు ప్రశ్నార్థకంగా చూసింది ప్రశాంతి.

'నువ్వెళ్లు. నేను బయటే ఉంటాను' మాట అస్పష్టంగా వచ్చింది.

'వాడికి ఇపుడే మనం ధైర్యం చెప్పాలి. వాడికి ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి. రండి' అంది.

వీళ్ల వెంట వచ్చిన వాళ్లు ఆగి వీళ్ళద్దరివైపే చూస్తున్నారు.

'నువ్వెళ్లు. నేను కాసేపయ్యాక వస్తాను. నాకు టైమ్ కావాలి' అన్నాడు శరత్. మరోమాటకు ఆస్కారం ఇవ్వకుండా బయటకు వచ్చాడు, ఆస్పత్రి పేరు గుర్తుపెట్టుకున్నాడు.

జేబులో చేతులు పెట్టుకుని గమ్యంలేకుండా నడవటం ఆరంభించాడు.

ఒక నిర్దిష్టమైన ఆలోచన లేదు. నిర్దిష్టమైన గమ్యం లేదు. కేవలం నడక. ఏదైనా భౌతికమైన శ్రమ కావాలి. ఎంత శ్రమ అంటే అలసిపోవాలి. మనసుకు మెదడుకు తమ పనిచేసేంత శక్తి ఉండకూడదు.

నడగ వేగం పెరిగింది.

ఎటూ చూడటం లేదు శరత్. దారి ఎటు తీసుకు వెళ్తే అటు వెళ్తున్నాడు.

దుకాణాలు, వాహనాలు, మనుషులు దాటుతున్నారు. ఎవరినీ చూడటంలేదు అతడు.

మనసు శూన్యంగా ఉంది. మెదడు ఖాళీగా ఉంది.

'అంతా శూన్యం!' అనిపిస్తోంది అతడికి.

మనిషి జీవితం అర్థంలేనిది. మనిషి ఆశలు అర్థం లేనివి. మనిషి నిరాశలు అర్థంలేనివి. మనిషి భావనలు అర్థంలేనివి.

ఎందుకు పుడతామో తెలియదు. ఎందుకు చదువుతామో తెలియదు. ఏమౌతామో తెలియదు. ఏమీ తెలియదు. కానీ జీవిస్తూంటాం. కాలం గడిపేస్తుంటాం.

యె జీవన్ సఫర్ ఏక్ అంధా సఫర్ హై

బహక్ నా హై ముమ్‌కిన్, భటక్ నే క డర్ హై

ఈ జీవిత ప్రయాణం ఓ గుడ్డివాడి ప్రయాణంలాంటిది. ఈ ప్రయాణంలో దారితప్పే భయం ఉంటుంది.

'అసలు దారి అంటూ ఉంటేకదా దారితప్పటానికి!' అనుకున్నాడు శరత్.

పిల్లవాడిని కన్నప్పుడు వాడు ఏమౌతాడో తెలియదు.

ప్రేమగా పెంచుతున్నప్పుడు అనుక్షణం వాడి భవిష్యత్తు గురించి బెంగపడుతూంటాం కానీ వాడు ఏమౌతాడో తెలియదు. ఏ దారి ఎంచుకుంటాడో తెలియదు. వాడేదో దారి ఎంచుకుంటాడు.

ఆ దారిలో వాడేమౌతాడో వాడికే తెలియదు.

యే అంధేరా ఘనా ఛా రహా

తేర ఇన్సాన్ ఘబ్రాగయా

హోరహా బేఖబర్, కుఛ్ న ఆతా నజర్

సుఖ్ క సూరజ్ ఛుపా జారహా

దియ తూనే హమే జబ్ జనమ్

తూహీ ఝేలేగ హమే సబ్ కె గమ్

దట్టమైన చీకటి అలుముకుంది.. మనిషి మనస్సు భయంతో నిండింది. ఏం జరుగుతోందో తెలియదు. ఏం చేయాలో తెలియదు. ఏమీ కనబడటంలేదు. అంతా చీకటి. ఆ చీకటిలో సుఖమనే సూర్యుడు దుఃఖమనే మేఘాల మాటుకు వెళ్లిపోతున్నాడు. కానీ మాకు జన్మనిచ్చిన నీవే, మా అందరి దుఃఖాలనూ తీరుస్తావు అని మా నమ్మకం.

శరత్ మనస్సు దుఃఖంతో నిండింది.

తన పరిస్థితి అలాగే ఉంది -

అంతా చీకటి. కానీ తన దుఃఖాన్ని తానే భరించాలి. తన కష్టాన్ని తానే ఎదుర్కోవాలి.

ఏడీ అందరి కష్టాలను తొలిగించే భగవంతుడు?

అయినా భగవంతుడు మనిషి కష్టాలు తీరుస్తాడా?

అంతా మనిషి మనసుని చేసుకునే మోసం

తిరిగి తిరిగి అలసిపోయాడు శరత్. దారిపక్కన ఓ బండరాయి మీద కూర్చున్నాడు.

అంతలో ఒక ఆలోచన అతడిని బలంగా తాకింది.

ఇప్పుడు తనకు వచ్చిన కష్టమేమిటి?

సుమంత్ ఆత్మహత్య ప్రయత్నం చేశాడు.

కానీ అది సుమంత్ జీవితం. సుమంత్ నిర్ణయం. దాన్లో తనకేం పాత్ర ఉంది. సుమంత్ జన్మించేందుకు కారకుడు తాను. వాడికి చదువు చెప్పించాడు. కానీ ఏం చదవాలి? ఎలా చదవాలి? ఎంత చదవాలి తాను నిర్ణయించలేదు.

ఎలా ఆలోచించాలో చూపించాడు. కానీ వాడికి నచ్చినట్టువాడు ఆలోచించాడు. వాడి గమ్యం వాడు నిర్ణయించుకున్నాడు. ఈ జీవితంలో దేనికీ ఎవరూ బాధ్యులుకారు. ఎవరి జీవితాలు వారివే. ఎవరి అదృష్టం వారిదే తన జీవితం, తన ఆలోచనలపైనే తనకు నియంత్రణలేదు. తన శరీరంలో జరిగే తన ప్రాకృతిక చర్యలపై తనకు నియంత్రణలేదు. తన ఊపిరి ఆడటం పైనే నియంత్రణ లేదు. మరి, తన సంతానంపై, వారి భవిష్యత్తుపై, వారి ఆలోచనలపై తనకు నియంత్రణ ఉండాలని ఎలా ఆశిస్తాడు? ఈ ప్రపంచంలో ఎవరికి వారు ఒంటరే. బంధాలు, అనుబంధాలు అన్నీ మనం కల్పించుకున్నవే. తనకసలు కష్టమే లేదు. తన ఉద్యోగం తనకుంది. ప్రశాంతి ఉద్యోగం ప్రశాంతిది. తిండికి లోటులేదు. మరి మనశ్శాంతి ఎందుకు లేదు?

ఎందుకు లేదంటే, తమ పరిధిలో లేని, తను నియంత్రణలో లేని, తమవాడనుకుంటున్న వ్యక్తి తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించి జీవితాన్ని దెబ్బ తీసుకుంటున్నందుకు అంతేనా? అదో కష్టమా?

Your children are not your children.

They are the son's and daughter's of the life's longing itself.

They come through you, but not from you.

Andi though they ar with you, yet they belong not to you.

You may give them love, but not your thoughts

For they have their own thoughts.

ఇందులో బాధపడేదేముంది? కష్టం ఏముంది?

మనసు తేలికైనట్టు అనిపించింది.

గబగబా వెనక్కు ఆస్పత్రివైపు నడవటం ఆరంభించాడు.

'అందరూ అబద్ధం చెప్తున్నారమ్మా. కుమ్మక్కయి నన్ను సినిమా నుంచి పక్కకు తొలగించాలని చూస్తున్నారు.' కన్నీళ్లు తుడుచుకుంటూ చెప్పాడు సుమంత్.

'ఎందుకురా.. అందరూ నీ ఫ్రెండ్సే కదరా?' అడిగింది ప్రశాంతి.

ఆమెకు సుమంత్‌ను చూస్తే జాలిగా అనిపిస్తోంది.

అడవిలో తోడేళ్లు నక్కలు, పులులూ ఉంటాయన్న గ్రహింపు లేకుండా అవన్నీ తన స్నేహితులే అనుకుని వాటితో విహారానికి వెళ్ళిన లేడి గుర్తుకు వస్తోంది సుమంత్‌ని చూస్తూంటే. అందరూ తనవారే అనుకుని తీరా చూస్తే ఎవరూ తనవారు కారని గ్రహింపుకు వచ్చిన అమాయకుడు గుర్తుకు వస్తున్నాడు సుమంత్‌ని చూస్తూంటే.

'ఎవరూ నా ఫ్రెండ్స్ కాదమ్మా. ఎవరికి వాళ్లు తమ కెరీర్‌ను చూసుకుంటారమ్మా. నాన్న డబ్బులు ఇవ్వనన్నారు కదా! నేను అదే చెప్పి నా టాలెంట్ పెట్టుబడి అన్నానమ్మా. నాతో అడ్డమైన చాకిరీ చేయించుకున్నారు. నన్ను పక్కకి నెడుతున్నారు. నా అవసరం తీరిన తరువాత సినిమా హిట్ అయితే నాకు పేరు వస్తుందేమోనని భయం.'

'మరి ఎవరో అమ్మాయిని ప్రేమించావన్నారు?' సూటిగా అడిగింది ప్రశాంతి.

ముఖం దిండులో దూర్చాడు సుమంత్.

అతడు ఏమీ మాట్లాడక పోవటంతో అతడి తలమీద చేయివేసి నిమిరింది ప్రశాంతి.

'నిజమా?' అని అడిగింది.

దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించాడు సుమంత్.

ప్రశాంతి మనసు ఎలానో అయిపోయింది.

'ఎందుకు దుఃఖం మనిషికి? ఎంత దుఃఖం!' అనిపించింది.

అతడి తల నిమురుతూ మౌనంగా ఉంది.

మనిషి సంతోషాన్ని కోరుకుంటాడు. కానీ దుఃఖాన్ని ఏరికోరి తెచ్చుకుంటాడు. సుఖం లేదని ఇంకాస్త ఏడుస్తాడు.

ఆమెకు శరత్ ఎప్పుడూ పాడే పాట చరణం గుర్తుకు వచ్చింది.

ఘర్ సే చలేథె హమ్ తొ ఖుషీ కే తలాష్ మే

గమ్ రాష్ మే ఖడేథే వొహీ సాథ్ హో లియే

సుఖాన్ని సంతోషాన్ని వెతుకుతూ ఇల్లు వదిలి వెళ్తే, బయట దారిలో విషాదం నిలబడి ఉంది. అదే వెంట నడుస్తోంది.

కాస్సేపటికి అతడి ఏడుపు ఉధృతం తగ్గింది.

'అమ్మా.. నేను ఇక్కడినుంచి రాను. ఇక్కడే ఉంటాను. నేను వదిలి వచ్చేస్తే నా శ్రమ అంతా వృధా అయిపోతుంది. నేను రాసిన రాతలు వేరేవాళ్లవి అయిపోతాయి. నా ఆలోచనలు వాళ్లవి అయిపోతాయి. ఇంతకాల కష్టపడినది వాళ్లపాల అయిపోతుంది. నేను అన్నీ వదిలేసి రాను. నేను ఫైట్ చేస్తాను' ఆవేశంగా అన్నాడు.

ప్రశాంతి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది.

ఇంతలో ఒక అమ్మాయి గదిలోకి అడుగుపెట్టి ప్రశాంతిని చూసి అడుగు వెనక్కువేసింది.

అమ్మాయి అందంగా ఉంది. ఆధునికంగా ఉంది.

కాస్సేపటికి బెరుకు బెరుకుగా లోపలకు వచ్చింది.

'నమస్తే ఆంటీ' అంది.

ఆమె స్వరం విని సుమంత్ దిండు తలమీద పెట్టుకుని పరుపులోకి మరింతగా ఒదిగాడు.

'ఇందులో నా తప్పేమీ లేదాంటీ. నేను అందరితో మాట్లాడినట్లే మాట్లాడాను. సుమంత్ అపార్థం చేసుకున్నాడు. ఆంటీ మీరైనా చెప్పండి. నవ్వుతూ మాట్లాడిన ప్రతివాడితో ప్రేమలో పడమని. మీరూ ఉద్యోగం చేస్తున్నారు కదాంటీ మీరు నవ్వుతూ మాట్లాడిన ప్రతివాడినీ మీరు ప్రేమిస్తున్నారంటే ఎలా ఉంటుంది ఆంటీ?'

ఆమె మాట పూర్తవకముందే పులిలా లేచాడు సుమంత్.

'షటప్ యూ బిచ్' అరిచాడు.

నిర్ఘాంతపోయింది ప్రశాంతి.

తన కొడుకు, తను అల్లారు ముద్దుగా పెంచినవాడు, తను సంస్కారం నేర్పినవాడు, తన రక్తమాంసాలేకాదు, గుణగణాలు సంస్కారం వారసత్వంగా పొందినవాడు ఒక అమ్మాయిని అలా అసభ్యంగా, కుసంస్కారం ప్రదర్శిస్తూ సంబోధించటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. బాధ కలిగించింది. అంతులేని ఆవేదన కలిగింది.

తన కొడుకు అలాంటి మాట ఓ అమ్మాయిని అంటాడని ఆమె కలలో కూడా ఊహించలేదు. మగవాళ్లు ఆడవాళ్ల గురించి చులకనగా మాట్లాడతారని తెలుసు. కానీ తన కొడుకు... ఎంత తన కొడుకయినా మగవాడు.

ఆమెలో విరక్తి భావన కలిగింది. తొలిసారిగా తన కొడుకు తనవాడు కాదేమో అనిపించింది.

ఇన్నాళ్ల ప్రేమ, ఇన్నాళ్ల భావనలు అన్నీ వృధా అనిపించింది. 'డోన్ట్ టాక్ టు మి లైక్ దట్ యూ బ్రూట్ అండ్ ఇడియట్' అరిచింది ఆ అమ్మాయి. కన్నీళ్లు ఆపుకుంటూ 'సారీ ఆంటీ మళ్లీ కలుస్తాను' అని వెళ్లిపోయింది.

గదిలో నిశ్శబ్దం భయంకరంగా ప్రతిధ్వనించసాగింది.

సుమంత్‌కి తల్లి ముఖం చూసి భయం కలిగింది.

ఆమె ముఖంలో బాధ గడ్డకట్టినట్టుంది.

'స్త్రీని గౌరవించటం తన కొడుకుకి నేర్పకపోవటం తనదే లోపం' అనుకుంటోందామె మనసులో పదే పదే. ఆమెకి సుమంత్ వైపు చూడాలనిపించటంలేదు.

ఎదిగిన పిల్లలను రెక్కలు వచ్చిన పక్షితో పోలుస్తారు. రెక్కలు వచ్చి ఎగరాల్సిన పక్షి రెక్కకు గాయమై నేలవాలితే దాన్ని దగ్గరకు తీసి దాని గాయం నయమయ్యేంతవరకూ ఆశ్రయం ఇవ్వాలి. రెక్కలు బాగవగానే మళ్లీ వదిలేయాలి. అంతే తప్ప 'నాది' అనుకోకూడదు.

సుమంత్ ఆత్మహత్య ప్రయత్నమే ఆమెలో విరక్తి కలిగించింది.

పిరికి వాళ్లంటే పరమ అసహ్యం ఆమెకి. ఆ పిరికితనం ఏదో గొప్పతనంగా భావించే వాళ్లంటే మరీ అసహ్యం. ఆ పిరికివాడు తన కొడుకు కావటం బాధ కలిగించింది. కానీ ఆడవాళ్లను అవమానించే వాళ్లను క్షమించదు. అలాంటివాడు తన కొడుకు కావటం ఆమెకు తానేదో ఘోరమైన నేరం చేసిన భావన కలిగింది.

అలాంటి పరిస్థితులలో గదిలోకి అడుగుపెట్టాడు శరత్.

**గదిలో అడుగు** పెడుతూనే గదినిండా ఉద్విగ్నత దట్టంగా అలుముకుని ఉందని గ్రహించాడు శరత్.

అతడికి ప్రశాంతి స్వభావం తెలుసు.

ఆమెకు కోపం రాదు. కానీ వచ్చిందంటే అది ప్రళయానికి ఏమీ తక్కువ కాదు. అయితే, ప్రశాంతి ప్రతి చిన్న విషయాన్నీ సీరియస్‌గా తీసుకునే మనిషి కాదు. ఆమెకు కోపం వచ్చిందంటే అదేదో అత్యంత గంభీరమైన సమస్య అయి ఉండాలి. పెళ్ళయిన కొత్తలో ప్రశాంతిని శరత్ ఆమెకు కోపం రాకపోవటాన్ని ఎత్తి చూపి ఏడిపించేవాడు.

'నేను నువ్వు అలిగితే అలక తీర్చటానికి ఎన్ని పాటలను, ఎంతమంది గాయనీ గాయకులను రడిగా లైన్‌లో నిల్చోబెట్టానో తెలుసా? అటు చూడు మహమ్మద్ రఫీ నుంచుని 'గుస్తాఖీ మాఫ్' అని పాడటానికి సిద్ధంగా ఉన్నాడు. ఇటు చూడు ముకేష్ 'తుమ్ రూఠీ రహో మై మనతారహూ' అంటున్నాడు. అటు చూడు కిశోర్‌కుమార్ 'హమేతుమ్సేప్యార్‌కిత్‌నా' అంటున్నాడు యేసుదాసు...' అని చెప్పబోతూంటే ఆమె అతడి నోరు మూసేసేది.

'ఎవరెవరివో పాటలుపాడి బ్రతిమిలాడటాలు నాకు ఒద్దు. మీరేమంటారో చెప్పండి' అనేది.

ప్రశాంతికి కోపం వచ్చిన రెండు, మూడు సందర్భాలు శరత్‌కి బాగా గుర్తు.

ఓసారి తన ఆఫీసులో అందరూ చులకనగా మాట్లాడే అమ్మాయి గురించి తానూ ప్రశాంతి దగ్గర చులకనగా మాట్లాడబోయాడు.

వెంటనే తోక తొక్కిన త్రాచులా లేచింది ప్రశాంతి.

'మగవాళ్ళ మాటలు నా దగ్గర మాట్లాడకండి. మీ కొలీగుల గురించి, వేరే అమ్మాయిల గురించి ఏం మాట్లాడాలన్నా నేనూ ఉద్యోగినిని అన్న విషయం గుర్తుంచుకోండి నేనూ రోజుకి తొమ్మిదిగంటలు ఆఫీసులో కొలీగుల నడుమ గడుపుతానని గుర్తుంచుకోండి. నేనూ బస్సుల్లో అడ్డమైన వెధవల నడుమ ప్రయాణిస్తానని గుర్తుంచుకోండి. అత్యవసరమైతే కొలీగుల లిఫ్టు తీసుకుంటానని తెలుసుకోండి. మీరు మీ కొలీగుల గురించి మాట్లాడే ప్రతిమాట నాకూ వర్తిస్తుందని గ్రహించండి.' అంది.

అప్పటి నుంచీ ఆమె దగ్గరే కాదు ఎవరి దగ్గర కూడా అలా మాట్లాడటం మానేశాడు శరత్. ఎవరైనా మాట్లాడుతూంటే దూరం వెళ్ళిపోయేవాడు. అసలు అలాంటి ఆలోచనలను దగ్గర రానిచ్చేవాడుకాదు.

మరోసారి శరత్ వాళ్ళమ్మ ఏదో పదే పదే చెపుతుంటే విసుగ్గా వచ్చేశాడు.

ఆరోజు ప్రశాంతికి వచ్చిన కోపం శరత్ మరచిపోలేదు.

'తల్లిని గౌరవించలేనివాడు ఇంకెవరిని గౌరవించి లాభంలేదు' అని మాట్లాడటం మానేసింది.

శరత్ క్షమార్పణలు వేడుకున్నాడు. 'అది అవమానం కాదు, అసహనం కాదు, పనితొందరవల్ల' అని సంజాయిషీలు ఇచ్చుకున్నాడు.

కానీ ప్రశాంతి మాట్లాడలేదు.

చివరికి 'అమ్మ అసలు గమనించలేదు. గమనించినా పట్టించుకోదు. నువ్వెందుకింత సీరియస్‌గా తీసుకుంటావు?' అన్నాడు.

'అమ్మ పట్టించుకోకపోతే అవమానకరంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించవచ్చా? ఎవరికోసమోకాదు మీ ప్రవర్తన. మీ ప్రవర్తన మీ వ్యక్తిత్వం' అంది.

వారానికి కానీ ఆమె శాంతించలేదు.

ఇలాంటి సంఘటన వల్ల ఎవరైనా స్త్రీ గురించి అవమానకరంగా మాట్లాడితే ప్రశాంతి సహించలేదని శరత్ గ్రహించాడు. అప్పుడప్పుడు ఆఫీసులోని మహిళా కొలీగుల విషయంలో శరత్‌ని ఏడ్పించినా అది కేవలం ఆటకే తప్ప చులకన అభిప్రాయం లేదని శరత్ గ్రహించాడు.

అందుకే ప్రశాంతి ముఖంలో కోపం కనిపిస్తూంటే అతడికి ఎందుకనో అర్థంకాలేదు. ఇక్కడ ప్రశాంతి, సుమంత్ తప్ప మరెవరూ లేరు.

సుమంత్ ఏమన్నా అమ్మాయిల గురించి చులకనగా మాట్లాడాడా?

అప్పుడు గుర్తొచ్చింది శరత్‌కి.

తాను పైకి వస్తుంటే బయట ఓ అమ్మాయి ఏడుస్తూంటే, నలుగురు యువకులు ఓదారుస్తున్నారు. దానికీ ప్రశాంతికి కోపం రావటానికీ, గదిలో ఉద్విగ్నతకూ సంబంధం ఉందా?

తనలో ఆలోచనలు అయోమయాన్ని పైకి కనబడనీయలేదు శరత్.

'ఎలా ఉంది?' సుమంత్ దగ్గర కూర్చుంటూ అడిగాడు.

సుమంత్ బలహీనంగా కనిపిస్తున్నాడు.

అయితే, అతడిపై జాలి కలిగటంలేదు శరత్‌కు.

ఆత్మహత్య ప్రయత్నం చేసిన వారిమీద అతడికి ఏమాత్రం సానుభూతిలేదు. పరాయి వారైనా, స్వంత కొడుకయినా ఈ విషయంలో శరత్ అభిప్రాయం బలహీన మనస్కులు, చేతకాని వారే ఆత్మహత్యకు పాల్పడతారు. వారిపై జాలి చూపించి, వారిని బుజ్జగించటం అంటే, పసిపిల్లవాడు ఏడవగానే దగ్గర దీసి బుజ్జగించి అడిగింది ఇచ్చేయటంలాంటిది.

భవిష్యత్తులో ఆత్మహత్యను ఓ బెదిరించే ఆయుధంలా వాడి ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసే వీలుని ఇచ్చినట్టే.

అందుకే కొడుకుపై ఎలాంటి జాలి చూపదలచుకోలేదు శరత్.

తన జీవితం పట్ల, తన జీవితంతో ముడిపడి ఉన్న వారి పట్ల ఏ మాత్రం ఆలోచన లేని వాడి పట్ల జాలి చూపాల్సిన అవసరం లేదన్నది శరత్ అభిప్రాయం. 'బాగానే ఉంది' శరత్ ప్రశ్నకు ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు సుమంత్.

'వెళ్దామా?' అసహ్యంగా లేచి నిలబడింది ప్రశాంతి.

'నేను డాక్టర్‌ని ఎప్పుడు తీసుకెళ్ళవచ్చో కనుక్కుంటాను. దాన్ని బట్టి ప్రయాణం ఏర్పాట్లు చేస్తాను' అన్నాడు శరత్.

శరత్ బయటకు వెళ్ళబోతుంటే వెనుకనుంచి బలహీనంగా వినిపించింది సుమంత్ గొంతు ' నేనురాను'

వెనక్కు తిరిగాడు శరత్. 'ఇదా వీళ్ళిద్దరి మధ్య ఉద్విగ్నతకు కారణం?' అనుకున్నాడు.

'వాడితో సంబంధంలేదు నేను ఇక్కడ ఒక్క క్షణం కూడా ఉండను. నేను వెళ్తాను' అంది ప్రశాంతి.

ఆమె మాటలవల్ల వాళ్ళిద్దరి మధ్య ఏదో గొడవ జరిగిందని గ్రహించాడు శరత్. 'నువ్వుండు. నేను డాక్టరుతో మాట్లాడివస్తాను' సమాధానం కోసం ఎదురుచూడకుండా బయటకు నడిచాడు శరత్.

డాక్టర్‌తో మాట్లాడి వచ్చి గదిలోకి అడుగుపెట్టబోయిన శరత్ ఆగిపోయాడు. గదిలో బోలెడంతమంది ఉన్నట్టున్నారు. మాటల శబ్దం వినిపిస్తోంది. తొంగి చూశాడు.

సుమంత్ స్నేహితులులా ఉన్నారు. వాళ్ళలో కొందరు అమ్మాయిలు కూడా ఉన్నారు. గదిలోకి అడుగుపెట్టగానే అందరూ నిశ్శబ్ధమైపోయారు.

వాళ్ళవైపు ఓసారి చూశాడు శరత్. వాళ్ళంతా అతడివైపు చూస్తున్నారు. ఒక్కరు కూడా పలకరింపుగా నవ్వలేదు.

'అమ్మ ఏది?' సుమంత్‌ని అడిగాడు శరత్.

'బయట కూర్చుంటానని వెళ్ళింది ఆంటీ' ఓ యువకుడు చెప్పాడు.

'సరే.. మీరు మాట్లాడుకోండి. నేను ఇప్పుడే వస్తాను' అంటూ బయటకు నడిచాడు శరత్.

అతడు గుమ్మం దాటకముందే లోపల వాళ్ళ మాటలు మొదలయిపోయాయి. నవ్వుకుంటూ ప్రశాంతిని వెతకటం ఆరంభించాడు శరత్.

ఆస్పత్రి బయట తోటలో ఓ చెట్టుక్రింద కూర్చుని కనిపించింది ప్రశాంతి 'అశోకవనంలో సీతలా విషాదం ఫోజు బాగుంది' నవ్వుతూ ఆమె పక్కన కూర్చున్నాడు శరత్.

ప్రశాంతి నవ్వలేదు 'ఎప్పుడు వెళ్తున్నాం?' అడిగింది.

'డాక్టర్ ఇంకా రెండురోజులు రెస్టు అవసరమన్నాడు. ఎల్లుండి బయలుదేరదాం' అన్నాడు శరత్.

'నేను వాడి ముఖం చూడను' స్థిరంగా అంది ప్రశాంతి.

శరత్ మాట్లాడలేదు. చుట్టూ చూశాడు.

ఆస్పత్రి ఆవరణలో పలు రకాల మనుషులు వేర్వేరు స్థితులలో ఉన్నారు. అందరూ గుంపులుగా కూర్చుని చర్చిస్తున్నారు. ఓ చోట ఓ నడివయసు అమ్మాయి ఇద్దరు పసిపిల్లలను పట్టుకుని ఏడుస్తూంటే, ఓ ముసలాయన ఓదారుస్తున్నాడు. ఇంకో చోట కొందరు ఏదో చర్చిస్తున్నారు. మరికొందరు సెల్‌ఫోన్లలో ఏదో వేలితో తిప్పుతూ చూస్తున్నారు.

ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య ఉంటుంది. ఎవరికి వారు తమ సమస్యలే అందరికన్నా కఠినమైన సమస్య అనుకుంటారు. కానీ ఒకరి సమస్య మరొకరికి హాస్యంగా కనిపిస్తుంది. తన సమస్య మాత్రమే జటిలమైనదనుకుంటారు. ఇతరుల సమస్యలను చులకనగా చూడటం మానవ స్వభావంలోని లక్షణమేమో అనుకున్నాడు శరత్.

'ఎందుకని?' అని అడగలేదు శరత్.

కాస్సేపటికి ప్రశాంత్ అంది.

'వేలెడంత లేడు, ఆ అమ్మాయిని 'డర్టీబిచ్' అన్నాడు. ఒక అమ్మాయిని అలా అంటాడా? ఎక్కడినుంచి వచ్చింది ఈ కుసంస్కారం? ఏమిటి వాడు ఉద్దేశ్యం? తన బ్రతుకు తాను సరిగ్గా బ్రతకలేడు. అమ్మాయిని అవమానించే అహంకారం ఎందుకు వాడికి? ఏం సాధించాడు జీవితంలో? అయినా ఏమైనా సాధిస్తే అమ్మాయిల గురించి చులకనగా మాట్లాడాలా? నేను వాడి ముఖం కూడా చూడకూడదనుకున్నాను కాబట్టి , వింటే వినమండి పోతే పొమ్మనండి' అంది కోపంగా.

శరత్‌కు విషయం అర్థమయింది.

వాడు ఇంటికి తాగివస్తే సమర్థించింది ప్రశాంతి. కానీ అమ్మాయి గురించి చులకనగా మాట్లాడితే భరించలేకపోతోంది. వాడి ముఖం చూడనంటూంది. నిట్టూర్చాడు శరత్.

'సరే నిన్ను హోటల్ రూములో దింపివస్తాను' అన్నాడు శరత్.

'అంతేకానీ వాడిని ఏమీ అనరు? మీ వల్లే వాడు ఇలా తయారయ్యాడు. తండ్రి భయంలేని పిల్లలు ఇలాగే ఉంటారు. చిన్నప్పటినుంచీ చెప్తున్నాను, వాళ్ళకి కాస్త తండ్రి భయం ఉండాలని నా మాటను వినలేదు. పిల్లలు, సున్నిత హృదయం అని ఏవేవో సిద్ధాంతాలు చెప్పారు. ఆ సిద్ధాంతాలు ఇప్పుడు ఎందుకయినా పనికి వచ్చాయా? వాడికి జీవితం మీద విలువలేదు. మనుషులంటే గౌరవంలేదు' అంది ప్రశాంతి.

'నా ఆవేదన కోపంగా కనిపిస్తోందా? చదువులు చదివాడు లాభంలేదు. సినిమాలు అన్నాడు. అక్కడా పనికి వస్తున్నట్టులేదు. పెద్దలు ఉన్నది పిల్లలు ఏమంటే దానికి తల ఊపటానికా? వాళ్ళకి మంచి చెడు చెప్పనవసరంలేదా?' అడిగింది.

'నేను వాడితో మాట్లాడతాను. నువ్వు రిలాక్సవు. కోపం తగ్గించుకో' అన్నాడు అనునయంగా.

'వాడిష్టం ఏట్లో దూకమనండి. బురదలో పొర్లమనండి. కానీ ఇంకోసారి వాడు అమ్మాయిల గురించి చులకనగా మాట్లాడితే వాడికీ నాకూ సంబంధంలేదని చెప్పండి.'

ప్రశాంతి మెత్తబడుతోందని గ్రహించాడు శరత్.

'వాడి సంగతి నేను చూసుకుంటాను. నువ్వు కాస్సేపు హోటల్ గదిలో నిద్రపో.' ఆమెని లేవదీశాడు శరత్.

ప్రశాంతిని హోటల్ గదిలో దింపి వెనక్కు వచ్చాడు.

అతడు గదిని చేరేసరికి లోపలనుంచి పెద్దగా మాటలు వినిపిస్తున్నాయి, నవ్వుల నడుమ.

శరత్ గదిలో అడుగుపెట్టేసరికి మళ్ళీ అందరూ నిశ్శబ్ధమైపోయారు.

'అమ్మేది?' అడిగాడు సుమంత్.

'హోటల్ గదిలో ఉంది. రెండురోజుల తరువాత ప్రయాణం చెయ్యవచ్చన్నాడు డాక్టరు' చెప్పాడు శరత్.

'నేను రాను' మొండిగా అన్నాడు సుమంత్.

'అవును అంకుల్. సుమంత్ మాతోటే ఉంటాడు. సుమంత్‌తో మాకు ఒప్పందం కుదిరింది. సుమంత్‌ని తీసుకువెళ్ళిపోండి' అన్న యువకుడు అన్నాడు.

వాళ్ళవైపు విచిత్రంగా చూశాడు శరత్. తాపీగా కుర్చీలో కూర్చున్నాడు. సుమంత్ వైపు సూటిగా చూస్తూ అడిగాడు 'ఏం జరుగుతోంది? ఒకసారి ఉండనంటాడు, ఓసారి ఉంచొద్దంటారు. ఇంకోసారి ఉంటానంటారు. ఉంచమంటారు ఏమిటిదంతా? అమ్మ ముందు ఎవరికో అవమానించవట?'

'అయితే. సుమంత్ మా షూటింగ్‌లో ఏ బాధ్యత వహించాలో ఇంతకెవరూ మేం స్పష్టంగా అనుకోలేదు. ఇప్పుడు మేము స్పష్టంగా మాట్లాడుకున్నాం. ఈవెన్ దట్ లిటిల్ బిచ్ అగ్రీడ్ అంకుల్. నౌ నో ప్రోబ్లెమ్' అన్నాడో యువకుడు అక్కడున్న అమ్మాయిలలో ఓ అమ్మాయిని చూపిస్తూ.

అందరూ పెద్దగా నవ్వారు.

'నన్ను బిచ్ అంటావా, యూ డర్టీ గూస్' అందా అమ్మాయి నవ్వుతూ, వాడి చెంప మీద కొడుతూ. ఒక్క క్షణంలో శరత్‌కు ఏదో అర్థమయిన భావన కలిగింది.

ఇది తమకు పూర్తిగా కొత్త ప్రపంచం. ఈ ప్రపంచంలో తాము ఇమడలేరు. అసలు ఇలాంటి ప్రపంచం ఉంటుందన్న ఊహ కూడా తమకు రాదు. తమ విలువలు వేరు. తమ నమ్మకాలు వేరు. వీళ్ళవి వేరు.

'లెటస్ సెలబ్రేట్. అయితే ఒప్పుకున్నట్టే' అన్నాడో యువకుడు.

'హే' అరిచారంతా.

'లెటస్ సెలబ్రేట్' అంటూ ఓ అబ్బాయి బ్యాగులోంచి బాటిల్ తీశాడు.

'ఏయ్ అంకుల్ ఉన్నారా' ఓ అమ్మాయి వాడిని హెచ్చరించింది.

'పోవే' అంటూ ఆ అమ్మాయిని పక్కకు తోసి, ముందుకు వచ్చాడా యువకుడు.

'అంకుల్ వాంట్ టు జాయిన్?' ప్రశ్నించాడు బాటిల్ శరత్ ముందు ఊపుతూ.

హేమంత్ వైపు చూశాడు శరత్.

సుమంత్ నవ్వుతున్నాడు. 'అరే మా నాన్న తాగడురా' అంటున్నాడు.

'హో.. షిట్.. ముందెందుకు చెప్పలేదురా? తాగని డాడీలుంటారనుకోలేదు' అంటూ బాటిల్ దాచేశాడు ఆ అబ్బాయి.

అందరూ నవ్వారు.

'దిస్ జెర్క్ ఈజ్ ఎ నట్ కేస్' అందో అమ్మాయి వాడి జుట్టు పట్టి ఊపుతూ.

లేచాడు శరత్.

'నేను రేపు ప్రొద్దున్నే వస్తాను అప్పుడు మాట్లాడుకుందాం' అన్నాడు.

బయటకు నడిచాడు.

శరత్ గుమ్మం దాటుతూంటే లోపలనుంచి కేకలు వినిపించాయి.

నవ్వులు, కేరింతలు వినిపించాయి.

వెంటనే ఓ నర్సు లోపలకు పరుగెత్తింది 'ఇది హాస్పిటల్. పబ్ కాదు' అని అరుస్తూ.

హోటల్‌వైపు నడుస్తున్న శరత్ మనస్సులో అతనికే అర్థంకాని భావాలు కదులుతున్నాయి.

ఈ సమాజం వేరు. ఈ తరం వేరు. వీరి ఆత్మాభిమానాలు వేరు. విలువలు వేరు.

సినిమాల్లో నాయిక హీరోను 'ఏరా, పోరా' అంటుంటే తమ తరం మెచ్చదు. ఈ తరం దాన్ని అనుకరిస్తుంది.

సినిమాల్లో హీరో తాగి తండ్రిని బూతులు తిడితే తమ తరం మెచ్చదు. ఈ తరం దాన్ని గొప్ప అనుకుని ఆమోదిస్తుంది.

సినిమాల్లో తండ్రి, కొడుకు కలసి తాగుతూంటే తమ తరం ఆమోదించదు.

ఈ తరం అలా ఉండాలని వాంఛిస్తుంది. బహుశా రాబోయే తరం అలాగే ఉంటుందేమో!

సుమంత్ ఓ అమ్మాయిని 'డర్టీబిచ్' అంటే ప్రశాంతికి కోపం వచ్చి మాట్లాడటం మానేసింది.

తనను ఓ యువకుడు 'బిచ్' అంటే, నవ్వుతూ, భుజం మీద చరిచి 'గూస్' అని అంటుందీ తరం అమ్మాయి.

అమ్మాయిల ముందు సిగరెట్ తాగటం, ముందు బాటిల్ తీయటం, ఘోరమైన నేరం తమకు.

ఈ తరానికి అది మామూలు విషయం.

ఆలోచిస్తూ హోటల్ సమీపిస్తున్న శరత్‌కి, ఆందోళనగా తనకోసం ఎదురు చూస్తున్న ప్రశాంతి కనిపించింది.

**'ఏమై ఉంటుంది?'** అనుకుంటూ ఆమె వైపు వడివడిగా అడుగులు వేశాడు శరత్.

శరత్‌ని చూడగానే భోరుమని ఏడవటం ఆరంభించింది ప్రశాంతి. అంతవరకూ పట్టి బంధించి ఉంచిన నదీ ప్రవాహం కట్టలు తెంచుకోగానే ఎంత ఉధృతంగా దూకుతుందో అంత ఉధృతంగా ఆమె కన్నీరు ప్రవహించటం ఆరంభించింది.

ఏమయిందో అర్థం కాలేదు శరత్‌కు.

ఆమె ఎందుకు ఏడుస్తుందో అర్థంకాలేదు. ఆమె దుఃఖానికి కారణం ఏమిటో తెలియదు. అయినా అతని హృదయం ద్రవించింది. ఏదో అర్థంకాని భావన అతని మనసులో కలిగింది. అప్రయత్నంగా ఆమెను దగ్గర తీసుకున్నాడు.

ఒక మనిషి నవ్వటం చూస్తూంటే ఎంత ఆనందం కలుగుతుందో, ఎంత హాయిగా అనిపిస్తుందో, అదే మనిషిని దుఃఖంలో చూస్తూంటే అంత బాధ కలుగుతుంది. ఆ మనిషి మనకు పరిచయం లేకున్నా మనసు స్పందిస్తుంది, సాటి మనిషి దుఃఖం పట్ల. మనసులో బాధ కలుగుతుంది.

ఒక మనిషి దుఃఖించటం మన ప్రమేయం లేకుండానే మనలో బాధ కలిగిస్తుంది.

ఒక మనిషి నవ్వటం కూడా మనకు సంతోషం కలిగిస్తుంది.

ఒక మనిషి కోపంగా ఉండటం చెప్పకుండానే మనకు తెలుస్తుంది.

నిజానికి మనిషికి భాష అవసరమా?

మనిషిలోని ఏ లక్షణం ఎదుటి మనసులోని భావం గ్రహించేట్టు స్పందించేట్టు చేస్తుంది?

భాష వల్ల పదాలు, పదాలు సరిగ్గా అర్థం కాకపోవటం, అపార్థాలు కలగటం, లేనిపోని మనస్తాపాలు కలగటం సంభవిస్తోంది. అసలు భాష అన్నది లేని జంతువుల నడుమ ఇలాంటి కృత్రిమ అపార్థాలుండవేమో! ఇలా ఆలోచిస్తున్న శరత్‌కు అంతలో నవ్వు వచ్చింది.

ప్రశాంతి ఏడుస్తోంది. ఎందుకో బాధ పడుతోంది.

తాను ఆమె ఎందుకు బాధపడుతోందో కనుక్కోవటంలేదు. తనని ఓదార్చటంలేదు.

మనసులో ఆమె బాధను స్పందిస్తున్నాడు. కానీ లోలోపల ఏవేవో ఆలోచనలు చేస్తున్నాడు. పైకి మాటల ద్వారా తాను భావనలను వ్యక్తం చేయనప్పుడు ఎదుటి మనిషి తాను స్పందనలు లేని 'రాయి' అనుకోవచ్చు. తాను సానుభూతి లేని వాడనుకోవచ్చు.

ఏడుపు ఉధృతి తగ్గిన తరువాత, ఆమె శరత్‌ని వదిలి దూరంగా జరిగింది.

'స్రవంతి ఎవరినో ప్రేమ వివాహం చేసుకుందిట' చెప్పి మళ్ళీ ఏడుపు ప్రారంభించింది.

ఈసారి శరత్ ఆమెని దగ్గర తీసుకోలేదు. ఆమె పట్ల అతడికి సానుభూతి కలగలేదు. అతడి హృదయం ద్రవించటం లేదు.

అతడి మెదడు మొద్దుబారిపోయింది.

ఆమె చెప్పిన వార్త పిడుగులా అతడిపై పడింది.

అర్థం కానట్టు ప్రశాంతి వైపు చూస్తూనుంచున్నాడు.

అతడి కళ్ళు ఆమెని చూస్తున్నాయి. కానీ అతడికి ఆమె కనబడటం లేదు. అతడి శరీరం అక్కడ ఉంది. కానీ అతడు అక్కడ లేడు.

స్రవంతి పెళ్ళి చేసుకోవటం ఏమిటి?

స్రవంతి ఇంకా చిన్నపిల్ల. చదువుతోంది. ఇంకా పై చదువులు చదవాలి. సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలి. జీవితంలో తనకంటూ ఓ గుర్తింపు సాధించాలి అప్పుడు పెళ్ళి గురించి ఆలోచించాలి.

కానీ ఇంకా జీవనపథంలో నడక సరిగ్గా ఆరంభించనేలేదు అప్పుడే గమ్యం చేరుకున్నామని ప్రయాణం ఆపేస్తే ఎలా?

బాధ ఒక మహాప్రళయ కాలం నాటి అలలా అతడిలో ఉవ్వెత్తున ఎగసింది.

దాని తాకిడికి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు శరత్.

నిలబడలేకపోయాడు. నిస్సత్తువుగా అనిపించింది. కూర్చుండిపోయాడు. ఏం జరుగుతోంది?

ఎందుకిలా జరుగుతోంది?

ఇద్దరు పిల్లలూ ఇలా సమాజంలోని దుష్ప్రభావాన్నుంచి తప్పించుకోలేక గాలి ఎటు వీస్తే అటు ఎందుకని కొట్టుకుపోతున్నారు ఎక్కడుంది లోపం?

'ఇతరులు ఆత్మహత్యలు చేసుకుంటారు. తన సంతానం ఆత్మవిశ్వాసం కలవారు. ఆలోచనలు కలవారు' అనుకున్నాడిన్నాళ్ళు.

అది తప్పని తన మగ సంతానం నిరూపించింది.

ప్రేమలు, చదివే కాలంలోనే చదువుమాని పెళ్ళిళ్ళులాంటివి ఇంట్లో ప్రేమ దొరకక, ఆత్మవిశ్వాసరాహిత్యంతో బాధపడుతూ, ప్రేమరాహిత్యభావనలో మగ్గే యువతీయువకులు చేసుకుంటావని భావించాడు ఇన్నాళ్ళు.

తల్లిదండ్రులతో అనుబంధం సరిగ్గా లేనివారు ఇల్లు వదలి, తల్లిదండ్రులు కాదని పెళ్ళిళ్ళు చేసుకుంటారని అనుకున్నాడు.

కానీ...స్రవంతిని ప్రేమగానే చూశారు. ఎక్కడా ఆమెకి ఎలాంటి లోపం రానీయలేదు.

తమతో గట్టి అనుబంధం ఉందని అనుకున్నారు.

కానీ.. తన అంచనాలు, ఆలోచనలు అన్నీ తప్పు అని తేలిపోయాయి. ఎక్కడినుంచో, ఏదో లోకంలోంచి వినిపించినట్టు వినిపించింది ప్రశాంతి గొంతు.

'ఎవడో క్రిష్టఫరట. వాడితో వెళ్ళిపోతున్నానని, తన గురించి బాధ పడవద్దని ఓ ఫ్రెండుకి చెప్పిందట. ఆ ఫ్రెండు ఫోను చేసి చెప్పింది.' అర్థం కానట్టు చూశాడు ఆమె వైపు.

'తనే చెప్పవచ్చుకదా?' అడిగాడు.

'ఎవరు చెప్పినా విషయం మారదు కదా?' అంది.

'తొందరపడింది' అన్నాడు శరత్.

'వాడిలా, ఇదిలా మన పెంపకంలో ఏం లోపం ఉంది?' సూటిగా అడిగింది శరత్ మాట్లాడలేదు. అతడిని కూడా ఇదే ప్రశ్న వేధిస్తోంది. లోపం పెంపకంలో ఉందా? తమ చుట్టూ ఉన్న సమాజంలో ఉందా? ప్రేమ పవిత్రమయినదని ప్రొద్దుటి నుంచి పడుకునే

వరకూ ప్రచారం చేస్తూ, కాలేజీ ప్రేమలు, స్కూలు ప్రేమలో పవిత్రమైనవని చూపిస్తూ, కాదన్న తల్లిదండ్రులు శత్రువులని ప్రచారం చేస్తూ, వారిపై తిరుగుబాటు చేయటమే ప్రేమ గొప్పతనమని 'బ్రెయిన్‌వాష్' చేస్తున్న సమాజం ప్రభావం నుంచి పసిమనసులు తప్పించుకోవటం కష్టం.

తామెంత సంస్కారాన్ని ఇచ్చినా, ఆలోచనలను ఇచ్చినా, తమకేది మంచో, ఏది చెడో నిర్ణయించుకునే స్వేచ్ఛ పిల్లలదే

'ఇంతకీ వాడెవడో?' అడిగాడు శరత్.

అతని కళ్ళముందు ఇంటికి దూరంగా రాత్రిపూట రోడ్డుమీద తన కూతురు మాట్లాడుతున్న యువకుడు మెదిలాడు. ఇంటి గేటువరకూ వచ్చి ఆశగా ఎదురు చూసిన అస్పష్టమైన ఆకారం కదిలింది.

సినిమా టిక్కెట్లు కొంటున్న యువకుడి అస్పష్టమైన ఆకారం గుర్తుకు వచ్చింది. వాడి రూపం గుర్తులేదు. ఆకారం సరిగ్గా జ్ఞప్తికి లేదు.

యువకుడు. తాను రోజూ చూసే వందలాది యువకులలో ఒకడు. కానీ ఇప్పుడు వాడు తన కూతురు జీవితంలో అత్యంత ప్రముఖమైన వ్యక్తి.

'నాకు ఇక్కడ ఉండాలని లేదు' అంది ప్రశాంతి.

తల ఊపాడు శరత్.

'వాడు కూడా రానంటున్నాడు. ఇక్కడే ఉంటాడట.'

'నాకు ఇంటికి తిరిగి వెళ్ళాలని లేదు ఇప్పుడే ' అంది ప్రశాంతి.

తల ఊపాడు శరత్. నాకు కూడా. ఓసారి వాడిని కలుద్దాం. వెళ్తున్నామని చెప్దాం.'

'ఎటు వెళ్దాం?' అడిగింది ప్రశాంతి.

'ఏమో! ఎటు వెళ్ళాలనిపిస్తే అటు వెళ్దాం. కాశీ, కేదారనాథ్, బద్రీనాథ్ ఎటో అటు వెళ్దాం' అన్నాడు శరత్.

అతనికి ఒంటరిగా ఉండాలని ఉంది.

తనలో జరుగుతున్న సంచలన స్వరూపాన్ని అర్థం చేసుకోవాలని ఉంది.

'మీరు వాడిని కలసి రండి. నాకు వాడి ముఖం చూడాలని లేదు' అంది ప్రశాంతి.

'ఏం?'

'మన ఇద్దరు పిల్లల్లో మగపిల్లవాడు పిరికివాడు. ఆడపిల్ల సాహసవంతురాలు. అమ్మాయి వేరే ఎవడితోనో సన్నిహితంగా ఉందని ఆత్మహత్య ప్రయత్నించాడు వాడు. తాను కోరుకున్న వాడితో చెప్పపెట్టకుండా పారిపోయింది అది. నాకు ఇద్దరి గురించి తెలుసుకోవాలని లేదు. వీళ్ళకోసం ఎన్ని రోజులు 'నా' అన్నది లేకుండా గడిపాను. ఎందుకని? మన జీవితంలో మనకోసం అన్నది లేకుండా అంతా పిల్లల కోసం అంటూ గడిపేసాం. మనకోసం ఒక్క పైసా ఖర్చుపెట్టుకోలేదు. ప్రతీదీ వాళ్ళ భవిష్యత్తు అంటూ దాచాం. ఎందుకోసం? ఈరోజు కోసమా? వాడికి వాడి జీవితం అంటే విలువలేదు. మన గురించిన ఆలోచనలేదు. దానికి మనమేమౌతాం అన్న ధ్యాసలేదు. వాడెవడో లోకం. వాడికోసం మనల్ని వదిలేసింది చెప్పాపెట్టకుండా. నాకు నాకోసం బ్రతకాలని ఉంది. కనీసం ఇక మిగిలిన జీవితమైనా పిల్లల గురించి ఆలోచించకుండా ఉండాలని ఉంది. పిల్లల ప్రసక్తి నా దగ్గర తేకండి.' చినుకులా ఆరంభమై వడగళ్ళ వానయి తుఫానులా మారినట్టు మాట్లాడుతోంది ప్రశాంతి.

అరుస్తోంది. ఏడుస్తోంది. నవ్వుతోంది.

ఆమెని చూస్తూంటే శరత్ మది చిత్రంగా స్పందించింది.

ప్రశాంతి ప్రతిమాట సత్యం. కనీసం తాను తనదంటూ ఓ ప్రత్యేకలోకాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. పాటలు వింటాడు. పుస్తకాలు చదువుతాడు. ఆలోచిస్తాడు. కానీ ప్రశాంతికి మరో లోకం లేదు. పిల్లలే ఆమె ప్రపంచం.

ఆమె ప్రతిక్షణం వాళ్ళ గురించే ఆలోచిస్తూ గడిపింది. ఆమె కంటూ ప్రత్యేకజీవితం లేకుండా వాళ్ళే లోకంగా గడిపింది.

ఆమెను దగ్గర తీసుకున్నాడు శరత్.

శరత్‌ని దూరం తోసేసింది.

'నేను మొదటి నుంచీ చెప్తున్నాను. పిల్లలకు తండ్రి భయం ఉండాలని. మీరు సైకాలజీ అనీ, పిల్లల పసిమనసులు అంటూ సిద్ధాంతాలు చెప్పారు. వాళ్ళని ఒక్కమాట అనలేదు. చూడండి. మీ వల్లనే వాళ్ళకి ధైర్యం వచ్చింది. లేకపోతే, నాన్న అంటే భయం ఉండి ఉంటే ఇలా చేసేవారు? భయపడుతూ వొదిగి ఉండేవారు. స్వేచ్ఛనిచ్చారు. వ్యక్తిత్వం అన్నారు. చూడండి వాళ్ళకి మీరిచ్చిన స్వేచ్ఛ ఫలితం' గట్టిగా అరిచింది.

శరత్ మాట్లాడలేదు. ప్రశాంతిని చూస్తూ మౌనంగా ఉన్నాడు. మనిషి తన ఓటమిని ఒప్పుకోవటానికి ఇష్టపడడు. తన పరాజయానికి కారణం వేరేవారిపై నెట్టేస్తే కానీ మనిషి నిలవలేడు.

అయినా ఇది తమ పరాజయం ఎలా అవుతుంది?

తమకు తోచిన రీతిలో, చేతనైన విధంగా పిల్లలను పెంచారు. విద్యాబుద్ధులు చెప్పారు. అంతే.. పిల్లలు తమ నిర్ణయాలు తామే తీసుకున్నారు. విత్తనం భూమిలో నాటుతాం. నీరు పోస్తాం. మొక్క భూమిని చీల్చుకుని వస్తుంది. మేకలు తినకుండా కంచెకడతాం. ఎదుగుతుంది. ఒక స్థాయివరకూ కాపాడతాం. ఆ తరువాత దాని ఎదుగుదల దానిదే అది ఎంత ఎత్తు ఎదుగుతుంది, ఎలాంటి సవాలనిస్తుంది, అని ఎంత రుచికరంగా ఉంటాయి వాటిపై తమకు ఎలాంటి నియంత్రణ ఉండదు.

ఇదీ అంతే.

'నేను వాడిని కలిసివస్తాను' అన్నాడు శరత్ బయటకు వెళ్తూ.

'కాస్సేపు రాకండి. నాకు మీతో కూడా మాట్లాడాలని లేదు' శరత్ బయట అడుగుపెట్టగానే ధడేల్న హోటల్ గది తలుపు వేసింది ప్రశాంతి.

కాస్సేపు వేసిన గది తలుపువైపు చూస్తూ నిలబడ్డాడు శరత్. అతడి మనసులో సన్నగా భయం ప్రారంభమయింది.

'ప్రశాంతి ఏమైనా పిచ్చిపని చేయదుకదా?'

భళ్ళుమని తలుపు తెరచి 'నేనేమీ పిచ్చి పనులు చేయను పనికిరానివాళ్ళ కోసం నా జీవితాన్ని వ్యర్థం చేసుకోను' అరిచి తలుపు వేసింది.

ముందుకు కదిలాడు శరత్. రోడ్డు దాటుతూంటే మ్రోగింది ఫోను.

ఫోను చేస్తున్నది శిల్ప.

**ఫోనులో శిల్ప పేరు** కనబడగానే శరత్ హృదయం స్పందించింది. కానీ అతడికి ఫోను తీయాలనిపించటంలేదు.

'శిల్ప'తో మాట్లాడాలని ఉంది. మాట్లాడాలని లేదు.

శిల్ప ఎవరు తన జీవితంలో?

ఆమె పేరు వినగానే తన మది ఎందుకని స్పందించాలి?

అతడికి ప్రశాంతి గుర్తుకు వచ్చింది.

ప్రశాంతి తన భార్య. తనతో జీవితం పంచుకుంటోంది. సౌఖ్యాలు, ఆనందాలు, కష్టాలు, విషాదాలు అన్నీ తామిద్దరివి. తమ - భావనలు, బాధ్యతలు, సుఖదుఃఖం అన్నీ ఇద్దరివి. అక్కడ తమ నడుమ ఎలాంటి తేడాలేదు. ప్రత్యేకత లేదు. తమ సంతానానికి మంచి జరిగితే ఇద్దరూ సంతోషిస్తారు. వారికి చెడు జరిగితే ఇద్దరూ బాధపడతారు.

తమ భావనలతో, తీవ్రతలలో తేడాలుండవచ్చు. కానీ భావనలు ఒకటే. కానీ శిల్ప విషయం తనకే ప్రత్యేకం.

శిల్ప పేరు చెబితేనే తన హృదయం అందంగా స్పందిస్తుంది. ఏదో తీయని భావన నరనరాన నిండుతుంది.

ఎందుకని?

శిల్ప తనకేమీకాదు. తమ నడుమ ఎలాంటి బంధం, అనుబంధం ఉండే వీలులేదు.

మరి ఈ భావన ఏమిటి?

ఆమెతో మాట్లాడాలని ఉంది - ఆమెకు తన బాధలన్నీ చెప్పుకోవాలని ఉంది. ఆమెతో తన ఆవేదనలు, ఆవేశాలు అన్నీ చెప్పి మనసులో ఉన్న బరువును దించుకోవాలని ఉంది. కానీ ఆమె తనకేమవుతుంది?

ఏమీకాదు.

తన బాధలు, సుఖాలు పంచుకునేది ప్రశాంతి. శిల్పకాదు.

కానీ శిల్ప తనను అర్థం చేసుకున్నంత ప్రశాంతి అర్థం చేసుకోలేదు. కానీ ఆ ఆలోచన శరత్‌కి రుచించలేదు.

ఫోను మ్రోగటం ఆగిపోయింది.

బ్లాంక్ అయి, మిస్డ్ కాల్ సమాచారం ఇస్తున్న తెరపై చూస్తూ కూచున్నాడు శరత్.

ఒక్కసారిగా జీవితానికి దిశ, గమ్యం లేకుండా అయిపోయింది.

సుమంత్ గురించి ఆలోచించాల్సిన అవసరం తీరింది.

స్రవంతి చదువు, వివాహం గురించి ఆలోచించాల్సిన అవసరం తీరింది.

ఇక జీవితంలో ఏముంది?

ఒక్కసారిగా భవిష్యత్తు శూన్యంగా అనిపించింది. జీవితం నిస్సారంగా, లక్ష్యరహితంగా తోచింది.

ఒక్కసారిగా తన జీవితం మొత్తం అతని కళ్ళు ముందు కదలాడింది.

నిజానికి మనిషి తాను అది చేశాడు. ఇది చేశాడు అని చెప్పుకుంటాడు. ఇతరులకు తాను అధికుడిని అనుకుంటాడు.

కానీ ఎక్కడా ఏ విషయంలో ఏదో మనిషి నియంత్రణలో ఉండదు. మనిషి ప్రవాహం ఎటు తీసుకు వెళితే అటు వెళ్ళేవాడే తప్ప ప్రవాహాన్ని తన ఇష్టం వచ్చి దిశలో ప్రవహింప చేసేవాడు కాదు.

చదువుకున్నంతకాలం ఏవో ఆశలు, కలలు. చదువు పూర్తయ్యేసరికి ఏ ఉద్యోగం దొరికితే దాన్లో చేరిపోవటం. ఏది దొరుకుతుందన్నది దైవ నిర్ణయం. ఆపై పెళ్ళికూడా దైవ నిర్ణయం. పిల్లలు పుట్టటం తన చేతుల్లో లేదు. వాళ్ళు చదవటం తమ తమ బ్రతుకులు నిర్ణయించుకోవటంలో తన ప్రమేయం లేదు.

ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే తన జీవితం తాను నడిపినట్టుకాక ఎవరో నడిపిస్తుంటే గుడ్డివాడు నడిచినట్టు తాను నడిచినట్టు అనిపిస్తోంది.

**యె జీవన్ సఫర్ ఏక్ అంధా సఫర్ హై**

**బహెక్ నాహై మమ్‌కిన్, భటర్ నేక డర్ హై.**

ఈ జీవిత ప్రయాణం ఒక గుడ్డివాడి ప్రయాణం లాంటిది. దీన్లో దారి తప్పటం తప్పని సరి.

ఎందుకంటే ఏ దారిలో వెళ్ళాలో తెలియదు. ఏదారి ఎటు తీసుకువెళ్తుందో తెలియదు.. ఏ దారెటు పోతుందో... ఎవరినీ అడగక....

అలా రోడ్డు పక్కన కూర్చుండిపోయాడు శరత్.

అతడికి కొడుకుని కలవాలనిపించటం లేదు. ప్రశాంతి దగ్గరకు వెళ్ళాలనిపించటం లేదు. ఎవరితో మాట్లాడాలనిపించటం లేదు. ఎటూ వెళ్ళాలనిపించటంలేదు. అలా, అక్కడే కూర్చుని నిద్రపోవాలనిపిస్తోంది.

**జాకర్ కహీ భోజావుమై, నీందాయె ఔర్**

**దునియా ముఝే ఢూండీ, మగర్ మేరా నిషాన్ కోయినహో**

**ఏయ్ దిల్ ముఝే ఇసీ ఓగాహ లే చల్ జహా కోయీ నహో**

ఎటో వెళ్ళి అదృశ్యమైపోతాడు. నిద్రవస్తుంది. నిద్రపోతాను. ప్రపంచం నన్ను వెతికినా నన్ను వెతికేందుకు గుర్తులేవు మిగలకూడదు. ఓ నా హృదయా నన్ను అలాంటి, ఎవ్వరూ లేని, ప్రాంతానికి తీసుకువెళ్ళు.

అతనికి తనను ప్రశాంతి వెళ్ళిపొమ్మనటం అర్థమయింది.

మొత్తం జీవితం అర్థవిహీనంగా అనిపిస్తున్న తరుణం ఇది.

బాధలు బాంధవ్యాలు, స్నేహాలు, ప్రేమలు అన్నీ బూటకం అన్న నిజం గ్రహింపుకు వచ్చి కళ్ళముందున్న మాయపొరలు తొలిగిపోయిన తరుణం అది.

వ్యక్తి తన జీవితం అర్థవిహీనం, వ్యర్థం అన్న గ్రహింపుకు వచ్చి వెనుతిరిగి చూసుకుని తనలోకి తాను చూసుకునే క్షణమది.

తానేంటి? తనకేం కావాలి? తానేం కోరాడు? ఏది లభించింది? ఏమవాలనుకున్నాడు? ఏమయ్యాడు? లాంటి ప్రశ్నలకు చేదు సమాధానాలు అన్వేషించే సమయం అది.

ఫోను మ్రోగుతోంది. తీయాలనిపించటంలేదు. కనీసం ఎవరు చేస్తున్నారో కూడా చూడాలనిపించటం లేదు.

ఫోను విసిరేయాలనిపిస్తోంది. అన్నీ విసిరేసి ఎటో వెళ్ళిపోవాలనిపిస్తోంది. మనిషన్నవాడు లేని స్థలానికి వెళ్ళిపోవాలనుంది శరత్‌కు.

**చలనా హై సచ్చే దూర్ దూర్ మగర్ కార్వాన్ కోయీనహో..**

అన్నిటికీ, అందరికీ దూరంగా వెళ్ళిపోవాలి. వెంట ఎవరూ ఉండవద్దు.

విడవకుండా ఫోను మోగుతూంటే ఫోను తీసుకున్నాడు విసుగ్గా.

తెలియని నెంబరు నుంచి ఫోను. తీసి 'హలో' అన్నాడు.

'నాన్నా.. ఫోను తియ్యవేం?' కోపంగా ధ్వనించింది సుమంత్ గొంతు.

'చెప్పు.. ఏంకావాలి?' నిరాసక్తంగా, చచ్చిపోయిన వాడి పెదవులు కదలినట్టు కదిలాయి శరత్ పెదవులు.

'నాన్నా. నేను డిశ్చార్జ్ అయిపోయాను. షూటింగ్ స్పాట్‌కి వెళ్తున్నాను మీరు వెళ్ళిపోండి. నాన్నా త్వరలో నేను గుడ్‌న్యూస్ చెప్తాను.'

'ఏమిటా గుడ్ న్యూస్?' నిరాసక్తంగా అడిగాడు శరత్.

'నాన్నా... మేము ఆడిన నాటకానికి బెన్నీ పడిపోయింది. నేనంటే లవ్ ఉందని చెప్పింది.'

'నాటకమా? బెన్నీ ఎవరు?' అయోమయంతో అడిగాడు శరత్.

'అదే నాన్నా. నా సూసైడ్ అంతా నాటకం. సినిమా వాళ్ళం కదా, బాగా రక్తి కట్టించాం. అది నిజమేనని బెన్నీ నమ్మేసింది. అంతవరకూ ఓపెన్ కానిది ఓపెన్ అప్ అయింది. నన్ను లవ్ చేస్తున్నానని చెప్పింది.' ఉత్సాహంగా చెప్తున్నాడు సుమంత్.

'బెన్నీనా?' నోరు చేదవుతుండగా అడిగాడు శరత్.

'అదే నాన్నా.. అమ్మ ఉన్నప్పుడు వచ్చింది చూడూ. ఆ అమ్మాయి పేరు బేనజీర్. మేము బెన్నీ అని పిలుస్తాం. మీకు పరిచయం చేద్దాం అనుకున్నాను. కానీ కుదరలేదు. షూటింగ్ లేటవుతోంది. అందుకని వెళ్ళిపోవాలి. బై నాన్నా. నేను హైదరాబాదు వచ్చేటప్పుడు బెన్నీని తీసుకువస్తాను.' ఫోను పెట్టేశాడు సుమంత్.

ఎందుకో శరత్‌కి నవ్వు వచ్చింది. పెద్దగా నవ్వాలనిపించింది.

ఇంతలో మళ్ళీ ఫోను మోగింది.

ప్రశాంతి ఫోను చేస్తోంది.

ఎత్తి 'హలో' అన్నాడు.

'రండి. నేను వెళ్ళమంటే వెళ్ళిపోవటమేనా? ఎక్కడెక్కడ తిరుగుతున్నారు? మన స్రవంతి అరగంటలో ఫోను చేస్తుందట. రండి త్వరగా!

'ఇంతే మనిషి జీవితం' అనుకున్నాడు శరత్ హోటల్‌వైపు నడుస్తూ.

ఒక్క నిమిషం క్రితం అన్నీ వదిలి ఎటో వెళ్ళిపోవాలనుకున్నాడు. ఇపుడు మళ్ళీ అన్నిటివైపు వెళ్తున్నాడు.

కాలుగాలిన పిల్లిలా గదిలో అటూ ఇటూ తిరుగుతోంది ప్రశాంతి. ఆమెనే చూస్తూ కూర్చున్నాడు శరత్

ఆమెకి సుమంత్ చెప్పిన విషయం చెప్పాలా? వద్దా? అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో అటూ ఇటూ తిరుగుతున్న ప్రశాంతి హఠాత్తుగా ఆగి శరత్‌వైపు చూసింది.

'సుమంత్ ఫోను చేశాడా?'

'చేశాడు'

'ఏమన్నాడు? ఎవరో అమ్మాయిని ప్రేమించాను, ఇంటికి తెస్తానని చెప్పాడా?'

'చెప్పాడు. నువ్వు చూశావట. బేనజీర్‌ట పేరు.'

'బేనజీరా?'

'అవును'

'అంటే.. ముస్లిం అమ్మాయా?'

ఆమె అడిగేవరకూ శరత్‌కు కూడా ఆలోచన రాలేదు.

'అవును. ముస్లిం అయి ఉంటుంది' అన్నాడు.

'మన వాళ్ళకి మనుషులే దొరకలేదా? దానికి క్రిష్టియన్ తప్ప వేరే ఎవరూ దొరకలేదు. వీడికిముస్లిం అమ్మాయి తప్ప, మరెవరూ నచ్చలేదు' అంది.

'ఏం? క్రిష్టియన్లు, ముస్లింలు మనుషులు కారా?' అడిగాడు శరత్.

శరత్ వైపు కోపంగా చూసిందామె.

'మన ఇల్లు మన దేశానికి ప్రతీక. భిన్నత్వంలో ఏకత్వం. ఏకత్వంలో భిన్నత్వం. నేషనల్ ఇంటిగ్రేషన్. కులమత భేద భావాలు లేని లౌకిక రాజ్యం. మన విశాల భావాలకి ప్రతిబింబం' అన్నాడు నవ్వుతూ.

'మీకిది హాస్యంగా ఉందా?'

'అబ్బాయికి నచ్చింది. అమ్మాయికి నచ్చాడు. ఇందులో మన ఇష్టాయిష్టాల ప్రసక్తి ఏముంది? ఇంకా నయం.. మా ఆఫీసులో ఓ కొలీగు కొడుకుకి ఓ నీగ్రో అమ్మాయి నచ్చింది. నల్లగా, వంకులు తిరిగి తీగలా సాగిన రాయిలాంటి జుట్టు.. లావు పెదిమలు... మా కొలీగు బాధలు చెప్తూంటే విని నవ్వలేక చచ్చేవాళ్ళం. దానితో పోలిస్తే మన పని నయం. అమ్మాయి ఎలా ఉంది? నువ్వు చూశావటగా?'

'వాడు బిచ్ అన్నది ఆ అమ్మాయినే'

'ఇంకేం..... పెళ్ళికి ముందే ముద్దు పేర్లతో సరసాలు ఆడుకుంటున్నారు'

కోపంగా ఏదో అనబోయింది ప్రశాంతి. ఇంతలో ఆమె ఎదురుచూస్తున్న ఫోను మోగింది. ఒక్క గెంతులో ఫోను తీసింది.

ఆ వైపు ప్రశాంతి మాట్లాడగానే అడిగింది ప్రశాంతి. 'ఏమే నీకు క్రిష్టియన్ తప్పించి ఎవరూ దొరకలేదా? ఇంతకీ అబ్బాయి ఏం చేస్తున్నాడు? నీలా చదువుతున్నాడా? ఉద్యోగం చేస్తున్నాడా?'

అవతలివైపు ఆమె ఏం చెప్పిందో తెలియదు. ప్రశాంతి ముఖం మాడిపోయింది. ఆమె కళ్ళల్లో వెర్రి చూపు వచ్చింది. శరత్ వైపు పిచ్చిదానిలా చూసింది. ఫోను కట్ అయినట్టుంది. పక్కన పెట్టేసింది.

'ఏమంది?' అడిగాడు శరత్, సామాన్లు సర్దుతూ.

'మాట్లాడింది మన ప్రశాంతేనా అని అనుమానం వస్తోంది'

'ఏం?'

'అది పెళ్ళిచేసుకుందట. కానీ మన ఇంటికి రావాలంటే ఒక నియమం విధించింది.'

'ఏమిటి?'

'మనమంతా మతమైనా మారాలట, లేదా, అది వచ్చినప్పుడు ఇంట్లో దేవుడి పటాలేవీ కనబడకూడదట.'

'అదేమిటి?'

'ఆ.. ఇప్పుడు అది క్రిష్టియన్ మతం పుచ్చుకున్నదట. మన ఇంట్లో సైతాను ఉన్నాడట. అందుకని మన ఇంటికి రాదట.'

'అదేమిటి? ఆ మాట్లాడింది మన స్రవంతేనా?'

'కాదు. సారా' చెప్పి, శరత్ దగ్గరగా వచ్చి అతడి రెండు చెంపలూ వాయగొట్టి, కూలబడి భోరున ఏడవటం ప్రారంభించింది ప్రశాంతి.

ఆమె వైపు నిస్సహాయంగా చూస్తూ నిలబడ్డాడు శరత్.

అతని చెవుల్లో ప్రశాంతి కొట్టిన దెబ్బలవల్ల కలిగిన హోరును మించి వినిపిస్తోంది. 'స్రవంతి కాదు.. సారా' అన్నమాట.

**చాలాసేపు** ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

'ఇక ఇక్కడ ఉండి ఏం చేస్తాం? వెళ్ళిపోదాం' ఇంటికి అన్నాడు శరత్ లేస్తూ.

మౌనంగా అతడివైపు చూసింది ప్రశాంతి. నిట్టూర్చి అంది 'ఇంటికి వెళ్ళి ఏం చేస్తాం? ఎక్కడికయినా వెళ్ళి ఏం చేస్తాం? అసలు ఇంతకాలం బ్రతికి ఏం సాధించాం? అసలు ఏం సాధించాలి?' అంది నిస్పృహగా.

ఆమె దగ్గరగా వెళ్ళి ఆమెని పొదివి పట్టుకున్నాడు శరత్.

ఇద్దరూ ఒకరి స్పర్శలోని ఆత్మీయతానురాగాలను మరొకరు అనుభవిస్తూ మౌనంగా ఉన్నారు.

'ఇది మన ఇంట్లోనే జరగాలా? ఇద్దరూ ఇలా మతాలు మారిపోవాలా?'

హఠాత్తుగా అడిగింది ప్రశాంతి.

'ఒక్క స్రవంతి మతం మారింది. సుమంత్ మారలేదు కదా?' అన్నాడు శరత్.

నీళ్ళు నిండిన కళ్ళతో అతడివైపు చూసింది ప్రశాంతి.

'సుమంత్ కూడా మారతాడు. మన ఆడపిల్లలు వేరే మతం వారిని చేసుకుంటే వాళ్ళు భర్త మతంలోకి మారతారు. మన మగపిల్లలు వేరేవారిని చేసుకుంటే, వాళ్ళు భార్య మతం స్వీకరిస్తారు. లేకపోతే ఆడపిల్లలు వీళ్ళతో పెళ్ళికి ఇష్టపడరు.' అంది ప్రశాంతి నిర్లిప్తంగా.

'అలా ఏం లేదు.. నాకో ఫ్రెండున్నాడు. వాడు మతం మారలేదు. అమ్మాయి మతం మారితే ఎవరి మతం వాళ్ళు అవలంభిస్తున్నారు. కలసి ఉంటున్నారు. అయినా మనసులు కలసిన తరువాత మతం ప్రసక్తి ఏముంది? ఏ మతమైనా ప్రార్థించేది దైవాన్నే కదా! కృష్ణ అనే బదులు క్రీస్తు అంటారు. రామ్ అనే బదులు రహీమ్ అంటారు. అంతే కదా' తేలికగా అన్నాడు శరత్.

పైకి ప్రశాంతి బాధను తగ్గించటం కోసం తేలికగా మాట్లాడుతున్నాడు కానీ అతని మనస్సులో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయి.

తాను బాధపడుతున్నట్టు కనిపిస్తే ప్రశాంతి మరింత బాధ పడుతుందని అతడికి తెలుసు.

'మీకు అర్థం కాదులెండి. ఆడపిల్లలకు సులభంగా ఈ బాధ తెలుస్తుంది. పెళ్ళికి ముందరి జీవితాన్ని సర్వం వదిలి పెళ్ళయిన తరువాత భర్త దగ్గర పూర్తిగా నూతన జన్మ ఎత్తినట్టు కొత్త జీవితం ఆరంభించాల్సి వస్తుంది. ఆ బాధ మీ మగవాళ్ళకు అర్థంకాదు. మీ ఊహకు కూడా అందదు' నిష్కర్షగా అంది ప్రశాంతి.

శరత్ మాట్లాడలేదు. పెళ్ళయినప్పటి నుంచి అతడు ఈ విషయమే ఆలోచిస్తున్నాడు. ఒక రకంగా ఈ ఆలోచననే అతడికి ప్రశాంతి పట్ల ప్రేమను మరింతగా పెంచింది.

'ఎంత నమ్మకంతో ఓ యువతి తనవారందరినీ వదులుకుని అత్తగారింటికి వస్తుందో!' తలచుకుంటే అతడి ఒళ్ళు జలదరిస్తుంది తనని ఆమె పరిస్థితిలో ఊహించుకుంటే భయం వేస్తుంది. తాను తనకు అలవాటయిన పరిస్థితులు, పద్ధతులు తప్ప మరో స్థలంలో ఉండలేడు. అందుకే ఎవ్వరి ఇంటికీ వెళ్ళడు. వెళ్ళినా ఎక్కువసేపు ఉండడు. రాత్రిళ్ళు అసలు ఉండడు. వేరే ఊరు వెళ్తే బంధువులు ఉన్నా హోటల్‌లో గది తీసుకుని ఉంటాడు. అలాంటిది, అన్నీ వదులుకుని పరిచయం లేని ఇంట్లో, పరిచయం లేని మనుషుల నడుమ, పరిచయం లేని పద్ధతులలో ఒక యువతి ఇమిడిపోవటం ఎంత అద్భుతం! ఎంత బాధాకరం! ఎంత ఓపిక, సమన్వయం, అవగాహనలు కావాలి.

'రిటర్న్ జర్నీ గురించి ఆలోచించండి' అంది ప్రశాంతి.

'వాడి ఆత్మహత్య నాటకం అట. అమ్మాయిని గెలుచుకోవటం కోసం ఆడిన సినిమాటిక్ నాటకం' చెప్తాడు శరత్.

'మన పిల్లలు ఇలా ఎందుకు తయారయ్యారు? మనం వాళ్ళకి ప్రేమను ఇచ్చాం. అనురాగాన్ని అందించాం. మంచి బుద్ధులు నేర్పించాం. ఇలా ఎలా అయ్యారు? కనీసం వేరే వాడిని పెళ్ళి చేసుకునే ముందు అమ్మాయికి మన గురించిన ఆలోచన రాలేదు. ఆత్మహత్య నాటకం ఆడే ముందు వాడికి ఆ వార్త మనమీద ఎలాంటి ప్రభావం చూపిస్తుంది, ఎంత బాధ కలిగిస్తున్నాం అన్న ఆలోచన రాలేదు' అంది ప్రశాంతి బాధగా.

'అది మన పెంపకంలో లోపం కాదనిపిస్తుంది నాకు. అది మన సమాజంలోనే నెలకొని ఉన్న పరిస్థితి.'

'అయితే అందరు పిల్లలు ఇలా ఎందుకు కావటంలేదు? మన పిల్లలే ఇలా ఎందుకవుతున్నారు?' కోపంగా అడిగింది ప్రశాంతి.

'ఎవరికి వాళ్ళకి అలా అనిపిస్తుంది. కానీ గమనించి చూస్తే అధికశాతం ఏదో ఓ సమస్యకు గురికావటం కనిపిస్తుంది. దీనికి లోపం మనలో కూడా ఉంది. మన చుట్టూ ఉన్న సమాజంలో కూడా ఉంది. తన చుట్టూ ఉన్న పరిస్థితులలో స్పందించే వ్యక్తి వ్యక్తిత్వంలో ఉంది. ఒకే పరిస్థితికి వేర్వేరు వ్యక్తులు వేర్వేరుగా స్పందిస్తారు. దానికి మనం చూపిన ప్రేమ, నేర్పిన సంస్కారం మాత్రమేకాదు, వారి వారి వ్యక్తిత్వం కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. కాబట్టి మనం సరిగ్గా పెంచలేదనో, సరిగ్గా దిశానిర్దేశనం చేయలేదనో బాధపడి లాభంలేదు. '

'కర్మ సిద్ధాంతం చెప్తున్నారు. ఇంతేగా?'

'అంతే.. లేకపోతే, ఒకే ఇంట్లో ఒకే వాతావరణంలో పెరిగిన వారు వేర్వేరు అదృష్టాలతో ఎలా ఎదుగుతున్నారు? కాబట్టి మంచిగా పెంచటం, చెడుగా పెంచటం అంటూ ఏమీ ఉండదు. ఎవరి అదృష్టం వారిది.'

'మన అదృష్టం ఇంతే అంటారు' అంది నవ్వుతూ.

**'దర్ద్ భీ హమే కుబూల్, చైన్ భీ హమే కుబూమ్!**

**హమ్ నె హర్ తరహ్ కె ఫూల్ హార్ మే ఫిరోలియే!'**

సన్నగా పాడాడు శరత్.

'మాకు అర్థంకాని కొటేషన్లిచ్చి చంపుతారెందుకు? పండితులు సంస్కృతం శ్లోకాలు చదివితే మీరు హిందీ పాటలు పాడతారు. ఏదైనా మాకు అర్థంకాదు' అంది నవ్వుతూ.

'అంటే బాధనయినా స్వీకరిస్తాను. శాంతినయినా స్వీకరిస్తాను. నేను ఏ రకమయిన పుష్పాన్నయినా మాలగా కట్టుకుంటాను. ధరిస్తాను' అని అర్థం.

'బాగుంది. అందరూ మీలా ఏది దొరికితే అదే అదృష్టం అనుకుంటే. ఇక ఈ ప్రపంచం ఎందుకు ఈ ఆరాటాలు, పోరాటాలు ఎందుకు? ఈ ప్రగతి, సాంకేతికత, పరిజ్ఞానం ఎందుకు?'

'అందరూ అలా అనుకోలేదు కాబట్టే ప్రపంచం నడుస్తోంది, ఆరాటాలు, పోరాటాలు మధ్య. కానీ ప్రశాంతంగా ఉండాలంటే ఇదీ మార్గం. ఎవరి సంస్కారాన్ని బట్టి వాళ్ళు ప్రవర్తిస్తారు' అన్నాడు శరత్.

'బాగుంది. ఇంటికి వెళ్ళే తయారీలు చేయండి' ఆమె అంటూండగానే ఫోను మోగింది.

శరత్‌కి ఫోను దగ్గరగా ఉండటంతో ఫోను తీశాడు.

'హలో' అన్నాడు.

'నాన్నా' అవతల స్రవంతి గొంతు వినిపించింది.

స్రవంతి 'నాన్న' అనగానే 'ఏమ్మా' అనటం శరత్‌కి అలవాటు. అలవాటు ప్రకారం 'ఏమ్మా' అన్నాడు.

'నాన్నా, నేను ఎల్లుండి సాయంత్రం ఇంటికి వస్తాను.' చెప్పింది.

'సరే'.. అన్నాడు శరత్.

'నాన్నా.. అమ్మకి నేను చెప్పాను.. నీకు చెప్పిందా?' అడిగింది.

'ఏమిటి?'

'అదే...' నీళ్ళు నమిలింది స్రవంతి.

'ఏమిటి?' రెట్టించాడు శరత్.

'అదే.. దేవుళ్ళ పటాలు..' నసిగింది స్రవంతి.

'స్రవంతీ. అది మన ఇల్లు.. ఎలాంటి కండిషన్లు, షరతులు లేకుండా నువ్వు రావచ్చు. నీకు తెలుసు. నేను ఎవరి ఇష్టానికి అడ్డుపెట్టను. కానీ ఎవరి ఇష్టాన్నీ నాపై రుద్దటం సహించను' సౌమ్యంగా కఠినంగా ధ్వనించింది శరత్ స్వరం.

ఆవైపు కాస్సేపటి నిశ్శబ్ధం తరువాత ఫోను 'కట్' అయింది.

ప్రశాంతివైపు చూశాడు శరత్. ఆమె కళ్ళల్లో నీళ్ళున్నాయి.

'పోనీ, దానికి అంతకష్టమైతే దేవుళ్ళ పటాల మీద ఏదైనా బట్ట కప్పుతాను రమ్మనండి' అంది ప్రశాంతి.

ఆమెవైపు పరిశీలనగా చూశాడు శరత్.

'ఇది మన బలహీనత. మనం ఎదుటివాడు ఏమనుకుంటాడో అని మన ఇష్టాయిష్టాలను అణచి వాడి ఇష్టానికి తగ్గట్టు ప్రవర్తిస్తాం. కానీ వాళ్ళు తమ ఇష్టప్రకారం ప్రవర్తిస్తారు. ఎవరు ఏమనుకుంటారో అన్నది పట్టించుకోరు. వారు వారిలాగే ఉంటారు. మనం వారికి తగ్గట్టు మారతాం. తరవాత బాధ పడతాం' అన్నాడు.

'మీరు ఎవరిగురించో కాదు మన అమ్మాయి గురించి మాట్లాడుతున్నారు' అంది ప్రశాంతి.

'స్రవంతి మన అమ్మాయి. అందుకే అది తన పాట మరచిపోయి వేరే గూటి పాట పాడుతోంది.' అన్నాడు శరత్.

ప్రశ్నార్థకంగా చూసింది ప్రశాంతి.

'ఎదుటివారి మనోభావాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రవర్తించటం ప్రశంసనీయం. కానీ పూర్తిగా వారికి తగ్గట్టు ప్రవర్తించటం ఆత్మవిశ్వాస రాహిత్యం సూచిస్తుంది. మనం మన పిల్లలకు ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వటంలో విఫలమవుతున్నాం. ఆత్మవిశ్వాస రాహిత్యం వల్ల వారు వేరేవారి ప్రభావానికి గురవుతున్నారు. ఆత్మాభిమానం లేనట్టు ప్రవర్తిస్తున్నారు. ఒకవ్యక్తి మరొకరి ప్రభావానికి గురవుతున్నాడంటే, ఆ ఎదుటివ్యక్తి ఆత్మవిశ్వాసం ఈ వ్యక్తికన్నా అధికం అని అర్థం.'

'కానీ..' ఏదో అడగబోయింది ప్రశాంతి. ఆమెను మాట్లాడనీయలేదు శరత్.

'పిల్లవాడి ఆత్మవిశ్వాసానికి తల్లిదండ్రులు కుటుంబ వాతావరణ తరువాత ప్రభావం చూపించేది సమాజం. ఇక్కడ ఎక్కడ లోపం ఉన్నా అది వ్యక్తిత్వం పై ప్రభావం చూపిస్తుంది. దీన్లో దోషం నీదికాదు, నాది కాదు.' అన్నాడు శరత్.

మళ్ళీ ఫోను మ్రోగింది.

శరత్ ఫోనెత్తి 'హలో' అనగానే 'కట్' అయింది.

కాస్సేపటికి మళ్ళీ ఫోను మోగింది.

ఈసారి ప్రశాంతి ఫోను ఎత్తింది.

'అమ్మా' అంది స్రవంతి.

'ఏంటమ్మా? చెప్పు' అంది ప్రశాంతి కళ్ళల్లో ఉబికి వస్తున్న నీటిని అదుపులో పెట్టుకుంటూ.

'అమ్మా.. నేను ఇంటికి వస్తానమ్మా.. నాన్నకి చెప్పు కొంచెం సర్దుకోమని. నాకేం అభ్యంతరం లేదుకానీ ఆయనకి ఇబ్బంది అమ్మా. అందుకని గంటలకోసం సర్దుకోండమ్మా' అంటూనే స్రవంతి ఏడవటం మొదలు పెట్టింది.

ప్రశాంతి కంటినుండి కూడా నీళ్ళు కారటం ఆరంభమయింది. 'సరేనమ్మా.. నాన్నకు నేను చెప్తాను. మీరు రండి. ఎవరెవరు వస్తారు?' అడిగింది.

'వాళ్ళ అమ్మా, నాన్న, వాళ్ళ పాస్టర్ వస్తారమ్మా... మన ఇల్లు చూసి నీతో, నాన్నతో వాళ్ళు మాట్లాడాలట.'

'సరేనమ్మా..' అని ఫోను పెట్టేసింది ప్రశాంతి. శరత్ వైపు చూసింది.

నవ్వాడు శరత్.

'ఎందుకా నవ్వు?' కోపంగా అడిగింది ప్రశాంతి.

'నేను కొత్త హిందీ సినిమా పాటలల్లో అర్థం లేదని అంటుంటాను. కానీ, ఇప్పుడిప్పుడు అనిపిస్తోంది, కొత్త సినిమా పాటలలో మనకు కనబడని అర్థాలు కొత్త తరానికి కనిపిస్తాయని. వాళ్ళకి సరిపోతాయి.. వాళ్ళకి ఇవే గొప్ప కవితలు'

'ఏమిటా పాట?'

హఠాత్తుగా శరత్ డాన్స్ పోజ్ పెట్టి పాటపాడటం ఆరంభించాడు.

**యే దిల్ పిఘ్లా కె సాజ్ బనాలు, ధడ్కన్ కో ఆవాజ్ బనాయీ**

**స్మోకింగ్ స్మోకింగ్ నిక్‌లేరే ధువా, సీనేమే జల్తీ హై అర్మానోంకీ అర్థీ**

**అరే వాట్ యు టెల్ యూ డార్లింగ్ క్యాహువా**

**అరే సప్నే దేఖే జన్నత్ కా, పర్ మిట్టి మె మిల్ జాయే**

**ఫూలే కి ఘర్ బార్‌కీ దునియాకో బోలో గుడ్‌బై**

**ఛడ్ జాయే హాయ్ అల్లా డిస్కో భాయే బుఖార్**

**తౌబా తేరా జల్వా, తేరుప్యార్, తేరా ఎమోషనల్ అత్యాచార్'**

**'ఎమోషనల్ అత్యాచార్'ను సాగదీసి సాగదీసి పలికాడు.**

'ఇక్కడ ఎవరు ఎవరిపై ఎమోషనల్ అత్యాచారం చేస్తున్నారు?' అడిగింది ప్రశాంతి.

'అర్థమయ్యేవారికి అర్థమయింది. అర్థంకానివారు అమాయకులు. పద ఇంటికి వెళాం.. దేవుళ్ళపై దుప్పట్లు కప్పాలి. ఇంతకీ కొత్త దుప్పట్లు కొనాలా? పాత దుప్పట్లు సరిపోతాయా?' అడిగాడు శరత్.

**ఇంటి తలుపు** తెరచి సోఫాలో కూర్చుని కన్నీరు కార్చటం ఆరంభించింది ప్రశాంతి.

ఆమెవైపు చూస్తూ కాస్సేపు నిలబడ్డాడు శరత్. తరువాత మౌనంగా తన గదిలోకి వెళ్లిపోయాడు.

మనిషికి దుఃఖం ఎందుకు కలుగుతుంది? అన్న ఆలోచన కలిగింది అతనికి.

పిల్లలు పెద్దవాళ్ళయిపోయారు.

వాళ్లకేం కావాలో వాళ్లు నిర్ణయించుకున్నారు.

వాళ్ల నిర్ణయాన్ని అనుసరించి సుఖమో, దుఃఖమో వాళ్లే అనుభవిస్తారు. దాన్లో తమకు ఎందుకు దుఃఖం?

తమ మాట వినలేదనా?

తమ అభిప్రాయం అడగకుండా, సలహా తీసుకోకుండా స్వయంగా నిర్ణయం తీసుకున్నారనా?

ఎందుకు దుఃఖం?

వాళ్ల ఇష్టం వాళ్లది. ఎవరి ఇష్టం వాళ్లది. ప్రపంచంలో ఘర్షణలు, దుఃఖాలు సర్వం ఎదుటివాడు తన ఇష్టం ప్రకారం నడుచుకోవాలన్న పట్టుదలవల్ల వస్తాయి. దీనికి మూలం 'అహం'

అందుకే శాస్త్రాలు 'అహం'ను అదుపులో పెట్టుకోమన్నాయి. అహాన్ని జయించిన వాడికి దుఃఖం ఉండదని అన్నాయి.

ఆలోచిస్తున్న శరత్ అలికిడి అవటంతో తల ఎత్తి చూశాడు.

ప్రశాంతి వచ్చి అతడి పక్కన కూర్చుంది.

'జీవితానికి అర్థం ఏమిటి?' అడిగింది సూటిగా.

శరత్ మాట్లాడలేదు.

ఇంతలో ఇద్దరి దృష్టి నేలమీద జరజర పాకుతున్న చీమల గుంపుమీద పడింది.

ఒక వరుసలో గబగబా పోతున్నాయి చీమలు. అవన్నీ ఏదో తెల్లటి పదార్థాన్ని మోస్తున్నాయి.

ఇద్దరూ మౌనంగా, ఏకాగ్రతతో చీమలను గమనించసాగారు. అలా చూస్తూంటే వారిద్దరికీ వేదన తగ్గి ఏదో సాంత్వన కలుగుతున్నట్టుంది.

ఇంతలో వారి దృష్టి 'టపటప' శబ్దం చేస్తున్న బల్లివైపు మళ్ళింది.

అది గోడమీద పాకుతోంది పురుగులేవైనా ఉన్నాయేమో చూస్తోంది. ముందుకు సాగుతోంది.

మరోవైపు గోడ. అందులో సాలెపురుగు చకచకా గూడు అల్లుతోంది. ఎంతో అందంగా అల్లుతోంది.

ప్రశాంతికి సాలెగూడు నచ్చదు. 'ఇంట్లో బూజు దరిద్రం' అంటుంది. అందుకే ఆమె దృష్టి సాలెగూడుపై పడగానే వెంటనే లేచి మూలనున్న బూజు దులిపే కర్ర తీసుకుంది. బూజు దులపబోతూ శరత్ వైపు చూసింది.

ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి.

ఆమె చేతిలోని బూజు కర్ర గాలిలోనే ఆగిపోయింది.

మెల్లిగా పాడాడు శరత్.

తూనే తిన్‌న్ తిన్‌న్ చున్‌కర్ నగరీ ఏక్ బనాయీ
బారిష్ మే తెరి భీగీ ఫాంకే, ధూప్ మె గర్మీ భాయీ
గమ్ న కర్ జో తేరీ మెహనత్, తేరే కామ్ న ఆయా
తేరీ కిస్మత్ మే లిఖాహై జీత్ జీ మర్ జానా...

ఆమె చేతిలోంచి కర్ర జారిపోయింది.

ఎంతో కష్టపడి ఒక్కో చితుకూ ఏరి పిట్ట గూడు కడుతుంది. ఆ గూడు కట్టటంలో ఎండకు ఎండి, వానకు తడిసి కష్టపడుతుంది. పిట్ట గూడు తనకోసం కట్టదు. గుడ్లు పెట్టే సమయంలో కడుతుంది. పిల్లల కోసం కడుతుంది. అంత శ్రమపడి కష్టనష్టాలకోర్చి అది గూడు కట్టి గుడ్లు పెడుతుంది. అలా పెట్టిన గుడ్లలో ఎన్ని పిల్లలవుతాయో తెలియదు. అలా పిల్లలయినవి ఎన్ని బ్రతికి రెక్కలార్చి ఎగరగలుగుతాయో తెలియదు. అలా పిల్లలయినవి ఎన్ని బ్రతికి రెక్కలార్చి ఎగరగలుగుతాయో తెలియదు. అంతవరకూ అన్ని కష్టాలను అనుభవిస్తూ పిట్ట పిల్లల రక్షణకోసం తపిస్తుంది. వాటి ఆహారం కోసం శ్రమిస్తుంది. తీరా ఎదిగిన తరువాత పిల్లలు, రెక్కలు అల్లలార్చి ఎగిరిపోతాయి. వెనుతిరిగి చూడవు.

అందుకే కవి 'నీ కష్టం నీకు ఫలితాన్ని ఇవ్వమన్నా బాధపడను. నీ అదృష్టం ఇంతే' అంటున్నాడు.

'మనుషులకూ పిట్టలకూ, ఇతర జంతువులకూ తేడాలేదా?' అడిగింది కోపంగా.

అన్ని జీవులకూ ఆహార, భయ, మైథునాలు సమానమే. సంతానాన్ని కనటం, దాన్ని పెంచటం సమానమే. కానీ సంతానం మీద హక్కు ఉందనుకుని, తాను చెప్పినట్టు అది వినాలనుకుని, దాని భవిష్యత్తును నిర్దేశించాలనుకునేది మానవుడు ఒక్కడే' అన్నాడు శరత్.

'అంటే మనిషి జంతువులలాగా, ఎలాంటి అనుబంధాలు, భావనలు లేకుండా ఉండటమే ఉత్తమం అంటారా?'

'కావచ్చు. మెదడు వాటికీ ఉంది. మనకూ ఉంది. కానీ, మనం చేస్తున్న పని పట్ల భావన, మనిషికే ఉంది అందుకే మనం ఇది నాది. అది నీది. ఇదినేను అది నీవు అనుకుంటాం. ఈ చైతన్యం వల్లనే మనకు కాలం స్పృహ ఏర్పడింది. జీవులన్నిటికీ ఈ స్పృహ ఉంది.

అందుకే ఋతువులను బట్టి వాటి చర్యలుంటాయి. ఎండాకాలం వచ్చిందని, ఆహారం సంపాదించి దాచుకోవాలి. రాబోయే వర్షాకాలం కోసం అని చీమకూ తెలుసు. దాని స్పృహ అంతవరకే. కానీ ఇలాంటి కాలాలు వస్తూంటాయని, సంవత్సరాలు గడుస్తాయన్న స్పృహ మనిషిది. అదీ తేడా. అందుకే సృష్టిలక్షణాన్ని పరిశోధించి, పరిశీలించి, విశ్లేషించిన మన పూర్వీకులు సృష్టిలోని జంతులక్షణాలన్నీ మనిషిలో నివిడీకృతమై ఉన్నాయని గ్రహించారు. వాటికి తోడు, వాటిలో లేని ఈ 'అధిక చైతన్యం 'సృజన'గా వ్యక్తమౌతుంది. తను చైతన్యాన్ని గుర్తించలేని వారు జంతువులలాగే జీవితాన్ని వెళ్లదీస్తారు. పుడుతారు. పెరుగుతారు, కంటారు, పెంచుతారు, పోతారు.. అంతే.. ఇంత రొటీన్ జీవితాన్ని అర్ధవంతం చేసుకోవాలంటే, ఇదిగో ఈ చైతన్యంపై నియంత్రణ సాధించాలి. మన వ్రతాలు, యజ్ఞాలు, పూజలు, సాధనలు అన్నీ దీనికోసమే. మనిషి జంతువుకన్నా ఉత్తముడయినా, తనలోని జంతు ప్రవృత్తిని అదుపులో పెట్టుకుని, తనను ప్రత్యేకమైన చైతన్యాన్ని నియంత్రణలో ఉంచుకోవటం ఉత్తమం'

శరత్ వైపు విచిత్రంగా చూసింది ప్రశాంతి.

'ఇవన్నీ చెప్పటానికి బాగుంటాయి. కానీ ఆచరణలో సాధ్యంకాదు అందరికీ' అంది.

'అవును. కానీ ఎలాగయితే ఉలితో కొడుతూ ఉంటే, ఏదో ఓనాడు రాయి ముక్కలవక తప్పదు. అలాగే మనం ఆచరించలేకపోయినా, మంచిని తలుస్తూండటం, పదిమందికీ చెప్తూండటంవల్ల ఏదో ఒకనాడు ఆ మంచి కొంత మనకూ అంటకపోదు. ఆ ఆశతోనే మనం విఫలమయినా, మంచి చెప్తూ పోవాలి.'

నవ్వింది ప్రశాంతి 'పోనీండి. దొరికిందే ఛాన్సని లెక్చరిచ్చేశారు. చాలాకాలం తరవాత మీకు దొరికిపోయాను. అసలు ఈ మధ్య కాలంలో మనకు మనసు విప్పి మాట్లాడుకోవటానికి సమయమే చిక్కటంలేదు' అంది ప్రశాంతి అతడి భుజం మీద తలవాల్చి.

'మన జీవితంలో మలిదశ ఆరంభమవుతోంది ప్రశాంతి. బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఇక మనకోసం మనం బ్రతకటం ఆరంభమవుతుంది. ఇదీ మన జీవితంలోని అత్యద్భుతమైన దశ. మనకోసం మనం సమయం వెచ్చించటం. ఇప్పుడు ఏదో సాధించాలని లేదు. ఎవరికో ఇవ్వాలని లేదు. ఎవరికో ఏదో చేయాలనీ లేదు. మనం మనకోసం మనలాగే బ్రతకటం' అన్నాడు శరత్ ఆమెని దగ్గరకి తీసుకుంటూ.

'అమ్మాయి వస్తోంది' ఎక్సయిట్‌మెంట్‌తో చెప్పింది ప్రశాంతి.

నిర్లిప్తంగా చూశాడు శరత్ ఆమెవైపు.

స్రవంతి వస్తున్నట్టు చెప్పినప్పటి నుంచీ ప్రశాంతి మారిపోయింది. అంతవరకూ నిస్సత్తువుగా కూర్చున్నదల్లా క్షణంలో ఉత్సాహవంతం అయింది.

చకచకా ఇల్లంతా శుభ్రం చేసింది తినుబండారాలు తీసుకురమ్మని శరత్‌ని తరిమింది.

ఇల్లు శుభ్రం చేసి, సర్దిన తరువాత దేవుడి పటాలపై స్వచ్ఛమైన తెల్లటి దుప్పటి కప్పింది.

'అంతా బాగానే ఉందికదా. ఎక్కడా దేవుడి పటాలు లేవుకదా? ' అడిగింది ఇల్లంతా కలయచూస్తూ.

ఆమెను చూస్తూంటే, కొద్దిసేపటి క్రితం విషాద వదన అయి 'ఏదీ తనది కాదు' అన్నట్టు ఉన్న మనిషి ఈమెనే అనిపించటంలేదు.

'వస్తున్నది మన కూతురే. దానికి ఇల్లు కొత్తకాదు' అన్నాడు శరత్ ఆమె హడావిడి చూసి.

'అది కొత్తకాదు. దానితో వస్తున్నవాళ్లు కొత్త' అంది.

ఇంతలో బయట కార్లు ఆగిన శబ్దం వినిపించింది.

శరత్ తొంగి చూశాడు.

నాలుగయిదు కార్లు ఆగాయి. వాటిల్లోంచి మనుషులు దిగుతున్నారు. ఆ దిగుతున్న వాళ్ళలో స్రవంతిని పోల్చుకున్నాడు శరత్.

పూర్తిగా క్రిష్టియన్ అమ్మాయిలా ఉంది.

ముఖాన బొట్టులేదు. దుస్తులు మారిపోయాయి. పెదిమలకు లిప్‌స్టిక్‌తో స్రవంతి పునర్జన్మ ఎత్తినట్టుంది క్రిష్టియన్‌గా.

'ఈమెని చూస్తే ప్రశాంతి ఏమనుకుంటుందో?' అనుకున్నాడు శరత్.

ఆమె వైపు చూశాడు.

టేబుల్‌ని గది మధ్యలో ఉంచి, అన్నీ సక్రమంగా ఉన్నాయో, లేదో చూస్తోంది.

ఒకరొకరుగా రావటం ఆరంభమయింది.

ముందుగా స్రవంతి ఓ అబ్బాయిని పరిచయం చేసింది. 'నాన్నా, ఈయనే..' అని.

శరత్ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు.

ఏదో అనేలోపలే వారిని తోసుకుంటూ తెల్ల దుస్తులు వేసుకున్న వ్యక్తి వచ్చాడు.

'నాన్న.. ఫాదర్' అంది స్రవంతి.

శరత్‌కి నవ్వు వచ్చింది. తాను తండ్రి అంటే ఫాదర్. అతడు ఫాదర్. కొత్త ఫాదర్ అనుకున్నాడు. అతడు శరత్‌కి విష్ చేసి ఏదో తనలో తాను గొణుక్కుంటూ లోపలకు వెళ్ళాడు. తన చేతిలోని కలశంలాంటి దాంట్లోంచి నీటి చుక్కలు ఇంటి నాలుగువైపుల చల్లాడు.

'కం ఇన్ డియర్స్' అన్నాడు.

ఒకరొకరుగా లోపలకు వెళ్ళారు.

అంటే ఆయన ఇంటిని శుద్ధి చేశాడన్నమాట.

శరత్‌కి నవ్వు వచ్చింది.

అందరూ వచ్చి కూర్చున్నారు.. అందరికీ అమ్మ, నాన్నని పరిచయం చేసింది స్రవంతి.

'మీరు పెళ్ళికి రాలేదు. మీకు పెళ్లి ఇష్టంలేదా?' అడిగాడు ఫాదర్ సూటిగా.

'మాకు తెలియదు. పెళ్లి అయిన తరువాత చెప్పింది' చెప్పాడు శరత్. అతడికి ఎలాగో అనిపించింది. తన కూతురి మీద వేరే వారికి తాను ఫిర్యాదు చేస్తున్నట్టనిపించింది.

'దిసీజ్ వెరీ బ్యాడ్ తల్లిదండ్రుల అనుమతితో వివాహం కావాలి.' అన్నాడు ఫాదర్.

శరత్ వైపు తిరిగి 'మీకు క్రిష్టియన్ మతాన్ని స్వీకరించటంలో అభ్యంతరం లేదుకదా?'అడిగాడు.

అయోమయంగా కూతురివైపు చూశాడు శరత్. 'ఎవరు స్వీకరించటం?'

'తన కూతురా? తానా?'

**తండ్రి చూపు** తనపై పడగానే తల వంచుకుంది స్రవంతి ఉరఫ్ సారా.

శరత్ చూపుల్లో అయోమయాన్ని గమనించాడు ఫాదర్.

'వాట్ సారా? మీ తల్లిదండ్రులకు చెప్పలేదా?' అడిగాడు.

'నో ఫాదర్. చెపితే మా అమ్మా నాన్న ఒప్పుకోరు. పెళ్లి చేసుకున్న తరువాత ఇక ఏమన్నా సమస్య లేదని మేము పెళ్లి చేసుకున్నాం' తలవంచుకుని మెల్లిగా చెప్పింది స్రవంతి.

అతడు పక్కనే ఉన్న స్రవంతి భర్తవైపు చూశాడు.

'వాట్ యంగ్ మేన్. ఇది నిజమా?' అడిగాడు.

'యెస్ ఫాదర్. ఫర్‌గివ్‌మి ఫాదర్ మీకు పూర్తి నిజం చెప్పలేదు' అన్నాడు తలవంచుకుని.

శరత్‌కి ఏం జరుగుతుందో అర్థం కావటంలేదు.

వారివైపు అయోమయంగా చూస్తున్నాడు.

ఇంతలో ప్రశాంతి నీళ్లు, తినుబండారాలు తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

ఫాదర్ వాటివైపు నిరసనగా చూశాడు. తరువాత శరత్ వైపు చల్లగా చూశాడు.

'దేరీజ్ సమ్ మిస్ అండర్‌స్టాండింగ్. సమ్ కమ్యూనికేషన్ గ్యాప్. మీరు మతం మారటానికి ఇష్టపడుతున్నారని, వాళ్ల పెళ్లి అయిన తరువాత మొత్తం ఫామిలీ మతం మారుతుందని క్రిష్టఫర్ చెప్పాడు. మీకు క్రిష్టియానిటీ స్వీకరించటం పట్ల అభ్యంతరం లేదుకదా?' అడిగాడాయన మృదువుగా.

శరత్ ప్రశాంతి వైపు, ఆమె బిత్తరపోయి శరత్ వైపు చూస్తోంది.

వారి మౌనం చూసి అసహనంగా కదిలాడు ఫాదర్.

'వాటీజ్ దిస్ కిష్టఫర్?' అనడిగాడు.

'ఐ విల్ ఎక్స్‌ప్లెయిన్ ఫాదర్' అన్నాడు క్రిష్టఫర్.

'నాన్నా.. మా పెళ్లికి క్రిష్టఫర్ వాళ్ల నాన్న ఒక షరతు విధించాడు. మీరు సంపూర్ణంగా మా పెళ్ళిని ఇష్టపడాలని. దానికి సూచనగా మీరంతా క్రిష్టియానిటీ స్వీకరించాలని. మీరు నా సుఖం కోసం ఏమైనా చేస్తారన్న నమ్మకంతో నేను మాట ఇచ్చేశాను నాన్నా. ముందు మా పెళ్లి అయితే మీకు ఇక మరో మార్గం ఉండదు. నేను సుఖంగా ఉండాలని మీరు కోరుకుంటే... మీరు మతం మారండి నాన్నా. ప్లీజ్ నాకోసం. కూతురి సుఖం కోసం తల్లిదండ్రులు ఏమైనా చేస్తారు కదా నాన్నా!'

'ఎమోషనల్ అత్యాచార్' పాట శరత్ చెవుల్లో గింగురుమంటోంది. అతడికి మాట్లాడుతున్నది తన కూతురు కాదు, ఎవరో పరాయి మనిషి అనిపిస్తోంది.

చిలుక పలుకులు పలుకుతున్నట్టుంది.

'ఎవరు నేర్పారీ మాటలు దీనికి?' అన్న సందేహం వచ్చింది శరత్‌కు.

ప్రశాంతి వైపు చూశాడు శరత్.

ఆమె మాట్లాడలేదు. లోపలకు వెళ్లిపోయింది.

'మీకిది చాలా సడెన్ అయి ఉంటుంది. టేక్ యువర్ ఓన్ టైమ్. ఆలోచించండి. సరైన నిర్ణయం తీసుకోండి' అన్నాడు ఫాదర్ లేస్తూ.

వారితోపాటు స్రవంతికూడా లేచింది.

లోపలనుంచి ప్రశాంతి గగబా వచ్చింది 'అదేమిటి నువ్వూ వెళ్ళిపోతున్నావా?' స్రవంతిని అడిగింది.

'అవునమ్మా. పెళ్లయిన తరువాత అత్తగారిల్లే సర్వంకదా' అంది స్రవంతి.

'అదికాదంటే.. మీరు మతం మారేవరకూ సారా ఇక్కడికి రాదు. ఇల్లంతా సాటాన్ మయంగా ఉంది. కాబట్టి మీరు సారాని కలవాలన్నా, సారా మీ ఇంటికి రావాలన్నా మీరు ఇంట్లోంచి సాటన్‌ని తరిమేయాలి. కరుణామయుడైన ప్రభువును స్వీకరించాలి' చెప్పాడు క్రిష్టఫర్.

శరత్ మాట్లాడలేదు.

పెళ్లయిన అమ్మాయి పరాయి ఇంటికి వెళ్తుంది. పరాయిది అవుతుంది. కానీ ఇంతగా పరాయిది అవుతుందన్న ఆలోచన అతని ఊహకే రాలేదు. అసలు స్రవంతికి ఇప్పుడిప్పుడే పెళ్లి చేయాలన్న ఆలోచన కూడా అతడికి లేదు.

'మేం వస్తాం' అంది స్రవంతి.

'ఉండు' అని లోపలకు వెళ్లింది ప్రశాంతి. కాస్సేపటికి పళ్లెంలో చీర, జాకెట్ పెట్టుకొచ్చింది. స్రవంతి ముందు నిలబడి, పళ్లెంలోని కుంకుమ భరిణెనుంచి బొట్టు తీసి స్రవంతికి పెట్టబోయింది.

స్రవంతి ఆమె చెయ్యిని అడ్డుకుంది.

పళ్లెంలోంచి చీర జాకెట్ తీసుకుంది - 'థాంక్స్ అమ్మా' అంది.

బయటకు నడుస్తున్న క్రిష్టిఫర్ వెంట వెళ్లిపోయింది.

నిర్ఘాంతపోయి అలాగే నుంచుండిపోయింది ప్రశాంతి.

శరత్ ఆమె వైపే చూస్తూ కూర్చున్నాడు. అతడి మనసు అల్లకల్లోలంగా ఉంది.

చాలాసేపటి తరువాత చేతిలో పళ్లెం పక్కన విసిరేసి సోఫాలో కూలబడింది ప్రశాంతి.

'ఎంతగా మారిపోయింది?' అంది.

'ఆడపిల్లలు మారిపోతారంటారు. మారిపోయింది' శరత్ కళ్లల్లో నీటి చుక్క తళుక్కుమంది.

ఎందుకిలా జరుగుతోంది? ఎక్కడుంది లోపం? అతని మనస్సులో ప్రశ్నలు సుళ్లు తిరుగుతున్నాయి.

'ఇంక ఏమేం చూడాల్సొస్తుందో' అంది ప్రశాంతి హఠాత్తుగా.

'దీనికన్నా ఇంకా ఘోరం ఏముంటుంది?' అన్నాడు శరత్ నిర్లిప్తంగా.

అతడి మాటలు పూర్తవుతూంటే, క్రింద ఏదో కారు తలుపు తెరిచిన శబ్దం వినిపించింది.

కాస్సేపటికి మెట్లెక్కుతున్న బూట్ల శబ్దం వినిపించింది.

తలుపు ఎదురుగా షేర్వాణీ వేసుకుని కళ్లకింద సుర్మా పూసుకున్న సుమంత్ నిలిచి ఉన్నాడు.

అతడిని చూసి తేరుకుంది ప్రశాంతి.

'అదేమిటి అక్కడే నిలిచిపోయావు? రాలోపలకు. అదేమిటి హఠాత్తుగా వచ్చావు? సినిమా వేషం తీయకుండా వచ్చినట్టున్నావు. హఠాత్తుగా చూస్తే అచ్చు ముస్లిం యువకుడిలా ఉన్నావు' అంది ప్రశాంతి.

అతడు లోపలకు వచ్చాడు. అతడి వెనకే బేనజీర్ లోపలకు వచ్చింది.

'అమ్మా మా నికాష్ అయిపోయింది. అంతా సడన్‌గా జరిగింది' గబగబా చెప్పాడు సుమంత్.

వాళ్లిద్దరూ ప్రశాంతి కాళ్లు మొక్కారు.

ప్రశాంతి స్థాణువై నిలబడిపోయింది. వారిని ఆశీర్వదించాలనీ గుర్తుకు రాలేదు.

బేనజీర్ శరత్‌వైపు కదలబోయింది.

'నాన్నకు ఎవ్వరూ కాళ్లు మొక్కటం ఇష్టం ఉండదు.' అన్నాడు సుమంత్.

'ఉండండి. దిష్టి తీస్తాను' తనలో తాను గొణుక్కుంటున్నట్టు అంది స్రవంతి.

'అవసరం లేదమ్మా' అని బేనజీర్ వైపు చూశాడు శరత్.

'అవునాంటీ.. సుమంత్ ఇప్పుడు ముసల్మాన్. పేరు సులేమాన్' అంది బేనజీర్.

కుప్పకూలిపోయింది ప్రశాంతి.

కుళ్లి కుళ్లి ఏడవటం ప్రారంభించింది.

'రా.. బెన్నీ' అంటూ ఆమెని తన గదిలోకి తీసుకెళ్లాడు సుమంత్, ఉరఫ్ సులేమాన్.

ఏడుస్తున్న ప్రశాంతిని పొదివి పట్టుకున్నాడు శరత్.

'అది మనది కాదు. వీడు మనవాడు కాదు. ఇందులో ఎవరు మనవాళ్లు?' ఏడుస్తూ అడిగింది.

'అందరూ మనవాళ్లే' అతికష్టం మీద అన్నాడు శరత్. కానీ అతడి మాటలపై అతడికే విశ్వాసం లేదు.

హఠాత్తుగా ఏడుపు ఆపి పెద్దగా నవ్వటం మొదలుపెట్టింది ప్రశాంతి.

ఆమె నవ్వుకి సుమంత్, బేనజీర్‌లు పరుగెత్తుకు వచ్చారు బయటకు.

శరత్ బిత్తరపోయి చూడసాగాడు.

ఆమె నవ్వు హఠాత్తుగా ఆపి, శరత్‌ని చూసి సీరియస్‌గా అడిగింది.

'ఇపుడీ అమ్మాయి కూడా కండీషన్ పెడుతుందా, మతం మారితేనే సుమంత్ మనతో ఇంట్లో ఉంటాడని, సుమంత్‌ని చూడగలుగుతామని'

'బేనజీర్ అలాంటి కండిషన్లు పెట్టదు. ఎవరు పెట్టారు అలాంటి కండిషన్లు?' కోపంగా అడిగాడు సుమంత్.

'స్రవంతి' అని జరిగింది చెప్పాడు శరత్.

సుమంత్ పిడికిళ్లు బిగుసుకున్నాయి. 'క్రిష్టిఫర్ ఉట్టి వెధవ. వాడికి మతం పిచ్చి. నాకు తెలుసు వాడు. వాడు స్రవంతిని ఎలా ట్రాప్ చేశాడు? అయినా స్రవంతి ఎలా మతం మారింది? ఇప్పుడే వెళ్లి వాడిని తన్ని దాన్ని లాక్కొస్తాను' కోపంగా అన్నాడు సుమంత్.

పెద్దగా నవ్వాడు శరత్. 'లాక్కొచ్చి ఏం చేస్తావు? నువ్విప్పుడు మహమ్మదీయుడివి. లాక్కొచ్చి దాన్ని హిందూ అంటావా? క్రిష్టియానిటీ వదిలి ఇస్లాం స్వీకరించమంటావా? ప్రేమకోసం మతం మారే స్వేచ్ఛ నీకెంత ఉందో, దానికీ అంత ఉంది' అన్నాడు శరత్.

శరత్ వైపు నిరసనగా చూశాడు సుమంత్.

'నాన్నా.. మాకు మళ్లీ షూటింగ్ ఉంది. మేము ఇక వేరుగా ఉండలేమనుకున్నాం. మీకు విషయం చెప్పాలని వచ్చాను. మళ్లీ రాత్రి ఫ్లైట్‌లో వెళ్లిపోవాలి. పోతే పోనీ నాన్నా. దాని పెళ్లి ఖర్చు తగ్గింది .. నాన్న.. సినిమాలో పెట్టుబడి తక్కువయింది. ఇప్పుడిక స్రవంతి ఖర్చులేదుకదా, నాకు డబ్బు ఇస్తే సినిమాలో పెడతాను' అన్నాడు.

ప్రశాంతంగా చూశాడు శరత్ సుమంత్ వైపు.

'నాకు స్రవంతి ఎంతో నువ్వూ అంతే. నువ్వూ మతం మారావు. అది మతం మారింది. నువ్వు ముస్లిం. అది క్రిష్టియన్. నేను హిందూ నా ఆస్తి హిందువులయిన నా సంతానానికి చెందుతుంది కానీ మీకు కాదు' అన్నాడు శరత్ ధృఢంగా కోపంగా చూశాడు శరత్‌వైపు సుమంత్.

'ఇదేమిటి నాన్నా కొత్తపాట. మతం మారినా నేను నీ కొడుకుని కానా?' అడిగాడు. 'నాకు ఆస్తిపై హక్కు పోతుందా?'

'ఇప్పుడు అవన్నీ చర్చించాల్సిన అవసరంలేదు. మీ బ్రతుకులు మీరు నిర్ణయించుకున్నారు. మా బ్రతుకులు మేము నిర్ణయించుకుంటాం. రాత్రికి తిని బయలుదేరతారా? బయట తింటారా?' అడిగాడు శరత్.

'ఇదే, మీతో ప్రాబ్లం నాన్న. అందరినీ కలుపుకోలేదు. ఇలాంటి ఏర్పాటు వల్లనే హిందూయిజం దెబ్బ తింటోంది. అంటరాని తనం, ఒంటరితనం అనాదిగా మీ జాతికి అదే మూలధనం ఇక సమభావం, సమధర్మం, సహజీవనమనివార్యం. తెలుసుకొనుట మీ ధర్మం. తెలియకుంటె మీ ఖర్మం' అన్నాడు సుమంత్ కోపంగా.

'సులేమాన్.. మా నాన్న పెట్టుబడి ఇస్తానన్నాడుగా. సో డోన్ట్‌బెగ్' అంది బేనజీర్. శరత్ వైపు కోపంగా చూసి బేనజీర్‌తో వెళ్లిపోయాడు సుమంత్.

వాళ్లిద్దరూ వెళ్లిపోయిన తరువాత శరత్, ప్రశాంతి ఒకరినొకరు పట్టుకుని మౌనంగా నేలమీద కూర్చుండిపోయారు.

చాలాసేపటికి అంది ప్రశాంతి 'మనం సంపాదించి, దాచింది అంతా పిల్లల కోసమే కదా! ఇద్దరికీ ఇచ్చేద్దాం. ఎక్కడికయినా వెళ్లిపోదాం. మనమెవరికీ తెలియకూడదు. మనకెవరూ తెలియకూడదు.'

ఆమెవైపు నిశితంగా చూశాడు శరత్.

'మనం ఎందుకు పారిపోవాలి? ఏం తప్పు చేశామని పారిపోవాలి?' అడిగాడు.

'ఇంక ఏముంది మనకు జీవితంలో? పిల్లల కోసం బ్రతికాం. వాళ్లు రెక్కలొచ్చి ఎగిరిపోయారు. ఇక మన జీవితం ఏముంది?'

'ఇప్పుడే మన అసలు జీవితం ప్రారంభమవుతోంది.' శరత్ మాటల్లోని నిశ్చయం, ఆనందం విని అయోమయంగా తలెత్తింది ప్రశాంతి.

'నల్లటి మేఘాలు ప్రమాద సూచకం. విషాదాన్ని సూచిస్తాయి. కానీ నల్లటి మేఘాలు చూసి నెమలి నర్తిస్తుంది. ఎందుకంటే నల్లటి మేఘాలలో ప్రళయం నాటి నీటిని చూసే బదులు అది సృష్టికి జీవం పోసే జీవధారను దర్శిస్తుంది. కొత్త మొలకలకు నాందీ ప్రస్తావనను చూస్తుంది. అందుకే పురివిప్పి నాట్యం చేస్తుంది. ప్రశాంతి నా మానసమయూరి నృత్యానికి సిద్ధమౌతోంది' అన్నాడు శరత్.

**అతడివైపు** ఆశ్చర్యంగా చూసింది ప్రశాంతి.

'మీరన్నది అర్థంకాలేదు' అంది.

'నాకూ ఇప్పుడే అర్థమయింది. ఇన్నిరోజులూ ఎన్నో అర్థంకాని విషయాల వెంటబడి అవే అర్థవంతం అని భ్రమపడుతూ వస్తున్నాను. ఇప్పుడే అర్థమయింది.'

'ఏమర్థమయింది?' ఆమె ప్రశ్నలో 'మీకు పిచ్చిపట్టలేదు కదా!' అన్న ప్రశ్న అంతర్లీనంగా ఉంది.

'చెప్తాను. నీకు కాకపోతే ఇంకెవరికి చెప్తాను' ఆమెను దగ్గరకు తీసుకున్నాడు శరత్.

'సుమంత్ ఆస్తి అడిగాడు చూడూ.. అప్పుడు అర్థమయింది. బృహదరణ్యక్ ఉపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు చెప్పిన గొప్ప నిజం. ఈ ప్రపంచంలో ఎవరూ ఎవరికి ఏమీ కారు. భార్య భర్తను ప్రేమించటం, భర్త భార్యను ప్రేమించటం, తల్లి పిల్లలను ప్రేమించటం, పిల్లలు తల్లిదండ్రులను ప్రేమించటం.. ఇదంతా భ్రమ. అసలు నిజం వ్యక్తి తనని తాను ప్రేమించుకోవటం. స్వార్థం ఈ ప్రపంచం పరమార్థం. ఆలోచించు.. ఈ ప్రపంచంలో గొప్ప వ్యక్తులంతా స్వార్థపరులే. గొప్ప గొప్ప పనులు సాధించిన వారంతా స్వార్థపరులే. మిగతా ప్రపంచాన్ని విస్మరించి, ఎవరినీ పట్టించుకోక తమకు కావాల్సిన దానిపైనే దృష్టిపెట్టిన వారే ఏదైనా సాధిస్తారు. అలాకాక, అందరినీ పట్టించుకుని, అన్నీ తనవనుకుని, ఇతరుల కోసం తన ఇష్టాన్ని త్యాగం చేసేవాడు గొప్ప త్యాగశీలిగా పేరు పొందవచ్చు.. కానీ ఎందుకూ పనికిరానివాడవుతాడు. ఈ నిజం నాకు గ్రహింపుకు వచ్చింది. ఎంతో స్వేచ్ఛను సాధించినట్టు అనిపిస్తోంది. ఎంతో గొప్ప జ్ఞానం సంపాదించినట్టు తోస్తోంది.'

'ఏమైంది మీకు? డాక్టర్ దగ్గరకు వెళ్దామా?'

'నేను భ్రమలో, పిచ్చిలో ఉన్నంతకాలం నీకు ఏమీ అనిపించలేదు. ఇప్పుడు నిజం గ్రహించి విజ్ఞానవంతుడనయినప్పుడు నీకు పిచ్చివాడిలా కనిపిస్తున్నానా?'

'కాదు.. ఏమేమో మాట్లాడుతున్నారు.'

'ప్రశాంతీ ఇన్నాళ్ళూ మనం వేరేవారికోసం బ్రతికాము. వేరేవారి ఇష్టాలను అనుసరించి బ్రతికాము. ఉద్యోగం చేశాము. ఎవరికోసం? డబ్బుల కోసం. డబ్బులెందుకు? మనం సుఖంగా బ్రతికేందుకు. పిల్లలను చదివించేందుకు. వాళ్ళ జీవితాలు సుఖమయం చేసేందుకు. ఇందులో మనం మనకిష్టమైనది ఏం చేశాం? చెప్పు నీకిలా నాలుగుగోడల మధ్య కూర్చుని, రోజూ ఆఫీసుకి వెళ్తొస్తూ, నెల తిరగగానే జీతం తీసుకుని మళ్ళీ నెలకోసం ఎదురుచూస్తూ ఇలాగే ఉండాలని ఉందా? ఇదే జీవితం అనిపిస్తోందా? అన్నీ వదిలి ఎక్కడికయినా వెళ్ళిపోవాలనిపించలేదా? అడవుల నడుమ తిరుగుతూ, కొండలెక్కుతూ, నదుల్లో ఈదుతూ.. చీకూ చింతాలేకుండా, భయభ్రాంతులు లేకుండా బ్రతకాలని లేదా? ఇదేనా మన జీవితం?'

ప్రశాంతి మాట్లాడలేదు.

'ప్రశాంతీ.. మనం ఒక చట్రంలో ఇమిడి అందులోనే కొట్టుమిట్టాడుతున్నాం. అది మన అశాంతికి మూలం. ఎందుకంటే మనం మనలా బ్రతకటంలేదు. అది మన అసంతృప్తికి మూలం. ఇప్పటికీ మించిపోలేదు. ఇప్పటినుంచీ మనం మనలాగా బ్రతుకుదాం. మనకు ఎలా ఇష్టమైతే అలా బ్రతుకుదాం. మన సమస్య ఏమిటో తెలుసా ప్రశాంతీ, మనం అన్నీ మనవి అనుకుని భ్రమపడతాం. మనం లేకపోతే గడవదని మనల్ని మనం మభ్యపెట్టుకుంటాం. మనల్ని మనం బంధనాలలో ఒదిగేట్టు చేసుకుంటాం. ఇవాళ్ళ మన పిల్లలు గొప్ప జ్ఞానాన్ని ఇచ్చారు. ఇక మనకు బాధ్యతలు లేవు. బంధాలు లేవు. డబ్బు మనిద్దరికీ సరిపడా ఉంది. చెప్పు నీకు ఎలా బ్రతకాలని ఉంది?'

బిత్తరపోయి చూస్తోంది శరత్ వైపు ప్రశాంతి.

మనిషి స్వేచ్ఛను కోరుకుంటాడు. విముక్తి కోరుకుంటాడు. రెండూ ఒకేసారి లభిస్తే ఏం చేయాలో తెలియదు. అలాంటి స్థితిలో ఉంది ప్రశాంతి.

'ప్రశాంతి.. నాకయితే అనాథ శరణాలయం స్థాపించాలని ఉంది. ఎవరూ లేని వారిని 'నేనున్నా'నని దగ్గర తీయాలని ఉంది.'

'ఇదీ బంధనమే కదా?' అడిగింది ప్రశాంతి.

'కావచ్చు. కానీ నాకిష్టమైన బంధనం. ఎవరో నాపై మోపిన బంధం కాదు. ఇంతకాలం వేరేవారు నాపై విధించిన బంధనాలలో ఒదిగాను. ఇకపై నేను అలా ఒదగదలచుకోలేదు.'

'కానీ...'

'కానీ.. అన్న పదం వచ్చిందంటేనే మనపై మనం సంకెళ్ళు విధించుకుంటున్నట్టు. ఈ ప్రపంచంలో ఎంతమంది అనాథలు ఉన్నారో ఆలోచించు. ఒక ప్రేమపూర్వకమైన పదం కోసం, గుప్పెడు తిండికోసం, ఎంతగా తపిస్తున్నారో ఆలోచించు. వాళ్ళ దుస్థితిని ఆసరాగా తీసుకుని వాళ్ళ జీవితాలతో ఎందరో చెలగాటం ఆడుతున్నారు. అలాంటి అనాథలకు ఆశ్రయం ఇద్దాం. మనం ఇవ్వాల్సిన ప్రేమని పంచుదాం. ఆలోచించు. మనం మనపై సంకెళ్ళు విధించుకున్నప్పుడు మనకు ఇద్దరే పిల్లలు. వాళ్ళే మన ప్రపంచం. వాళ్ళని దాటి మనం చూడలేకపోయాం కానీ ఇప్పుడు మనం స్వేచ్ఛ పొందినపుడు ప్రపంచంలోని పిల్లలంతా మనవారే. ప్రపంచమంతా మనదే'

'కానీ.. ఇందాక స్వార్థం మంచిదన్నారు?'

'ఇదంతా నా స్వార్థమే. నాకు ఇలాగే ఉండాలని ఉంది. నీకు గుర్తుందా.. నేనెప్పుడూ ఒక పాడేవాడిని.

**హాథ్ థే మిలే వో జుల్ఫ్ చాంద్‌కీ సవాల్ దూ**

**హాథ్ థే ఖులీ కె హర్ బహార్ కోప్పవార్ దూ**

**దర్ద్ థా దియా గయా కె హర్ దుఖీ కాస్వార్ దూ**

**ఔర్ సాంస్ యూ కె స్వర్గ్ భూమి పర్ ఉతార్ దూ...**

ఇన్నాళ్ళకి ఈ కలను నిజం చేసుకునే అవకాశం వచ్చింది. ఇక నేనీ ఉద్యోగం చేయను. ఇక ఈ భ్రమలో ఉండలేను. చేయిసాచి సాటి మానవుల వేదనను అందుకుంటాను. కన్నీరు తుడుస్తాను. నాకు ఉన్నది అందరితో పంచుకుంటాను. ఇదే నా కోరిక. నీ ఇష్టం ఏమిటి?' అడిగాడు.

ఆమె మౌనంగా ఉంది

'మీరు ఉద్యోగం మానేసి అనాథల సేవ చేయండి. నేను ఓపిక ఉన్నంతవరకూ ఉద్యోగం చేసి మీ అనాథశరణాలయానికి నా జీతం విరాళంగా ఇస్తాను నెలనెలా' అంది.

'ప్రశాంతీ' అన్నాడు శరత్ ఆమెని దగ్గరకి తీసుకుంటూ..

**అప్నీ ఖుదీ కా జో సమ్ ఝా**

**ఉస్‌నే ఖుదా కా పహచానా**

**ఆజాద్ ఫిత్రితె ఇన్సాన్**

**అందాజ్ క్యూ గులామానా**

**సర్ యే నహీ ఝువానే కే లియా**

**తూ జీ పయ్ దిల్ జమానేకేలియే**

**అప్‌నే లియే జియ్‌తొ క్యాజియే**

తనని తాను అర్థం చేసుకున్నవాడు, భగవంతుడిని తెలుసుకున్నవాడు. మనిషి మౌలిక లక్షణం స్వేచ్ఛ. అలాంటప్పుడు బానిసలా ఎందుకు ఉండాలి? ఈ శిరస్సు ఎందుకని ఎవరిముందయినా వంగాలి? ప్రపంచమే తనదిగా జీవించేవాడే అసలయిన మనిషి. అదే అసలయిన స్వార్థం.

*(సమాప్తం)*